సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 19 సంచిక: 42

సోమవారం 4-5-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

### 'సన్'స్ట్రోక్

సొంతగడ్డపై కోల్‌కతాపై సన్‌రైజర్స్ హైదరాబాద్ అనూహ్య ఓటమి -10లో

### టైటాన్స్ హ్యాట్రిక్

గుజరాత్‌కు వరుసగా మూడో గెలుపు. పంజాబ్‌పై 4 వికెట్లతో విజయం -10లో



### హోర్ముజ్‌ను దాటిన ఎల్పీజీ నౌక

46,313 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో ఓ నౌక హోర్ముజ్ జలసంధిని దాటి భారత్‌కు వస్తోందని అధికార వర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో ▸

### నింగిలోకి 'మిషన్ దృష్టి'

గెలాక్సీఐకి చెందిన 'మిషన్ దృష్టి' ఉపగ్రహాన్ని అమెరికాలోని కాలిఫోర్నియాలో స్పేస్‌ఎక్స్ ఫాల్కన్–9 రాకెట్ ద్వారా ప్రయోగించారు.

వివరాలు 6లో ▸

### దురుసుగా ప్రవర్తిస్తే..

ఇరాన్ కొత్త ప్రతిపాదనను సమీక్షిస్తున్నట్టు చెప్పిన ట్రంప్.. ఒకవేళ దురుసుగా ప్రవర్తిస్తే మళ్లీ దాడులు తప్పవని హెచ్చరించారు.

వివరాలు 6లో ▸

### ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

దేశ రాజధాని ఢిల్లీలోని వివేక్ విహార్ ప్రాంతంలో ఆదివారం ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. 9 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸

## ఇన్వెస్టర్లూ పారాహుషార్

వాయిదా వేయకండి

- వెల్త్ పేజీల్లో ▶

అమరావతిలో చంద్రబాబు నిర్మించుకుంటున్న నూతన ప్యాలెస్

# 'భూ'మాయాజాలం!

**రాజధాని ప్రధాన ప్రాంతంలో సీఎం కోడలు నారా బ్రాహ్మణి 25 వేల చదరపు గజాలు కొనుగోలు**

**ఆ ప్లాటులో రూ.వందల కోట్లతో అత్యాధునిక ప్యాలెస్‌ని నిర్మిస్తున్న చంద్రబాబు కుటుంబం**

ఆ ప్లాటు దక్షిణం వైపు 3,670 గజాల రెసిడెన్షియల్ స్థలం ఖాళీగా ఉన్నట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లో స్పష్టీకరణ

నారా బ్రాహ్మణి ఆ ప్లాటును కొనుగోలు చేశాక ఆ ఖాళీ స్థలాన్ని హరిత ప్రాంతంగా మార్చేసిన సీఆర్‌డీఏ

రెసిడెన్షియల్ స్థలం ఖాళీ ప్రాంతంగా ఉండుంటే అక్కడ మరికొందరు రైతులకు ప్లాట్లు ఇచ్చే అవకాశం

2లో

- ఆ ప్రాంతంలో మరెవరికీ ప్లాట్లు ఇవ్వకూడదనే ఈ ఎత్తుగడ
- తద్వారా గజానికి రూ.50 వేల చొప్పున సీఆర్‌డీఏకు రూ.18.35 కోట్ల మేర నష్టం
- 2015 జనవరి 3న జారీ చేసిన భూ సమీకరణ నోటిఫికేషన్‌లో 163-బీలో ఎకరం భూమిని శ్మశానంగా చూపిన సీఆర్‌డీఏ
- ఆ భూమి తనదిగా పేర్కొన్న కంచర్ల శాంతి కిరణ్.. బదులుగా వెయ్యి గజాల రెసిడెన్షియల్ స్థలం కేటాయింపు
- ఆ వెయ్యి గజాలతోపాటు కంచర్ల శాంతి కిరణ్ కుటుంబం నుంచి నారా బ్రాహ్మణి 25 వేల గజాలు రూ.18.75 కోట్లతో కొనుగోలు.. అంటే గజం రూ.7,500 చొప్పున కొనుగోలు.. ఈ లెక్కన ఎకరం ధర రూ.3.63 కోట్లే
- ప్రధాన రాజధాని ప్రాంతంలో వాస్తవ ధర అంతేనా? ఈ లెక్కన ఎన్ని ఎకరాలు అమ్మితే రాజధానికి తెచ్చిన అప్పు తీరుతుందంటున్న మేధావులు
- ఇలాగైతే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ కేపిటల్ ఎలా అవుతుందని నిలదీస్తున్న ప్రజా సంఘాలు
- ఒకవేళ చంద్రబాబు కోడలు ఎక్కువ ధరకు కొనుగోలు చేసి ఉంటే ఆ మేరకు రిజిస్ట్రేషన్ ఫీజు, ఆదాయపు పన్ను ఎగ్గొట్టినట్లే

## పచ్చమూకల పాశవికం

**రాయచోటిలో మారణాయుధాలతో రెచ్చిపోయిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి అనుచరులు**

వైఎస్సార్‌సీపీ నేత దశరథరామిరెడ్డిపై హత్యాయత్నం

తల, చేతిపై వేటకొడవలితో తీవ్ర దాడి.. ఆయన అనుచరులపైనా విరుచుకుపడిన గూండాలు

దశరథతో పాటు ఇద్దరి పరిస్థితి విషమం.. మరో 15 మందికి గాయాలు

కోర్టు స్టేటస్ కో ఉన్న స్థలం వ్యవహారంలో జోక్యం చేసుకుని రెచ్చిపోయిన మంత్రి బ్యాచ్

ఘటన జరిగిన తర్వాత 108 వాహనాన్ని రానివ్వకుండా అడ్డుకున్న మూకలు

**రాయచోటి:** అన్నమయ్య జిల్లా రాయచోటిలో పచ్చమూకలు విధ్వంసం సృష్టించాయి. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచర మూకలు కత్తులు, రాడ్లతో రెచ్చిపోయాయి. వైఎస్సార్‌సీపీ నేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి పై హత్యాయత్నానికి తెగబడ్డాయి. కోర్టు స్టేటస్ కో విధించిన స్థలం వివాదం విషయంలో మంత్రి అనుచరులు జోక్యం చేసుకున్నారు. ఈ విషయంలో దశరథ రామిరెడ్డి తమ మాట వినడంలేదన్న అక్కసుతో సుమారు 100 మందికిపైగా యువకుల సాయంతో స్థలంలో నిర్మాణాలను చేపట్టారు. స్టేటస్ కో ఉన్నా దౌర్జన్యంగా మంత్రి అనుచరులు ఆది నారాయణరెడ్డి, అతని భార్య సుమన భూమిలో నిర్మాణాలను చేపట్టడానికి

తీవ్రంగా గాయపడిన దశరథరామిరెడ్డి

యత్నిస్తున్నారని అన్నమయ్య జిల్లా ఎస్పీ, స్థానిక డీఎస్పీ, సీఐలకు శనివారం దశరథరామిరెడ్డి ఫిర్యాదు కూడా చేశారు. ఫిర్యాదుపై పోలీసుల వైపు నుంచి ఎలాంటి స్పందనా రాలేదని దశరథరామిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేత దశరథరామిరెడ్డి ఆదివారం ఉదయం

మిగతా 2వ పేజీలో ▶

### న్యూస్‌రీల్

#### రిటర్నబుల్ ప్లాట్లలో అక్రమ తవ్వకాలు

రాజధాని ప్రాంతంలోని రిటర్నబుల్ ప్లాట్లతో సహా వివిధ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పెద్దల అండతో మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తోంది. నవులూరులో అక్రమ మట్టి తవ్వకాలను రైతులు అడ్డుకున్నారు.

వివరాలు 14లో ▸

#### వెన్నుపోటుదారు రాధాకృష్ణ

ఏబీఎన్ రాధాకృష్ణకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి బహిరంగ లేఖ రాశారు. 'రాధాకృష్ణా నీ బాస్‌కి, నీకు, రామోజీకి వెన్నుపోటుదారులనే బిరుదు చరిత్ర పుటల్లో శాశ్వతంగా ఉండిపోతుంది. ఎందుకురా బతుకంతా అబద్ధాలతో బతుకుతారు' అంటూ మండిపడ్డారు.

వివరాలు 14లో ▸

#### అమరావతిపై అసంబద్ధ లెక్కలు

టీడీపీ కూటమి ప్రభుత్వం అమరావతికి సంబంధించి తీసుకుంటున్న నిర్ణయాలు రాజధానికి మేలు చేసేలా లేవని, తాజాగా కేబినెట్ భేటీలో ఆమోదించిన మూడు అంశాలే ఇందుకు నిదర్శనమని రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త పురుషోత్తమరెడ్డి స్పష్టం చేశారు.

వివరాలు 14లో ▸

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| 12 గుడ్ల రిటైల్ ధర ₹75 | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 123 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 218 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 150 కిలో | స్కిన్ లెస్ | 248 కిలో |

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

## రూ.5 వేల కోట్ల కొండను కొట్టేస్తున్నారు

**సైదాపురం క్వార్ట్జ్, మైకా గనుల్లో మరో భారీ లూటీ**

నెల్లూరు జిల్లా సైదాపురం మండలం చాగానం, మొలకలపాండ్ల గ్రామాల్లో అక్రమంగా క్వార్ట్జ్, మైకా తవ్వకాలు

- లీజు అనుమతులు రాకముందే అక్రమ తవ్వకాలు.. ఇప్పటికే 30 వేల టన్నుల ఖనిజం అక్రమంగా తవ్వకం
- ఇందులో ఆంతర్యమేంటి? సదరు అమాత్యుడు ఎలా ఒప్పుకున్నారు
- అటవీ.. పర్యావరణం తన ప్రాణమంటూ లెక్చర్లిస్తూ ఇలా ఎలా చేశారు?
- ఈ దోపిడీలో రూ.వంద కోట్లు చేతులు మారిన వైనం.. నెల్లూరు ఎంపీ ముఖ్య అనుచరుడి ద్వారా సొమ్ము సమర్పణ
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుకు పది రోజుల్లోనే మోక్షం
- వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఈ ఒక్క ఫైల్ మాత్రమే క్లియర్
- నట్టడవిలో తవ్వకాలకు అడ్డగోలుగా అనుమతులు
- గతంలో భారీ పెనాల్టీలు పడిన అక్రమార్కుడికే మళ్లీ అప్పగింత

5లో

### అందరి చూపు బెంగాల్ పైనే..

- పశ్చిమ బెంగాల్ సహా తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో నేడే కౌంటింగ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత
- కౌంటింగ్ సిబ్బందికి తొలిసారిగా క్యూఆర్ కోడ్ ఐడీ కార్డులు
- అనధికార వ్యక్తులను నిరోధించడానికి పటిష్టమైన చర్యలు
- తొలుత పోస్టల్ బ్యాలెట్లు.. తర్వాత ఈవీఎంల లెక్కింపు
- ఫలితాలపై మధ్యాహ్నంకల్లా స్పష్టత వచ్చే అవకాశం
- ఉప ఎన్నికలు జరిగిన ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లోనూ నేడు ఓట్ల లెక్కింపు

6లో

## కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాల్లేవు

రెండునెలలుగా 50 వేల మంది ఎదురుచూపులు

మార్చితో గడువు ముగియడంతో సర్వీసు కూడా ఇప్పటివరకు పొడిగించని ఆర్థిక శాఖ

3లో

## మనోడైతే ఇచ్చేద్దాం

ఏపీయూఐఎంఎల్‌లో టీడీపీ సానుభూతిపరులైన నలుగురు ఉద్యోగుల ఇష్టారాజ్యం

ఆ నలుగురికీ ఐఏఎస్‌ల కంటే అధిక వేతనాలు

టీడీపీ సానుభూతిపరులైతే అర్హత లేకున్నా.. పనితీరు సక్రమంగా లేకున్నా పదోన్నతులు, వేతనాలు పెంపు

ఈ అన్యాయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే సస్పెన్షన్ వేటు తప్పదు

3లో

## గత ప్రభుత్వ సంస్కరణల వల్లే 'పది'లో ప్రభంజనం

**పదో తరగతి ఫలితాల్లో 596 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ**

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సమకూరిన వసతులతో మెరుగైన ఫలితాలు

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు

అన్ని వసతులతో వైఎస్ జగన్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన కాకినాడ శ్రీనగర్‌లోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల

- అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు
- ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ, ఐబీ సిలబస్, ట్యాబ్‌లు
- గోరుముద్ద పేరుతో మధ్యాహ్నం రుచికరమైన భోజనం
- జగనన్న విద్యా కానుక కింద బ్యాగ్‌తో కూడిన పుస్తకాల కిట్
- అమ్మ ఒడి కింద రూ.15 వేల చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ
- ఫలితంగా పూర్తిగా చదువుపై దృష్టి పెట్టిన పిల్లలు, టీచర్లు

14లో

## అది ఏకపక్ష కమిషన్

**చంద్రబాబుకు అనుకూలంగా దినేష్‌కుమార్ నివేదిక**

- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మండిపాటు
- తిరుమల లడ్డూలో జంతుకొవ్వు కలవలేదని సీబీఐ సిట్ తేల్చింది
- అయినా మమ్మల్ని దోషులుగా చూపించేందుకు కుట్ర
- చంద్రబాబు కంటే ముందుగానే ఎల్లో మీడియాకు నివేదిక
- రెండు రోజులుగా వాస్తవాలకు విరుద్ధంగా కథనాలు
- ఇందాపూర్–హెరిటేజ్ బంధాన్ని దాచడానికే ఇదంతా

**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏర్పాటు చేసిన దినేష్‌కుమార్ ఏకసభ్య కమిషన్.. ఏకపక్ష కమిషన్‌గా మారిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. చంద్రబాబు చెప్పినట్టుగానే దినేష్‌కుమార్ తన నివేదికను తయారు చేశారని చెప్పారు. తిరుపతిలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం

ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీం కోర్టు నియమించిన సీబీఐ సిట్ దాదాపు ఏడాదిన్నర పైగా విచారణ జరిపింది. లడ్డూ కల్తీ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం లేదని సీబీఐ సిట్ నివేదిక స్పష్టంగా తెలిపింది. అయినా చంద్రబాబు, పవన్‌లు వైఎస్సార్‌సీపీ పాలనలో తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారనే ఆరోపణలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ దినేష్‌కుమార్‌తో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ ఏకపక్షంగా మారి చంద్రబాబు పక్షాన నివేదిక ఇచ్చింది. అది అధికారికంగా విడుదల కాక ముందే ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల చేతుల్లోకి వెళ్లి విభిన్న కథనాలు ప్రచారం చేస్తున్నాయి. ఒక పత్రికలో అనిల్ సింఘాల్, మరొక దాంట్లో ధర్మారెడ్డి పేర్లు, తర్వాత మా పేర్లను కూడా చేర్చడం అనుమానాలకు తావిస్తోంది. దినేష్‌కుమార్ నివేదిక ప్రకారం నేను, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మిగతా 3వ పేజీలో ▶

### సరళంగా నీట్ యూజీ-2026 ప్రశ్నపత్రం

దేశవ్యాప్తంగా 5,432 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతం

గతేడాదితో పోలిస్తే ఈసారి పెరగనున్న కటాఫ్‌లు

అంచనా వేసిన సబ్జెక్టు నిపుణులు

వివరాలు 14లో

ఈ విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదనుకుంటా సార్!

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

## క్లుప్తంగా...

### పునర్విభజనతో దక్షిణాదికి తీరని నష్టం

డాక్టర్ పరకాల ప్రభాకర్

**ప్రొద్దుటూరు:** నియోజక వర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని డాక్టర్ పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ భ్రమలు–వాస్తవాలు' అనే అంశంపై ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మన ఎంపీలపైనే కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం బిల్లులో మార్పులను సూచించకపోవడం దారుణమన్నారు. ప్రపంచంలోనే ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని చెబుతున్న పాలకులు వికసిత భారత్ కోసం 2047 వరకు వేచి ఉండాలనడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల పేరుతో యువతకు ఇచ్చిన శిక్షణ 95 శాతం బోగస్ అని కాగ్ నివేదిక బట్టబయలు చేసిందన్నారు. ఇవే పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో సభలు, సమావేశాలు నిర్వహించుకునే స్వేచ్ఛ కూడా ఉండదన్నారు. దేశమంతా ఉద్యమించినప్పుడే మార్పు వస్తుందన్నారు.

### మస్కట్‌లో మహిళ కష్టాలు

షహనాజ్

**వాల్మీకిపురం:** అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం పింగాణి ఫ్యాక్టరీకి చెందిన షహనాజ్(25) బతుకుతెరువు కోసం ఏజెంట్ ద్వారా ఆరు నెలల క్రితం మస్కట్‌కు వెళ్లింది. ఐదు నెలలు సాఫీగా ఉన్నా నెల రోజులుగా అక్కడ ఉన్న సేఠ్ వేధిస్తున్నాడని, దీంతో భారత్‌కు రప్పించాలని సెల్ఫీ వీడియో ద్వారా అర్థిస్తోంది. ఏజెంటుకు చెప్పినా పట్టించుకోవడం లేదని, దీనిపై ప్రభుత్వం స్పందించి షహనాజ్‌ను స్వదేశానికి రప్పించాలని బాధితురాలి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. షహనాజ్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

### పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలి: సీపీఎం

**లక్ష్మీపురం:** చంద్రబాబు ప్రభుత్వం రాజధానిలో పేదల అభివృద్ధిని విస్మరించి, పెద్దలకు భూములు దోచిపెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. ఆదివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. ఆర్–5 జోన్ రద్దు చేసిన నేపథ్యంలో పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని కోరారు. రైతుల నుంచి వేలాది ఎకరాలను తీసుకుని కార్పొరేట్ సంస్థలకు తక్కువ ధరకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. రాజధానిలో పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై మే, జూన్ నెలల్లో ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే జూన్‌లో మంత్రి లోకేశ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

### గూడూరు @ 46.2 డిగ్రీలు

**ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రత నెల్లూరు జిల్లాలో నమోదు**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతోంది. నమోదవుతున్న ఉష్ణోగ్రతల కన్నా వేడి తీవ్రత 4, 5 డిగ్రీలు ఎక్కువగా ఉండడంతో జనం అల్లాడిపోతున్నారు. ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో ఈ వేసవిలోనే అత్యధికంగా 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 46.1 డిగ్రీలు రికార్డయ్యింది. వాస్తవానికి అక్కడ ప్రభావం మాత్రం 50 డిగ్రీల కన్నా ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాష్ట్రంలోని 300కి పైగా మండలాల్లో ఆదివారం ఉష్ణోగ్రతలు ఠారెత్తించాయి. 286 మండలాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాడ్పులకు ప్రజలు అల్లాడిపోతున్నారు.

**మరోవైపు భారీ వర్షాలు**

మరోవైపు ఆదివారం కోనసీమ, కాకినాడ జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 7.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాట్రేనికోనలో 5.7, కాకినాడ జిల్లా పెద్దాపురంలో 5, పిఠాపురంలో 4.5, కాకినాడ రూరల్‌లో 4.3, అచ్యుతాపురంలో 4.2, కాకినాడ అర్బన్‌లో 4.1 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

**అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు ఇలా..**

| ప్రాంతం | ఉష్ణోగ్రత |
|---|---|
| ప్రకాశం జిల్లా కొప్పెరపాడు | 46.1 |
| మార్కాపురం జిల్లా కంభం | 45.7 |
| తిరుపతి జిల్లా బోనుపల్లె | 45.6 |
| పల్నాడు జిల్లా నడిగడ్డ | 44.2 |
| పల్నాడు జిల్లా కారంచేడు | 44.0 |
| కర్నూలు జిల్లా తోవి | 43.9 |
| చిత్తూరు జిల్లా తవనంపల్లె | 43.8 |
| అనంతపురం జిల్లా తెరన్నపల్లి | 43.4 |
| వైఎస్సార్ కడప జిల్లా వీరబల్లె | 43.4 |
| నంద్యాల జిల్లా బనగానపల్లె | 43.1 |
| ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు | 43.1 |
| విజయవాడ | 43.0 |

# వెలగపూడి ప్యాలెస్‌లో 'భూ'మాయాజాలం!

## రాజధాని ప్రధాన ప్రాంతంలో సీఎం కోడలు నారా బ్రాహ్మణి 25 వేల చదరపు గజాలు కొనుగోలు

**సాక్షి, అమరావతి:** రాజధానికి భూ సమీకరణ కింద భూమి ఇచ్చిన తనకు అభివృద్ధి చేసిన నివాస స్థలం (రెసిడెన్షియల్ ప్లాటు), వాణిజ్య స్థలం (కమర్షియల్ ప్లాటు) ఇస్తామని చెప్పి.. చెరువులో పల్లపు ప్రాంతంలో రెసిడెన్షియల్ ప్లాటు ఇచ్చారని.. మరో చోట తనకు ప్లాటు కేటాయించాలని పదే పదే కోరుతున్నా సీఆర్‌డీఏ స్పందించడం లేదని 2025 డిసెంబర్ 26న మందడంలో నిర్వహించిన సమావేశంలో దొండపాటి రామారావు అనే రైతు ఆవేదన వ్యక్తం చేస్తూ కుప్పకూలి కన్నుమూశారు. రాజధానికి భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన అనేక మంది రైతులదీ ఇదే పరిస్థితి. కానీ.. సీఎం చంద్రబాబు కుటుంబం, మంత్రులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలకు మాత్రం వారు ఎలా కావాలంటే అలా ప్లాట్లను సీఆర్‌డీఏ కేటాయించడం.. అందులో మార్పులు చేయడం చేసేస్తోంది. దీనికి తార్కాణం రాజధాని ప్రధాన ప్రాంతం (కోర్ కేపిటల్ ఏరియా)లో శాశ్వత సచివాలయం టవర్లు, శాశ్వత హైకోర్టు, అసెంబ్లీ భవంతులు నిర్మిస్తున్న ప్రాంతానికి కూత వేటు దూరంలో, వెలగపూడికి సమీపంలో అత్యాధునిక వసతులతో రూ.వందల కోట్ల వ్యయంతో సీఎం చంద్రబాబు కుటుంబం 25 వేల గజాల్లో (5.17 ఎకరాలు) నిర్మిస్తున్న ప్యాలెస్సే అందుకు తార్కాణం. రాజధానిలోని వెలగపూడిలో కంచెర్ల సాంబశివరావుకు చెందిన సర్వే నంబరు 142–బీ, 142–సీ, 89లోని 4.41 ఎకరాలు, కంచెర్ల శాంతికిరణ్‌కు చెందిన సర్వే నంబరు 136–సీ, 160, 163–బీ, 184–బీలోని 11.10 ఎకరాలు, కంచెర్ల ఓంకార్‌కు చెందిన సర్వే నంబరు 136–సీ, 85, 89లోని 14.01 ఎకరాలు.. మొత్తం 29.52 ఎకరాలను భూ సమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇచ్చారు. ఇందుకుగానూ రాజధాని ప్రధాన ప్రాంతం వెలగపూడిలో సర్వే నంబరు 111, 112, 113, 122, 150, 152, 239లోని 5.16 ఎకరాలను (25 వేల చదరపు గజాలు) కంచెర్ల సాంబశివరావు, కంచెర్ల శాంతికిరణ్, కంచెర్ల ఓంకార్, కాట్రగడ్డ గీతాశ్రీలకు సీఆర్‌డీఏ రిటర్నబుల్ ప్లాట్ల కింద ఇచ్చింది. ఆ ప్లాట్లను సీఎం చంద్రబాబు తనయుడు మంత్రి నారా లోకేశ్ భార్య నారా బ్రాహ్మణి ట్రస్టీగా ఉన్న నివాస ట్రస్టు పేరు మీద రూ.18.75 కోట్లకు 2025 ఏప్రిల్ 2న కొనుగోలు చేశారు. ఆ మేరకు మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లో కొనుగోలు చేసిన భూమికి ఉత్తరం వైపున పాసివ్ జోన్ (హరిత ప్రాంతం), దక్షిణం వైపున రెసిడెన్షియల్ ఖాళీ స్థలం, తూర్పు వైపున 17 మీటర్ల రోడ్డు, పశ్చిమ వైపున 25 మీటర్ల రోడ్డును హద్దులుగా పేర్కొన్నారు.

### రెసిడెన్షియల్ ఖాళీ ప్రాంతాన్ని హరిత ప్రాంతంగా ఎవరి కోసం మార్చారు?

నారా బ్రాహ్మణి 25 వేల గజాలను కొనుగోలు చేశాక ఆ ప్లాటు హద్దులు మారిపోయాయి. దక్షిణం వైపున రెసిడెన్షియల్ ఖాళీ స్థలాన్ని హరిత ప్రాంతంగా సీఆర్‌డీఏ మార్చేసింది. 3,670 గజాల రెసిడెన్షియల్ ఖాళీ స్థలం హరిత ప్రాంతంగా మారిపోయింది. ఎవరి ఒత్తిడితో ఇలా చేశారని రాజధాని రైతులు నిలదీస్తున్నారు. ఆ భూమి రెసిడెన్షియల్ ఖాళీ ప్రాంతంగా ఉండి ఉంటే.. ఎకరం చొప్పున రాజధానికి భూములు ఇచ్చిన ముగ్గురు రైతులకు వెయ్యి గజాల చొప్పున రెసిడెన్షియల్ ప్లాట్లు కేటాయించే అవకాశం ఉండేదంటున్నారు. చెరువుల్లో, ముంపు ప్రాంతంలో రైతులకు కేటాయించిన రెసిడెన్షియల్ ప్లాట్లను.. ఆ ఖాళీ స్థలంలోకి మార్చే అవకాశం ఉండేదని స్పష్టం చేస్తున్నారు. దీని వల్ల తమకు తీవ్రంగా అన్యాయం జరిగిందని రైతులు మండి పడుతున్నారు. ఇక భూ సమీకరణ కింద భూములిచ్చిన రైతులకు ఇచ్చిన నివాస స్థలాలు (రెసిడెన్షియల్ ప్లాట్) గజం రూ.50 వేలు పలుకుతుందని ప్రపంచ బ్యాంకుకు ఇచ్చిన నివేదికలో సీఆర్‌డీఏ లెక్కగట్టింది. వాణిజ్య (కమర్షియల్) ప్లాట్ ధర రూ.2.70 కోట్లుగా చూపింది. ఎకరం భూమిని సమీకరణ కింద ఇచ్చిన రైతులకు.. పదేళ్లపాటు కౌలు కింద రూ.7,25,000, నివాస స్థలం (వెయ్యి గజాలు.. గజం రూ.50 వేల చొప్పున) రూ.5 కోట్లు, వాణిజ్య స్థలం రూ.2.70 కోట్లు వెరసి రూ.7,77,25,000 ప్రయోజనం చేకూరుతుందని సీఆర్‌డీఏ లెక్కలు వేసింది. ఈ లెక్కన 3,670 గజాల రెసిడెన్షియల్ ఖాళీ స్థలాన్ని హరిత ప్రాంతంగా మార్చేయడం వల్ల సీఆర్‌డీఏకు రూ.18.35 కోట్ల మేర నష్టం వాటిల్లిందని స్పష్టం చేస్తున్నారు.

### వాస్తవ ధర గజం రూ.7,500 లేనా? లేక మోసం చేశారా?

వెలగపూడిలో సీఎం చంద్రబాబు కోడలు నారా బ్రాహ్మణి 25 వేల గజాలను రూ.18.75 కోట్లకు కొనుగోలు చేశారంటే గజం ధర రూ.7,500. అక్కడ రెసిడెన్షియల్ స్థలం ధర వాస్తవంగా గజం రూ.7,500లేనా అని మేధావులు, రైతులు ప్రశ్నిస్తున్నారు. లేదంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేశారా? అని నిలదీస్తున్నారు. ఒకవేళ ఎక్కువ ధరకు కొనుగోలు చేసి ఉంటే.. రిజిస్ట్రేషన్ ఫీజు ఎగ్గొట్టినట్లేనని స్పష్టం చేస్తున్నారు. ఆ క్రమంలో ఆదాయపు పన్ను కూడా ఎగ్గొట్టినట్లేనని తేల్చి చెబుతున్నారు. సీఎం చంద్రబాబు కోడలు కొనుగోలు చేసిన భూమి ధరను బట్టి చూస్తే.. ప్రధాన రాజధాని ప్రాంతంలో ఎకరం ధర రూ.3.63 కోట్లే. రాజధాని నిర్మాణ పనుల కోసం ఇప్పటికే రూ.47,387 కోట్లను చంద్రబాబు సర్కార్ అప్పు చేసింది. ఈ లెక్కన ఆ అప్పును వడ్డీతో సహా తీర్చాలంటే కనీసం 15 వేల ఎకరాలు అమ్మాల్సి ఉంటుందని ఆర్థిక వేత్తలు లెక్కలు వేస్తున్నారు. కానీ.. రాజధాని ప్రాంతంలో అంత భూమి అందుబాటులో లేదు. ఈ లెక్కన అప్పు తీర్చాలంటే రాష్ట్ర బడ్జెట్ నుంచి.. అంటే ప్రజలు చెల్లించే పన్నుల నుంచి నిధులు కేటాయించాల్సిందే. అలాంటప్పుడు అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ కేపిటల్ సిటీ ఎలా అవుతుందని మేధావులు, ఆర్థిక వేత్తలు నిలదీస్తున్నారు.

### ఆ ఎకరం శ్మశానమే..

వెలగపూడిలో సర్వే నంబరు 163–బీలో ఎకరం శ్మశానం భూమి. ఇప్పటికీ ఆ భూమిలో సమాధులు ఉన్నాయి. రాజధాని భూ సమీకరణ కోసం వెలగపూడిలో 2015 జనవరి 3న సీఆర్‌డీఏ జారీ చేసిన నోటిఫికేషన్‌లోనూ 163–బీలో ఎకరం శ్మశానంగా స్పష్టం చేసింది. కానీ.. ల్యాండ్ పూలింగ్ స్కీం కింద భూమిని సమీకరిస్తూ జారీ చేసిన 9.22 ఫార్మ్‌లో మాత్రం ఆ భూమి కంచెర్ల శాంతి కిరణ్‌దిగా పేర్కొనడం గమనార్హం. ఎవరి ఒత్తిళ్లతో శ్మశానం భూమిని శాంతి కిరణ్‌కు చెందినదిగా మార్చారని వెలగపూడి రైతులు నిలదీస్తున్నారు. 163–బీలో శ్మశానం ఉన్న ఎకరం భూమి కంచెర్ల శాంతికిరణ్‌దిగా చూపుతూ.. దానికిగాను కేటాయించిన వెయ్యి గజాల రెసిడెన్షియల్ స్థలంతోపాటు 25 వేల గజాలను కంచెర్ల శాంతికిరణ్ కుటుంబ సభ్యుల నుంచి సీఎం చంద్రబాబు కోడలు నారా బ్రాహ్మణి కొనుగోలు చేయడం గమనార్హం.



వెలగపూడికి సంబంధించి సీఆర్‌డీఏ జారీ చేసిన భూ సమీకరణ నోటిఫికేషన్(9.1 ఫారమ్)లో 163–బీ సర్వే నంబర్‌లో ఎకరం భూమిని శ్మశానంగా పేర్కొందనడానికి ఇదే ఆధారం

ల్యాండ్ పూలింగ్ స్కీం 9.22 ఫారమ్‌లో 163–బీ సర్వే నంబర్‌లో శ్మశానం భూమి కంచెర్ల శాంతి కిరణ్‌కు చెందినట్లుగా చూపిన సీఆర్‌డీఏ

> Whereas the Vendor No.2 was the absolute owner, possessor and title holder/ Pattadar of the Agricultural land admeasuring an extent of Ac.11.10 cents in Sy. No.136-C, 160, 163-B and 184-B situated at Velagapudi Village, Thullur Mandal, Guntur District, Andhra Pradesh.

కంచెర్ల శాంతి కిరణ్ నుంచి నారా బ్రాహ్మణి కొనుగోలు చేసిన 25 వేల గజాలలో 163–బీ సర్వే నంబర్‌లో శ్మశానం భూమి ఎకరానికి గాను సీఆర్‌డీఏ కేటాయించిన 1,000 గజాలు కూడా ఉంది అనడానికి ఈ రిజిస్ట్రేషన్ డాక్యుమెంటే ఆధారం



SCHEDULE OF PROPERTY

All that part and parcel of Residential Open Plot bearing No. Plot No.10-102-485-2590-39-E318 admeasuring 25,000 Square Yards in Sy Nos.111, 112, 113, 122, 150, 152 and 239 situated at Velagapudi Village, & Panchayath, Thullur Mandal, Guntur District, Andhra Pradesh and bounded as follows:-

| | | |
|---|---|---|
| NORTH | : | Passive Greens. |
| SOUTH | : | Residential Vacant Land. |
| EAST | : | 17 meters Road. |
| WEST | : | 25 meters Road. |

నారా బ్రాహ్మణి కొనుగోలు చేసిన 25 వేల గజాల భూమికి దక్షిణాన రెసిడెన్షియల్ ఖాళీ భూమి ఉంది అని హద్దులో చూపిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్






Plot Code: 10-485-2590-39-E318

| | |
|---|---|
| Owner: | M/S.Nivasa Trust,Hyderabad,Rep By Its Trustee |
| Plot Category: | E318 |
| Plot Code: | 10-485-2590-39-E318 |
| Township: | 10 |
| Sector: | 102 |
| Colony: | 485 |
| Block: | 2,590 |
| Plot Number: | 39 |
| Measurments(Ft's): | |
| Length: | 534.03 |
| Width: | 421.21 |
| Plot Area: | 25,000.00 Sq.Yards |
| Plot boundaries: | |
| North: | P1-Passive zone |
| East: | 17.0 mtr Road |
| South: | P1-Passive zone |
| West: | 25.0 mtr Road |

చంద్రబాబు కోడలు నారా బ్రాహ్మణి 25 వేల గజాల భూమిని కొనుగోలు చేసిన తర్వాత ఆ భూమికి దక్షిణాన రెసిడెన్షియల్ ఖాళీ భూమికి బదులుగా హరితవనం ఉన్నట్లుగా మార్చేసిన సీఆర్‌డీఏ



Plot Code:

| | |
|---|---|
| Owner: | |
| Plot Category: | P1-Passive zone |
| Plot Code: | |
| Township: | 10 |
| Sector: | 102 |
| Colony: | 485 |
| Block: | 2,590 |
| Plot Number: | 1 |
| Measurments(Ft's): | |
| Length: | 434.12 |
| Width: | 322.63 |
| Plot Area: | 3,670.00 Sq.Yards |
| Plot boundaries: | |
| North: | 25.0 mtr Road |
| East: | 10-102-485-2593-3-D53 |
| South: | 25.0 mtr Road |
| West: | 25.0 mtr Road |

హరిత ప్రాంతంగా మార్చేసిన భూమి పరిమాణం 3,670 చదరపు గజాలు

వెలగపూడి లే-అవుట్‌లో ఎడమవైపున వృత్తంలో సీఎం చంద్రబాబు కోడలు కొనుగోలు చేసి రూ.వందల కోట్ల వ్యయంతో ప్యాలెస్ నిర్మిస్తున్న 25 వేల గజాల భూమి ఇదే.. (కుడివైపున 163–బీ సర్వే నంబర్‌లోని ఎకరంలో ఉన్న శ్మశానం భూమి)

# పచ్చమూకల పాశవికం

▶ మొదటి పేజీ తరువాయి

తన కల్యాణమండపం ఎదురుగా ఉన్న నిర్మాణ ప్రాంతానికి వెళ్లి ప్రశ్నించడంతో అక్కడే ఉన్న పచ్చమూకలు ఒక్కసారిగా కత్తులు, రాడ్లతో దాడి చేశాయి. ఈ దాడిలో దశరథరామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనతోపాటు కల్యాణ మండపం మేనేజర్ జాకీర్, అనుచరుడు దేరంగుల ఆంజనేయులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. మరో 15 మంది దశరథరామిరెడ్డి అనుచరులు, పార్టీ కార్యకర్తలు పచ్చమూకల దాడిలో గాయపడ్డారు. ఘటనా స్థలంలోనే రక్తపు మడుగులో పడి ఉన్న దశరథరామిరెడ్డి, ఆంజనేయులు, జాకీర్ను రక్షించేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అనుచరులు తీవ్రంగా యత్నించారు. పచ్చమూకల బరితెగింపుతో స్థానిక ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

తలకు తీవ్ర గాయాలతో దేరంగుల ఆంజనేయులు

### కల్యాణ మండపంలో విధ్వంసం..

వైఎస్సార్‌సీపీ నేత దశరథరామిరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడడంతోపాటు ఆయన కల్యాణ మండపంలోనూ పచ్చమూకలు విధ్వంసం సృష్టించాయి. మండపం తలుపులను ధ్వంసం చేసి అద్దాలను బద్దలు కొట్టారు. లోపల ఉన్న ఫర్నిచర్, ఇతర వస్తువులను పగలగొట్టారు. సమీపంలోనే ఉన్న దశరథరామిరెడ్డి వాహనాన్ని కూడా పగలగొట్టారు.

### 108 వాహనాన్నీ అడ్డుకున్నారు

తీవ్రంగా గాయపడిన దశరథరామిరెడ్డితోపాటు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు వచ్చిన 108 వాహనాన్నీ పచ్చమూకలు అడ్డుకున్నాయి. దీంతో దశరథరామిరెడ్డి భార్య విజయమ్మ కొంతమంది అనుచరులతో ఘటన స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో ఉన్న భర్తను, మరో ఇద్దరిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ ఘటనపై దశరథరామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన నుంచి ఎస్ఐ జహీర్‌బాషా వివరాలు సేకరించారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చినా ఆదినారాయణ రెడ్డి, అతని భార్య దౌర్జన్యంగా కల్యాణమండపం ఎదురుగా ఉన్న స్థలంలో నిర్మాణాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇదేమని ప్రశ్నించడానికి వెళ్లిన తనపై ఆదినారాయణ రెడ్డి మంత్రి అనుచరులతో దాడి చేయించారని పోలీసులకు రాయించిన వాంగ్మూలంలో తెలిపారు.

### భూమన పరామర్శ

కాలికి బలమైన గాయంతో కల్యాణ మండపం మేనేజర్ జాకీర్

**తిరుపతి తుడా:** టీడీపీ గూండాల హత్యాయత్నంతో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న రాయచోటి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి పరామర్శించారు. దాడి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం కొనసాగుతోందని, హత్యాయత్నాలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయపెట్టలేరని భూమన పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పూర్తిగా క్షీణించిన లా అండ్ ఆర్డర్

- దశరథరామిరెడ్డిపై టీడీపీ గూండాల దాడి హేయం
- పోలీసుల సమక్షంలోనే దాడి అత్యంత దారుణం
- దశరథరామిరెడ్డి రెండురోజుల కిందటే సీఐ, డీఎస్పీలకు ఫిర్యాదు చేశారు
- అయినా వారు స్పందించక పోవడంతోనే ఈ పరిస్థితి
- వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాయచోటి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డిపై టీడీపీ గూండాలు పోలీసుల సమక్షంలోనే దాడిచేసి కాళ్లుచేతులు విరిచి, తల పగులగొట్టారని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రాయచోటిలో రెండురోజులుగా తన ఫంక్షన్‌హాల్ మీద జరుగుతున్న దాడులపై దశరథరామిరెడ్డి సీఐ, డీఎస్పీలకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని చెప్పారు. దీంతో టీడీపీ గూండాలు ఈ దాడికి తెగబడ్డారన్నారు. దశరథరామిరెడ్డి ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని తెలిపారు. పోలీసులు అధికారపార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తూ దాడులకు పరోక్షంగా సహకరించడం హేయమన్నారు. దశరథరామిరెడ్డిపై దాడిచేసిన వారు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నా ఇప్పటికీ ఒక్కరిపైనా కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. పోలీసులు తమ బాధ్యతను పూర్తిగా మర్చిపోయారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల మీద పదేసి కేసులు పెట్టి రాష్ట్రమంతా తిప్పి పొలిటికల్ బాస్‌లను సంతృప్తి పరుస్తున్న పోలీసులు.. తమ పార్టీ నాయకుల మీద టీడీపీ గూండాలు పట్టపగలు బహిరంగంగా దాడులు చేసి ప్రాణాలు తీసేస్తున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులే స్పందించడం లేదన్నారు. పోలీసుల సమక్షంలోనే దాడులు చేస్తుండటం.. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ విధంగా పతనమయ్యాయో చెప్పడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు తక్షణం స్పందించి దశరథరామిరెడ్డి మీద దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. ఆ విధంగా అయినా తమ వ్యవస్థపై సన్నగిల్లుతున్న నమ్మకాన్ని పోలీసులు కాపాడుకోవాలని సూచించారు. అలాకాకుండా, ఇలాగే కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఇలాంటి చర్యలే ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

# దశరథరామిరెడ్డిపై దాడి ఆటవిక చర్య

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి**

**సాక్షి, అమరావతి/రాయచోటి అర్బన్:** మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు మారణాయుధాలతో కర్కశంగా చేసిన దాడి ఆటవిక చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన హేయమైన చర్యగా ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు పెరిగిపోయాయని.. ప్రజాసమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలపై కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ దాడికి కారకులను వెంటనే అరెస్టుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థ గట్టిగా వ్యవహరించకపోవడంవల్లే రాష్ట్రంలో దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలు పెరుగుతున్నాయన్నారు. ఇటువంటి సంఘటనలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులెవ్వరూ అధైర్యపడొద్దని.. పార్టీ అండగా ఉంటుందని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఇలా దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పాత రాయచోటిగా మార్చొద్దు..**

ఇక ప్రశాంతంగా ఉన్న రాయచోటిని అధికార పార్టీ నేతలు మళ్లీ పూర్వపు రాయచోటిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదని శ్రీకాంత్‌రెడ్డి హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ ఏనాడు ఇలాంటి దాడులకు పాల్పడలేదని ఆయన గుర్తుచేశారు. మా సహనాన్ని చేతగానితనంగా చూడొద్దని.. మళ్లీ ఇలా దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకునేదిలేదని గడికోట శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు.

### నరకయాతన.. దీనవేదన

**గోకవరం:** రక్తపు మడుగులో కూరుకుపోయిన ఈ క్షతగాత్రుడు తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముగ్గళ్లకు చెందిన పి.సుబ్రహ్మణ్యం. ఆదివారం సాయంత్రం బైక్‌పై పోలవరం జిల్లా రంపచోడవరం నుంచి గోకవరం వైపు వెళ్తుండగా కృష్ణునిపాలెం వద్ద కిందపడిపోయి గాయపడ్డాడు. అతని తలకు, కళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించినా వాహనం రాలేదు. దీంతో క్షతగాత్రుడు నరకయాతన అనుభవించాడు. వేదన భరించలేక తనను కాపాడాలంటూ చేతులెత్తి చుట్టూ ఉన్న వారిని వేడుకున్న తీరు చూపరులను కలచివేసింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తుండగా, అతని పరిస్థితి విషమంగా ఉంది.

# మనోడైతే ఇచ్చేద్దాం

## ఏపీయూఐఏఎంఎల్‌లో టీడీపీ సానుభూతిపరులైన నలుగురు ఉద్యోగుల ఇష్టారాజ్యం

- ఆ నలుగురికీ ఐఏఎస్‌ల కంటే అధిక వేతనాలు
- టీడీపీ సానుభూతిపరులైతే అర్హత లేకున్నా.. పనితీరు సక్రమంగా లేకున్నా పదోన్నతులు, వేతనాలు పెంపు
- ఈ అన్యాయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే సస్పెన్షన్ వేటు తప్పదు

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వరంగ సంస్థలో ఉద్యోగులైనా.. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటైన సంస్థ ఉద్యోగులైనా పదోన్నతి కల్పించడానికి, వేతనాలు పెంచడానికి వారి అర్హత, పనితీరే కొలమానం. కానీ ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అస్సెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్)లో మాత్రం అందుకు భిన్నంగా నడుస్తోంది. అధికార పార్టీకి సానుభూతిపరులైతే చాలు.. అర్హత లేకున్నా పనితీరు తీసికట్టుగా ఉన్నా.. ప్రతిభ లేకపోయినాసరే పదోన్నతి ఇచ్చేస్తున్నారు. వేతనాలు భారీగా పెంచేస్తున్నారు. అర్హత ఉండి.. మెరుగైన పనితీరు కనబరుస్తూ.. లక్ష్యాల సాధనలో ప్రతిభ చాటుతున్న ఉద్యోగులకు పదోన్నతి, వేతనాలు పెంచడానికి ముడుపులు వసూలు చేస్తున్నారు. ఏమిటీ అన్యాయమని ఎవరైనా ప్రశ్నిస్తే.. వారిపై సీఈవో, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి తప్పుడు సమాచారం ఇచ్చి, తప్పుదోవ పట్టించి సస్పెండ్ చేయిస్తున్నారు. పదోన్నతి కల్పించకుండా, వేతనాలు పెంచకుండా వేధింపులకు గురిచేస్తున్నారని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షించడం.. వాటిని నిర్వహించడమే లక్ష్యంగా 2016లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏపీయూఐఏఎంఎల్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 49 శాతం కాగా.. ఐఎల్‌అండ్ ఎఫ్ఎస్ వాటా 51 శాతం.

### నష్టాలు వచ్చిన విభాగాల్లో పదోన్నతులు, వేతనాల పెంపు

రాష్ట్రంలో 8 విభాగాల్లో ఏపీయూఐఏఎంఎల్ సేవలందిస్తోంది. 243 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే సంస్థలో కొత్త పదవి సృష్టించి.. అందులో టీడీపీ సానుభూతిపరుడిని నియమించారు. నెలకు వేతనం రూ.3,94,240 చెల్లిస్తున్నారు. ఐఏఎస్ అధికారికి కూడా ఈ స్థాయి వేతనం ఉండదు. దీంతోపాటు టీడీపీ సానుభూతిపరులైన ముగ్గురు ఉద్యోగులకు సీఈవో కార్యాలయం, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. వారికి వరుసగా నెలకు రూ.2,46,400, రూ.1.90 లక్షలు, రూ.1.75 లక్షల చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఈ నలుగురు కలిసి ఉద్యోగులు టీడీపీ సానుభూతిపరులైతే అర్హత లేకున్నా.. పనితీరు సక్రమంగా లేకున్నా పదోన్నతి కల్పించి, వేతనాలు పెంచేలా చక్రం తిప్పుతున్నారు. ఎకనమిక్ డెవలప్‌మెంట్ (ఈడీ), అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ (యూఐడీ), పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విభాగాల్లో మాత్రమే ఈ సంస్థలకు లాభాలు వస్తున్నాయి. మిగతా 5 విభాగాల్లోనూ నష్టాలే. 2025–26లో ఈ సంస్థకు రూ.19.99 కోట్ల ఆదాయం వస్తే.. ఖర్చులు రూ.12.48 కోట్లు పోగా రూ.7.51 కోట్లు లాభాలు వచ్చాయి. ఈడీ విభాగంలో రూ.7.81 కోట్ల లాభం రాగా.. యూఐడీలో రూ.1.29 కోట్లు, పీపీపీ విభాగంలో రూ.61.65 లక్షల లాభాలు వచ్చాయి. ఇందులో తక్కువ లాభం వచ్చిన పీపీపీ విభాగంలో ఓ ఉద్యోగికి వేతనాలు పెంచి నెలకు రూ.4,63,050 చొప్పున ఇస్తున్నారు. టీడీపీ సానుభూతిపరుడనే ఏకైక కారణంతో ఇటీవల బీడీడీ విభాగంలో ఓ ఉద్యోగిని తీసుకుని నెలకు రూ.3,85,714 చొప్పున వేతనం ఇస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులైన ఉద్యోగులకు లేదా ముడుపులు ఇచ్చిన వారికి నెలకు గరిష్టంగా రూ.4.63 లక్షల నుంచి కనిష్టంగా రూ.1.42 లక్షల చొప్పున వేతనాలు ఇస్తున్నారు.

### అన్యాయాన్ని ప్రశ్నిస్తే సస్పెన్షన్ నజరానా

తమకు అప్పగించిన విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచి.. తమ ప్రతిభ ఆధారంగా లాభాలు తెచ్చిన ఉద్యోగులకు పదోన్నతి కల్పించకుండా, వేతనాలు పెంచకుండా వేధిస్తున్నారని వాపోతున్నారు. ఏమిటీ అన్యాయమని ఎవరైనా ప్రశ్నిస్తే... సీఈవోకు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి తప్పుడు సమాచారం ఇచ్చి, తప్పుదోవ పట్టించి వారిపై సస్పెన్షన్ వేటు వేయిస్తున్నారు. లేదంటే మెమోలు ఇప్పించి వేధిస్తున్నారు. కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ అజీమ్ అహ్మద్‌పై ఇదే రీతిలో ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి సస్పెన్షన్ వేటు వేయించారని ఉద్యోగులు తెలిపారు. తమ మాట వినకుండా ముడుపులు ఇవ్వడానికి నిరాకరించిన ఉద్యోగులకు పదోన్నతి ఇవ్వకుండా, వేతనాలు పెంచకుండా ఆ నలుగురూ మోకాలడ్డుతున్నారని ఆ సంస్థ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయ సంస్థ, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. కానీ.. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య సంస్థ అయిన ఏపీయూఐఏఎంఎల్ సిబ్బందికి మాత్రం ప్రభుత్వ నిధులతో ప్రతినెలా ఠంచనుగా జీతాలు ఇస్తుండటం గమనార్హం.

# అది ఏకపక్ష కమిషన్

▶ మొదటి పేజీ తరువాయి

పర్చేజ్ కమిటీలో కేవలం ప్రత్యేక ఆహ్వానితులమే. పూర్తి స్థాయి సభ్యులం కాదు. అసలు సభ్యులైన మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని సీబీఐ గంటల తరబడి విచారించగా, నన్ను మాత్రం 15 నిమిషాల్లోనే బయటకు పంపించి నాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పి పంపింది' అని భూమన తెలిపారు. ఈ సమావేశంలో భూమన ఇంకా ఏమన్నారంటే..

### దినేష్ కుమార్‌కు టీటీడీ చైర్మన్ పదవి ఆఫర్

దినేష్‌కుమార్ అనే వ్యక్తి ఇప్పటికే అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఐఏఎస్ అధికారిగా పేరుంది. గతంలో చంద్రబాబు హయాంలో చీఫ్ సెక్రటరీగా పని చేసిన ఆయనకు ఇప్పుడు టీటీడీ చైర్మన్ పదవి ఆశ చూపించి, ఏకసభ్య కమిషన్‌గా నియమించి, చంద్రబాబు చెప్పినట్టుగా నివేదిక ఇప్పించారు. ఆయన విచారణలో అనిల్ కుమార్ సింఘాల్, ధర్మారెడ్డి వంటి వారిని పిలిచారా? నిందితులుగా పేర్కొంటున్న జగదీశ్వర్‌రెడ్డి, బాలాజీ, విజయభాస్కర్, సురేంద్రనాథ్‌లను విచారించారా? మమ్మల్ని ఎప్పుడైనా విచారణకు పిలిచారా? పిలవకుండానే మీ ఇష్టం వచ్చినట్లు నివేదిక ఎలా ఇస్తారు? ఏడాదిన్నర పాటు సీబీఐ సిట్ అధికారులు ఎనిమిది రాష్ట్రాలు తిరిగి వందల మందిని విచారించి ఇచ్చిన నివేదిక కంటే మీ విచారణ గొప్పదా? సీబీఐ మమ్మల్ని ఎవరినీ దోషులుగా నిర్ధారించలేదు కాబట్టి, మమ్మల్ని దోషులుగా చూపించేందుకు ఉద్దేశ పూర్వకంగానే ఈ ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

### మా హయాంలో 18 సార్లు వెనక్కి పంపించాం

చంద్రబాబు హయాంలోనే కల్తీ నెయ్యిని పట్టుకుని, అదే నెయ్యిని తిరిగి లడ్డూ తయారీలో వాడారని సీబీఐ చెప్పింది. మీరు వెనక్కి పంపిన అదే నెయ్యిని వైష్ణవి డెయిరీ ద్వారా తిరుమలకు పంపించి లడ్డూలు తయారు చేయించింది మీరు కాదా? జంతు కొవ్వు కలిసిందని ప్రచారం చేసిన నెయ్యినే మీరు ఉపయోగించారు. మా హయాంలో బీటా సైటోస్టెరాల్ పరీక్షల్లో లోపాలు తేలితే 18 సార్లు నెయ్యిని వెనక్కి పంపించాం. మీ హయాంలో కూడా 14 సార్లు తిరస్కరించారనే విషయం వాస్తవం కాదా? మేం ఎన్‌డీడీబీతో ఒప్పందం చేసుకుని ల్యాబ్‌లను ఆధునికీకరించాం, ఎఫ్ఎస్ఎస్ఏఐతో కలిసి రూ.30 కోట్ల ల్యాబ్‌కు పునాదులు వేసింది కూడా మేమే. ఆ తర్వాత మీరు దేవాన్ష్ పుట్టిన రోజున ఓపెన్ చేశారంతే. 2018లోనే మీరు రూ.4.5 కోట్లకు ఫ్లేవర్ ఘీ కొనుగోలు చేశారు. మీ లడ్డూ నాణ్యమైనదైతే అది ఎందుకు? ఈ ఏకపక్ష కమిషన్ అసలు ఉద్దేశం డైవర్షన్ రాజకీయాలే. ఇందాపూర్–హెరిటేజ్ బంధాన్ని దాచడానికే ఇదంతా. ఈ సమావేశంలో మాజీ మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర పాల్గొన్నారు.

### దమ్ముంటే కేసులు పెట్టండి?

- దినేష్‌కుమార్ నివేదికపై ఈనాడులో కథనం వచ్చిన వెంటనే టీటీడీ బోర్డు సభ్యులు హడావుడిగా మీడియా ముందుకు వచ్చి ఈ నెల 6న బోర్డు మీటింగ్‌లో తీర్మానం చేసి మాపై క్రిమినల్ కేసులు పెడతామని చెబుతున్నారు. చాలెంజ్ చేస్తున్నాం.. దమ్ముంటే కేసులు పెట్టండి. అదే పత్రికలో నేను, భాస్కర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులమేనని, చర్యలు బోర్డు నిర్ణయానికే వదిలేశారని రాశారు. అనిల్‌కుమార్ సింఘాల్‌పై ఎలాంటి చర్యలకు కమిషన్ ఆదేశించకపోయినా, ఆయన కింద ఉన్న సీఈవో బాలాజీ, ధర్మారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిలపై క్రమశిక్షణ చర్యలు సూచించడం ఆశ్చర్యకరం. బీఆర్ నాయుడు వ్యవహారాలపై, కొండపై రెండేళ్లుగా జరుగుతున్న అపచారాలపై కూడా దినేష్ కుమార్ విచారణ చేయాల్సింది.
- చంద్రబాబు హయాంలో కిలో నెయ్యి రూ.321తో సరఫరా చేసిన హెరిటేజ్‌తో సంబంధం ఉన్న ఇందాపూర్ డెయిరీ ఇప్పుడు కిలో నెయ్యి రూ.658తో ఎలా సరఫరా చేస్తోంది? అసలు ఇందాపూర్–హెరిటేజ్ సంబంధం ఏమిటి? దీనిపై కూడా దినేష్‌కుమార్ విచారణ చేయాలి. 2018లో చంద్రబాబు పాలనలోనే బోలేబాబాకు సంబంధించిన హర్ష్ ఫ్రెష్ డెయిరీకి తలుపులు తెరిచి, ఆ సంస్థ నుంచి సుమారు 82 వేల కేజీల నెయ్యి సరఫరా జరిగిన విషయాన్ని ఎందుకు పట్టించుకోలేదు? 2019లో మా ప్రభుత్వం వచ్చాక ఒక్క డెయిరీ అయినా వచ్చిందా?
- 2023లో నేను టీటీడీ చైర్మన్ అయ్యాక మళ్లీ నిబంధనలు కఠినతరం చేసినప్పటికీ వైష్ణవి, ప్రీమియం, మావిగంగ డెయిరీలు టెండర్లలో పాల్గొన్నాయి కదా. కేంద్ర ప్రభుత్వ స్టార్టప్ విధానం ప్రకారం స్థానిక డెయిరీలకు అవకాశాలు ఇవ్వాలనే ఉద్దేశంతోనే మేము నిబంధనలు మార్చాము. నాణ్యత ప్రమాణాలు తగ్గించామని మీరు ఎందుకు నిరూపించలేకపోతున్నారు?
- ఇప్పుడు మీరు చెబుతున్న ఆల్ఫా, ప్రీమియం డెయిరీలు 2014–2019 మధ్య 80 శాతానికి పైగా నెయ్యి సరఫరా చేశాయి. అలాగే ఇందాపూర్, ఆల్ఫా, బోలేబాబా డెయిరీలు టెండర్లలో పాల్గొన్నది నిజం కాదా? ఈ విషయంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5లతో కలిసి త్రిసభ్య కమిషన్ వేయండి.

## కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాల్లేవు

**సాక్షి, అమరావతి:** వివిధ ప్రభుత్వ శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 50 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెండు నెలలుగా జీతాల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి సర్వీసు కాలం ఈ ఏడాది మార్చి నెలాఖరుతో ముగిసింది. సర్వీసు కాలాన్ని పొడిగించకుండా ఆర్థిక శాఖ తాత్సారం చేస్తుండడంతో వేతనాలు నిలిచిపోయాయి. సర్వీసు కాలం పొడిగిస్తూ ఆర్థిక శాఖ జీఓ జారీ చేస్తేగానీ వీరికి వేతనాలు రావని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు నిధి పోర్టల్‌లో వీరి వివరాలు నమోదు కాలేదనే సాకుతో ఆర్థికశాఖ మార్చి నెల వేతనాలు కూడా చెల్లించలేదు. గతంలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు కాలాన్ని పొడిగిస్తూ ఆర్థికశాఖ జారీ చేసిన గడువు మార్చితో ముగిసింది. దీంతో ఏప్రిల్ వేతనాలనూ చెల్లించలేదు. సాధారణంగా ఏటా కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు కాలాన్ని ఏడాది పాటు పొడిగిస్తూ ఆర్థికశాఖ జీఓలు జారీ చేస్తుంది. గతంలో జారీచేసిన జీఓ గడువు మార్చి నెలాఖరుతో ముగిసినప్పటికీ మే వచ్చినా వారి సర్వీసు పొడిగింపునకు సంబంధించిన ఉత్తర్వులు జారీచేయలేదు. రెండు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్టు ఉద్యోగులు వాపోతున్నారు.

## నా చావుకు కారణం మీ అనుచరులే..

- మంత్రి దుర్గేష్ అనుచరులు అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారు
- సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి కట్టా మణికంఠ
- మణికంఠ ఆచూకీ తెలపాలని పోలీస్ స్టేషన్ ఎదుట టీడీపీ శ్రేణుల ఆందోళన

**నిడదవోలు రూరల్:** రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అనుచరుల టార్చర్ వల్లే నేను చనిపోతున్నాను.. అకారణంగా ఓ కేసులో ఇరికించి ఇబ్బంది పెడుతున్నారని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం సింగవరం గ్రామానికి చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి కట్టా మణికంఠ సోషల్ మీడియాలో ఆదివారం మధ్యాహ్నం సెల్ఫీ వీడియో పోస్ట్ చేశాడు. దీంతో మణికంఠ ఆచూకీ తెలపాలని టీడీపీ నాయకులు నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. మరో వైపు మణికంఠ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

### సెల్ఫీ వీడియో సారాంశం ఇదీ..

'నా పేరు కట్టా మణికంఠ. మాది నిడదవోలు మండలం సింగవరం. నాన్న.. నన్ను క్షమించండి.. నేను చనిపోతున్నా. అక్రమ కేసులు తట్టుకోలేకపోతున్నాను. మంత్రి కందుల దుర్గేష్ గారూ.. నేను తెలుగుదేశం కార్యకర్తను. మా నాన్న గారు తెలుగుదేశం పార్టీ నాయకులు. 1989 నుంచి అదే టీడీపీలో ఉన్నారు. సింగవరంలో చందు అనే వ్యక్తి గతంలో దేవదాయశాఖకు సంబంధించిన స్థలాలు కబ్జా చేశాడు. పంచాయతీరాజ్, స్కూల్ స్థలాలు కబ్జా చేశాడు. దానిపై మా నాన్న 14 నెలలుగా పోరాటం చేస్తున్నారు. టీడీపీ బూత్ ఇన్‌చార్జినైన నా మీద కేసులు పెడితే ఇంకా ఎందుకు సార్ పార్టీ. మీ నియోజకవర్గంలో బీసీలంటే అంత చులకనా? ఎఫ్ఐఆర్ ఫైల్ చేయించి నా ఫోన్ సీజ్ చేశారు. ఎస్సై, సీఐ పట్టించుకోవడం లేదు. నేను పనిచేసిన చోటుకు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కూర్చోబెడుతున్నారు. ఊర్లో భూములు కబ్జా చేసిన చందు నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. నాకు గుండె దడగా ఉంది. తట్టుకోలేకపోతున్నాను. నేను చనిపోతున్నాను. నా చావుకు కారణం డాక్టర్ తోపరాల కల్యాణ చక్రవర్తి, పెన్మత్స చందు వర్మ, అచ్యుత్ పవన్, సాయిలక్ష్మణ్ అడ్డాల, ఎస్సై జగన్మోహన్ రావు, సీఐ తిలక్‌లే. నేను చనిపోతున్నాను.. నా వల్ల కావడం లేదు.' అని పోస్టు చేశాడు.

సోషల్ మీడియాలో కట్టా మణికంఠకు మద్దతుగా జనసేన పార్టీని ప్రశ్నిస్తూ టీడీపీ నాయకులు పెట్టిన పోస్టులు

మణికంఠ సెల్ఫీ వీడియో కోసం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్ సంక్షోభాలకు లోబడి ఉంటాయి, స్కీముకి సంబంధించిన డాక్యుమెంట్లను జాగ్రత్తగా చదవండి.

ప్రతి మనిషికి ఆలోచనల రూపంలో కొంత మూలధనం ఉంటుంది. దానిని ఉపయోగించి మరిన్నిటిని సంపాదించుకునే శక్తి మనిషికి మాత్రమే ఉంది.

– జోహాన్ ఫ్రెడ్రిక్ హెర్బర్ట్

సాక్షి

సోమవారం, 4 మే 2026

# అందమైన నివాసం

మనిషికి ఆకాశంలోకి ఎగరాలన్న కాంక్ష పుట్టించేది పక్షి కాదు, తారలు కూడా కాదు, చదమామ! కథలు వినాలన్న ఆసక్తి పుట్టించడంలో నానమ్మ పాత్ర ఎంతో చందమామదీ అంతే. చందమామే ఒక కథ. ఒక కవిత కూడా. ఒక అందమైన స్త్రీ ఎలాంటి కవితావేశాన్ని కలిగిస్తుందో, నిండు చందమామ అలాంటి భావావేశాన్ని పుట్టిస్తుంది. అందుకే చందమామను తన అక్షరాల్లోకి ఒడిసిపట్టని భావకవులు ఉండరు. అసలు ఏ కవికైనా తన తొలి కవితకు సరంజామా ఇవ్వగలిగేది చందమామ కాక ఇంకేమిటి? అది మనిషికి ఎంత దూరమో అంత దగ్గర. ఈ నట్టనడి ఎండల్లో చంద్రుడి తలంపే మనకు చల్లని గొడుగు.

'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అని తిలక్ అన్నప్పుడు ఈ వాక్యానికి అందం అందమైన ఆడపిల్లల వల్లే రాలేదు; వాళ్లు వెన్నెల్లో ఆడుకోవడం వల్ల వచ్చింది. చంద్రుడిని తలుచుకుంటేనే ఒక నెమ్మది, ఒక ప్రశాంతత, ఒక రహస్యోద్వేగం. అని మనిషిని మెలకువలోంచి కలల్లోకి మేలుకొలిపే మార్మిక మంత్రదండం. ఒంటరి ప్రయాణీకుడికి చందమామే దారి దీపం. అనంత చీకటిమయ ఆకాశాన్ని సజీవ మూర్తిగా నిలబెట్టేది దానికి రెండో కన్నుగా ఉండే చందమామే. పౌర్ణమికి దినదిన ప్రవర్ధమానమవుతూ, అమవసకు అంతా కోల్పోయినట్టవుతూ మనిషి జీవిత చక్రాన్ని ఇది గుర్తుచేస్తుంది. అన్ని మతాల్లోనూ, సంస్కృతుల్లోనూ చంద్రుడి చుట్టూ ముడివడి ఎన్నో పండుగలున్నాయి. అసలు శరదృతువులో పౌర్ణమిని చూడటమే ఒక పండుగ!

చైనా భావకవితోద్యమానికి మార్గదర్శిగా చెప్పే లీ తై–పో క్రీ.శ. 699–705 ప్రాంతంలో జన్మించాడు. పదేళ్లకే కన్‌ఫ్యూసియస్ పుస్తకాలన్నీ చదివేశాడు. దేశమంతా తిరిగాడు. రాజప్రాసాదాల్లోనూ జీవించాడు, గుహల్లోనూ నిద్రించాడు. మద్యం, మగువ, కవిత్వం ఆయనకు ప్రాణాధారం. వెనుక సంచీలో పుస్తకాలు, అంగీ మడతలో గుప్తంగా పిడిబాకు, అరచేతిలో సిద్ధంగా కవిత– ఇదీ ఆయన వేషం. ఒకరోజు తాగిన మత్తులో సరస్సులోని చంద్రుడి బింబాన్ని కౌగిలించుకోబోయి మరణించాడని చెబుతారు. ఎలాంటి భావకవి! ర్యోకన్ తైగు అనే జెన్ గురువు గుడిసెలోకి ఒక దొంగ వచ్చాడట. తన దుస్తులు సహా దొంగకు ఒలిచి ఇచ్చేశాడు గురువు. దొంగ వెళ్లిపోయిన తర్వాత, ఒంటి మీద నూలుపోగైనా లేకుండా నిండుగా వెలుగుతున్న చందమామను కిటికీలోంచి చూస్తూ కూర్చున్న గురువు, అంతటి అందమామను దొంగకు ఇవ్వలేకపోయినందుకు నొచ్చుకున్నాడట! దొంగలు మన దగ్గరినుంచి ఎత్తుకెళ్లలేనిది మన విద్య, వివేకాలనే కాదు, మనకున్న చందమామను కూడా! ఒక్క చంద్రుడుని నిండుగా ఆనందించగలిగే హృదయముంటే ఎన్ని పూటల భోజనానికి పడే ఆరాటం తప్పుతుంది! ఇటాలో కాల్వీనో కథా ప్రపంచంలోనైతే చందమామ మీదికి నిచ్చెన వేసుకుని ఒక్క గెంతులో ఎక్కేయొచ్చు. అక్కడి మీగడ చిక్కదనపు పాలను లోడుకోవచ్చు. దానికి చేయవలసిందల్లా పొక్కులుగట్టిన చందమామ ఉపరితలం మీదుండే పొలుసులను కొద్దిగా జరిపి అక్కడ గరిట పెట్టడమే!

గ్రీకు ప్రకృతి దేవత మీదుగా నామకరణం చేసి, చంద్రుడి మీదకు 'నాసా' పంపిన వ్యోమనౌక ఆర్టెమిస్–2 ఏప్రిల్ 1–11 వరకు తిరుగాడి భూమ్మీదకు తిరిగొచ్చింది. భూమి నుంచి అంతరిక్షంలోకి సుదూరం పయనించి గతంలోని 'అపోలో' రికార్డును ఇది బద్దలుకొట్టింది. అన్నట్టూ అపోలో, ఆర్టెమిస్ గ్రీకు పురాణంలో కవల సోదరీమణులు. మొదలైనప్పటినుంచీ తిరిగొచ్చేదాకా 6,95,081 మైళ్లు ప్రయాణించిన ఆర్టెమిస్–2 అంతరిక్షంలోకి సుదూరంగా వెళ్లే వ్యోమగాములకు అవసరమైన వ్యవస్థలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదోనని నిర్ధారించేందుకు ఉద్దేశించినది. వస్తూవస్తూ సాక్ష్యంగా కొన్ని ఫొటోలను తెచ్చింది. వాటిని చూస్తే, చంద్రుడి మీద వెన్నెల మీగడలు ఏమీ లేవని తెలియడం ఒకింత కాల్పనిక నిరాశ. ఇది మామూలు భూమిలానే ఉందని తెలియడం ఒక వాస్తవం. కానీ చంద్రుడిపై మనుషులు దీర్ఘకాలంగా నివసించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు కావడం సాంకేతిక సంభ్రమం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ పరాభవనామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం; **తిథి:** బ.తదియ రా.2.50 వరకు, తదుపరి చవితి; **నక్షత్రం:** అనూరాధ ఉ.8.04 వరకు, తదుపరి జ్యేష్ఠ; **వర్జ్యం:** ప.2.16 నుండి 4.03 వరకు; **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.12 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.44 వరకు; **అమృత ఘడియలు:** రా.12.56 నుండి 2.41 వరకు.

**సూర్యోదయం:** 5.38
**సూర్యాస్తమయం:** 6.16
**రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు
**యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు

## సోషల్ టాక్

### వాదన వద్దు



నా జీవితంలో ఇప్పుడు నేను 'వాదించని దశ'లో ఉన్నాను. ఏనుగు ఎగరగలదని మీరు చెబితే, మీరు చెప్పింది అక్షరాలా నిజం అంటాను. అలాగని నేను మీతో ఏకీభవించానని కాదు. కాదని మిమ్మల్ని ఒప్పించేంత ఉత్సాహం, ఓపిక, అవసరం నాకు లేనందువల్ల.

– త్రిష, దక్షిణాది నటి

### తెలిసినా సరే..!



జీవితంలోని గొప్ప నైపుణ్యం ఏమిటంటే, మీకు బాగా తెలుసని అనుకునే దాని గురించి మీకసలు ఏమీ తెలియదని అనుకోవటం. మీరు నేర్చుకున్న దాని గురించి మీరు గర్వపడటం మొదలుపెడితే, ఇంకేదీ నేర్చుకోకుండా ఆ గర్వం మీ బుద్ధికి అడ్డుపడుతుంది.

– టిన్నూ ఆనంద్ (81), నటుడు, దర్శకుడు

### ఏకైక మార్గం

మర్చిపోండి, క్షమించండి, ముందుకు సాగండి. బలమైన సంస్థను, బలమైన దేశాన్ని నిర్మించటానికి ఇదే ఏకైక మార్గం. అలాగే, బలమైన వ్యక్తిత్వాన్ని కూడా! చెదరని మనసుతో సరైన సమయం కోసం వేచి ఉండేవారు ఎన్నటికీ అస్థిమితానికి గురవరు.

– అశోక్ గెహ్లోత్, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి

### కర్తవ్యం



అవాస్తవాలు లక్షలాది మందికి వ్యాపించినప్పుడు ఆ 'మంటలను' అడ్డుకోవటం సులభం కాదు. కానీ, అడ్డుకోవటం అన్నది మన కర్తవ్యం. ద్వేషాన్ని రగిల్చేవారి పట్ల మౌనం వహించటం కూడా ఆ అమానవీయమైన నేరంలో భాగస్వామ్యం కలిగి ఉండటమే.

– ఎన్. రామ్ (81), జర్నలిస్టు దిగ్గజం

### 'ఆలయ' ప్రవేశం

విద్యా సంస్థలు దేవాలయాలు కావు. అవి ఆలోచనలకు, చర్చలకు వేదికలు. కుల, లింగ భావాలు లేకుండా ఆ, జ్ఞాన ప్రపంచంలోకి అందరి ప్రవేశాన్నీ మనం సంరక్షించాలి. సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించటం విద్యావంతులందరి జీవన విధానం కావాలి.

– దీపా నిశాంత్, మలయాళ రచయిత్రి

### లేకపోతే కదా..!

భారతదేశం అభివృద్ధి చెందటానికి 2027 వరకూ వేచి ఉండాలా! నిజానికి ఆ లక్ష్యాన్ని మనం ఏటా రెండంకెల వృద్ధితో ఒక దశాబ్దం ముందే చేరుకోవచ్చు. అందుకు కావలసిన సామర్థ్యం, కష్టించి పనిచేసే యువత మన దగ్గర లేకపోతే కదా!!

– సునీల్ కనోరియా, 'అసోచామ్' మాజీ అధ్యక్షులు

# జీవిత సాఫల్యానికి మూడు పాఠాలు

విశ్వ గురు



రిషి సునాక్ బ్రిటన్‌కు మొదటి బ్రిటిష్ ఏషియన్ ప్రధాని. బ్రిటన్ కడచిన 200 ఏళ్లలో అంతటి పిన్న వయస్కుడైన ప్రధానిని చూడలేదు. అక్షతా మూర్తి ఇన్ఫోసిస్ స్థాపకుడు ఎన్.ఆర్.నారాయణ మూర్తి కుమార్తె. వ్యాపారంలో, సేవా కార్యక్రమాల్లో దక్షురాలిగా నిరూపించుకున్నారు. రిషి–అక్షత అమెరికాలోని 'స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్'లో కలిసి చదువుకున్నారు. అక్కడే ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నారు. వారిద్దరూ అదే యూనివర్సిటీ 2025 బ్యాచ్ గ్రాడ్యుయేట్లను ఉద్దేశించి చేసిన 'మూడు పాఠాల' ప్రసంగ సంక్షిప్త పాఠం:

**రిషి సునాక్:** నేను ప్రాథమికంగా సంఖ్యల మనిషిని. గణితం, గణాంకాలు, కోడింగ్ ఉపయోగించి ఫైనాన్స్ రంగంలో పెట్టుబడి వ్యూహాలు రూపొందించే నిపుణుడిని. అది మా మామగారు 'ఇన్ఫోసిస్' నారాయణ మూర్తితో నా అనుబంధం బలపడటానికి సహాయపడింది. ''మేం దేవునిపై విశ్వాసం ఉంచాం. డేటాను ఒక చోటికి చేర్చడమే మిగిలిన వారందరి కర్తవ్యం'' అన్నదే ఆయన నమ్మే మంత్రం. నాదీ అదే బాట. డేటా, దాని విశ్లేషణ పట్ల నాకు అపారమైన గౌరవం. స్టాన్‌ఫోర్డ్ విడిచిపెట్టాక, నేను నిర్వహించిన ప్రతి పాత్రలోనూ అది నన్ను విజయుడిని చేసింది. డేటా, దాని ననుసరించి తీసుకునే డెసిషన్లు నాకు చాలా ఉపకరించాయి.

### 1. అంతరాత్మ చెప్పినట్లు కూడా నడుచుకోండి!

నేను ఇక్కడ నేర్చుకున్న టెక్నిక్కులు, పదిహేనేళ్ళ తర్వాత, ఎస్.ఐ.ఆర్. మోడళ్ళను అర్థం చేసుకోవడంలో సాయపడ్డాయి. ఎస్ అంటే సస్కెప్టిబుల్. వ్యాధికి ఇంకా లోనుకానివారు. దాని బారిన పడటానికి అవకాశం ఉన్నవారు. ఐ అంటే ఇన్‌ఫెక్ష్యువస్. వ్యాధి బారినపడి, దాన్ని ఇతరులకు వ్యాపింపజేసే స్థితిలో ఉన్నవారు. ఆర్ అంటే రికవర్డ్/రిమూవ్డ్. వ్యాధి నుంచి కోలుకుని, శాశ్వత రోగ నిరోధక శక్తిని అభివృద్ధి చేసుకున్నవారు. వారు మరోసారి వ్యాధికి లోనయ్యే అవకాశం లేదు. వ్యాధితో మరణించినవారు కూడా ఇదే వర్గంలోకి వస్తారు. మహమ్మారులు ప్రబలినపుడు జనాభాను ఈ మూడు వర్గాలుగా విభజించి వ్యాధి వ్యాప్తికి ఉన్న అవకాశంపై లెక్కలు కడుతూంటారు. కోవిడ్ కారణంగా నెలల తరబడి లాక్‌డౌన్లతో బాధపడ్డాక, 2021లో ఒమిక్రాన్ అంటూ కోవిడ్‌లో కొత్త రకం మొదలైంది. దక్షిణాఫ్రికాలో మొదలైన ఆ వైరస్, బ్రిటన్‌లో విపరీతంగా పెరిగిపోతూ వచ్చింది. నేను అపుడు బ్రిటన్ ఆర్థిక మంత్రిగా ఉన్నాను. ఆ సమయంలో, అమెరికా పర్యటనలో ఉన్నాను. ఆందోళన కనబరుస్తూ, హఠాత్తుగా వచ్చిన ఫోన్ కాల్‌తో, పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని బ్రిటన్‌కు వెళ్లిపోయాను. మరోసారి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించాలంటూ ఒత్తిడి వస్తోంది.

డేటా పట్ల సరైన అవగాహన ఉన్నవాడిని కనుక సరిపోయింది. లేకపోతే, నేనూ అదే రకమైన అభిప్రాయాన్ని బలపరచేవాడినేమో. దక్షిణాఫ్రికాలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరాన్ని డేటా సూచించింది. అది నాలో ప్రశ్నలను రేపింది. 'కానీ' ఏమైనా అయితే అనే సందేహమూ తొలుస్తోంది. డేటా సరైన పరిష్కారాన్ని సూచిస్తుందని నమ్మేవాడినే కానీ, నేను ఇక్కడ చదువుకుంటున్న రోజుల్లోనే, డేటా అన్ని వైపుల పరిస్థితిని చూపలేదని ఆషా(అక్షత) నేను గ్రహించేటట్లు చేసింది. లాక్‌డౌన్ విధిస్తే తీవ్ర పర్యవసానాలుంటాయి. నాడు 2021 డిసెంబర్‌లో ఎటూ తేల్చుకోలేని స్థితి. అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే 50 శాతం మంచిదనిపిస్తుంది. వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం 50 శాతం మంచిదనిపిస్తుంది. కేవలం డేటా విశ్లేషణపైనే ఆధారపడి నిర్ణయాలు తీసుకునే పక్షంలో ఆ పని ఎవరైనా చేయగలరు. నాయకుని బల్ల దాకా రానక్కరలేదు. కనుక, డేటాతోపాటు అంతఃకరణపైన కూడా ఆధారపడాలి. అంతరాత్మ ప్రబోధాన్ని కూడా వినాలి. రెండింటిని బట్టి నిర్ణయాలు తీసుకోవాలి.

**అక్షతా మూర్తి:** రెండవ పాఠం ఆదర్శవాదంతో కనే పెద్ద పెద్ద కలలకు, ఆచరణవాదంతో వేసే చిన్న చిన్న అడుగులకు సంబంధించినది. దీన్ని నేను రిషి నుంచి నేర్చుకున్నాను. నేను ధనికులకు–పేదలకు మధ్య అగాధం ఎక్కువగా ఉన్న దేశంలో పెరిగాను. నా తల్లితండ్రులు విస్తృతమైన మార్పు తీసుకురావాలనే స్ఫూర్తిని అందించారు. స్టాన్‌ఫోర్డ్‌లో విధిగా రాయవలసిన మొదటి వ్యాసంలో విద్య, ప్రభావం, సేవల గురించే ఎక్కువ చెప్పాను. మిగిలినవాటన్నింటికన్నా ఆదర్శమే సర్వోత్తమమైనదనే అభిప్రాయం ఉండేది. దానికోసం ఏం చేయదలచుకున్నావు అనే ప్రశ్న రిషి నుంచి ఎదురైంది.

వాస్తవికతతో ముడిపెట్టని ఆదర్శాల వల్ల ప్రయోజనం శూన్యమని రిషి అభిప్రాయం. బాహ్య ప్రపంచంలో దైనందిన జీవితంలో స్పష్టంగా కనిపించే చిన్ని అడుగుల ద్వారానే పెద్ద స్థాయిలో రూపాంతరీకరణ సాధ్యమవుతుందని రిషి నుంచి నేర్చుకున్నాను. ఆదర్శాలను వల్లిస్తే సరిపోదు. ఆ దిశగా చిన్న అడుగులైనా వేయడం ప్రారంభించామా లేదా అన్నదే ముఖ్యం.

### 2. ఆచరణాత్మక దృక్పథమూ అవసరమే!

జీవితాలను మార్చాలన్నా, సామాజిక చేతనను పెంచాలన్నా చదువు ద్వారానే సాధ్యమని మా ఇద్దరి అభిప్రాయం. బ్రిటన్ ప్రధాని అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ఉన్నపుడు, 'లెసన్స్ ఎట్ 10' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. అది బ్రిటన్ నలుచెరగులా యువతను విద్యావంతులను చేసి, వారిలో స్ఫూర్తిని నింపేందుకు చేపట్టిన కార్యక్రమం. రిషి, నేను కలసి 'రిచ్‌మండ్ ప్రాజెక్టు'ను కూడా ప్రారంభించాం. గణితాన్ని చూసి బెదిరిపోకుండా యువతలో ధైర్యం నింపడం, వారిలోని సంఖ్యా పరిజ్ఞాన పాటవాలకు మెరుగులు దిద్దడం, ఫైనాన్షియల్ అక్షరాస్యతను పెంపొందించడం ఆ కార్యక్రమం లక్ష్యం. ఆచరణాత్మక దృక్పథం నేను ఒకప్పుడు అమాయంగా భావించినట్లుగా, అది ఆదర్శవాదానికి వ్యతిరేకమైనది కాదు. అది ఆదర్శానికి తోటి భాగస్వామి లాంటిది. పెద్ద పెద్ద కలలను సాకారం చేసుకునేందుకు ఆ రెండూ అవసరమే.

> ◆ డేటాతోపాటు అంతరాత్మ ప్రబోధాన్ని కూడా వినాలి. వాస్తవికతతో ముడిపెట్టని ఆదర్శాల వల్ల ప్రయోజనం శూన్యం. ఫలితం గురించి ఎక్కువగా ఆందోళన చెందకూడదు.

**రిషి సునాక్:** ఫలితం గురించి ఎక్కువగా ఆందోళన చెందకపోవడం మేం నేర్చుకున్న ముఖ్యమైన మూడవ పాఠం. ఈ భావనను సంస్కృతంలో 'ధర్మం'గా పిలుస్తారు. మనం చేసే పనుల నుంచి ఫలితాలను ఆశించకుండా మన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడం. నాయకత్వం వహిస్తున్నప్పుడు విజయాలు, వైఫల్యాలు రెండింటినీ చవి చూడవలసి వస్తుంది. ఆ మాటకొస్తే, మనం ఏ రంగంలో ఉన్నా దూషణ భూషణలను ఎదుర్కోవలసి వస్తుంది. నిర్లిప్తంగా ఎవరి పని వారు చేసుకుపోవాలని నేను చెప్పడం లేదు. విమర్శల పట్ల భయంతో కాక, నా బాధ్యతను నేను నిర్వర్తిస్తున్నాననే భావనతో ఏ పనైనా చేయాలి.

### 3. విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి!

ఆషా నేనూ కలసి గడ్డు కాలాన్ని ఎదుర్కోవడంలో ఈ విద్యుక్త ధర్మ భావన ఎంతో సహాయపడింది. కన్సర్వేటివ్ పార్టీ నాయకునిగా, ప్రధాన మంత్రిగా తిరిగి పరిణమించే ప్రయత్నంలో 2022 వేసవిలో నేను విఫలమయ్యాను. ఎంతో శ్రమపడ్డ తర్వాత కూడా ఫలితం అనుకూలంగా రాకపోవడం బాధ పెట్టింది. కానీ, తర్వాత, అదీ మంచికే అనిపించింది. ఒక సాధారణ పార్లమెంట్ సభ్యునిగా చేయవలసిన పనులపై మరింత దృష్టి పెట్టగలిగాను. ఒక భర్తగా, తండ్రిగా కుటుంబానికి మునుపటికన్నా ఎక్కువ సమయాన్ని కేటాయించగలిగాను.

ఆరు వారాలు గడిచాక, నాకన్నా, ముందు ఆ పదవిలో ఉన్న వ్యక్తి రాజీనామా చేశారు. పౌండ్ విలువ వేగంగా పతనమవడం ప్రారంభించింది. ద్రవ్యోల్బణం 40 ఏళ్లలో ఎన్నడూ లేనంత అత్యధిక స్థాయికి చేరుకుంది. పరిస్థితులను చక్కదిద్దడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. కానీ, క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడే దేశానికి సహాయపడటం ధర్మమని ఆషా గుర్తు చేసింది. రెండు రోజుల తర్వాత, ప్రధాని నయ్యాను.

ప్రజాహిత రంగంలోనే కాదు ఎక్కడైనా సరే, పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ, మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించేందుకు ముందుకు రావాలి. అంతకుముందున్న పరిస్థితులను లెక్కలోకి తీసుకోకూడదు. అహంకారానికి తావు ఇవ్వకూడదు. జీవితాన్ని సఫలం చేసుకునేందుకు అదొక్కటే మార్గం. మనం సాధ్యమని భావిస్తున్న దాని కన్నా ఎక్కువగా సాధించడానికి అది తోడ్పడుతుంది. 10 డౌనింగ్ స్ట్రీట్‌లో కాపురముండిన మొదటి స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్లం మేమే. కానీ, ఒక ముఖ్యమైన సమయంలో, ఒక ముఖ్యమైన బాధ్యతను నిర్వర్తించిన చివరివాళ్ళం మేమే కాకూడదని మా ఇద్దరి కోరిక. ◆

# అందరి ఆసక్తీ బెంగాల్ పైనే...

మే 4న వెలువడనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో దేశమంతా అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫలితాలు పశ్చిమ బెంగాల్‌వే.

కొంతమంది రాజకీయ విశ్లేషకులు బెంగాల్ ఎన్నికలను దేశంలోని మధ్యంతర ఎన్నికలతో పోలుస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన కొందరు ప్రతినిధులు, బెంగాల్‌లో బీజేపీ ఓడిపోతే ప్రధాన మంత్రి, గృహ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగంపై అవగాహన లేని ఇలాంటి వ్యాఖ్యలపై నవ్వడం తప్ప మరేమీ చెప్పలేం.

ఎగ్జిట్ పోల్స్, భారీ ఓటింగ్ శాతం, భయపడిన ఓటర్ల నిశ్శబ్దం, మార్పు గాలి– ఇవన్నీ చాలా విషయాలను సూచిస్తున్నాయి. అయితే మే 4కు ముందే ఫలితాలపై వ్యాఖ్యానించడం రాజకీయ అపరిపక్వత అవుతుంది. గత ఐదు దశాబ్దాల కాలంలో ముందుగా 35 సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టీలు, తరువాత గత 15 సంవత్సరాలుగా తృణమూల్ కాంగ్రెస్ హింస, భయం, అశాంతి ద్వారా ఎన్నికలు గెలిచాయనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు, పరిపాలన, ప్రభుత్వ వ్యవస్థ ఈ సంఘటనలపై చూపిన మౌనం రాజకీయ ఉద్దేశ్యాలను స్పష్టంగా సూచిస్తోంది.

92 శాతం ఓటింగ్‌లో పాల్గొన్న బెంగాల్ ప్రజలను ప్రశంసించాలి. గతంలో కేవలం 60 శాతం మాత్రమే ఓటు వేసే 'భద్రలోక్' వర్గం కూడా ఈసారి భయంలేకుండా సుమారు 90 శాతం వరకు ఓటు వేసింది. బూత్ స్థాయి సర్వేలు చూపిస్తున్నట్లుగా ఎక్కువ మంది ప్రజలు భయం, హింస, అశాంతి నుండి విముక్తి కోసం ఓటు వేశారు. భవానీపూర్‌లో తృణమూల్ ఆందోళన కనిపిస్తోంది. అక్కడ మమతా బెనర్జీ స్వయంగా పోటీలో ఉన్నారు. ఆమె రోజంతా బూత్‌లను సందర్శిస్తూ కనిపించారు. గురువారం సాయంత్రం ఆమె తమ పార్టీ నేతలతో కలిసి ఈవీఎమ్ స్ట్రాంగ్ రూమ్ బయట ధర్నా కూడా చేశారు. మరోవైపు బీజేపీ ప్రతి బెంగాలీ ఓటరును చేరుకుని తృణమూల్ చర్యలను విమర్శిస్తూ, బెంగాల్ అభివృద్ధికి తమ ప్రణాళికలను వివరించింది. తమ ఎన్నికల హామీ పత్రంలో సమాజంలోని ప్రతి వర్గానికి హామీలు ఇచ్చింది.

మరి కొద్ది గంటల తర్వాత బెంగాల్ ప్రజలు ఎవరిపై నమ్మకం ఉంచారో, పశ్చిమ బెంగాల్ రైటర్స్ బిల్డింగ్‌లో ఎవరు కూర్చుంటారో స్పష్టమవుతుంది. తృణమూల్ ఓడిపోతే, అది ప్రతిపక్షానికి పెద్ద ఓటమిగా పరిగణించబడుతుంది. ఎందుకంటే అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, అరవింద్ కేజ్రీవాల్, పరోక్షంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు తృణమూల్‌కు మద్దతుగా ప్రచారం చేశారు కనుక. కాగా బీజేపీ ఒంటరిగానే వారిని ఎదుర్కొంది. బీజేపీ బెంగాల్‌లో గెలిస్తే, అది నెగెటివిటీపై పాజిటివిటీ విజయంగా చెప్పవచ్చు. ఇప్పుడు మమతా చేతులు జోడించినా ప్రయోజనం ఉండదు. సందేశ్‌ఖాలి, ఆర్జీకర్ ఆసుపత్రి డాక్టర్ వంటి ఎందరో నిరపరాధుల ఆత్మలు న్యాయం కోరుతున్నాయి.

– రాకేష్ శర్మ । 'ఆజ్' దినపత్రిక పబ్లిషర్

# కణశాస్త్ర శోధనలో ధ్రువతార

వైజ్ఞానిక వేగుచుక్కలు- 44

భారత ప్రభుత్వం వివిధ విజ్ఞాన శాస్త్ర విభాగాలకు చెందిన 11 మంది మహిళా శాస్త్రవేత్తలను గౌరవించాలనే ఉద్దేశంతో 2020 ఫిబ్రవరిలో వేరు వేరు చోట్ల పరిశోధన పీఠాలను ఏర్పరిచింది. ఆ జాబితాలో మొదట కనబడే పేరు డా॥ అర్చనా శర్మ. వృక్ష జన్యుశాస్త్రవేత్త, కణశాస్త్రవేత్తగా ప్రసిద్ధి చెందిన అర్చనాశర్మ క్రోమోజోముల నిర్మాణం, వృక్ష జాతి ఉత్పత్తి, మ్యూటోజెనెసిస్ వంటి అంశాలలో సైతం గణనీయమైన కృషిచేశారు. క్రోమోజోముల నిర్మాణం అధ్యయనం చేయడానికి ఆమె రూపొందించిన విధానాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. పశ్చిమ భారతంలోని పుణెలో 1932 ఫిబ్రవరి 16న జన్మించిన ఈమె మధ్య భారతంలో చదువు కొనసాగించి తూర్పు తీరంలోని కోల్‌కతాలో స్థిరపడ్డారు.



డా॥ అర్చనా శర్మ

1955లో 'భారతదేశంలో కణశాస్త్రానికి పిత' ('ఫాదర్ ఆఫ్ ఇండియన్ సైటాలజీ')గా పరిగణించే అరుణ్ కుమార్ శర్మ వద్ద కలకత్తా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన్నే పెండ్లాడారు. ఆమె మంచి పరిశోధకురాలే కాదు, అంతకుమించి విద్యార్థులను చేరదీసి, బోధించే 'దీదీ' కూడా! మొక్కలలో అధిక ఉత్పత్తిని సాధించే రీతిలో జెనెటిక్స్ విభాగంలో ఆమె ప్రతిపాదించిన భావన 'నేచర్' జర్నల్‌లో ప్రచురణ కావడం అప్పట్లో భారతదేశానికి గర్వకారణం. ఆమె ప్రయోగశాలను సృజనాత్మకంగా రూపొందించుకున్నారు. కనుకనే క్రోమోజోముల పరిశోధనకు సంబంధించి అద్భుతమైన ఫలితాలు సాధించారు. పర్యావరణంలో వచ్చిన విపరిణామాలు వంటివి మొక్కలకు సంబంధించిన కణ నిర్మాణంలోనూ, వాటి జన్యుపదార్థంలోనూ మార్పులకు దారితీస్తున్నాయని గుర్తించిన విషయాలు విలువైనవి. సుమారు 70 మందికి పీహెచ్‌డీ పరిశోధనలను పర్యవేక్షించారు. ఆమె రాసిన 350 పరిశోధనాపత్రాలతో పాటు 'క్రోమోజోమ్స్ టెక్నిక్స్– థియరీ అండ్ ప్రాక్టీస్' వంటి పుస్తకాలు సుప్రసిద్ధం.

కణజన్యుశాస్త్రానికి సంబంధించి పరిశోధనా జర్నల్స్‌ను సంపాదకులుగా పర్యవేక్షించడం, కొత్త కోర్సులు రూపొందించడంలో ఆమెది అందె వేసిన చేయి. జగదీష్ చంద్రబోస్, బీర్బల్ సహానీ, అశుతోష్ ముఖర్జీ, శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి శాస్త్రవేత్తల పేరున స్థాపించిన ఎన్నో పురస్కారాలతో పాటు అర్చనా శర్మ 1984లో భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ గౌరవం కూడా పొందారు. రామకృష్ణ మిషన్, శారదా మఠాలతో కలిసి ఎన్నో రకాల సామాజిక కార్యక్రమాలలో మునిగి తేలిన ఆమె తుదకు 2008 జనవరి 14న కన్నుమూశారు. ఆమె కణశాస్త్ర పరిశోధనలో ఎప్పటికీ ధ్రువతారే!

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి విశ్రాంత ఉన్నతాధికారి

డేటా పాయింట్




# అప్రమత్తత




ఒక గొప్ప సాధువు తన శిష్యునికి తపస్సు స్పృహ లేదని గ్రహించి శిక్షణ కోసం జనక మహారాజు దగ్గరకు వెళ్లమన్నాడు. 'గురువుగారూ, మీరే గొప్ప సన్యాసి. జనకుడు గృహస్థుడు. ఆయన నుండి నేర్చుకోవడానికి ఏముంటుంది?' అని అడిగాడు. 'నేర్చుకోవలసింది చాలా ఉంది' అనడంతో గురువు ఆజ్ఞను పాటించి మిథిలకు వెళ్ళాడు.

'నీ గురువు నిన్ను ఏదో నేర్చుకోవడానికి ఇక్కడికి పంపారు కదూ. అది నేర్చుకోవడానికి నువ్వు ఈ రాజభవనంలో ఒక రోజుండి, ఆ తర్వాత వెళ్ళవచ్చు' అని చెప్పాడు జనకుడు. అతనిని రాజభవనంలోని ఒక గదిలో ఉంచారు. విందు అనంతరం నిద్రపోవడానికి మంచం మీద పడుకున్నాడు. పైకి చూడగానే ఉలిక్కిపడ్డాడు. గది పైభాగాన ఒక సన్నని దారానికి పదునైన కత్తి వేలాడుతూ ఉంది. ఏ క్షణంలోనైనా ఆ దారం తెగిపోయి ఆ కత్తి తన మెడ మీద పడుతుందేమోనని అనిపించింది. ఆ రాత్రంతా తాడుకు వేలాడుతున్న కత్తిని చూస్తూ మేల్కొని ఉన్నాడు.

తెల్లవారగానే జనకుడు వచ్చాడు. 'రాత్రి బాగా నిద్రపోయావా?' అని అడిగాడు. 'తలపైన కత్తి వేలాడుతుంటే ప్రశాంతంగా ఎలా నిద్రపోయుంటానని మీరనుకుంటున్నారు?' అప్పుడు జనకుడు 'ఇక్కడికి వచ్చినప్పుడు నువ్వు అలసిపోయి ఉన్నావు. నడుం వాల్చడంతోనే నీకు నిద్ర పట్టేసుండాలి. కానీ కత్తి నీపై పడితే ఏమవుతుందోనని భయపడి, రాత్రంతా ఆలోచనలతో పరుగెడుతూ ఉండి ఉంటావు కదూ. నిద్రపోకుండా క్షణక్షణం అప్రమత్తంగా, జాగరూకతతో ఉండి ఉంటావు. ఈ జాగరూకత మధ్యలో, నువ్వు ఈ లోకం గురించి, దాని సుఖదుఃఖాల గురించి ఆలోచించి ఉండవు. ఈ ఆలోచనారహితమైన మనస్సే వైరాగ్యం. ఇదే నీకు నా బోధ. జీవితం నీటిబుడగ లాంటిది. అది ఏ క్షణంలోనైనా పగిలిపోవచ్చు. అలాగే, మరణం ఎప్పుడైనా సంభవించవచ్చు. జీవితం అశాశ్వతత్వాన్ని గమనించు' అన్నాడు. జనకునికి నమస్కరించి వెళ్లిపోయాడు శిష్యుడు.

– యామిజాల జగదీశ్

## క్లుప్తంగా...

### 'ఇష్టకామేశ్వరి' దర్శనాలు పునఃప్రారంభం

**మార్కాపురం/శ్రీశైలం ప్రాజెక్ట్:** శ్రీశైలం ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయ దర్శనాలను తిరిగి ప్రారంభించినట్లు మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ ఆదివారం తెలిపారు. అటవీశాఖ సిబ్బంది, డ్రైవర్ల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి యాత్రికుల సందర్శనకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం యధావిధిగా వాహనాలు తిరుగుతున్నాయని వెల్లడించారు. భక్తులు ఎప్పటిలాగే అమ్మవారి దర్శనానికి వెళ్లవచ్చునన్నారు.

### ఆకివీడులో రామాలయానికి శంకుస్థాపన

**కాళ్ల :** పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలో రామాలయ నిర్మాణానికి భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఆదివారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దంపతులు శంకుస్థాపన చేశారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు దంపతులు హాజరయ్యారు. మరోవైపు చలో ఆకివీడుకు బీఎస్పీ నేతలు ఇచ్చిన పిలుపు మేరకు అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఆంక్షలు విధించారు. పెద్ద ఎత్తున ఆకివీడుకు చేరుకున్న బీఎస్పీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

### ఆత్మీయులను కలవకుండానే అనంతలోకాలకు...

**పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వెళ్తూ ఇద్దరు స్నేహితుల మృతి**

**అల్లవరం:** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఉత్సాహంగా బయలుదేరిన ఇద్దరు స్నేహితులు.. ఆత్మీయులను కలవకుండానే దుర్మరణం పాలయ్యారు. అల్లవరం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నంలోని అక్కయ్యపాలేనికి చెందిన సింహాద్రి శ్రీనివాస్ (47), అల్లవరం మండలం రెల్లుగడ్డ గ్రామానికి చెందిన ఈదరపల్లి సూర్యనారాయణరాజు (50) వైజాగ్‌లో స్థిరపడ్డారు. అల్లవరం ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన వీరు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి వెళ్లేందుకు అమలాపురం నుంచి రెల్లుగడ్డకు బైక్‌పై బయలుదేరారు. అల్లవరం ప్రధాన రోడ్డుపై పుచ్చకాయల షాపు వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సింహాద్రి శ్రీనివాస్, సూర్యనారాయణరాజును స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోగా, సూర్యనారాయణరాజు చికిత్స పొందుతూ మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని స్వస్థలం అల్లవరం మండలం బోడసకుర్రు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన బోడసకుర్రులోని తన బంధువుల ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

### పిడుగుపాటుకు కౌలు రైతు దుర్మరణం

మృతుడు అర్జునరావు

**సామర్లకోట:** కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటకు చెందిన కౌలు రైతు పిడుగుపాటుకు మృతిచెందాడు. అకాల వర్షం నేపథ్యంలో పొలంలో రాశులుగా ఉన్న ధాన్యంపై బరకాలు కప్పుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. జి.రాగంపేటకు చెందిన పెన్నాడ అర్జునరావు (60) సామర్లకోటలోని ఓ రైతు నుంచి భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం భీమేశ్వరాలయం సమీపంలో ఉన్న పొలంలో ధాన్యాన్ని రాశులుగా పొలంలోనే ఉంచాడు. ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో అప్రమత్తమైన అర్జునరావు ధాన్యాన్ని కాపాడుకునేందుకు సమీపంలో ఉన్న బరకాలను ధాన్యంపై కప్పుతుండగా.. ఆయనకు సమీపంలోనే పిడుగు పడింది. దీంతో అర్జునరావు స్పృహ తప్పి పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానిక రైతులు వెంటనే అర్జునరావును ఆస్పత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనపై సీఐ ఎ.కృష్ణ భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మావోయిస్టు పార్టీ సభ్యుడి లొంగుబాటు



దేవకు రివార్డు అందజేస్తున్న పోలీసులు

**ఎటపాక:** సీపీఐ (మావోయిస్టు) సభ్యుడు కొవ్వాసి దేవ ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూర్ పరిధిలోని భూసాపూర్‌కు చెందిన దేవ 2013 నుంచి మావోయిస్టు పార్టీలో చేరి మిలీషియా సభ్యుడిగా పని చేశాడు. 2022 నుంచి పార్టీ సభ్యుడిగా పనిచేస్తున్నాడు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసుగు చెంది, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆకర్షితుడై జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకొని లొంగిపోయినట్టు ఓఎస్‌డీ పంకజ్ కుమార్ మీనా చెప్పారు.

# రూ.5 వేల కోట్ల కొండను కొట్టేస్తున్నారు

## సైదాపురం క్వార్ట్‌జ్, మైకా గనుల్లో మరో భారీ లూటీ

**అది దట్టమైన అటవీ ప్రాంతం.. అందులో 25 ఎకరాల్లో విలువైన క్వార్ట్‌జ్, మైకా 10 లక్షల టన్నుల మేర నిక్షిప్తమై ఉన్నాయి.. కనీస మొత్తంగా లెక్కేసుకున్నా దాని విలువ రూ.5 వేల కోట్లు.. ఈ భూమి లీజుకివ్వాలని ఓ సంస్థ అప్పుడెప్పుడో దరఖాస్తు చేసుకుంది.. ఇది అటవీ భూమి కాబట్టి కుదరదన్నారు.. సదరు అటవీ శాఖలో లీజులకు సంబంధించి వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు ఈ ఒక్క దరఖాస్తునే బయటకు తీసి వెనువెంటనే క్లియర్ చేసేశారు.. పైగా బ్లాక్ లిస్ట్‌లో ఉందని కూడా చూడకుండా ఈ సంస్థకే లీజుకిచ్చేస్తున్నారు.. ఎందుకు ఇలా చేశారు? ఇందులో ఆంతర్యమేంటి? అటవీ.. పర్యావరణం అంటే తనకు ప్రాణమని చెప్పే ఆ అమాత్యుడు ఎలా ఒప్పుకున్నారు? ఈ దందాలో వాటా ఇస్తామన్నారా? లేక భారీ మొత్తం చేతులు మారిందా? పైకి చెప్పేదొకటి.. లోపల చేసేది మరొకటని ఇలా స్పష్టం చేస్తున్నారా? కొసమెరుపు ఏమిటంటే ఇంకా అనుమతులు ఇవ్వక ముందే తవ్వకాలు మొదలు పెట్టడం. ఇదంతా చూస్తుంటే మాకింత-మీకింత కాక మరేంటి?**

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

EFS & T Dept., – Diversion of 10.02 ha. in Sy.No. 505 of Chaganam (V) (Compartment no. 108) and Sy.no. 528 of Molakalapundla (V), Compartment no. 107 of Sydapuram Mandal, SPSR Nellore District for grant of quarry lease of Mica, Quartz & Feldspar in favour of M/s Krishna Mining Company, Mg. Partner Sri G. Bharath – Permission accorded – Orders – Issued.

ENVIRONMENT, FORESTS, SCIENCE & TECHNOLOGY (Section-II) DEPARTMENT

G.O.MS.No. 64 Dated: 03-11-2025
Read the following:-

అటవీ భూమిని బదలాయించడానికి ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 64

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Mines & Minerals – Newly Classified Major Minerals – Treatment of LOIs and Applications in respect of Quartz, Feldspar, Mica and Barytes - To consider certain pending cases as LOI (by whatever name called) and to authorize DMG for grant of leases – Orders – Issued.

INDUSTRIES AND COMMERCE (M.II) DEPARTMENT

G.O.Rt.No. 229 Dated:16.12.2025.
Read the following:

కృష్ణ మైనింగ్ కంపెనీకి పాత విధానం ప్రకారం అటవీ భూములు బదలాయిస్తూ ఇచ్చిన జీఓ నంబర్ 229

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం మాటలకు, చేతలకు సంబంధం ఏమాత్రం లేదని మరోమారు స్పష్టమైంది. ప్రకృతి వనరులను అడ్డగోలుగా దోచుకో.. పంచుకో.. అంటూ బరితెగిస్తోంది. నట్టనడి అడవిలో విలువైన ఖనిజాలను కొల్లగొట్టడానికి ఏమాత్రం ఆలోచించకుండా అడ్డగోలుగా అనుమతులిచ్చేస్తోంది. ట్రాక్ రికార్డు ఏమాత్రం బాగోలేని, కనీసం ఫైన్ చెల్లించని సంస్థకు పెద్దపీట వేస్తోంది. ఇందుకు సంబంధించిన ఫైల్ క్లియరెన్స్ అటవీ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం మైనింగ్ కుంభకోణాలకు అడ్డాగా మారింది. తాజాగా చాగానం, మొలకలపొండ్ల గ్రామాల సరిహద్దుల్లోని రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రూ.వేల కోట్ల విలువైన మైకా, క్వార్ట్‌జ్ ఖనిజాలను కొల్లగొట్టేందుకు కూటమి నేతలు రంగం సిద్ధం చేశారు. పర్యావరణ అనుమతులు (ఈసీ) రాకముందే, అధికారికంగా లీజు ఒప్పందం కుదరకముందే అక్కడ ఖనిజాలను యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. నిబంధనల ప్రకారం వేలం నిర్వహించకుండా ఈ అక్రమ తవ్వకాలకు తెరలేపారు. అక్రమాలను సక్రమం చేసుకునేందుకు పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తును ఇప్పుడు హడావుడిగా బయటకు తీసి, ఆగమేఘాల మీద క్లియర్ చేయించారు. అటవీ భూములను కాపాడాల్సిన వారే వాటిని అక్రమార్కులకు అప్పగించడం వెనుక భారీ కుట్ర దాగి ఉంది.

### పదేళ్ల నిద్ర.. పది రోజుల్లో మేల్కొలుపు

పదేళ్లు పెండింగ్‌లో ఉన్న ఈ లీజు ఫైలుకు ఉన్నట్టుండి కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే గ్రీన్ సిగ్నల్ రావడం వెనుక కీలక నేత హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. సైదాపురం మండలం చాగానంలో సర్వే నంబర్ 505, మొలకొలపొండ్లలో సర్వే నంబర్ 528లో 10.02 హెక్టార్లలో (25 ఎకరాలు) క్వార్ట్‌జ్, మైకా లీజు కోసం ది కృష్ణా మైనింగ్ కంపెనీ (మేనేజింగ్ పార్టనర్ భరత్) 2014 అక్టోబర్ 9న దరఖాస్తు చేసుకుంది. ఇది అటవీ భూమి కావడం, పర్యావరణ నిబంధనల ప్రకారం అక్కడ ఖనిజ తవ్వకాలకు అనుమతి లేకపోవడంతో ఈ దరఖాస్తు అప్పటి నుంచి పెండింగ్‌లోనే ఉంది. కానీ 2024 అక్టోబర్ తర్వాత దీనికి అకస్మాత్తుగా రెక్కలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం మైకా, క్వార్ట్‌జ్ వంటి ఖనిజాలను మేజర్ మినరల్స్ జాబితాలోకి చేర్చి వాటికి బహిరంగ వేలం ద్వారా మాత్రమే లీజులు ఇవ్వాలని గెజిట్ ఇచ్చిన సమయంలోనే కూటమి ప్రభుత్వం తన పరిధిని వాడుకుంటూ పాత దరఖాస్తును క్లియర్ చేయడం గమనార్హం. 2025 నవంబర్ 3న జీఓ ఎంఎస్ నెంబర్ 64 జారీ చేసి అటవీ భూమి మళ్లింపునకు తుది అనుమతులు ఇవ్వడం వెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ తరహా దరఖాస్తులు లెక్కనేనన్ని పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఈ ఒక్క దరఖాస్తుకు మాత్రమే క్లియరెన్స్ లభించడం ఇందుకు తార్కాణం.

### గతంలో పట్టుబడ్డ అక్రమార్కుడికే మళ్లీ పట్టం

సాధారణంగా ప్రభుత్వానికి బకాయిలు ఉన్న కంపెనీలకు కొత్త లీజులు ఇవ్వకూడదు. కానీ కృష్ణా మైనింగ్ కంపెనీ గతంలోనే అక్రమ తవ్వకాలు జరపడంతో ప్రభుత్వం రూ.11.66 కోట్ల జరిమానా విధించింది. ఆ డబ్బు ఇప్పటికీ కట్టలేదు. అలాంటి బ్లాక్ లిస్టు కంపెనీకి మళ్లీ 10.02 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని అప్పగించడం వెనుక నెల్లూరు జిల్లా అధికార పార్టీ పెద్దలతో పాటు ఉండవల్లి, మంగళగిరి పెద్దల హస్తం ఉన్నట్లు సమాచారం. 2025 డిసెంబర్ 16న జీఓ ఆర్‌టీ నెంబర్ 229 ద్వారా ఈ కేసును ప్రత్యేకంగా పరిగణించి కొత్తగా మారిన కేంద్ర చట్టాలను పక్కన పెట్టి పాత మైనర్ మినరల్ నిబంధనల కిందే వెసులుబాటు కల్పించారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF MINES AND GEOLOGY :: IBRAHIMPATNAM

Letter No. INC04-13027(33)/19/2025-D-8 Date: 24-12-2025

From
W. Bala Chandra Sekhar, M.Sc.,
Director of Mines and Geology,
Dept., of Mines and Geology,
5th & 6th Floors, Block - B,
Sri Anjaneya Towers,
Ibrahimpatnam, NTR District.

To
M/s. The Krishna Mining Company,
Mg. Partner: Sri G. Bharath,
Goginenipuram Village,
Nellatur Post, Gudur Mandal,
Tirupati District – 524 101.
Mobile No. 9849323222
Mail Id: kmc@hotmail.co.in

Sir,

Sub: Mines & Quarries – Grant of Quarry Lease application for Mica, Quartz & Feldspar over an extent of 10.000 Hectares (24.71 Acres) in Sy.No.505 of Chaganam Village, (Compartment No.108) and Sy.No.528 of Molakalapundia Village, (Compartment No.107) of Sydapuram Mandal, SPSR Nellore District Filed by M/s. The Krishna Mining Company, Mg. Partner: Sri G. Bharath – Payment of 1st installment Premium Amount – Requested – Regarding.

After careful examination of the proposals, M/s. The Krishna Mining Company, Mg. Partner: Sri G. Bharath is hereby requested to remit the following amounts towards the 1st Instalment Premium amount in accordance with the Rule 12(2)(a)(vi) of amended APMMC Rules, 1966, within fifteen (15) days from the date of receipt of this letter, to facilitate the issuance of the Letter of Intent (LoI):

Premium Amount: Equivalent to 3 times of dead rent i.e., Rs.9,01,800/- @ (30,000 X 3 X 10.02) (Rupees Nine Lakhs One Thousand and Eight Hundred Only) under rule 12 (2) (a) (vi) of APMMC Rules, 1966.

రూ.కోట్ల విలువైన లీజుకు సంబంధించి కేవలం రూ.9 లక్షల ప్రీమియం కట్టాలని మైనింగ్ శాఖ ది కృష్ణ మైనింగ్ కంపెనీకి రాసిన లెటర్

అక్రమంగా జరుగుతున్న క్వార్ట్‌జ్, మైకా తవ్వకాలు

### లీజు రాకుండానే లూటీ

నిబంధనల ప్రకారం లీజు ఖరారైన తర్వాతే తవ్వకాలు జరగాలి. కానీ ఈ కంపెనీ ఇప్పటికే 20 వేల టన్నుల నుంచి 30 వేల టన్నుల ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించేసినట్లు తెలుస్తోంది. మైనింగ్ ప్రాంతంలో ఉన్న లోతైన గుంతలే ఇందుకు నిదర్శనం. ఎన్జీటీ నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు చేస్తున్నట్లు తెలిసింది. అటవీ భూముల మళ్లింపునకు అనుమతి ఇచ్చినా ఇంకా పర్యావరణ అనుమతులు (ఈసీ) రాలేదు. త్వరలో ఈసీ అనుమతి కోసం పబ్లిక్ హియరింగ్ జరగనుంది. కానీ ఈలోపే అక్రమార్కుల యంత్రాలు అడవిని తవ్వేస్తున్నాయి.

### వందల దరఖాస్తులు పెండింగ్.. ఈ ఒక్కటి మాత్రమే క్లియర్

రాష్ట్ర వ్యాప్తంగా అటవీ భూముల్లో మైనింగ్ కోసం దాదాపు 200 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే, అందులో ఒక్క నెల్లూరు జిల్లావే 80 దరఖాస్తులున్నాయి. ఇవి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఒక్క సంస్థ దరఖాస్తును మాత్రమే అత్యవసరంగా క్లియర్ చేశారు. అసలు అడవిని తవ్వడానికి తాను ఏమాత్రం ఒప్పుకోనని, పర్యావరణం అంటే తనకు ప్రాణమని లెక్చర్లిచ్చే నేత ఈ దందాకు ఎలా అంగీకరించారని సదరు శాఖలో తీవ్రంగా చర్చ జరుగుతోంది. భారీగా ముడుపులు అందడం తప్ప మరేమీ కాదని ప్రచారం జరుగుతోంది.

### వేల కోట్ల సంపద.. నామమాత్రపు లీజులు

సైదాపురం ప్రాంతంలో ఉన్న రూ.వేల కోట్ల విలువైన ఖనిజ సంపదకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తుంది. ప్రస్తుతం చాగానం, మొలకొలపొండ్లలో ఉన్న ఖనిజం విలువ రూ.వేల కోట్లలోనే ఉంటుంది. కానీ గనుల శాఖ కేవలం రూ.9 లక్షల ప్రీమియం మాత్రమే కట్టాలని ఆ సంస్థకు డిమాండ్ నోటీసు ఇచ్చింది. ఈసీ రాక ముందే అటవీ భూమిని మళ్లించడం, వ్యవస్థలన్నీ ఆ కంపెనీ కోసం ఏకమై పని చేయడం చూస్తుంటే ఈ అక్రమాల వెనుక ఎంత పెద్ద లాబీయింగ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. అటవీ భూమిని ఈ సంస్థకు దారాదత్తం చేయడం వెనుక రూ.100 కోట్లు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సంస్థ నుంచి ఈ లీజును చేజిక్కించుకున్న నెల్లూరు ఎంపీ ప్రధాన అనుచరుడు తెర వెనుక చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో 'ఉప' నేతకు కూడా డబ్బు కొట్టి ఒప్పించినట్లు తెలిసింది.

## శ్రీవారి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సతీష్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే జస్టిస్ శ్రీనరసింహ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని కూడా దర్శించుకున్నారు. – తిరుమల/శ్రీకాళహస్తి

## భీమిలిలో సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జీలు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ రవి చీమలపాటి

**భీమునిపట్నం(విశాఖ)/గాజువాక:** భీమిలిలో నూతన పౌర న్యాయస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ రవి చీమలపాటి ఆదివారం ప్రారంభించారు. ఈ న్యాయస్థాన ప్రథమ న్యాయమూర్తిగా ద్వారంపూడి సోనీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జనార్దనరావు మాట్లాడుతూ.. రెండు వేల కేసులు ఇక్కడికి బదిలీ అవుతాయని, త్వరలోనే రూ.36 కోట్లతో నూతన భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**గాజువాకలో ఫ్యామిలీ కోర్టు..**

గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి ఆదివారం ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తులను, న్యాయవాదులను అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి రవి చీమలపాటి, డిస్ట్రిక్ట్ కోర్టు ప్రిన్సిపాల్ జడ్జి చిన్నంశెట్టి రాజు, గాజువాక కోర్టుల న్యాయమూర్తులు పాల్గొన్నారు.

## పోలీసుల వేధింపులకు మహిళ మృతి

**సత్తెనపల్లి :** రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో ఒక కుటుంబాన్ని సత్తెనపల్లి రూరల్ పోలీసులు వేధింపులకు గురిచేస్తుండడంతో ఓ మహిళ తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యంతో ఆదివారం మరణించింది. వివరాలివీ.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరులో రెండు కుటుంబాల మధ్య గతనెల 29న ఘర్షణ జరిగింది. రెండువర్గాల వారూ గాయపడి, సత్తెనపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై రాచమంటి భూపతిరావు, తేలుకుట్ల నాగేశ్వరరావు వేర్వేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయితే, ఈ ఘర్షణకు టీడీపీ నేత ఒకరు రాజకీయ రంగు అద్దారు. ఈయన ప్రోద్బలంతో రాచమంటి భూపతిరావు వర్గాన్ని సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నాలుగు రోజులుగా భూపతిరావు వర్గానికి చెందిన రాచమంటి వెంకటేశ్వర్లు అలియాస్ చిన్నాపై ఏ–10గా కేసుపెట్టి పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టి పంపుతున్నారు. అలాగే, ఆయన భార్య రాచమంటి మల్లేశ్వరిపై, వారి కుమారులైన రాచమంటి జాన్‌పై, రాచమంటి బాజీపైగా కేసులు పెట్టారు. మరోవైపు బెయిలు ఇచ్చేందుకు పోలీసులే బేరసారాలు నడిపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగదు చెల్లింపునకు సిద్ధమై కొంత చెల్లించినా ఆదివారం కూడా పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కూర్చోబెట్టారు. ఈ నేపథ్యంలో.. మల్లేశ్వరి (55) ఆదివారం సత్తెనపల్లికి వస్తుండగా ఒక్కసారిగా బీపీ, షుగర్ లెవెల్స్ పెరిగి అపస్మారక స్థితికి వెళ్లింది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయింది. భర్త, ఇద్దరు కుమారులను పోలీసులు వేధిస్తున్నారనే మనస్తాపంతోనే మల్లేశ్వరి మృతిచెందినట్లు తెలుస్తోంది.

# దళిత యువకుడిని బలిగొన్న టీడీపీ

- ఐటీడీపీ అధ్యక్షుడి వేధింపులు తాళలేక ఆత్మహత్య
- ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- మృతుడి కుటుంబం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటోందని కక్షగట్టి వేధింపులు
- మంత్రి టీజీ అండతోనే తనను వేధించాడని సూసైడ్ నోట్

సతీష్ (ఫైల్)

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**కర్నూలు/కర్నూలు (టౌన్):** ఐటీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అనుచరుడి వేధింపులు తాళలేక దళిత యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కర్నూలు శ్రీరామ్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. నగరానికి చెందిన బీసీ సతీష్ (27) ఫ్యాన్‌కు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. తనపై అక్రమంగా కేసు పెట్టించి వేధింపులకు గురి చేయడంతో తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నట్టు ఆ యువకుడు సూసైడ్ నోట్ రాయడం కలకలం రేపింది. 'నా ప్రేమ వ్యవహారంలో మెయిన్ విలన్ ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అనుచరుడు గట్టు తిలక్. మంత్రి టీజీ భరత్ నన్ను వేధించాడు. టీడీపీ పవర్‌ను ఉపయోగించి నీ జీవితం నాశనం చేస్తా.. నీ కుటుంబాన్ని రోడ్డున పడేలా చేస్తా.. ఎస్సీవైన నీకే అంత ఉంటే.. నాకెంత ఉండాలి' అని వేధించి బెదిరించాడు. 'నువ్వు, నీ కుటుంబం ఊరొదిలి వెళ్లాలని పోలీసులతో ఒత్తిడి చేయించాడు. చివరకు అమ్మాయి తండ్రితో నాపై అక్రమంగా కేసు పెట్టించి పోలీసులతో వేధింపులకు గురి చేస్తుండటాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నా' అని మృతుడు సతీష్ సూసైడ్ నోట్ వివరించాడు.

**ప్రేమ వ్యవహారంలో వేధింపులే కారణం**

కర్నూలు శ్రీరామ్‌నగర్‌లో ఉంటున్న బీసీ బాలన్న, శోభారాణి దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడైన సతీష్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. అదే కాలనీకి చెందిన ఓ యువతి, సతీష్ పదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సతీష్ కుటుంబం చాలాకాలంగా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటోంది. ఎలాగైనా ఆ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో స్థానిక టీడీపీ కార్యకర్తలు సతీష్ ప్రేమ వ్యవహారాన్ని బజారుకీడ్చి ఇబ్బంది పెట్టేందుకు కుట్ర పన్నారు. కర్నూలులో మంత్రి టీజీ భరత్ వ్యవహారాలు చక్కబెడుతున్న ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్‌ను వారంతా సంప్రదించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రేమ జంటను విడదీసేందుకు ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ కొంతకాలంగా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఐదు రోజుల క్రితం విధి నిర్వహణలో భాగంగా మంత్రి టీజీ భరత్‌కు చెందిన గౌరీగోపాల్ హాస్పిటల్‌లో డాక్టర్లను కలవడానికి సతీష్ వెళ్లగా.. ఆ ఆస్పత్రి పాలనా వ్యవహారాలు చూస్తున్న గట్టు తిలక్ ఇద్దరు కానిస్టేబుళ్లను పిలిపించి అతడిని బెదిరించాలని ఆదేశించాడు. దీంతో అతడి సెల్‌ఫోన్ లాక్కున్న కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి 10 గంటల వరకు కూర్చొబెట్టి వదిలేశారు. ఇంటికి చేరుకున్న సతీష్ జరిగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పాడు. పోలీసులు తన సెల్‌ఫోన్‌ను ఇవ్వకపోవడంతో సతీష్ తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం రెండు పేజీల సూసైడ్ నోట్ రాశాడు. తన చావుకు ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ కారణమంటూ కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలన్నిటినీ ఆ లేఖలో వివరించాడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఫ్యాన్‌కు వేలాడుతున్న సతీష్‌ను చూసిన తల్లి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి మార్చురీ వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుని తండ్రి బీసీ బాలన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### గట్టు తిలక్‌పై కేసు నమోదు చేయాలి: ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్

ప్రేమ వ్యవహారంలో తలదూర్చి కర్నూలులోని శ్రీరామనగర్‌కు చెందిన సతీష్ ఆత్మహత్యకు కారకులైన ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సతీష్ మరణానికి కారణమైన గట్టు తిలక్‌పై చర్యలు తీసుకోవాలని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# రెడ్‌బుక్ బ్లడ్‌బుక్‌గా మారింది

- వైఎస్సార్‌సీపీ శ్రేణుల అణచివేతే లక్ష్యంగా ప్రభుత్వ వేధింపులు
- అక్రమ కేసులకు మేం భయపడం
- మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత విడదల రజిని

**చిలకలూరిపేట టౌన్/యడ్లపాడు:** రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ పేరుతో సాగిస్తున్న అరాచక పాలన ఇప్పుడు బ్లడ్‌బుక్‌గా మారిందని మాజీమంత్రి విడదల రజిని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం హాజరై బయటకొచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వైఎస్సార్‌సీపీ శ్రేణుల అణచివేతే లక్ష్యంగా వేధింపులు, కేసుల నమోదుకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడడం నేరమా అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన ర్యాలీ చేస్తే కేసులు పెడుతున్నారని, తనపై దాడిచేసి తిరిగి తనపైనే ఎదురు కేసు కట్టారని రజిని పేర్కొన్నారు. రెండేళ్లుగా రాష్ట్రంలో దాదాపు 2,500 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించారని.. పార్టీకి చెందిన 800 మందిపై హత్యాయత్నం, 390 మందిపై హత్య, 700 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టారని చెప్పారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగా 70 మంది జర్నలిస్టులను కూడా వదలకుండా కేసులు పెట్టడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ఆమె విమర్శించారు.

### పార్టీలో చురుగ్గా ఉన్న వారే టార్గెట్..

వైఎస్సార్‌సీపీలో ఎవరు యాక్టివ్‌గా ఉన్నారో గుర్తించి వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడమే పోలీసులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఏకైక టార్గెట్ అని రజిని ఆరోపించారు. కేంద్రం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ 36వ స్థానానికి పడిపోయిందని, ఇందుకు మంత్రి లోకేశ్ రెడ్‌బుక్ పాలనే కారణమన్నారు. ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా భయపడే ప్రసక్తేలేదని ఆమె స్పష్టంచేశారు. అబద్ధపు హామీలపై ప్రజాగొంతుకై కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆమె తేల్చి చెప్పారు.

పంచ తంత్రం

# అందరి చూపు బెంగాల్ పైనే!

## పశ్చిమ బెంగాల్ సహా తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో నేడే కౌంటింగ్

- ఏర్పాట్లు పూర్తిచేసిన ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత
- కౌంటింగ్ సిబ్బందికి తొలిసారిగా క్యూఆర్ కోడ్ ఐడీ కార్డులు
+ అనధికార వ్యక్తులను నిరోధించడానికి పటిష్టమైన చర్యలు
+ తొలుత పోస్టల్ బ్యాలెట్లు.. తర్వాత ఈవీఎంల లెక్కింపు
+ ఫలితాల సరళిపై మధ్యాహ్నంకల్లా స్పష్టత వచ్చే అవకాశం
+ ఉప ఎన్నికలు జరిగిన ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లోనూ నేడు ఓట్ల లెక్కింపు

దేశమంతటా తీవ్ర ఉత్కంఠ సృష్టిస్తున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల భవితవ్యం మరి కొన్ని గంటల్లోనే తేలిపోనుంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే అందరి దృష్టి నెలకొంది. మరో కీలక రాష్ట్రం తమిళనాడులో ఎవరు గెలుస్తారన్న దానిపై ఆసక్తి పెరిగిపోతోంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో(ఈవీఎంలు) నిక్షిప్తమైన ప్రజాతీర్పు సోమవారం బహిర్గతం కానుంది. సరిగ్గా ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 8.30 గంటలకు ఈవీఎంలు తెరుచుకుంటాయి. సమయం గడిచేకొద్దీ అభ్యర్థుల జాతకాలు, పార్టీల బలాబలాలు తెలిసిపోతాయి. ఐదు రాష్ట్రాల్లో ప్రజల ఆశీస్సులతో కొత్తగా అధికారంలోకి వచ్చేది ఎవరో, ప్రజాతీర్పును శిరసావహించి కుర్చీ నుంచి దిగిపోయేది ఎవరో స్పష్టమైపోతుంది. ఫలితాల సరళిపై మధ్యాహ్నంకల్లా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. అనధికార వ్యక్తులు కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించకుండా కౌంటింగ్ సిబ్బందికి తొలిసారిగా ఈసీఐనెట్ ద్వారా క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డులను అందజేసింది. అన్ని కేటగిరీల సిబ్బందికి ఈ కార్డులను తప్పనిసరి చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అత్యంత కీలకమైన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళలో వెల్లడి కానున్న ప్రజాభిప్రాయం రాబోయే రోజుల్లో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలతో పాటు గోవా, కర్ణాటక, నాగాలాండ్, గుజరాత్, మహారాష్ట్రలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా, సోమవారమే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కోల్‌కతాలోని ఖుదీరాం అనుశీలన్ కేంద్ర స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తులో భద్రతా బలగాలు



హౌరాలో ఆదివారం భద్రతా బలగాల పహారా

### బెంగాల్‌లో రికార్డు స్థాయి ఓటింగ్ ఎవరికి లాభమో?

పశ్చిమ బెంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలుండగా, ఒక స్థానంలో ఈ నెల 21న రీపోలింగ్ నిర్వహించబోతున్నారు. మిగిలిన 293 స్థానాల ఓట్ల లెక్కింపు కోసం 77 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం 432 మంది కౌంటింగ్ పరిశీలకులను నియమించింది. వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావడానికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ విపరీతంగా శ్రమించింది. ఈసారి బెంగాల్‌లో కచ్చితంగా జెండా పాతాలన్న లక్ష్యంతో బీజేపీ సర్వశక్తులూ ఒడ్డి పోరాడింది. ఈ ఎన్నికలను బీజేపీ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా సహా ఆ పార్టీ అగ్రనేతలు ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించగా, రికార్డుస్థాయిలో 92.47 శాతం ఓటింగ్ నమోదయ్యింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బెంగాల్ ఎన్నికల చరిత్రలో ఈ స్థాయిలో భారీగా ఓటింగ్ నమోదు కావడం ఇదే మొదటి సారి. దక్షిణ పరిగణాల జిల్లాలో 15 బూత్‌ల్లో శనివారం రీపోలింగ్ చేపట్టగా, 87 శాతం ఓటింగ్ నమోదయ్యింది. గెలుపు తమదేనని తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని ఎగ్జిట్ పోల్స్ అధికార తృణమూల్ కాంగ్రెస్‌దే మళ్లీ విజయమని అంచనా వేయగా, మరికొన్ని బీజేపీ స్పష్టమైన మెజార్టీ సాధించబోతున్నట్లు వెల్లడించాయి. బెంగాల్‌లో ఎన్నికలు ముగిసినప్పటికీ రాజకీయ వేడి ఇంకా తగ్గలేదు. అక్కడక్కడా ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి హింసాకాండ చోటుచేసుకోకుండా 2.5 లక్షల మంది పారామిలటరీ జవాన్లను ఎన్నికల సంఘం మోహరించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ద్వారా 90 లక్షల ఓట్లను తొలగించిన తర్వాత జరిగిన తొలి ఎన్నికలే ఇవే కావడంతో ఫలితాలపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కౌంటింగ్ ప్రక్రియపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అనుమానాలు వ్యక్తంచేశారు. ఈవీఎంలను తారుమారు చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కోల్‌కతాలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. మమతా బెనర్జీ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఈవీఎంల ట్యాపరింగ్‌కు అవకాశమే లేదని వివరణ ఇచ్చింది.

| 2021 ఫలితాలు(మొత్తం సీట్లు 294) | |
|---|---|
| పార్టీ | సీట్లు |
| తృణమూల్ కాంగ్రెస్ | 215 |
| బీజేపీ | 77 |
| ఆర్ఎస్ఎంపీ | 1 |
| ఇతరులు | 1 |

### తమిళనాడులో విజయం విజయ్‌దేనా?

తమిళనాట ఓట్ల లెక్కింపునకు సమగ్రమైన మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 234 అసెంబ్లీ స్థానాలుండగా, కౌంటింగ్‌కు మొత్తం 62 కేంద్రాలు సిద్ధం చేసినట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి అర్చనా పట్నాయక్ తెలిపారు. రాష్ట్రంలో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, 85.15 శాతం ఓటింగ్ రికార్డయ్యింది. కౌంటింగ్ విధుల్లో 1.25 లక్షల మంది భద్రతా సిబ్బంది, అధికారులు, సూక్ష్మపరిశీలకులు పాలుపంచుకుంటున్నారు. ఎన్నికల సంఘం 234 మంది కౌంటింగ్ అబ్జర్వర్లను నియమించింది. రాష్ట్రంలో ఈసారి ముక్కోణపు పోరు జరిగింది. అధికార డీఎంకే, విపక్ష అన్నాడీఎంకేతో పాటు దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వేట్రి కళగం(టీవీకే) తొలిసారిగా బరిలోకి దిగింది. వరుసగా రెండోసారి విజయంపై డీఎంకే అధినేత స్టాలిన్ చాలా ఆశలే పెట్టుకున్నారు. బీజేపీతో జతకట్టిన విపక్ష అన్నాడీఎంకే గెలుపు కోసం హోరాహోరీగా పోరాడింది. డీఎంకే మళ్లీ నెగ్గడం తథ్యమని మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ స్పష్టంచేయగా, విజయ్ పార్టీ టీవీకే 98 నుంచి 120 స్థానాలు గెల్చుకొని అధికారంలోకి రాబోతున్నట్లు 'యాక్సిస్ మై ఇండియా' ఎగ్జిట్ పోల్ తేల్చిచెప్పింది.

| 2021 ఎన్నికల ఫలితాలు (మొత్తం సీట్లు 234) | |
|---|---|
| పార్టీ | సీట్లు |
| డీఎంకే | 133 |
| అన్నాడీఎంకే | 66 |
| కాంగ్రెస్ | 18 |
| పీఎంకే | 5 |
| వీసీకే | 4 |
| ఇతరులు | 8 |

### కేరళలో వామపక్షాలకు చేదు అనుభవమే!

కమ్యూనిస్టులకు గట్టి పట్టున్న కేరళ అసెంబ్లీలో మొత్తం 140 స్థానాలు ఉండగా, ఏప్రిల్ 9న జరిగిన పోలింగ్‌లో 79.63 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఈసారి వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే హోరాహోరీగా తలపడ్డాయి. అధికార ఎల్డీఎఫ్‌పై యూడీఎఫ్ స్వల్ప మెజార్టీతో గెలిచే అవకాశం ఉన్నట్లు ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. కేరళలో తమ బలం పెరిగిందని, రెండంకెల్లో సీట్లు గెల్చుకోవడం ఖాయమని ఎన్డీయే విశ్వాసం వ్యక్తంచేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 43 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 15 వేల మందికిపైగా భద్రతా సిబ్బంది, ఎన్నికల అధికారులు కౌంటింగ్ విధుల్లో భాగస్వాములవుతున్నారు. ఒక బూత్‌లో నమోదైన ఓట్ల సంఖ్యకు, ఈవీఎంలలో నిక్షిప్తమైన ఉన్న ఓట్ల సంఖ్యకు మధ్య వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో వీవీప్యాట్ స్లిప్‌లను కూడా లెక్కిస్తామని ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు.

| 2021 ఎన్నికల ఫలితాలు (మొత్తం సీట్లు 140) | |
|---|---|
| కూటమి | సీట్లు |
| ఎల్డీఎఫ్ | 99 |
| యూడీఎఫ్ | 41 |

### అస్సాంలో 258 మంది స్వతంత్ర అభ్యర్థులు

ఈశాన్య రాష్ట్రం అస్సాంలో విజయం పట్ల అధికార బీజేపీ ధీమాగా ఉంది. ఎగ్జిట్‌పోల్స్ సైతం ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని తెలియజేశాయి. 126 అసెంబ్లీ స్థానాలున్న అస్సాంలో ఏప్రిల్ 9న ఎన్నికలు నిర్వహించగా, 85.96 శాతం ఓటింగ్ నమోదయ్యింది. 35 జిల్లాల్లో మొత్తం 40 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 25 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలను రంగంలోకి దించారు. ఈసారి ఎన్నికల్లో పార్టీల అభ్యర్థులతోపాటు 258 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీకి దిగడం గమనార్హం. అధికార ఎన్డీయేలో బీజేపీతోపాటు అస్సాం గణ పరిషత్, బోడో పీపుల్స్ ఫ్రంట్ ఉన్నాయి. కాంగ్రెస్ కూటమిలో రాయ్‌జోర్ దళ్, ఏజేపీ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఏపీహెచ్ఎల్సీ తదితర పార్టీలు ఉన్నాయి.

| 2021 ఎన్నికల ఫలితాలు (మొత్తం సీట్లు 126) | |
|---|---|
| పార్టీ | సీట్లు |
| బీజేపీ | 64 |
| ఏజీపీ | 9 |
| యూపీపీఎల్ | 7 |
| బీపీఎఫ్ | 3 |
| కాంగ్రెస్ | 26 |
| ఏఐయూడీఎఫ్ | 15 |
| సీపీఎం | 1 |
| ఇతరులు | 1 |

### పుదుచ్చేరిలో మళ్లీ ఎన్డీయే!

కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా ఆరు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలిండియా ఎన్.ఆర్.కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్సీ), బీజేపీ, అన్నాడీఎంకే, ఎల్‌జేకే పార్టీలతో కూడిన అధికార ఎన్డీయే మరోసారి విజయం సాధించనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. విపక్ష ఇండియా కూటమిలో కాంగ్రెస్, డీఎంకే, వీసీకే పార్టీలున్నాయి.

| 2021 ఎన్నికల ఫలితాలు (మొత్తం సీట్లు 30) | |
|---|---|
| పార్టీ | సీట్లు |
| ఏఐఎన్ఆర్సీ | 10 |
| డీఎంకే | 6 |
| బీజేపీ | 6 |
| కాంగ్రెస్ | 2 |
| ఇతరులు | 6 |

## నా గెలుపు ఖాయం కోటి పందెం

**బీజేపీ అభ్యర్థి పీసీ జార్జి సవాల్**

**కొట్టాయం:** కేరళలోని పూంజార్ అసెంబ్లీ నియోజకవర్గంలో తమ విజయం ఖాయమని బీజేపీ అభ్యర్థి పీసీ జార్జి ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. తన గెలుపుపై కోటి రూపాయల పందెం కూడా ఆయన ప్రకటించారు. నేను భారీ మెజారిటీతో గెలుస్తా. ఇందులో ఎవరికైనా సందేహం ఉంటే, నా పందెం కోటి రూపాయలు'అని ఓ టీవీ చానెల్‌కు ఆయన తెలిపారు. పొరుగునే ఉన్న పాలా నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన తన కుమారుడు షోన్ జార్జి కూడా గెలుస్తారన్నారు. తామిద్దరం అసెంబ్లీలో అడుగు పెట్టనున్నామన్నారు.

## కేరళలో లడ్డూలు బిర్యానీ సిద్ధం

**తిరువనంతపురం:** కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడి కానుండగా, వివిధ రాజకీయ పార్టీలు వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాయి. విజయం ఖాయమన్న అంచనాల నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ శ్రేణులు మలప్పురం జిల్లా పండిక్కడ్‌లో 5 వేల మందికి సరిపోను బిర్యానీని సిద్ధం చేయిస్తున్నారు. 40 కిలోల చొప్పున అన్నం వండేందుకు 16 భారీ పాత్రలను వాడుతున్నారు. ఆహార పంపిణీ కోసం భారీ టెంట్‌ను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక తిరువనంతపురంలోని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ఇందిర భవన్ వద్ద భారీ వేదికను, స్వీట్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

## ఆలయాల్లో బెంగాల్ బీజేపీ అభ్యర్థుల పూజలు

**కోల్‌కతా:** ఓట్ల లెక్కింపు మరికొద్ది గంటల్లో మొదలుకానుండగా పశ్చిమబెంగాల్ బీజేపీ నేతలు, అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోయింది. తమ గెలుపును కాంక్షిస్తూ బీజేపీ అభ్యర్థులు ఆదివారం ఆలయాల్లో పూజలు చేశారు. ప్రతిపక్ష నేత సువేందు అధికారి తన సొంత జిల్లా పూర్బ మేదినీపూర్‌లోని కాళీ మాత, శివాలయాల్లో పూజలు చేశారు. పూర్బ మేదినీపూర్‌లోని నందిగ్రామ్‌తోపాటు కోల్‌కతాలోని భవానీపూర్‌లో సీఎం మమతా బెనర్జీని ఢీకొడుతుండటం తెల్సిందే. అదేసమయంలో, సిలిగురి అభ్యర్థి శంకర్ ఘోష్ రథఖోలా కాళీబరి ఆలయంలో పూజలు చేశారు. బీజేపీ గెలవాలని, బెంగాల్‌లో పరివర్తన రావాలని పూజ చేసినట్లు ఆయన చెప్పారు. ఖరగ్‌పూర్ సదరు అభ్యర్థి దిలీప్ ఘోష్ కూడా కోల్‌కతాలో తనుండే న్యూటౌన్‌లో ఉన్న కాళీ ఆలయంలో పూజ చేశారు. కోల్‌కతా పోర్టు అభ్యర్థి రాకేశ్ సింగ్ తమ ప్రాంతంలోని ఆలయాన్ని, బుర్రా బజార్‌లోని ఆలయాన్ని చౌరింఘీ అభ్యర్థి సంతోష్ కుమార్ పాఠక్ దర్శించుకున్నారు. ముర్షిదాబాద్ జిల్లా బహరంపూర్ నియోజకవర్గం అభ్యర్థి సుబ్రతా మైత్రా తన నియోజకవర్గంలోని పలు ఆలయాలను ఆదివారం దర్శించుకుని, పూజలు చేశారు.

## ఫాల్టాకు మోదీ, షా వస్తారా?

**బీజేపీకి టీఎంసీ సవాల్**

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లోని ఫాల్టా నియోజకవర్గానికి ఈ నెల 21వ తేదీన మళ్లీ జరిగే పోలింగ్‌కు బీజేపీ చేతనైతే తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించాలని సీఎం మమతా బెనర్జీ సవాల్ విసిరారు. రెండో విడత పోలింగ్ సందర్భంగా ఈ నియోజకవర్గంలో తీవ్ర అవకతవకలు జరిగినట్లు తేలడంతో మళ్లీ పోలింగ్ జరపాలని ఈసీ నిర్ణయించడం తెల్సిందే. ఆదివారం సీఎం మమత ఎక్స్‌లో..'ఫాల్టా. డైమండ్ హార్బర్. మే 21. ఎంత ఖర్చయినా వెనకాడొద్దు. మీ శక్తియుక్తులన్నీ కేంద్రీకరించండి. ప్రధాని మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్.. మీకు ధైర్యం ఉంటే రండి. 50వేల కేంద్ర బలగాలను, ప్రతి బూత్ వద్ద సాయుధ వాహనాలను మోహరించండి. సింగం వంటి పోలీసు అధికారులందరినీ అక్కడికి రప్పించండి'అంటూ ఎద్దేవా చేశారు.

## కేరళలో 79.70 శాతానికి చేరిన ఓటింగ్

**తిరువనంతపురం:** కేరళ అసెంబ్లీకి ఏప్రిల్ 9వ తేదీన జరిగిన పోలింగ్‌లో మొత్తమ్మీద 79.70 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ ఆదివారం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్లను కూడా గణనలోకి తీసుకున్నాక ఓటింగ్ శాతం కాస్తంత పెరుగుదల నమోదైందని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) రతన్ యు.కేల్కర్ చెప్పారు. ఉద్యోగుల బ్యాలెట్ ఓట్లను మినహాయిస్తే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ శాతం 79.63 వరకు ఉందన్నారు. మొత్తం 53,984 పోస్టల్ బ్యాలెట్లను జారీ చేయగా, ఈ నెల ఒకటో తేదీనాటికి 20,028 బ్యాలెట్ ఓట్లు అందాయని వివరించారు. వీటిని కలిపిన తర్వాత ఓటింగ్ 0.07 శాతం మేర పెరిగిందన్నారు.

## తమిళనాడులో ఓటింగ్ 85.10%

**చెన్నై:** ఏప్రిల్ 23వ తేదీన తమిళనాడు అసెంబ్లీలోని మొత్తం 234 సీట్లకు జరిగిన పోలింగ్‌లో మొత్తమ్మీద 85.10 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని అర్హులైన 5.67 కోట్ల మంది ఓటర్లకుగాను 4.87 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఈసీ తెలిపింది. వీరిలో 2.52 కోట్ల మహిళలు, మరో 2.35 కోట్ల పురుష ఓటర్లు ఉన్నారని వివరించింది. అత్యధిక సంఖ్యలో కరూర్ నియోజకవర్గంలోని 93.41 శాతం మంది ఓటేశారని, ఆ తర్వాత సాలెం జిల్లా వీరపాండి స్థానంలో 93.36 శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిపింది. అత్యల్పంగా కన్యాకుమారి జిల్లా కిల్లియూర్‌లో 71.26 శాతం మంది ఓటేశారని వివరించింది.

## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం
# చిన్నారి సహా 9 మంది బలి!

- నాలుగంతస్తుల భవనంలో మంటలు..
- ఏసీ పేలుడే కారణమని ప్రాథమికంగా నిర్ధారణ
- 15 మందిని కాపాడిన ఫైర్ సిబ్బంది

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివేక్ విహార్ ప్రాంతంలో ఆదివారం వేకువజామున నాలుగంతస్తుల భవనంలో సంభవించిన ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఏడాదిన్నర చిన్నారి సహా 9 మంది ప్రాణాలు కోల్పోయారు. రెండో అంతస్తులోని ఏసీ పేలుడే ఘటనకు కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే, ఆ ఇంట్లో సెంట్రల్ లాకింగ్ సిస్టమ్, మందపాటి ఐరన్ గ్రిల్స్‌తోపాటు టెర్రస్‌కు చేరుకునే ఒకేఒక మార్గం మూసి ఉండటం ప్రమాద తీవ్రతను మరింతగా పెంచింది. వివేక్ విహార్‌లోని ఫేజ్-1లోని వేకువజామున 3.48 గంటల సమయంలో మంటలు చెలరేగినట్లు పోలీసులు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందింది. వెంటనే వారు వాహనాలతో చేరుకున్నారు. అప్పటికే మంటలు రెండు, మూడు, నాలుగో అంతస్తులకు వేగంగా ఎగబాకాయి. మంటల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సెంట్రల్ లాకింగ్ వ్యవస్థ, లిఫ్టు పనిచేయలేదు. గట్టి ఐరన్ గ్రిల్స్, బాల్కనీలు మూసి ఉండటంతో లోపల మంటలు, పొగ దట్టంగా వ్యాపించాయి. దీంతో, వెనుకవైపు ఉన్న నాలుగు ఫ్లాట్లలోని వారు ప్రమాదం బారిన పడ్డారు. సెంట్రల్ లాకింగ్ వ్యవస్థ కారణంగా టెర్రస్ డోరు మూసి ఉండటంతో పైఫ్లాట్‌లోని వారు తప్పించుకునే మార్గం లేకపోయింది. ఇరుకు రోడ్డులో ఉన్న ఆ భవనం వద్దకు చేరుకున్న 12 ఫైరింజన్లతో సిబ్బంది మంటలను ఆర్పేపనిలో నిమగ్నం కాగా, స్థానిక పోలీసులు, విపత్తు, ట్రాఫిక్ విభాగాల సిబ్బంది భవనంలో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. కిటికీల గ్రిల్స్ యంత్రాలతో కోసి క్రేన్ల సాయంతో కొందరిని కిందికి దించారు. మరి కొందరిని నిచ్చెనలు వేసి కాపాడారు. సుమారు 15 మందిని బయటకు తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తిగా కాలిపోయిన స్థితిలో 9 మృతదేహాలను వెలికి తీసినట్లు ఫైర్ విభాగం వెల్లడించింది. మృతులను ఒక కుటుంబంలో అరవింద్ జైన్ (60), ఆయన భార్య అనిత (58), కుమారుడు నిశాంత్ (35), కోడలు ఆంచల్ (33), మనవడు ఆకాశ్ (18 నెలలు)గాను మరో కుటుంబంలో నితిన్ జైన్ (50), భార్య షైలీ (48), కుమారుడు సమ్యక్ (25), శిఖా జైన్ (45)గా గుర్తించారు. మంటలను పూర్తిగా అదుపు చేయడానికి గంటలు పట్టిందన్నారు. ప్రమాదానికి ఏసీ పేలుడే కారణమని అంటున్నప్పటికీ, దీనిపై ఇప్పుడే ఒక అంచనాకు రాలేమని ఫైర్ అధికారులు తెలిపారు. టెర్రస్ డోరు తెరిచే వీలుంటే కనీసం ముగ్గురు ప్రమాదం నుంచి బయటపడే వారని పేర్కొన్నారు. ఈ విషాదంపై లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జీత్ సింగ్, సీఎం రేఖా గుప్తా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ప్రకటించారు.

భవనం: మంటల్లో, మంటలు ఆర్పాక..

రోదిస్తున్న మృతుల కుటుంబీకురాలు(ఇన్‌సెట్)

## నింగిలోకి 'మిషన్ దృష్టి'

**ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహం**

**న్యూఢిల్లీ:** బెంగళూరులోని అంతరిక్ష స్టార్టప్ సంస్థ గెలాక్సీఐకి చెందిన 'మిషన్ దృష్టి'ఉపగ్రహాన్ని ఆదివారం అమెరికాలోని కాలిఫోర్నియాలో స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. మిషన్ దృష్టి అనేది ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహం. ఇది ఎలక్ట్రో-ఆప్టికల్ (ఈఓ), సింథటిక్ అపర్చర్ రాడార్(ఎస్ఏఆర్) సెన్సార్లను ఒకే కార్యాచరణ ప్లాట్‌ఫారమ్‌లోకి అనుసంధానిస్తుంది. ఈఓ సెన్సార్లు సూర్యకాంతిలో లేదా నిర్మలమైన ఆకాశం ఉన్నప్పుడు అధిక రిజల్యూషన్‌తో చిత్రాలను బంధిస్తాయి. ఎస్ఏఆర్ సెన్సార్లు రాడార్ పల్స్‌లను ఉపయోగించి అన్ని కాలాల్లో, అన్నిరకాల వాతావరణ పరిస్థితులలో స్పష్టమైన చిత్రాలను అందిస్తాయి. మిషన్ దృష్టి ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి చేరుకున్నట్లు గెలాక్సీఐ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ సుయాష్ సింగ్ తెలిపారు. ఈ ఉపగ్రహం సంప్రదాయ వ్యవస్థల్లోని దీర్ఘకాలిక పరిమితులను అధిగమించడంతోపాటు విభిన్న పర్యావరణ పరిస్థితుల్లో మరింత విశ్వసనీయమైన, స్థిరమైన డేటాను సేకరిస్తుంది. ఇది ద్వంద్వ ప్రయోజన భూ పరిశీలన ఉపగ్రహం. రక్షణ, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక వంటి రంగాల్లో తోడ్పాటు అందిస్తుంది. ఐదేళ్ల స్వదేశీ పరిశోధన, అభివృద్ధి, విస్తృతమైన పర్యావరణ పరీక్షలు, 'మిషన్ దృష్టి'పనితీరు ధ్రువీకరణ తర్వాత ఈ ప్రయోగం జరిగింది. మిషన్ దృష్టి ప్రయోగం భారతదేశ అంతరిక్ష ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు.

## లిపులేఖ్ మీదుగా మానస సరోవర్ యాత్ర నేపాల్ అభ్యంతరం.. కొట్టేసిన భారత్

**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ కనుమ మీదుగా చేపట్టే కైలాశ్ మానస సరోవర్ యాత్రపై నేపాల్ అభ్యంతరం చెప్పడాన్ని భారత్ ఖండించింది. ఏకపక్షంగా, కృత్రిమంగా విస్తరించుకుని భూభాగాలపై హక్కులను ప్రకటించడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. జూన్ నుంచి ఆగస్ట్ వరకు మానస సరోవర్ యాత్ర జరుగుతుందని గత వారం విదేశాంగ శాఖ ప్రకటించింది. అయితే, తమను ఏమాత్రం సంప్రదించకుండా భారత్, చైనాలు లిపులేఖ్ మీదుగా మానస్ సరోవర్ యాత్రకు ఏర్పాట్లు చేస్తుండటాన్ని ఖండిస్తూ నేపాల్ విదేశాంగ శాఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. లిపులేఖ్ తమ భూభాగమని పేర్కొంది. దీనిపై కొద్ది గంటల్లోనే భారత్ స్పందించింది. 'ఈ విషయంలో భారత్ వైఖరి స్థిరంగా, స్పష్టంగా ఉంది. లిపులేఖ్ కనుమ 1954 నుంచి కైలాస మానస సరోవర యాత్రకు పురాతన మార్గంగా ఉంటోంది. దశాబ్దాలుగా అదే మార్గంలో యాత్ర కొనసాగుతోంది'అని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. నేపాల్ చేస్తున్న వాదనలు ఏమాత్రం సమర్థనీయం కాదని చెప్పారు. వాటికి చారిత్రక ఆధారాలు లేవన్న విషయాన్ని భారత్ మొదట్నుంచీ చెబుతూనే ఉందన్నారు.

## హార్మూజ్‌ను దాటిన ఎల్పీజీ నౌక

- 46,313 మెట్రిక్ టన్నుల గ్యాస్‌తో భారత్ దిశగా పయనం
- ఈ నెల 13వ తేదీకల్లా విశాఖపట్నానికి చేరే అవకాశం

**న్యూఢిల్లీ:** భారత్‌లో ద్రవీకృత పెట్రోలియం గ్యాస్(ఎల్పీజీ) కొరత కొంతవరకు తీరిపోయే అవకాశం వచ్చింది. 46,313 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో ఓ నౌక హార్మూజ్ జలసంధిని దాటేసి భారత్ దిశగా పయనం సాగిస్తోందని అధికార వర్గాలు ఆదివారం వెల్లడించాయి. మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉన్న ఈ నౌక పేరు ఎంటీ సర్వశక్తి. అందులో 20 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 18 మంది భారతీయులే. ఈ నెల 2న హార్మూజ్‌లో కీలకమైన చెక్‌పాయింట్‌ను విజయవంతంగా దాటేసింది. ఈ నెల 13వ తేదీ కల్లా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చేరుకుంటుందని అంచనా. భారత్‌లో సగంరోజు అవసరానికి సరిపడా ఎల్పీజీ ఈ నౌకలో ఉంది. గంటకు 12 నుంచి 14 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తోంది. ఆదివారం సాయంత్రానికి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఉన్నట్లు తెలిసింది. సర్వశక్తి నౌకలోని సిబ్బంది, ఎల్పీజీ సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. గతంలో పర్షియన్ గల్ఫ్, భారత్‌లోని ఓడరేవుల మధ్య రాకపోకలు సాగించిన ఈ అతిపెద్ద గ్యాస్ నౌకను భారత ప్రభుత్వ యాజమాన్యంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అద్దెకు తీసుకుంది. ఇరాన్ నౌకలు, ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం ప్రారంభమైన తర్వాత హార్మూజ్‌ను దాటిన మొదటి భారత అనుబంధ చమురు నౌక సర్వశక్తి కావడం విశేషం. భారత జెండా లేదా భారత యాజమాన్యంలోని 14 నౌకలు ఇప్పటికీ హార్మూజ్ జలసంధి పశ్చిమ భాగంలో చిక్కుకుపోయి ఉన్నాయి.

# దురుసుగా ప్రవర్తిస్తే మళ్లీ దాడులు చేస్తాం

- ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- కొత్త ప్రతిపాదనను నిశితంగా పరిశీలిస్తున్నాం
- ఇది అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని అనుకోవడం లేదు
- 47 ఏళ్ల అకృత్యాలకు ఇరాన్ ఇంకా మూల్యం చెల్లించలేదని వ్యాఖ్య

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో తాత్కాలికంగా నిలిచిపోయిన యుద్ధాన్ని పూర్తిగా ముగించేందుకు ఇరాన్ నుంచి వచ్చిన తాజా ప్రతిపాదనను సమీక్షిస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఒకవేళ ఇరాన్ గనక దురుసుగా ప్రవర్తిస్తే ఆ దేశంపై దాడులు మళ్లీ ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఆయన శనివారం ఫ్లోరిడాలోని పామ్ బీచ్ నుంచి మియామీ వెళ్తూ విలేకరులతో మాట్లాడారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇరాన్ తప్పుగా ప్రవర్తిస్తే, ఏదైనా చెడు చేస్తే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందన్నారు. ఇరాన్ పంపిన కొత్త ప్రతిపాదనను నిశితంగా పరిశీలిస్తున్నానని, దానిపై మళ్లీ మీడియాతో మాట్లాడతానని తెలిపారు. ఈ కొత్త ఆఫర్ కూడా తనకు అంతగా నచ్చలేదని పరోక్షంగా సంకేతాలిచ్చారు. తర్వాత ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. గత 47 ఏళ్లుగా మానవాళిపై పాల్పడిన అకృత్యాలకు ఇరాన్ ఇంకా మూల్యం చెల్లించలేదని ఆక్షేపించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ నూతన ప్రతిపాదన అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని తాను భావించడం లేదన్నారు. ఇరాన్‌కు పెద్ద శిక్ష పడాల్సి ఉందని తేల్చిచెప్పారు. అయితే, పశ్చిమాసియాలో శాంతి సాధన విషయంలో ఇరాన్ కొత్త ప్రతిపాదన ఏమిటన్నది ఆయన బయటపెట్టలేదు. ఈ ప్రపోజల్‌ను ఇరాన్ గురువారం అమెరికాకు పంపించినట్లు తెలిసింది. గతంలో ఇరాన్ చేసిన ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించి విషయం విదితమే. దానిపై తాను సంతృప్తిగా లేనని ఆయన తేల్చిచెప్పారు.

### బంతి అమెరికా కోర్టులోనే ఉంది: ఇరాన్

నూతన ప్రతిపాదన పట్ల ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ప్రతిస్పందించింది. చర్చల ద్వారా పరిష్కారాన్ని కోరుకుంటారా? లేక యుద్ధానికి తిరిగి వెళ్తారా? అనేది అమెరికా ఇష్టమని తేల్చిచెప్పింది. ఇప్పుడు బంతి అమెరికా కోర్టులోనే ఉందని ఇరాన్ విదేశాంగ శాఖ ఉప మంత్రి కజెమ్ ఘరీబాబాదీ పేర్కొన్నారు. దౌత్య మార్గాన్ని ఎంచుకుంటారో లేక ఘర్షణను కొనసాగిస్తారో వారే నిర్ణయించుకోవాలని ఉద్ఘాటించారు. తన జాతీయ ప్రయోజనాలు, భద్రతను కాపాడుకోవడమే తమకు ముఖ్యమని స్పష్టంచేశారు. ఇరాన్ రెండు మార్గాలకు.. చర్చలకు లేదా యుద్ధానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు.

### ఏమిటీ కొత్త ప్రతిపాదన?

అమెరికా చేసిన 9 పాయింట్ల ప్రతిపాదనకు ప్రతిస్పందనగా ఇరాన్ 14 పాయింట్లతో ఈ కొత్త ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా దిగ్బంధనాన్ని ముగించడం, ఇరాన్, లెబనాన్‌లో యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలకడంపై ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ ప్రతిపాదించినట్లు సమాచారం. ఆయా అంశాలపై చర్చలకు ఒక నెల గడువు విధించింది. అటువంటి ఒప్పందం కుదిరిన తర్వాతే అణు కార్యక్రమంపై మరో ఒప్పందానికి వచ్చేందుకు మరో నెల రోజులపాటు చర్చలు కొనసాగించాలని పేర్కొంది. భవిష్యత్తులో ఎలాంటి దాడులు చేయకూడదని, తమ భద్రతకు హామీ ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అణ్వాయుధాల అభివృద్ధిని నిలిపివేస్తామంటూ ఇరాన్ స్పష్టమైన గ్యారంటీ ఇవ్వలేదని సమాచారం. హార్మూజ్‌ను తెరుస్తామని, తక్షణమే ఉద్రిక్తతలను తగ్గించే చర్యలపై దృష్టి సారిస్తామని ఇరాన్ వెల్లడించింది. అమెరికా ఈ ప్రాంతం నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలని, తమ చమురు ఎగుమతులపై ఆంక్షలు సహా ఆర్థిక ఆంక్షలను తొలగించాలని షరతు విధించింది. సముద్ర వాణిజ్యం, చమురు సరఫరా పునరుద్ధరణను అణు కార్యక్రమాల చర్చల నుంచి వేరు చేయాలన్నదే ఇరాన్ వ్యూహమని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ నిబంధనల కింద తమ అణు కార్యక్రమ హక్కులను అధికారికంగా గుర్తించాలని ఇరాన్ కోరుతోంది. ఏ ఒప్పందమైనా శాశ్వతంగా ఉంటుందని, ఏకపక్ష ఉపసంహరణకు తావు లేదన్న హామీలు ఇవ్వాలని అంటోంది.

## అన్నదాన పథకానికి విరాళం

పెదకాకాని: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వర ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఫిరంగిపురానికి చెందిన జెట్టి శివకుమారి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



## పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 400 క్యూసెక్కుల వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 33.9760 టీఎంసీలు.

## భక్తిశ్రద్ధలతో పూజలు



సత్తెనపల్లి: స్థానిక నాగన్న కుంటలోని కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవ స్థానం వార్షికోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి గంధ సిందూరంతో (గంధోత్సవం) అలంకరణ చేపట్టి ఘనంగా విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### ముగిసిన అండర్–11 చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని విజేత ఐఐటీ స్కూల్‌లో ఆదివారం నైట్ క్యాజిల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వ హించిన అండర్–11 చిన్నారుల చెస్ పోటీలు ముగిశాయని టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్ర వర్తి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 50 మందికి పైగా చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. బాలికల విభాగంలో పి.లాలిత్య, పి.ఐవిష్య, బాలురలో ఎం.చేతన్, శౌర్యదీప్ సింగ్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి విజేతలుగా నిలిచారన్నారు. నలుగురు చిన్నారులు ఈ నెల 9, 10 తేదీల్లో విశాఖపట్నం లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రవీంద్రరాజు, విజేత స్కూల్ డైరెక్టర్ నిమ్మల సురేష్, ఇన్‌ఛార్జి సంధ్యలు విజేతలకు బహుమ తులు అందించారని తెలిపారు.

### రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

నగరం: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి మీ భూమి–మీ హక్కు కార్యక్రమం దోహదప డుతుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. బాపట్ల జిల్లా నగరం మండలం పూడివాడ గ్రామంలో ఆదివారం జరిగిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మీ భూమి–మీ హక్కు కార్యక్రమంలో భాగం గా చేపట్టిన రీ సర్వేతో రైతులకు స్పష్టమైన భూ హక్కులు లభిస్తున్నాయన్నారు. రీసర్వే పూర్త యిన తర్వాత క్యూఆర్‌కోడ్‌తో రూపొందించిన కొత్త పుస్తకాలు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక సాం కేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల హద్దులు, విస్తీర్ణం కచ్చితంగా నిర్ధారించడంతో భూ వివాదాలు తగ్గడమే కాకుండా రైతులకు బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభం గా పొందవచ్చన్నారు. భూహక్కు పత్రాలు, పాస్ పుస్తకాలను రైతులు భద్రంగా ఉంచుకో వాలని సూచించారు. కార్యక్రమంలో జాయిం ట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఆర్డీవో శ్రీదేవి, తహ సీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో శ్రీనివా సరావు, అధికారులు పాల్గొన్నారు.

### ముగిసిన రంగనాథుని బ్రహ్మోత్సవాలు

యడ్లపాడు: మండల పరిధిలోని సొలస గ్రామంలో వెలసిన శ్రీ భూ సమేత రంగనాయ క స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ఆదివారం పవళింపు సేవతో ముగిశాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా ఆలయ అర్చకులు వర్చూరి రామకృష్ణమాచార్యుల నేతృత్వంలో స్వామి వారికి పులంగి సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం ద్వారా ప్రదక్షి ణలు చేశారు. ఆలయ ఈఓ నెమలిరెడ్డి పర్యవే క్షణలో ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్–నాగజ్యోతి దంపతులు, అర్వపల్లి బ్రదర్స్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చి రంగనాథుని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సాగిన ఈ కార్యక్ర మాల అనంతరం భక్తులకు అన్నప్రసాద విత రణ గావించారు. భక్తుల గోవింద నామస్మర ణతో సొలస క్షేత్రం మార్మోగింది.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 525.40 అడుగులకు చేరింది. ఇది మొత్తం 159.3072 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్ బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 450 క్యూసె క్కులు వచ్చి చేరుతోంది.

# పెద్దాసుపత్రికి నిర్లక్ష్య రోగం

- వైద్య సేవల కోసం పేద రోగుల పడిగాపులు
- ఓపీ చీటీ కావాలంటే ఎంతో ఓపిక కావాల్సిందే
- వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే నిరీక్షించాల్సిందే
- అందుబాటులో లేని సీనియర్ వైద్యులు
- మధ్యాహ్నం ఓపీ సేవలు అందితే ఒట్టు
- చంద్రబాబు సర్కారు నిర్వాకంతో పడకేసిన వైద్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్ద ఆసుపత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్‌లో సకాలంలో వైద్య సేవలు అందక రోగులు అలమటిస్తున్నారు. సుమారు ఏడు జిల్లాలకు చెందిన రోగులు ప్రతి రోజూ 3 వేల మందికిపైగా గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నారు. రోగులకు సరిపడా వైద్య సౌకర్యాలు కల్పించడంలో ఆసుపత్రి అధికారులు విఫలమవుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన సీనియర్ వైద్యులు మధ్యాహ్నానికే ఇళ్లకు, సొంత క్లినిక్‌లకు, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. పర్యవసానంగా పెద్ద ఆసుపత్రిలో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయని స్థానికులతో పాటు పొరుగు జిల్లాల నుంచి గంపెడంత ఆశతో చికిత్స కోసం వస్తున్న నిరుపేదలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌కు క్యాజువాలిటీ (ఎమర్జెన్సీ వార్డు) గుండె లాంటిది. రోడ్డు ప్రమా దాల బాధితులు, దాడుల్లో గాయపడిన వారు, విషప్రభావానికి గురైన వారిని అత్యవసర సేవల విభాగంలో (ఎమర్జెన్సీ వార్డు) చేరుస్తారు. అయితే ఎమర్జెన్సీ వార్డులో సరైన వైద్య సౌకర్యాలు అందు బాటులో లేవు. ముఖ్యంగా డ్యూటీలో ఉండాల్సిన డ్యూటీ అసిస్టెంట్ ఫిజీషియన్స్ (డీఏపీ), డ్యూటీ అసిస్టెంట్ సర్జన్లు (డీఏఎస్)లు అందుబాటులో ఉండటం లేదు. ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఉన్నప్పటికీ సదరు వైద్యులు నత్తమాంగా విధులు నిర్వహించడం లేదు. ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుల పనితీరుపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి నెలం డర్ చేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఆసుపత్రి మొత్తానికి గుండెకాయలాంటి కీల కమైన అత్యవసర వైద్య విభాగంలో అత్తెసరు వైద్య సేవలు మాత్రమే లభిస్తున్నాయి. ఎమర్జెన్సీ వార్డులో పర్యవేక్షణ చేయాల్సిన సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ అక్కడ్ని నివాసం ఉండటం లేదు. రాత్రి వేళల్లో ఎమర్జెన్సీ వార్డులో అందుబాటులో ఉండటం లేదు. నర్సింగ్ అధికారుల పర్యవేక్షణ కూడా మొక్కుబడిగా కొనసాగుతోంది.

**వైద్య పరీక్షల కోసం ఎదురు చూపులు....**

జీజీహెచ్‌లో వ్యాధి నిర్ధారణ కోసం చేసే సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఇలా వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. స్ట్రెచర్లు, వీల్‌చైర్‌లతో ఆక్సిజన్ మాస్క్‌లు ధరించి సైతం రోగులు వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వైద్య పరీక్షల అనంతరం రిపోర్ట్‌ల కోసం సైతం ఇదే తరహా కష్టాలు రోగులకు తప్పడం లేదు. ఉదయం ఓపీలో చూపించుకున్న రోగి రిపోర్ట్‌ల కోసం సాయంత్రం 4 గంటల వరకు వేచి చూడాల్సి వస్తోంది. రిపోర్ట్‌లు వచ్చే సరికి వైద్యులు అం దుబాటులో ఉండటం లేదు. రోగులు రిపోర్ట్‌లు చేతిలో పట్టుకుని ఉసూరుమంటూ ఇళ్లకు వెళ్లి మరోరోజు వైద్య సేవల కోసం రావాల్సి వస్తోంది.

**ప్రైవేటు అంబులెన్స్‌లే దిక్కు.....**

పెద్దాసుపత్రికి వచ్చి చనిపోతే వారి భౌతిక కాయాన్ని తరలించాలంటే... ముఖ్యంగా రాత్రి వేళల్లో తరలించాలంటే బంధువులు రూ.వేలల్లో ప్రైవేటు అంబులెన్స్‌ల వారికి డబ్బులు చెల్లించా ల్సిందే. మృతదేహాలను తరలించే కాంట్రాక్టును మహాప్రస్థానం పేరుతో ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తు లకు అప్పగించింది. వారు సాయంత్రం ఆరు గం టలు దాటితే సేవలు నిలిపివేస్తున్నారు. రాత్రివేళ చనిపోతే మరుసటిరోజు వరకు వార్డులో లేదా మార్చురీలో ఉండాల్సిందే. లేదంటే రాత్రి వేళల్లో ప్రైవేటు అంబులెన్స్‌ల వారికి పదివేల వరకు చెల్లిం చి మృతదేహాలను తరలించుకోవాల్సి వస్తుందని బంధువులు వాపోతున్నారు. మహాప్రస్థానం వాహనాల సేవలు అంతంత మాత్రమే ఉంటున్నా ఆస్పత్రి అధికారులు వారికి పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

**అరకొరలో విధుల నిర్వహణ**

జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పనిచేస్తున్న సుమారు 30 మంది వైద్య సిబ్బందికి ఏడాదిపైగా వేతనాలు చెల్లించలేదు. కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది సుమారు 700 మందికి పైగా రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. వేతనాలు రాక పలువురు వైద్య సిబ్బంది అర్ధాకలితో విధులు నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి సైతం ప్రతినెలా వేతనాలు చెల్లింపులు జరగటం లేదు. జీతాలు నెల నెలా రాక పోవటంతో వారు పోస్టర్లు, స్కానర్లు పెట్టి మరీ మామూళ్లు అడుగుతున్న వీడియో ఇటీవల కాలం లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**ముట్టజెప్పాల్సిందే...**

కాన్పుల విభాగంలో, మార్చురీ వద్ద, ఆపరేషన్ థియేటర్‌ల వద్ద అధిక మొత్తంలో మామూళ్లు వసూలు చేసి రోగులను ఇబ్బందులకు గురిచే స్తున్నా ఆసుపత్రి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుండిపోతున్నారు. రోగులను కట్టుమార్చే వారు సైతం ముడుపులు తీసుకుని డ్రెస్సింగ్ చేస్తున్నారు. పెద్ద ఆసుపత్రిలో పుట్టినా, గిట్టినా ముడుపులు తప్పనిసరి అన్నట్లుగా కింది స్థాయి ఉద్యోగులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కార్యాలయంలోనూ మామూళ్ల రోగం తీవ్ర స్థాయిలో ఉందని ఆసుపత్రి ఉద్యోగులు వాపో తున్నారు. ఏ ఫైల్ కదలాలన్నా ముడుపులు ముట్ట చెప్పాల్సిందే. నర్సింగ్ కార్యాలయంలో కూడా సెల వుల మంజూరుకు, డ్యూటీల కేటాయింపునకు మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపి స్తున్నాయి. మందులు, సర్జికల్, ఆక్సిజన్, వర్క్ షాపు బిల్లుల మంజూరుకు పర్సంటేజీలు ఇవ్వక పోతే సంతకాలు చేయడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళుతున్న సహాయకులు

క్యాజువాలిటీలో వృద్ధుడికి సరైన వసతులు లేకుండానే ఆక్సిజన్ పెట్టిన దృశ్యం

### ఓపీ చీటీకి ఓపిక కావాల్సిందే..

గుంటూరు జీజీహెచ్‌లో అవుట్ పేషెంట్ విభాగంలో (ఓపీ) చికిత్స పొందాలంటే తొలుత ఓపీ చీటీ తీసుకోవాలి. ఆసుపత్రి ఆవ రణలో ఓపీ చీటీల ప్రక్రియను ఆన్‌లైన్ చేశారు. ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న సెల్‌ఫోన్, ఆధార్ కార్డు ఉండి గంటసేపు క్యూలో ఉంటే ఓపీ చీటీ చేతికందుతుంది. తీరా ఓపీ చీటీ తీసుకుని వైద్యుల వద్దకు వెళితే అక్కడ సీని యర్ వైద్యులు అందుబాట్లో లేరు. బిజీగా ఉంటూ జూనియర్ వైద్యులతో ఓపీ వైద్య సేవలను మమ అనిపిస్తున్నారు.

### నీటి కష్టాలు తప్పటం లేదు....





క్యాన్సర్ ఆసుపత్రి వద్ద పనిచేయని వాటర్ కూలర్

ఎండలకు జీజీహెచ్‌లో రోగులు నీటి సరఫరా లేక అల్లాడిపోతున్నారు. తాగు నీరు తప్పనిసరిగా బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దాతల సాయంతో కూలింగ్ వాటర్ కూలర్స్ ఏర్పాటు చేసినా వాటిల్లో నీటిని నింపే ప్రక్రియ సక్రమంగా చేయకపోవడంతో రోగులు, వారి సహాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది అందరూ కూడా తాగునీటిని బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. వార్డుల్లో ఉపయోగించుకునేందుకు, ఇతర అవసరాల కోసం నీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్నారు.

నీళ్ల బాటిల్ కొనుగోలు చేసి తీసుకెళుతున్న దృశ్యం

### రోగుల సహాయకులే మోసుకెళ్లాలి...

ఆసుపత్రిలో రోగులను వార్డులోకి తరలించేందుకు అవసరమైన వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండటం లేదు. కొన్ని వీల్ చైర్లు తుప్పుబట్టిపోయి వినియోగించడానికి పనికి రాకుండా ఉం టున్నాయి. రోగుల బంధువులే వైద్య పరీక్షల కోసం, వార్డుల్లో అడ్మిషన్ కోసం రోగులను తరలించాల్సిన దుస్థితి నెలకొంది. రోగులను తరలించాల్సిన ఆస్పత్రి ఉద్యోగులు ఆసుపత్రిలో ఉన్నారో.. లేరో.. అన్నట్లు ఉంది. వీరిపై అజమాయిషీ చేయా ల్సిన అధికారులు మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.

వీల్‌చైర్‌పై రోగిని తీసుకెళుతున్న సహాయకురాలు

### పనివేళలు పాటించని వైద్యులు ...

నిబంధనల ప్రకారం జీజీహెచ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ వైద్య సేవలు అందిం చాల్సి ఉంది. భోజన విరామం కోసం గంట గ్యాప్ ఇస్తే, మిగతా సమయమంతా ఓపీల్లో వైద్యులు ఉండి చూడాల్సిం దే. కానీ పెద్ద ఆసుపత్రిలో సీనియర్ వైద్యులు పనివేళలు పాటించడం లేదు. ఉదయం 9 గంటలకు రావాల్సిన వారు తీరిగ్గా 10 గంటలకు ఓపీకి వస్తున్నారు. కొంత మంది హెచ్ ఓడీలు, ప్రొఫెసర్లు ఓపీ వైద్య సేవలకు డుమ్మా కొడుతు న్నారు. ఓపీ విభాగానికి వచ్చిన సీనియర్ వైద్యులు రోగులను చూడకుండా ఓపీ సమయంలోనే వైద్య విద్యా ర్థులకు పాఠాలు చెబుతూ మధ్యాహ్నం చేయాల్సిన విధు లను ఓపీలో చేసేసి మధ్యాహ్నం విధులు ఎగ్గొట్టి సొంత ప్రాక్టీస్‌లో మునిగి తేలుతున్నారు. కొంత మంది వైద్యులు మధ్యాహ్నం ఒంటిగంటకల్లా ఇళ్లకు, సొంత క్లినిక్‌లకు వెళ్లి పోతున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కొంత మంది సీనియర్ వైద్యులతో కొన్ని వైద్య విభాగాల వారు ఈవినిం గ్ క్లినిక్‌ను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. పెద్దాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు వారంలో కేవలం రెండు రోజులు లేదా మూడు రోజులు మాత్రమే ఓపీలు నిర్వహి స్తారు. సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవల కోసం రోగులు రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. విధులు నిర్వ హించని వైద్యులపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కించటం విమర్శలకు తావిస్తోంది.

# ప్రతి నెలా మామూళ్లు ఇవ్వాల్సిందే

- రేషన్ దుకాణం నిర్వహిస్తున్న మహిళలకు ఈస్ట్ డీటీ బెదిరింపులు
- అక్రమంగా షాపుపై దాడి చేసి కేసులో ఇరికించారని బాధితుల ఆరోపణ

రేషన్ దుకాణం ఎదుట కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న శివలీల, విజయలక్ష్మి

పట్నంబజారు: 'మీరు ప్రతి నెల డబ్బులు ఇవ్వాల్సిందే... ఆ వేళ ఇవ్వలేకపోతే... నా దగ్గర వేరే మార్గం ఉంది' అంటూ గుంటూరు ఈస్ట్ డీటీ భాస్కర్ ఒక డ్వాక్రా గ్రూప్ ద్వారా నడుపుతున్న రేషన్ డీలర్ తిరుమలశెట్టి శివలీల, ఆమె బంధువు ఉప్పలూరు విజయలక్ష్మి పట్ల అసభ్యకరంగా వ్యవహ రించారని బాధితులు వెల్లువెత్తుతున్నారు. ఆదివారం ఇంది ప్రియదర్శిని కాలనీలో రేషన్ దుకాణం వద్ద వారి ద్దరు నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు తూర్పు నియోజక వర్గంలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీలో ఉన్న 183 నెంబర్ రేషన్ డిపోను తిరుమలశెట్టి శివలీల ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఆమె ప్రస్తుతం డ్వాక్రా గ్రూప్ లీడర్‌గా ఉన్నారు. ఈస్ట్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే డీటీ భాస్క ర్‌కు నెల రూ.5 వేల చొప్పున ఇస్తున్నామని రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం గ్రీవె న్స్‌లో డీటీ భాస్కర్‌పై ఫిర్యాదు చేశారని చెబు తున్నారు. ఈ క్రమంలో గత ఏడాది మే 18వ తేదీన రూ 1.50 లక్షలు ఇవ్వాలని తెలిపారు. ఈ ఏడాది కూడా ఇవ్వాలని అడుగుతున్నారని, తమకు ఆ పరిస్థితి లేదని చెబుతున్నప్పటికీ విడిపించుకోకుం డా పోలీసు చేసిన ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 8వ తేదీలోగా ఇవ్వాలని, అందులో జిల్లా పౌరసరఫరాల అధికారికి రూ. లక్ష వాటా ఇవ్వడంతో, ఆరుగురు వ్యక్తులకు ఇవ్వ న్నారని, మీరెందుకు ఇవ్వరని వేధిస్తున్నారని తెలి పారు. అది ఇవ్వలేదనే కోపంతోనే, పైగా తాను కలె క్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానన్న కక్షతో ఈ నెల 2వ తేదీ రాత్రి ఐదుగురు తమ షాపులో కొంత మంది వ్యక్తు లతో బియ్యం తీసుకుని వచ్చారని చెప్పారు. అవి తమ షాపులో పెడుతున్న సమయంలో ప్రత్యేకించినా ఏం వర్తంలో తమ షాపును వచ్చి చూసుకుంటూ ఉన్నారని తెలిపారు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే కథనంతా మార్చేసి.. బియ్యం తమ షాపులో అధికంగా ఉం దని చెప్పి తమపై అక్రమంగా కేసు నమోదు చేసి, బలవం తంగా సంతకం చేయించుకున్నారని కన్నీరుమున్నీరు అవుతున్నారు. అక్రమంగా షాపుకు తాళం వేసి వెళ్లిపోయారని తెలిపారు. ప్రతి నెలా రేషన్ మామూళ్లు సైతం తాను చెప్పిన వారికే బియ్యం విక్రయించాలని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. డీటీ భాస్కర్ తీరుకు స్థానికులంతా ప్రత్యక్ష సాక్షులని చెప్పారు. స్థానికులు, రేషన్ డిపో ఇంటి యజమాని సైతం డీటీ భాస్కర్ కొంత మంది ప్రైవేట్ వ్యక్తులతో వచ్చి దౌర్జన్యం చేశారని చెబుతున్నారు.

### వేరే మార్గం ఉంది...

శివలీల, విజయలక్ష్మితో డీటీ భాస్కర్ వ్యవహ రించిన తీరు ఎంతో విస్మయం కలిగిస్తోంది. డబ్బులు లేకపోయినా ఫర్వాలేదని, దానికి నా దగ్గర వేరే మార్గం ఉందని ఆయన మాట్లాడటం పై మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. డీటీ భాస్కర్ వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని, తమ పని తాము చేసుకునేలా చూడాలని కోరుతున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మను వివరణ కోరగా పరిశీలి స్తామని తెలిపారు. డీటీ భాస్కర్‌ను అడిగితే ఏమి ఉం దని, కేసు నమోదు చేసే సమయంలో ఆరోప ణలు చేస్తారని వ్యాఖ్యానించారు. దీనిపై డీటీ భాస్కర్‌ను వివరణ కోరినప్పటికీ ఆయన స్పం దించలేదు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

ఏఎన్‌యూ పరీక్ష కేంద్రం వద్ద కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడంతో చెట్టు కింద విద్యార్థుల తల్లిదండ్రులు, సహాయకుల అవస్థలు

- జిల్లాలో 98.06 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత తనిఖీలు
- ఏఎన్‌యూలో అవకాశం కోల్పోయిన విద్యార్థిని
- గుంటూరులో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తనిఖీలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను నీట్ టెన్షన్ పెట్టింది. మండుటెండలో సకాలంలో పరీక్ష కేంద్రా లకు చేరుకోవడంలో విద్యార్థులు, వారి తల్లిదం డ్రులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోకూడదని ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. జాతీయ స్థాయిలో వైద్య విద్య కోర్సుల ప్రవేశానికి ఆదివారం నీట్ పరీక్ష (నీట్–యూజీ 2026)ను గుంటూరు జిల్లాలో 98.06 శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తం గా ఏర్పాటు చేసిన 24 కేంద్రాల పరిధిలో కేటాయిం చిన 8,417 మంది విద్యార్థుల్లో 8,299 మంది హాజ రయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. ఉదయం 11 నుంచే ఆయా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి వెంట వచ్చిన తల్లిదండ్రుల సందడి నెలకొంది. ఉదయం 11.30 నుంచి విద్యార్థులను ఆయా కేం ద్రాల్లోకి అనుమతించారు. అంతకుముందు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఆభరణాలు, వాచీలు, బోటీలను తొలగింపచేశారు. అన్ని కేం ద్రాల వద్ద మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేస్తామని ఎన్‌టీఏ నిబంధనల్లో పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యా లయం పరీక్ష కేంద్రానికి మధ్యాహ్నం 1.45 గంట లకు వచ్చిన ఓ విద్యార్థినిని లోనికి అనుమతించలే దంతో పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయిన ఆమె కన్నీరు పెట్టుకుంది. గుంటూరు సాంబశివపేటలోని ఏసీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తనిఖీ చేశారు. పరీక్ష జరు గుతున్న తీరును పరిశీలించారు.

**వసతులు కల్పించలేదని తల్లిదండ్రుల ఆగ్రహం**

ఏఎన్‌యూ(పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవి ద్యాలయంలో నీట్ రాసేందుకు పెద్దఎత్తున విద్యార్థులు తరలివచ్చారు. మొత్తం 2,976 మం దికిగాను 2,911 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటలకే ఓ విద్యార్థిని పరీక్ష కేంద్రా నికి చేరుకుంది. కానీ పరీక్ష సమయం 2 గం టలకు అని స్థానికులు చెప్పడంతో తిరిగి ఇంటికి వెళ్లింది. అనంతరం నిర్ణీత సమయానికి చేరుకోవడంలో 10 నిమిషాలు ఆలస్యం కావడంతో ప్రధాన ద్వారం గేటు వేశారు. ఆ విద్యార్థినిని ఎంత ప్రాధే యపడినా అనుమతించలేదు. పరీక్ష రాసే విద్యార్థి తంబ్ (వేలిముద్ర) తీసుకోవడంలో జాప్యం చేసినా వెనక్కి పం పించారు. 30 సెకన్లు ఆలస్యంగా వచ్చిన మరో విద్యార్థిని విషయంలో డీఎస్పీ మురళీకృష్ణ చెప్ప డంతో లోనికి అనుమతించారు. వేలాదిగా తల్లి దండ్రులు వర్సిటీ వద్దకు తమ పిల్లలతో చేరుకు న్నారు. నిర్వాహకులు పూర్తి స్థాయిలో వసతులు కల్పించకపోవడం, తాగడానికి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో చెట్ల కింద, జాతీయ రహదారి అండర్‌పాస్ కింద వారు గడపాల్సి వచ్చింది. విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులకు వసతులు కల్పించడంలో వర్సిటీ అధికారులు విఫలమయ్యారని, కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదని, తాగునీరు కూడా లేదని, ప్రధాన ద్వారం ఎదుట కూర్చోవాల్సి వచ్చిందని తల్లిదండ్రులు మండిపడ్డారు. వర్సిటీ ఏఐఎస్ ఎఫ్ నాయకులు నారాయణస్వామి తదితరులు వసతుల విషయంలో అధికారుల తీరును ఖండించారు. పెదకాకాని సీఐ టి. పెద నారాయణస్వామి ఆధ్వ ర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఏఎన్‌యూ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున రావడంతో రద్దీ

## క్లుప్తంగా

### నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

**నరసరావుపేట రూరల్:** ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. అర్జీదారులు తమ సమస్య గురించి ఖచ్చితమైన, పూర్తి సమాచారంతో దరఖాస్తు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. అలాగే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముగ్గురు రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లు పాల్గొని వినతులు స్వీకరిస్తారని వివరించారు.

### వరిగడ్డి వాములు దగ్ధం

రూ.25 లక్షల ఆస్తి నష్టం

**గుంటూరు రూరల్:** ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులో భారీ అగ్నిప్రమాదం ఆదివారం చోటుచేసుకుంది. పొలం సమీపంలో నాలుగు వరిగడ్డివాములు, ఒక లారీ దగ్ధం కావ్వటంతో భారీ నష్టం జరిగిందని బాధితులు గరికపాటి లక్ష్మయ్య తెలిపారు. పందెం ఎద్దులకు చెందిన వరిగడ్డి వాములు కావటం, దానితో పాటు ఒక లారీ, లారీలోని ఎద్దుల పందేలకు వినియోగించే సామగ్రి దగ్ధమయ్యాయి. సుమారు రూ.25 లక్షల వరకూ ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని బాధితులు తెలిపారు. ఘటనపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కుడో జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్

**గుంటూరు వెస్ట్(క్రీడలు):** కుడో అసోసియేషన్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో స్థానిక టీజేపీఎస్ కళాశాలలో జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల పర్యవేక్షకుడు రిషి వర్మ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్‌ఆర్ ప్రసాద్, కార్యదర్శిగా సిద్ధార్థ, కోశాధికారిగా రిషి వర్మ రాజు ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణకు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ నుంచి అబ్జర్వర్‌గా బాక్సింగ్ కోచ్ రామిశెట్టి విశ్వనాథ్, స్టేట్ అసోసియేషన్ నుంచి కోటిరెడ్డి హాజరయ్యారన్నారు. రిటర్నింగ్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు వ్యవహరించారని చెప్పారు.

### ఊబకాయానికి సరైన చికిత్స అవసరం

'మణిపాల్ లైవ్ బేరియాకాన్'లో ప్రముఖ వైద్యులు

**తాడేపల్లిరూరల్:** గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం 'మణిపాల్ లైవ్ బేరియాకాన్-2026' పేరుతో ప్రత్యేక అకడమిక్ ఈవెంట్‌ను నిర్వహించారు. విజయవాడలోని వరుణ్ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు, బేరియాట్రిక్ సర్జన్లు హాజరై తమ అనుభవాలను వివరించారు. మణిపాల్ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు మాట్లాడుతూ ఊబకాయం ప్రధాన సమస్య కాదని, దీనికి సరైన ప్లానింగ్, మల్టీ డిసిప్లినరీ అప్రోచ్‌తో చికిత్స అవసరమని తెలిపారు. మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ జె.రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ బేరియాకాన్ ద్వారా ఆధునిక శస్త్రచికిత్స నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, రోబోటిక్ సర్జరీ సేవలు, వైద్య సమాజానికి దగ్గర చేయడం తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు బత్తిని రాజేష్, రాజేష్ చంద్ర, వరుణ్ దాసరి, రవి దాస్యం, అమిత్ , భానుప్రవీణ్ నాయుడు, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### వడగళ్ల వాన



**గుంటూరు రూరల్:** మండుతున్న ఎండల వేళ ఆదివారం వర్షం కురిసింది. కాకుమాను, పెదనందిపాడు, గుంటూరు రూరల్ మండలాల్లో మబ్బులతో కూడిన వర్షం పడింది. కాకుమాను గ్రామంలో అక్కడక్కడ చిన్నపాటి వడగడ్లు పడ్డాయి..

# రంగస్థల ప్రముఖులకు అవార్డుల ప్రదానం

గోవాడ వెంకట్‌కు 'సవ్యసాచి' అవార్డు ప్రదానం

జ్యోతిరాణికి జీవిత సాఫల్య పురస్కారం

**తెనాలి:** కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో ఉభయ రాష్ట్రస్థాయి 12వ ఆహ్వాన నాటికల పోటీలు రెండోరోజైన ఆదివారం రాత్రి కొనసాగాయి. కొలకలూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఖాజీపేట నాటకశాల వద్ద ప్రత్యేక వేదికపై జరుగుతున్న ఈ నాటిక పోటీలు గడ్డం ప్రకాష్ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల, టీవీ, సినీనటులు డాక్టర్ గోవాడ వెంకట్‌కు కరణం సురేష్ జ్ఞాపకార్థం 'సవ్యసాచి' అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. విజయనగరానికి చెందిన ప్రముఖ రంగస్థల నటి ఎస్.జ్యోతిరాణికి గోపరాజు హేమలత జీవిత సాఫల్య పురస్కారాన్ని గోపరాజు శివరామకృష్ణ హనుమత్ శేఖర్, కుటుంబసభ్యులు ప్రదానం చేశారు. సభకు ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ మాజీ కార్యదర్శి డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. కళారంగ ప్రముఖులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు (చిలకలూరిపేట), గుదె పాండురంగారావు (అనంతపురం), కూచి రామాంజనేయులు (వినుకొండ), ఏటూరి రోహిణీకుమార్ (హైదరాబాద్), చెరుకూరి సాంబశివరావు (గుంటూరు) పాల్గొన్నారు. కళారంగంలో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు చేస్తున్న కృషిని ప్రశంసించారు. గోపరాజు రమణ, గోపరాజు విజయ్, వైఎస్‌కేఎస్ స్వామి, సుంకర శ్రీనివాసరావు, సుద్దపల్లి మురళీధర్ పర్యవేక్షించారు. నాటక పోటీల్లో భాగంగా తొలుత కళానికేతన్, వీరన్నపాలెం వారి 'దీపం కింద చీకటి' నాటికను ప్రదర్శించారు. అగస్త్య రచనకు వైబీ చౌదరి దర్శకత్వం వహించారు. తదుపరి హేలాపురి కల్చరల్ అసోసియేషన్-ఏలూరు వారి 'అనగనగా ఓ రాత్రి' నాటికను ప్రదర్శించారు. పీవీ సత్యనారాయణ రచనకు మహమ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించారు. చివరగా ఎస్‌ఎంఆర్ క్రియేషన్స్-అనకాపల్లి వారి 'మలిసంధ్య' నాటికను ప్రదర్శించారు. గోవిందరాజుల నాగేశ్వరరావు రచనకు ముత్యాలరావు దర్శకత్వం వహించారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
# తెరిచే తేదీని ప్రకటించాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**గుంటూరు ఎడ్యుకేషన్:** రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరిచే తేదీలను తక్షణమే ప్రకటించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి లేఖ రాసిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఎప్పటి నుంచి ప్రారంభించేది రైతులకు వివరణ ఇవ్వకుంటే, మొక్కజొన్న అమ్మకాల్లో తీవ్రమైన సందిగ్ధత, నిరాశ నెలకొనే అవకాశముందన్నారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధిక ఉత్పత్తి వచ్చిన నేపథ్యంలో తక్షణమే కొనుగోలు కేంద్రాలు తెరిపించాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. రాజకీయ విందు సమావేశాలను పక్కన పెట్టి, రైతుల కడుపు నింపే విధంగా మొక్కజొన్నకు కేంద్రం ప్రకటించిన విధంగా రూ.2,400 మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గ బోర్డర్ అయిన వడ్లమూడిలోని సంగం డెయిరీలో ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరతో కొని, నిల్వ ఉంచి, అధిక ధరకు విక్రయించేందుకు సిద్ధం చేసిన భారీ మొక్కజొన్న నిల్వలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను తీసుకువచ్చి సీజ్ చేయించి, సంగం డెయిరీ ద్వారా అక్రమ నిల్వలకు సంబంధించి వ్యత్యాసం డబ్బులను రైతులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అక్రమ కొనుగోళ్ల దళారీల గ్యాంగ్ లీడర్ పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై చర్యలు తీసుకోకపోవడం, రైతాంగానికి మేలు చేయాలనే ఉద్దేశం సీఎం చంద్రబాబుకు, డీసీఎం పవన్ కళ్యాణ్‌కు లేదని అర్థమవుతోందన్నారు. ఇప్పటికే రైతాంగం కళ్లు కాయలు కాచే విధంగా ఎదురు చూస్తున్న మొక్కజొన్న పంట కొనుగోళ్లను తక్షణమే ప్రారంభించకుంటే, రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి గల తీరు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతిచెందిన మునెయ్య

**వినుకొండ:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని మార్కాపురం రోడ్డులో గల చెక్‌పోస్టు సెంటర్‌లో ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన శివరాత్రి మునెయ్య (30) వినుకొండ రూరల్ మండలం శివాపురం వద్ద జరిగే పాతపాటి పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా హోటల్ నిర్వహించేందుకు సామగ్రి ఆటోలో వేసుకొని బయలుదేరాడు. చెక్‌పోస్టు సెంటర్ వద్దకు రాగానే జేసీబీ రోడ్డుపైకి రావడంతో ఆటో అదుపు తప్పి జేసీబీని ఢీకొట్టింది. ఈ ఘటనలో మునెయ్య మృతి చెందాడు. ఆటోలో ఉన్న మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మునయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం

మృతి చెందిన ఇమామ్ హుస్సేన్

ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**పిడుగురాళ్ల:** మున్సిపల్ ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొనటంతో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి గాయాలైన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని బైపాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నరసరావుపేటకు చెందిన ఓ కుటుంబం కారులో తెలంగాణ రాష్ట్రంలోని జానపాడు దర్గా దర్గకు వెళ్తున్నారు. ఈక్రమంలో కొండమోడు డంపింగ్ యార్డులో చెత్తను వేసి పిడుగురాళ్లలోని ఓటర్ ట్యాంక్ వద్ద పార్క్ చేసేందుకు వస్తున్న ట్రాక్టర్‌ను పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి దగ్గరలో కారు వెనుకగా ఢీకొనడంతో కారు గాలిలో పల్టీలు కొట్టి కింద పడింది. ఘటనలో ఇమామ్ హుస్సేన్ (38) అక్కడిక్కడే మృతి చెందగా కరిముల్లా, షకీరా, నజీమా, నూర్జహాన్, హసీమా, జానీలకు గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు, ఎస్ఐ శివనాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. సీఐ శ్రీరాం వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్యాస్ లీకై టీకొట్టు దగ్ధం

ప్రమాదంలో అగ్నికి ఆహుతైన టీస్టాల్

ప్రమాదానికి కారణమైన సిలిండర్

త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం

**చిలకలూరిపేటటౌన్:** పట్టణంలోని 52 ఎకరాల టిడ్కో నివాసాల సముదాయల్లో ఆదివారం ఒక్కసారిగా చెలరేగిన అగ్నిప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. టీ స్టాల్‌లో ఆదివారం యథావిధిగా వ్యాపారం సాగుతుండగా, ఒక్కసారిగా గ్యాస్ లీకేజీ చోటుచేసుకుంది. క్షణాల్లోనే మంటలు షాపు అంతటా వ్యాపించాయి. మంటల ధాటికి దుకాణంలోని సామాగ్రి మొత్తం కాలి బూడిదయ్యింది. ప్రమాదం జరిగిన సమయంలో దుకాణంలో ఉన్నవారు, వినియోగదారులు అప్రమత్తమై బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మంటలు ఎగసిపడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే సాహసించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అందరూ కలిసి శ్రమించి మంటలను ఆర్పివేయడంతో పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు ప్రమాదం వ్యాపించకుండా నివారించగలిగారు. ఈ ప్రమాదంలో షాపులోని ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# వేసవిలో చోరీల నియంత్రణకు ప్రత్యేక నిఘా

గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్

**నగరంపాలెం:** వేసవిలో చోరీలు నిలువరించేందుకు ప్రత్యేక నిఘా చేపట్టామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల వేసవి సెలవుల దృష్ట్యా పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్తుంటారని అన్నారు. ఈ క్రమంలో తాళాలు వేసిన ఖాళీ ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీంతో రాత్రిళ్లు బీట్ పెట్రోలింగ్ పెంచామని, సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్‌లు, అనుమానితులపై నిఘా ఉందన్నారు. ఎవరైనా ఇతరత్రా కార్యక్రమాలకు వెళ్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. తద్వారా ఆ ఇళ్లల్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ ఇళ్లల్లో చోరీలకు పాల్పడేందుకు చోరులు వస్తే వెంటనే పట్టుకునేందుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. ఇళ్లలో నగదు, నగలు, విలువైన వస్తువులు దాచవద్దని, బ్యాంకుల లాకర్లలో భద్రపరచాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు ఫోన్ చేయాలని లేదా దగ్గర్లోని పోలీస్‌స్టేషన్లల్లో తెలియజేయాలని ప్రజలను కోరారు.

### భక్తజనసంద్రంగా ఇంద్రకీలాద్రి

మహా మండపం వద్ద అమ్మవారి ప్రతిమకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు

అమ్మవారికి నైవేద్య సమయంలో క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** వేసవి సెలవులు, నీట్ పరీక్ష నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు, యాత్రికులు, విద్యార్థులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచే అంతరాలయ దర్శనం రద్దు చేసి రూ.300 టికెట్‌పై బంగారు వాకిలి దర్శనం కల్పించారు. దీంతో ఉదయం 11గంటల కల్లా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులందరికీ అమ్మవారి దర్శనం పూర్తయ్యింది. మరో వైపున అమ్మవారి మహా నివేదన నిమిత్తం మధ్యాహ్నం అన్ని దర్శనాలు నిలిపివేయడంతో క్యూలైన్లలో రద్దీ పెరిగింది. మధ్యాహ్నం 12.20 గంటలకు తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా, క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు త్వరగా దర్శనం అయ్యేలా దేవస్థాన అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీతో ఘాట్‌రోడ్డులోని పార్కింగ్ ప్రదేశం పూర్తిగా వాహనాలతో నిండిపోవడంతో కార్లు ఇతర వాహనాలను కనకదుర్గనగర్‌కు మళ్లించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవల, పల్లకీ సేవలోనూ ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ..**

సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ జరిగింది. లక్ష కుంకుమార్చన వేదిక వద్ద సూర్య భగవానుడి విగ్రహానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

**స్నాన ఘాట్, క్యూలైన్ల పరిశీలన..**

దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదివారం పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత దుర్గాఘాట్ స్నానాల రేవులో అపరిశుభ్రంగా ఉండటంతో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవులోని గట్టుపై మట్టి, వ్యర్థాలు నదిలో పడకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో భక్తులకు మజ్జిగ, మంచినీటితో పాటు చంటి పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

### రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తెనాలిరూరల్:** రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి- చుండూరు స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లారు. సుమారు 30 నుండి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. రైలు నుంచి జారి పడడం వల్ల మృతి చెందాడని ప్రాథమికంగా భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ ఎల్. సరస్వతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అగ్ని కీలలకు ఆహుతైన మొక్కజొన్న

పావులూరు సమీపంలో మొక్కజొన్న పంటపై అలుముకున్న అగ్నికీలలు

**ఇంకొల్లు(చినగంజాం):** ప్రమాదవశాత్తూ పంట పొలాల్లో మంటలు చెలరేగడంతో పంటలు ఆహుతయ్యాయి. తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ అందించిన వివరాలు మేరకు.. మండలంలోని పావులూరు, చిన్ననక్కలపాలెం గ్రామాల మధ్య పంట పొలాల్లో ఆదివారం ఉదయం 9 గంటలు నుంచి 10 గంటల సమయంలో మూడు ప్రాంతాల్లో మంటలు చెలరేగడంతో సుమారు 100 ఎకరాల్లో పంట పొలాలు పూర్తిగా తగులబడిపోయాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాస్ చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి సుమారు మూడున్నర గంటల పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోనికి తీసుకొనివచ్చారు. అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రమాద స్థలానికి ఇంకొల్లు సీఐ రామానాయక్, ఎస్ఐ జీ సురేష్, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారులు హాజరయ్యారు. అగ్ని ప్రమాద ఘటనలో రైతు సింగంశెట్టి వెంకటరత్నానికి చెందిన 4 ఎకరాలు మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి కావడంతో తీవ్రంగా నష్టపోయాడు. మిగిలిన 96 ఎకరాల్లో రైతులు ముందుగానే పంటను కోయడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా కోసిన తర్వాత మిగిలిన చొప్ప కూడా అగ్నిప్రమాదంలో తగలబడిపోయాయి. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సందర్శించి పంట నష్టపోయిన రైతుకు నష్టపరిహారం అందజేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాల్సిందిగా సూచించారు.

# ముగిసిన జాతీయ నాటకోత్సవాలు

యయాతి పౌరాణిక నాటకంలోని ఓ దృశ్యం

**చీరాల:** చీరాల కళాంజలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ 9వ నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక కస్తూర్బాగాంధీ మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి శింగమనేని సుబ్బారావు కళావేదికపై సుమిత్ర యూత్ అసోసియేషన్, మధిర వారి యయాతి అనే పౌరాణిక నాటకం ప్రదర్శించారు. ప్రతిరోజూ రెండు నాటికలతో పాటు కూచిపూడి నృత్య ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. వర్తమాన సమాజ స్థితిగతులకు నాటికలు అద్దంపట్టాయి. కార్యక్రమానికి ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు వారిచే నాటిక పోటీలను నిర్వహించారు. నాటకోత్సవాలు విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన కళాంజలి కార్యదర్శి సాంబశివరావును అభినందిస్తూ గౌరవ సత్కారం నిర్వహించారు. కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, సాంబశివరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, వలివేటి మురళీకృష్ణ, పూర్ణా సత్యం, లూక, పొట్టి శ్రీనివాసరావు, దరియా సాహెబ్ తదితరులు తెలిపారు.

# చట్టసభల్లో ఓబీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో సదస్సు



ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్‌తో డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

**గుంటూరు మెడికల్:** చట్టసభల్లో ఓబీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలో బీపీ మండల్ ట్రస్ట్ అధ్యక్షుడు, గుంటూరుకు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అనేకమంది మేధావులను, ఉద్యమకారులను కలిసి మద్దతు కోరారు. స్వరాజ్ అభియాన్ అధ్యక్షుడు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ సుకుమార్, సీనియర్ జర్నలిస్ట్, రాజ్యసభ టీవీ మాజీ చైర్మన్ ఊర్మిలేష్, రాష్ట్రీయ జనతాదళ్ అధికార ప్రతినిధులు డాక్టర్ కాంచన యాదవ్, కుమారి ప్రియాంక భారతి, సమాజ్ వాది పార్టీ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ లక్ష్మణ్, ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్, ప్రొఫెసర్ సందీప్ తదితరులను డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు కలిశారు. ఈ సందర్భంగా తాను కలిసిన వారికి డాక్టర్ వెంకటేశ్వర్లు 1992లో ఆనాటి కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు, కేపీ రెడ్డయ్య యాదవ్ ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుకు సంబంధించిన ప్రతిని వారికి అందజేశారు. లోక్ సభలోను , అనేక రాష్ట్రాల అసెంబ్లీలలో ఓబీసీల సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని, రిజర్వేషన్లు కల్పించకపోతే రానున్న కాలంలో వారి సంఖ్య మరీ తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ ఆందోళన వ్యక్తం చేసినట్లు డాక్టర్ ఆలా వివరించారు. ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కోసం ఆగస్టు 7న ఢిల్లీలో మేధావుల సదస్సును నిర్వహించనున్నట్లు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సందీప్ వివరించినట్లు చెప్పారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**

■ నర్సింగ్(MPHW), ల్యాబ్ టెక్నీషియన్ (MLT), అగ్రికల్చర్‌అసిస్టెంట్, వెటర్నరీఅసిస్టెంట్, జనరల్ నర్సింగ్(GNM), M.S.M కాలేజీ, గోరంట్ల, GNT. 7386706839, 7780494333, 7386406839

**REAL ESTATE**

**TOLET**

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ వారికి 2027 విద్యా సంవత్సరానికి గాను పలకలూరు లేదా పరిసర ప్రాంతాలలో 50,000 నుండి 60,000 చదరపు అడుగుల బిల్డింగ్ నిర్మించి అద్దెకు ఇవ్వదలచిన సొంత స్థలం యజమానులు లేదా బిల్డర్స్ సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 91541 52894.

**RENT**

■ For Rent Tenali Kopalli Road Godam 60l 40w 20h, Amaravathi Plots ground floor and 3rd floor for office,banks services 1st floor for residential. Contact 9441957952

**SERVICES**

**GOLD FINANCE**

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 83338 33368

**WANTED**

■ రామ డ్రెస్సెస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సేల్స్ గర్ల్స్, బాయ్స్ & టైలర్స్, నైట్‌వేర్ కూడా కావలెను. సంప్ర: రఘు మాన్షన్ 5/1, బ్రాడీపేట,గుంటూరు. 9347790038

■ ప్రముఖ సంస్థ నందు వంట చేయుటకు సమ్మర్ క్లాసులు చెప్పడానికి టీచర్లు కావలెను. (18సం॥ నుండి 30సం॥ వయస్సు) ఉచిత భోజనం, వసతి సదుపాయం. సంప్ర: 7337360712

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు తాడేపల్లి, మణిపాల్ హాస్పిటల్, కొలనుకొండ, మంగళగిరి ఏరియాలలో 12గం॥ పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 9959576707

■ తెనాలిలోని కృష్ణ బిజినెస్ పొల్సీ నందు క్యాషియర్ కలెక్షన్ చేయుటకు స్టాఫ్ కావలెను. అ: 10th-డిగ్రీ, జీతం: 15-18వేలు, తెనాలి పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర: 9866424243

■ కృష్ణసాయి క్లాత్ స్టోర్స్ నందు పనిచేయుటకు సేల్స్‌మెన్, హెల్పర్స్ స్త్రీలు/పురుషులు కావలెను. మంచి జీతం. ఇంట్రెస్ట్ వారు మాత్రమే సంప్ర: నాయర్‌హోటల్‌సెంటర్,లక్ష్మీపురం.9885513844

■ గుంటూరు శ్రీనివాసరావుపేట ITC వద్ద వర్క్ చేయుటకు హౌస్‌కీపింగ్ 9 గం॥-10300/- సెక్యూరిటీగార్డ్స్-15000/- 12 గం॥ డ్యూటీ అ: 10th, PF,ESI కలదు. సంప్ర:91000 97782

■ రాయల్ స్పోర్ట్స్ షాపు నందు హెల్పర్స్ (లేడీస్/జంట్స్) కావలెను. జీతం: 12k-15k వరకు. బాలాజీ స్వీట్స్ ప్రక్కన, లాడ్జి సెంటర్ దగ్గర గుంటూరు. 63031 12438

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజిలో ఉద్యోగ ఖాళీలు: క్యాంపస్ ఇన్‌ఛార్జీలు లింగం: పురుషులు మాత్రమే. విద్యార్హతలు: డిగ్రీ, వయస్సు: 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవలెను. నెలకు జీతం : 25000/- వరకు ఇవ్వబడును. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 82487 22246

■ Wanted teachers for KG to 10th, PET, Academic Incharges (All Subjects) For the year 26-27, For a School in Gnt. 80969 70673

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ గుంటూరులో పనిచేయుటకు కావలెను Field Executives (Sal: 15K-20K) + Incentives. Ph: 72079 42933

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 9912011499, 9912011899

గుంటూరు
7075167663
7075167541

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించవలసిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు చేసే వాగ్దానాలతో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేసేముందు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్లుప్తంగా

### కార్మెల్‌మాతకు విశ్వాసుల మొక్కులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై గల కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసులు ఆదివారం తరలివచ్చారు. ఆదోని, మార్కాపురం, ధర్మవరం, నంద్యాల, వెంకటగిరి ప్రాంతాల విశ్వాసులు కొండను ఎక్కి కార్మెల్‌మాతను దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టారు. కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

### పత్రికలు చదవడంతో సమస్యలు తెలుసుకోవచ్చు

తాడేపల్లి రూరల్: పత్రికలు చదవడం ద్వారా స్థానిక సమస్యలతో పాటు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను తెలుసుకోవచ్చని బాలోత్సవాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు వివిధ రకాల పరీక్షల్లో రాణించాలంటే పాజిటివ్ ఆలోచనలు పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేయడం ద్వారా చదువుకునే సబ్జెక్ట్‌లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవాల బాధ్యులు మనోహర్ రెడ్డి, సుబ్బారెడ్డి, గణిత ఉపాధ్యాయులు లెనిన్‌బాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

మంగళగిరి టౌన్: వేసవి దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఆర్టీసీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మంగళగిరి డిపో మేనేజర్ రెంటపాళ్ల పిచ్చయ్య తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలో కాళీమాత ఆలయం, ఎన్ఆర్ఐ బస్టాండ్‌ల వద్ద టెంట్‌లు వేసి ఆదివారం చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపోమేనేజర్ పిచ్చయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీ విజయవాడ కేంద్ర కార్యాలయం ఉత్తర్వుల మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బస్ షెల్టర్లు లేని ప్రాంతాల్లో టెంట్‌లు వేసి మంచినీటిని అందుబాటులో ఉంచామని తెలిపారు. వేసవిలో ప్రయాణం చేసేవారు, వృద్ధులు, చిన్నారులకు తాగునీరు అందుబాటులో ఉండడం ద్వారా వడదెబ్బ నుంచి ఉపశమనం లభిస్తుందని తెలియజేశారు.

### కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది ఎగువ ప్రాంతంలోని నీటిలో మృతదేహం తేలియాడుతోందని స్థానిక మత్స్యకారులు ఆదివారం తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సాయి వెంకటప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి కృష్ణానది ఎగువ ప్రాంతంలో 25వ ఖానా వద్ద నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. మృతుడి వద్ద గుర్తింపు కార్డులు ఏమీ లభించలేదు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ.. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్ల లోపు ఉండవచ్చని, మృతుడు బిస్కెట్ రంగు పూలు కలిగిన చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, ఎవరైనా ఈ మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

### 6న భట్టిప్రోలులో జాబ్‌మేళా

భట్టిప్రోలు: స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన 15కు పైగా ప్రముఖ జాతీయ, బహుళజాతి సంస్థలు ఈ మేళాలో పాల్గొని యువతకు ప్రత్యక్ష నియామక అవకాశాలు కల్పించనున్నాయని తెలిపారు.

# మంగళగిరిలో ప్రశాంతంగా నీట్ పరీక్ష

పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

మంగళగిరి టౌన్: దేశవ్యాప్తంగా మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన నీట్ యూజీ–2026 పరీక్షకు మొట్టమొదటి సారిగా మంగళగిరి నగరంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు మంగళగిరి నగర పరిధిలోని చింతిక్రింది కనకయ్య ఉన్నత పాఠశాలలో 384 మంది విద్యార్థులు, పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో 120 మంది విద్యార్థులకు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాలకు సిటీ కో ఆర్డినేటర్‌గా ఒకరిని, కంబైన్డ్ సెక్యూరిటీ ఆఫీసర్లు ఇద్దరిని, ఛీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లను కేటాయించారు. చింతిక్రింది కనకయ్య ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షకు 384 మంది విద్యార్థులకు 370 మంది పరీక్షకు హాజరు అయ్యారు. 14 మంది గైర్హాజరు అయ్యారని.. వీవర్స్ కాలనీ పాఠశాలలో 120 మంది విద్యార్థులకు గాను 117 మంది పరీక్షకు హాజరు కాగా ముగ్గురు హాజరు కాలేదని సిటీ కో ఆర్డినేటర్ వెల్లడించారు. కాగా విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల వద్ద నిబంధనలను కఠినంగా అమలు చేశారు. అడ్మిట్ కార్డ్, ఫొటో గుర్తింపు కార్డు ఉన్నవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. మరోవైపు నీట్ ప్రవేశ పరీక్ష కోసం ఇచ్చిన ప్రశ్నాపత్రం సులువుగా ఉందని విద్యా నిపుణులతో పాటు పరీక్ష రాసిన విద్యార్థులు ఆనందంతో చెబుతున్నారు.

## మణిపాల్‌లో 'ఫ్రం బ్లడ్ టు హార్ట్'

'ఫ్రం బ్లడ్ టు హార్ట్' కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ప్రాంతంలో గల మణిపాల్ హాస్పిటల్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ కృష్ణా జిల్లా శాఖతో కలసి 'ఫ్రం బ్లడ్ టు హార్ట్' పేరుతో ఇంటిగ్రేటెడ్ పీడియాట్రిక్ కేర్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్యులు, వివిధ రంగాల నిపుణులు, ఆరోగ్య రంగానికి చెందిన ప్రొఫెషనల్స్ పాల్గొని హెమటాలజీ, ఆంకాలజీ, పీడియాట్రిక్ కార్డియాలజీ విభాగాలపై తమ అవగాహనను మరింత పెంచుకున్నారు. బ్లీడింగ్ డిజార్డర్స్, పిల్లల్లో అనీమియా, లుకేమియాలో సీఏఆర్–టీ థెరపీ, హెమటోపోయెటిక్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, హీమోగ్రామ్ ఎలా అర్థం చేసుకోవాలి అనే విషయాలపై సెషన్లు జరిపారు. పిల్లల్లో గుండెకు సంబంధించిన ఎమర్జెన్సీ సిట్యువేషన్స్, హార్ట్ ఫెయిల్యూర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ కె.విక్రమ్ మాట్లాడుతూ.. పిల్లల్లో వచ్చే అనేక సమస్యలు ఒకే విధమైన లక్షణాలతో కనిపిస్తాయని, అందుకే హెమటాలజీ, కార్డియాలజీ వంటి విభాగాలను కలిపి చూసే సమగ్ర దృష్టి అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు డాక్టర్లకు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. హాస్పిటల్ డైరెక్టర్ సీఏ రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ.. 'ఫ్రం బ్లడ్ టు హార్ట్' వంటి కార్యక్రమాలు డాక్టర్లకు ఎప్పటికప్పుడు సరికొత్త నాలెడ్జ్, ప్రాక్టికల్ అవగాహన అందించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మణిపాల్ హాస్పిటల్, వివిధ హాస్పిటళ్ల వైద్యులు జి.కృష్ణారెడ్డి, బోడేపూడి శ్రవణ్‌కుమార్, మండవ భవాని, కె.విక్రమ్, శ్రావణి, వీణ అక్కినేని, ఎస్‌కే మొయినుద్దీన్ చిష్టీ, మిస్బా లతీఫా, పి.రవికుమార్, బి.ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**11 మంది జూదరులపై కేసు**

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

తాడేపల్లి రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తాడేపల్లి ఎస్ఐ తెలిపారు. తాడేపల్లి వీఆర్ రెసిడెన్సీ ఈ బ్లాక్, ఫ్లాట్ నంబరు 212లో పేకాట నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తాడేపల్లి పోలీసులు వీఆర్ రెసిడెన్సీలో ఆదివారం రాత్రి దాడులు చేశారు. ఈ దాడుల్లో 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 11 సెల్‌ఫోన్‌లు, రూ.35,560 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలానే ఏడు రంగుల్లో ఉన్న 124 (రూ.4,290 విలువగల) కాయిన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జూదాన్ని వింతా సాంబిరెడ్డి నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లి పోలీసులు తెలిపారు.

## హిందూ సంస్కృతిని భావితరాలకు అందించాలి

మాట్లాడుతున్న శ్రీనరేంద్ర రామానుజదాసస్వామి

తెనాలి:హిందూ ధర్మ రక్షణకు దేవాలయాలలో నెలవారీ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెనాలిలోని శ్రీశరణాగతి వ్యవస్థాపకులు శ్రీనరేంద్ర రామానుజ దాసస్వామి తెలిపారు. సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి మండల సమావేశం ఆదివారం స్థానిక నాజరుపేటలోని శరణాగతి గోష్ఠి ఆశ్రమంలో జరిగింది. ఈ సందర్భంగా నరేంద్ర రామానుజదాస స్వామి మాట్లాడుతూ మండల కమిటీ సభ్యులు హిందువుల్లో కుల భేదాలు లేకుండా ఐక్యత సాధిస్తూ హిందూ ధర్మ రక్షణకు పాటుబడాలని చెప్పారు. రెండవ శనివారం సత్సంగం, ప్రతి ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. మహిళలు దేవాలయాలలో వారం వారం భజనలు నిర్వహించాలనీ, తద్వారా హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, మండల కన్వీనర్ దీపాల మహేష్, తెనాలి నగర కన్వీనర్ కూనపరెడ్డి బైరాగి, గోలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద పరవశుల్ని చేసిన అన్నమయ్య కీర్తనలు

తెనాలి:పదకవితా పితామహుడు అన్నమాచార్యుల 618వ జయంతిని ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలను గానం చేసి సభికులను ఆనంద పరవశులను చేశారు. పట్టణానికి చెందిన సంకీర్తన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కొత్తపేటలోని అదితి ఫంక్షన్ హాలులో సాయంత్రం ఆరు గంటల్నుంచి తొమ్మిది గంటల వరకు జరిగిన సంగీత ఉత్సవంలో తొలుత వెంకటేశ్వరస్వామికి అర్చన చేశారు. అనంతరం సంగీత విద్వాంసుడు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి గణపతి ప్రార్థన చేయగా, కొండిపి వసుంధర 'అప్పని వరప్రసాది అన్నమయ్య' అనే సంకీర్తన గానంతో సంకీర్తనలను ఆరంభించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ కె.పురుషోత్తమరావు నరసింహస్వామిపై 'పాలనేత్ర ప్రభల విద్యుల్లత కేళివిలాస లక్ష్మీ నరసింహ' అనే సంకీర్తనను ఆలపించారు. ఆలపించగా, వేమవరపు లక్ష్మీనరసింహారావు 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వీడు' కీర్తనను గానం చేశారు. ఇతర గాయకులు పర్చూరు సుబ్బారావు, దివ్యశ్రీ, వెంకటేశ్వరరావు, ఉప్పులూరు శారద, సుచరిత, హిమబిందు, నాన్నపనేని, విజయలక్ష్మిలు పలుకీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై, గౌరవఝుల ఆంజనేయశాస్త్రి, కీ బోర్డుపై నల్లపాటి వెంకటేశ్వరరావు, మృదంగంపై కానూరు వెంకట రామకృష్ణ, తబలాపై పెరవలి వంశీకృష్ణ వాయిద్య సహకారం అందించినారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి హాజరయ్యారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఇంటింటి ప్రచారం చేస్తున్న సభ్యులు

తెనాలి:త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక, గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి మండలంలోని హాఫ్ పేట, సమీప తంగెళ్లమూడి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞానగ్రంథాల ప్రచారాన్ని ఇంటింటా నిర్వహించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తన కాలజ్ఞానంలో తాడిపత్రిలోని ప్రబోధాశ్రమం ఉన్నతమైన జ్ఞానం కలిగినదని చెప్పారు. మహాదేవతలు అందరూ అలాంటి ఆనందాశ్రమంలో ఆనందగురువు వద్దనే ఉన్నారని చెప్పారు. ఆవిధంగా ప్రబోధాశ్రమం నుంచి వెలువడిన త్రైత సిద్ధాంతం గొప్పదని పరోక్షంగా చెప్పారని సేవాసమితి, జ్ఞానవేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు తెలియజేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథమనీ, శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని వివరించారు. సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు రౌతు శ్రీనివాసరావుతోపాటు టీవీ కృష్ణారావు, బి.శివ లింగనాయక్, తదితరులు పాల్గొన్నారు.

### నూతన దంపతులకు ఆశీర్వచనాలు

తాడికొండ: తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు గొట్టం నర్సిరెడ్డి పద్మావతిల కుమారుడు గొట్టం నాగతేజరెడ్డి–లక్ష్మీ నూతన దంపతులను వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారుడు మోహిత్ రెడ్డిలు ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, చుండు శ్రీనివాసరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ఎండ తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

తాడికొండ: ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుళ్లూరు తహసీల్దార్ హరిబాబు సూచించారు. ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని.. విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించిందని.. వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో బయటకు వెళ్లడం తగ్గించాలని ఆయన కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ లేదా రూమాలు ధరించాలని.. గొడుగులు ఉపయోగించాలని వివరించారు. ఎక్కువగా తాగునీరు, మజ్జిగ, గ్లూకోజు, నిమ్మరం, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ తాగుతూ జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

### లాడ్జి మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: లాడ్జి మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం తెనాలిలో జరిగింది. తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంకు చెందిన 42 ఏళ్ల భక్తవత్సలం అలియాస్ భాస్కర్ కుటుంబాన్ని వదిలేసి ఒంటరిగా ఉంటున్నాడు. తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో మూడు నెలలుగా ఉంటూ క్యాటరింగ్ పనులకు వెళుతున్నాడు. ఆదివారం ఉదయం లాడ్జి వద్ద రక్తపు గాయాలతో మృతి చెంది పడి ఉన్నాడు. తెల్లవారుజామున మద్యం మత్తులో మెట్లపై నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని తోటి కార్మికులు అనుమానిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

### పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

తెనాలిఅర్బన్:మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రూ.30 లక్షల స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీలోగా తమను సంప్రదించాలన్నారు. వీటిని ఫీజు రాయితీ రూపంలో అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 7331159919, 8125412442 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## యథేచ్ఛగా అనధికార నిర్మాణం

తెనాలి అర్బన్ :చంద్రబాబునాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో యథేచ్ఛగా అనధికారిక కట్టడాలు వెలుస్తున్నాయి. బ్లాక్ నెంబర్ 7 వద్ద ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా షాపు నిర్మించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనిపై మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణిని వివరణ కోరగా ఇది తమ దృష్టికి వచ్చిందని, త్వరలో కూల్చి వేస్తామని చెప్పారు.

# గిట్టుబాటు ధరలు లేక రైతుల ఆందోళన

యార్లగడ్డ సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నారని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో ఆదివారం మేడేను పురస్కరించుకుని జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణకు 8 గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక ఐక్య పోరాటంతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మేడే చరిత్ర కార్మికుల హక్కుల సాధనలో విశేష ప్రాధాన్యత కలిగి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ వ్యయాలు పెరగడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని వివరించారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ ఇవ్వాలని, రుణ భారం తగ్గించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తొలుత గ్రామంలోని సీపీఐ కార్యాలయం వద్ద యార్లగడ్డ సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి మేడే స్ఫూర్తిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జి.సాంబశివరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ కార్మికుల హామీని అమలు చేయాలి

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా కార్మికుల సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు దీక్షలు విరమించేది లేదని స్పష్టం చేశారు. దీక్షల్లో సాంబశివరావు, సుబ్బారావు, నవనీతమ్మ, అన్నమ్మ, నాగేశ్వరరావు కూర్చొన్నారు. కార్యక్రమంలో వై.సాంబశివరావు, మాణిక్యరావు, సుభాని, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదభరితంగా హోర్డింగ్‌లు!

**ఇబ్బంది పడుతున్న విద్యుత్ శాఖ అధికారులు**

విద్యుత్ తీగలపై పడుతున్న హోర్డింగ్‌కు ఏర్పాటు చేసిన చిరిగిన ఫ్లెక్సీలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు ప్రమాదభరితంగా మారి విద్యుత్‌శాఖ అధికారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి కుంచనపల్లి సర్వీస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌కు అమర్చిన ఫ్లెక్సీ గాలికి చిరిగి విద్యుత్ తీగలపై పడింది. షార్ట్ సర్క్యూట్ అయ్యి ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుంచనపల్లి సబ్‌స్టేషన్ విద్యుత్ అధికారులు ఆ లోపాన్ని గుర్తించి వెంటనే ఫ్లెక్సీని తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. మరలా తిరిగి హోర్డింగ్‌కు రెండో వైపు ఉన్న ఫ్లెక్సీ చిరగడంతో మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. గంట వ్యవధిలో మరోసారి విద్యుత్‌ను పునరుద్ధరించారు. రానున్న ఈదురు గాలులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ స్తంభాల వద్ద ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరుకుంటున్నారు.

## వాణిజ్య సిలిండర్ ధర తగ్గించాలి

నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

ఫిరంగిపురం: కేంద్ర ప్రభుత్వం పెంచిన వాణిజ్య సిలిండర్ల ధరను తగ్గించాలని సీపీఎం నాయకులు అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పెంచిన సిలిండర్ల ధరలకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ.. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలతో చిన్న, తోపుడు బండ్లు, చిరువ్యాపారులు, టీస్టాల్స్ మూతబడిపోయాయని చెప్పారు. సిలిండర్లు లేక హోటళ్లు, టిఫిన్ సెంటర్ల వ్యాపారాలు సాగని పరిస్థితి నెలకొందన్నారు. ఉన్న హోటళ్లలో వాటి రేట్లు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వివరించారు. దీంతో అన్ని రకాల రేట్లు పెరిగిపోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన వాణిజ్య సిలిండర్ల ధరలు తగ్గించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్‌రావు, అమీస్, కె.సాయి, మీరావలి, రాధా, సాంబయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దుగ్గిరాల: దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై ఒక్కసారిగా రూ.993 పెంచడం దారుణమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్ జెండా చెట్టు సెంటర్ వద్ద పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పెంచిన ధరలతో సిలిండర్ ధర రూ.3 వేల పైబడి చేరుకుందని అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అలానే గ్యాస్ వినియోగదారులు 25 రోజులకు ఒకసారి గ్యాస్‌ను బుక్ చేసుకునే సౌకర్యం కల్పించేలా కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్ జిలానీ, షేక్ మస్తాన్ వలీ, కుర్రా శ్రీనివాసరావు, బులుసుపాటి యేల్లేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



చెరుకుపల్లి: చెరుకుపల్లి వీరరాఘవపేటలో వేంచేసియున్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయ 30వ వార్షికోత్సవాన్ని గత మూడు రోజులుగా వైభవంగ నిర్వహిస్తున్నారు. స్వామివారికి శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి చెరుకుపల్లికి చెందిన అన్నం వెంకటేశ్వరరావు విజయలక్ష్మీ దంపతులతో బాబాకు లక్ష మల్లెల పూజ చేయించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో కాంతులీనింది. బంగారు కిరీటంతో ప్రత్యేకంగా శ్రీ షిరిడి సాయిబాబాను అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 3,000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మల్లెల కష్ణమూర్తి, పొన్నపల్లి రామకృష్ణ, శ్రీ షిరిడి సాయి సేవా సమితి అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు, మారిశెట్టి జ్ఞాన మణికుమార్, అన్నం మధన్‌మోహన్‌రావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## భారత మహిళల 'ఎ' జట్టులో షబ్నమ్

ముంబై: ఇంగ్లండ్ మహిళల 'ఎ' జట్టుతో ఈ ఏడాది జూన్–జూలైలలో జరిగే వన్డే, టి20 సిరీస్‌లలో పాల్గొనే భారత మహిళల 'ఎ' జట్లను ప్రకటించారు. భారత వన్డే, టి20 'ఎ' జట్లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మీడియం పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్‌కు చోటు లభించింది. భారత వన్డే 'ఎ' జట్టుకు హర్లీన్ డియోల్... భారత టి20 'ఎ' జట్టుకు అనుష్క శర్మ నాయకత్వం వహిస్తారు. ఇంగ్లండ్ 'ఎ' జట్టుతో నార్తంప్టన్‌లో జూన్ 20న, 23న తొలి రెండు టి20లు... చెమ్స్‌ఫోర్డ్‌లో జూన్25న మూడో టి20 జరుగుతుంది. అనంతరం జూన్ 28న హోవ్‌లో తొలి వన్డేను... జూలై 1న, జూలై 4న టాన్‌టన్‌లో మిగతా రెండు వన్డేలను నిర్వహిస్తారు.

**భారత 'ఎ' టి20 జట్టు:** అనుష్క శర్మ (కెప్టెన్), వృందా, కమలిని, ఉమా ఛెత్రి, వైష్ణవి శర్మ, ప్రేమ రావత్, పూర్వజ వర్లేకర్, జింతిమణి కలిత, సైమా ఠాకూర్, సిమ్రన్, శ్వేత సెహ్రావత్, దియా యాదవ్, మిన్ను మణి, షబ్నమ్ షకీల్, తనూజ కన్వర్.

**భారత 'ఎ' వన్డే జట్టు:** హర్లీన్ డియోల్ (కెప్టెన్), ప్రతిక రావల్, ప్రియా పూనియా, తనీషా సింగ్, కమలిని, ఉమా ఛెత్రి, తేజల్ హసబ్నిస్, నికీ ప్రసాద్, ప్రేమ రావత్, తనూజ కన్వర్, వైష్ణవి శర్మ, షబ్నమ్ షకీల్, సయాలీ సత్‌ఘరే, జింతిమణి కలిత, సైమా ఠాకూర్.

వరుణ్ చక్రవర్తి

హెడ్

# సన్ స్ట్రోక్

సొంత మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అనూహ్య ఓటమి

7 వికెట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఘన విజయం

రాణించిన వరుణ్, నరైన్, రఘువంశీ

**తొలి 8.5 ఓవర్లలోనే వికెట్ నష్టానికి 105 పరుగులు... హెడ్ దూకుడుగా ఆడుతుండగా, క్లాసెన్ రావాల్సి ఉంది. ఈ స్థితిలో ఉప్పల్ స్టేడియంలో మరోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పరుగుల ఉప్పెన ఖాయమనిపించింది. కానీ ఒక్కసారిగా కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) బౌలర్లు చెలరేగడంతో రైజర్స్ బ్యాటింగ్ కుప్పకూలింది. తర్వాతి 61 బంతుల్లో కేవలం 60 పరుగులు మాత్రమే చేసిన జట్టు మిగిలిన 9 వికెట్లు కోల్పోయింది. సీజన్‌లో తొలిసారి ఆలౌట్ కావడంతో పాటు పూర్తి ఓవర్ల కోటా కూడా ఆడలేక పోయింది. కోల్‌కతా స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ సన్‌రైజర్స్ జట్టు పతనంలో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత స్వల్ప లక్ష్యమే అయినా కేకేఆర్ దూకుడుగా ఆడలేకపోగా, చివరకు 18.2 ఓవర్లలో గెలుపు తీరం చేరి ఊరట చెందింది. వరుసగా ఐదు విజయాల తర్వాత హైదరాబాద్‌కు ఓటమి ఎదురవగా, కేకేఆర్‌కు ఇది హ్యాట్రిక్ విజయం కావడం విశేషం.**

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ 19వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు బ్రేక్ పడింది. సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో బలహీన కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో జట్టు అనూహ్యంగా ఓటమిపాలైంది.

ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో కేకేఆర్ 7 వికెట్ల తేడాతో రైజర్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ 19 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది. ట్రవిస్ హెడ్ (28 బంతుల్లో 61; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. ఇషాన్ కిషన్ (29 బంతుల్లో 42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తికి 3 వికెట్లు దక్కాయి. నరైన్, కార్తీక్ త్యాగి 2 వికెట్ల చొప్పున తీశారు. అనంతరం కోల్‌కతా 18.2 ఓవర్లలో 3 వికెట్లకు 169 పరుగులు చేసి విజయాన్నందుకుంది. అంగ్‌క్రిష్ రఘువంశీ (47 బంతుల్లో 59; 5 ఫోర్లు, 2 సిక్స్) హాఫ్ సెంచరీ చేశాడు. కెప్టెన్ అజింక్య రహానే (36 బంతుల్లో 43; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అనారోగ్యం కారణంగా సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు.

**హెడ్ మినహా...**

నరైన్ వేసిన తొలి ఓవర్లో 9 పరుగులే రాగా, అతని తర్వాతి ఓవర్లో హెడ్ వరుసగా 6, 4 కొట్టాడు. అంతకుముందు వైభవ్ ఓవర్లో హెడ్ 4 ఫోర్లతో చెలరేగాడు. అయితే త్యాగి తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ (10 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్) వెనుదిరగడం జట్టును దెబ్బ తీసింది. గ్రీన్ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టిన హెడ్... వరుణ్ ఓవర్లోనూ 4, 6 బాది 22 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పవర్‌ప్లేలో జట్టు 71 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ కూడా త్యాగి ఓవర్లో వరుసగా 6, 4తో మొదలు పెట్టినా... ఆ తర్వాత దూకుడు తగ్గిపోయింది. వరుణ్ ఓవర్లో భారీ సిక్స్ బాదిన హెడ్... తర్వాతి బంతికే అవుటయ్యాడు. ఇక్కడి నుంచి జట్టు పతనం వేగంగా సాగింది. గ్రీన్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన క్లాసెన్ తర్వాతి బంతికి పావెల్ అద్భుత క్యాచ్‌తో పెవిలియన్‌కు చేరాడు. ఈ మ్యాచ్‌తోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన స్మరణ్ (4), అనికేత్ వర్మ (6), సలీల్ అరోరా (2) ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. మరో ఎండ్‌లో నిలిచిన ఇషాన్ కిషన్ తప్పనిసరి స్థితిలో భారీ షాట్లకు ప్రయత్నించి 16వ ఓవర్ చివరి బంతికి అవుటయ్యాడు. దాంతో డెత్ ఓవర్లలో రైజర్స్ పూర్తిగా చేతులెత్తేసింది. తర్వాతి 3 ఓవర్లలో 17 పరుగులు మాత్రమే చేసి చివరి మూడు వికెట్లు కోల్పోయింది.



రఘువంశీ

**ఒకే ఓవర్లో 27 పరుగులు...**

ఛేదనలో కోల్‌కతాకు ఫిన్ అలెన్ (13 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ఆరంభాన్నిచ్చాడు. తొలి 3 ఓవర్లలో కేకేఆర్ 22 పరుగులే చేసినా... కమిన్స్ వేసిన నాలుగో ఓవర్లో అలెన్ చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లు బాదిన అతను 22 పరుగులు రాబట్టాడు. అయితే చివరి బంతికి అతడిని అవుట్ చేసి కమిన్స్ ఊపిరి పీల్చుకున్నాడు. వైడ్ బౌండరీ ఐదు పరుగులతో కలిపి కమిన్స్ ఈ ఓవర్లో ఏకంగా 27 పరుగులు ఇచ్చాడు. ఆ తర్వాత రహానే, రఘువంశీ కలిపి ప్రశాంతంగా ఇన్నింగ్స్‌ను నడిపించారు. మలింగ ఓవర్లో రఘువంశీ 2 సిక్స్‌లు కొట్టడంతో పవర్‌ప్లేలో కేకేఆర్ కూడా సరిగ్గా 71 పరుగులే చేసింది. ఇద్దరూ బ్యాటర్లూ ఎలాంటి సాహసాలకు పోకుండా జాగ్రత్తగా ఆడుతూ పోయారు. 39 బంతుల్లో రఘువంశీ అర్ధ సెంచరీ పూర్తయింది. రఘువంశీతో రెండో వికెట్‌కు 66 బంతుల్లో 84 పరుగులు జత చేసిన తర్వాత ఎట్టకేలకు రహానేను అవుట్ చేయడంలో రైజర్స్ సఫలమైంది. కొద్దిసేపటికే రఘువంశీ కూడా వెనుదిరిగాడు. అయితే రింకూ సింగ్ (11 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ షాట్లతో మరో 10 బంతులు మిగిలి ఉండగా మ్యాచ్‌ను ముగించాడు.

### స్కోరు వివరాలు

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్:** అభిషేక్ (సి) గ్రీన్ (బి) త్యాగి 15; హెడ్ (సి) గ్రీన్ (బి) వరుణ్ 61; ఇషాన్ కిషన్ (సి) రాయ్ (బి) నరైన్ 42; క్లాసెన్ (సి) పావెల్ (బి) గ్రీన్ 11; స్మరణ్ (సి) రహానే (బి) వరుణ్ 4; అనికేత్ (సి) రహానే (బి) వరుణ్ 6; సలీల్ (బి) నరైన్ 2; కమిన్స్ (సి అండ్ బి) రాయ్ 10; శివాంగ్ (సి) రఘువంశీ (బి) వైభవ్ 1; హర్షల్ (సి) వైభవ్ (బి) త్యాగి 6; మలింగ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (19 ఓవర్లలో ఆలౌట్) 165. వికెట్ల పతనం:** 1–44, 2–105, 3–117, 4–122, 5–135, 6–139, 7–148, 8–156, 9–156, 10–165. **బౌలింగ్:** నరైన్ 4–0–31–2, వైభవ్ 3–0–25–1, కార్తీక్ త్యాగి 4–0–30–2, గ్రీన్ 3–0–34–1, వరుణ్ చక్రవర్తి 4–0–36–3, అనుకూల్ రాయ్ 1–0–8–1.

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** రహానే (సి) స్మరణ్ (బి) సాకిబ్ 43; అలెన్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 29; రఘువంశీ (సి) మలింగ (బి) శివాంగ్ 59; రింకూ (నాటౌట్) 22; గ్రీన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (18.2 ఓవర్లలో 3 వికెట్లకు) 169. వికెట్ల పతనం:** 1–49, 2–133, 3–151. **బౌలింగ్:** అభిషేక్ 2–0–14–0, కమిన్స్ 4–0–47–1, ఇషాన్ మలింగ 3.2–0–42–0, శివాంగ్ 4–0–31–1, హర్షల్ 2–0–17–0, సాకిబ్ 3–0–17–1.

**200** ఐపీఎల్‌లో 200 వికెట్లు పూర్తి చేసుకున్న మూడో బౌలర్‌గా, తొలి విదేశీ బౌలర్‌గా సునీల్ నరైన్ గుర్తింపు పొందాడు. భువనేశ్వర్ కుమార్, చహల్ తర్వాత అతను ఈ మైలురాయిని దాటాడు. ఒకే టీమ్ తరఫున 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా అతను నిలవడం విశేషం.

### ఐపీఎల్‌లో నేడు

ముంబై × లక్నో ; వేదిక: ముంబై

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

### ఐపీఎల్-2026 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| పంజాబ్ | 9 | 6 | 2 | 1 | 13 | 0.855 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 0 | 12 | 1.420 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 0 | 12 | 0.644 |
| రాజస్తాన్ | 10 | 6 | 4 | 0 | 12 | 0.510 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 0 | 12 | -0.147 |
| చెన్నై | 9 | 4 | 5 | 0 | 8 | 0.005 |
| ఢిల్లీ | 9 | 4 | 5 | 0 | 8 | -0.895 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 1 | 7 | -0.539 |
| ముంబై | 9 | 2 | 7 | 0 | 4 | -0.803 |
| లక్నో | 8 | 2 | 6 | 0 | 4 | -1.106 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, ర.రే-నెట్ రన్‌రేట్

### బౌండరీ మీటర్

4 1436 833 6

## మిట్టల్ చేతికి రాజస్తాన్ రాయల్స్

- రూ. 15,660 కోట్లకు కొనుగోలు
- లక్ష్మీ మిట్టల్‌కు 75 శాతం వాటా
- పూనావాలాకు 18 శాతం వాటా

న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మీ మిట్టల్ ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్తాన్ రాయల్స్‌ను కొనుగోలు చేశారు. లక్ష్మీ మిట్టల్, ఆయన కుమారుడు ఆదిత్య మిట్టల్, అదర్ పూనావాలాతో కలిసి 165 కోట్ల డాలర్ల (రూ. 15,660 కోట్లు) బిడ్‌తో రాయల్స్‌లో మెజారిటీ వాటాను సొంతం చేసుకున్నారు. ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీతో పాటు... వేర్వేరు లీగ్‌ల్లో పార్ల్ రాయల్స్, బార్బడోస్ రాయల్స్ జట్లు కూడా మిట్టల్ సొంతం అయ్యాయి. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్, బీసీసీఐ పాలక మండలి ఆమోదం అనంతరం ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ ప్రక్రియ ముగియడానికి మరో మూడు నెలలు పట్టొచ్చని సమాచారం. 'మనోజ్ బదాలే కన్సార్టియం నుంచి అదర్ పూనావాలా భాగస్వామ్యంతో రాజస్తాన్ రాయల్స్‌ను కొనుగోలు చేసుకోవడానికి ఒప్పందం కుదిరింది' అని మిట్టల్ కుటుంబం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ వివరాల ప్రకారం రాయల్స్ జట్టులో మిట్టల్ కుటుంబం 75 శాతం వాటా కలిగి ఉంటుంది. పూనావాలా 18 శాతం వాటా కలిగి ఉంటారు. మిగిలిన 7 శాతం వాటాలో పాత యజమాని మనోజ్ బదాలేతో పాటు ఇతర పెట్టుబడిదారులు ఉంటారు. దీంతో రాయల్స్ బోర్డులో లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్, వనిషా మిట్టల్–భాటియా, అదర్ పూనావాలా, మనోజ్ బదాలే సభ్యులుగా ఉంటారు. రాజస్తాన్ సాదుల్‌పూర్‌లో జన్మించిన లక్ష్మీ మిట్టల్ మాట్లాడుతూ... 'నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. మా కుటుంబం రాజస్తాన్‌కు చెందింది. అందుకే వాటా కొనుగోలు చేసేందుకు రాజస్తాన్ రాయల్స్ కంటే మంచి జట్టు లేదనిపించింది' అని అన్నారు. రెండు నెలల క్రితం భారత సంతతికి చెందిన అమెరికా వ్యాపారవేత్త కాల్ సోమాని కన్సార్టియం రాజస్తాన్ రాయల్స్‌ను కొనుగోలు చేయనుందని వార్తలు వచ్చాయి. అయితే పలు కారణాల వల్ల ఆ ఒప్పందం కార్యరూపం దాల్చలేదు.

## టైటాన్స్ 'హ్యాట్రిక్'

వరుసగా మూడో మ్యాచ్ నెగ్గిన గుజరాత్

- పంజాబ్‌కు వరుసగా రెండో ఓటమి
- మెరిసిన హోల్డర్, సుదర్శన్, సుందర్

హోల్డర్

అహ్మదాబాద్: ఐపీఎల్ 19వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. ఆదివారం జరిగిన పోరులో మాజీ చాంపియన్ గుజరాత్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. సీజన్ ఆరంభంలో వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో పరాజయం ఎరగకుండా సాగిన పంజాబ్‌కిది వరుసగా రెండో ఓటమి కావడం గమనార్హం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. టాపార్డర్ విఫలం కాగా... సూర్యాంశ్ (29 బంతుల్లో 57; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరవగా... స్టొయినిస్ (31 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) విలువైన పరుగులు చేశాడు. 47 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో ఈ జంట ఆరో వికెట్‌కు 44 బంతుల్లో 79 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హోల్డర్ 24 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... సిరాజ్, రబాడ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో గుజరాత్ టైటాన్స్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (41 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో ఆకట్టుకోగా... వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) చివరి వరకు నిలిచి జట్టును గెలిపించాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్, వైశాక్ చెరో 2 వికెట్లు తీశారు.

**సిరాజ్ తొలి ఓవర్‌లోనే 2 వికెట్లు...**

ఈ సీజన్‌లో ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తున్న హైదరాబాదీ పేసర్ సిరాజ్... తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లతో పంజాబ్ దూకుడుకు అడ్డుకట్ట వేశాడు. ఇన్నింగ్స్ తొలి బంతికి బతికిపోయిన ప్రియాన్ష్ ఆర్య (2) రెండో బంతికి అవుట్ కాగా... తదుపరి బంతికి కూపర్ (0) పెవిలియన్ బాట పట్టాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (15) ఎక్కువసేపు నిలవలేకపోగా... నేహల్ వధేరా (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (19) కూడా అవుటవ్వడంతో పంజాబ్ జట్టు 47 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో స్టొయినిస్‌తో కలిసి సూర్యాంశ్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. మానవ్ సుతార్ వేసిన ఇన్నింగ్స్ 14వ ఓవర్‌లో సూర్యాంశ్ వరుసగా 6, 6, 4, 4, 6 కొట్టడంతో 27 పరుగులు వచ్చాయి. ఇక కోలుకున్నట్లే అనుకుంటున్న దశలో మరోసారి గుజరాత్ బౌలర్లు విజృంభించడంతో పంజాబ్ జట్టు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఆశించిన స్కోరు సాధించలేకపోయింది. స్టొయినిస్, బార్ట్‌లెట్ (0)ను వరుస బంతుల్లో అవుట్ చేసిన హోల్డర్ పంజాబ్‌ను కట్టడి చేశాడు.

**సుదర్శన్ నిలకడ**

లక్ష్యం మరీ పెద్దది కాకపోయినా... కాస్త కఠినంగా ఉన్న పిచ్‌పై గుజరాత్ ఆచితూచి ఆడింది. కెప్టెన్ గిల్ (5) విఫలం కాగా... బట్లర్ (22 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. ఈ మ్యాచ్ ద్వారానే ఐపీఎల్ అరంగేట్రం చేసిన నిశాంత్ (15) ఎక్కువసేపు నిలవలేకపోగా... సాయి సుదర్శన్ సాధికారికంగా ఆడటంతో పెద్దగా ఇబ్బంది లేకపోయింది. గుజరాత్ విజయానికి చివరి 18 బంతుల్లో 24 పరుగులు అవసరం కాగా... 18వ ఓవర్‌లో బార్ట్‌లెట్ 7 పరుగులే ఇచ్చాడు. దీంతో సమీకరణం 12 బంతుల్లో 17 పరుగులకు మారగా... అర్ష్‌దీప్ సింగ్ 19వ ఓవర్‌లో 6 పరుగులే ఇచ్చి హోల్డర్ (5)ను అవుట్ చేశాడు. చివరి ఓవర్‌లో 11 పరుగులు అవసరం కాగా... అర్షద్ ఖాన్ (8 నాటౌట్; 1 ఫోర్) అండతో సుందర్ మ్యాచ్‌ను ముగించాడు.

శ్రేయస్ అయ్యర్ బౌల్డ్

### స్కోరు వివరాలు

**పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రియాన్ష్ (సి) నిశాంత్ (బి) సిరాజ్ 2; ప్రభ్‌సిమ్రన్ (సి) సుతార్ (బి) రబాడ 15; కూపర్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 0; శ్రేయస్ (బి) హోల్డర్ 19; నేహల్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 0; సూర్యాంశ్ (సి) బట్లర్ (బి) రబాడ 57; స్టొయినిస్ (సి) సుందర్ (బి) హోల్డర్ 40; యాన్సెన్ (సి) గిల్ (బి) రషీద్ 20; బార్ట్‌లెట్ (బి) హోల్డర్ 0; వైశాక్ (నాటౌట్) 1; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 163. వికెట్ల పతనం:** 1–2, 2–2, 3–35, 4–36, 5–47, 6–126, 7–141, 8–141, 9–162. **బౌలింగ్:** సిరాజ్ 4–0–28–2; రబాడ 4–1–22–2; హోల్డర్ 4–0–24–4; అర్షద్ 3–0–29–0; రషీద్ 4–0–32–1; మానవ్ సుతార్ 1–0–27–0. **గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్:** సుదర్శన్ (సి) బార్ట్‌లెట్ (బి) వైశాక్ 57; గిల్ (సి) కూపర్ (బి) అర్ష్‌దీప్ 5; బట్లర్ (సి) శ్రేయస్ (బి) వైశాక్ 26; నిశాంత్ (సి) వైశాక్ (బి) స్టొయినిస్ 15; సుందర్ (నాటౌట్) 40; తెవాటియా (సి) బట్లర్ (బి) యాన్సెన్ 2; హోల్డర్ (సి) కూపర్ (బి) అర్ష్‌దీప్ 5; అర్షద్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19.5 ఓవర్లలో 6 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1–16, 2–69, 3–94, 4–124, 5–140, 6–152. **బౌలింగ్:** బార్ట్‌లెట్ 4–0–38–0; అర్ష్‌దీప్ 4–0–24–2; యాన్సెన్ 4–0–33–1; వైశాక్ 4–0–30–2; స్టొయినిస్ 2.5–0–26–1; చాహల్ 1–0–13–0.

## సినెర్ రికార్డు

వరుసగా ఐదు మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ గెలిచిన తొలి ప్లేయర్‌గా ఘనత

మాడ్రిడ్: పురుషుల టెన్నిస్‌లో ప్రపంచ నంబర్ వన్ యానిక్ సినెర్ అద్భుతం చేశాడు. గతంలో ఎవరికీ సాధ్యంకాని ఘనతను సాధించాడు. గ్రాండ్‌స్లామ్ తర్వాత అగ్రశ్రేణి టోర్నీలుగా పరిగణించే 'మాస్టర్స్' సిరీస్‌లో సినెర్ వరుసగా ఐదో టైటిల్ గెలిచాడు. ఆదివారం ముగిసిన మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో సినెర్ విజేతగా నిలిచాడు. ప్రపంచ 3వ ర్యాంకర్ జ్వెరెవ్ (జర్మనీ)తో జరిగిన ఫైనల్లో సినెర్ 6–1, 6–2తో అలవోకగా విజయం సాధించాడు. తద్వారా 36 ఏళ్ల చరిత్ర కలిగిన మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లో వరుసగా ఐదు టైటిల్స్ గెలిచిన తొలి ప్లేయర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో మూడుసార్లు జొకోవిచ్ (సెర్బియా), రాఫెల్ నాదల్ (స్పెయిన్) ఒకసారి వరుసగా నాలుగు మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ సాధించారు. గత ఏడాది పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన సినెర్... ఈ ఏడాది మోంటెకార్లో, మయామి, ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లో విజేతగా నిలిచాడు. చాంపియన్ సినెర్‌కు 10,07,165 యూరోల (రూ. 11 కోట్ల 21 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ గెలుపు

కల్యాణి (పశ్చిమ బెంగాల్): ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్ స్టేజ్–2లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) మరో విజయం అందుకుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న డైమండ్ హార్బర్ ఎఫ్‌సీ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 2–1 గోల్స్ తేడాతో గెలిచింది. శ్రీనిధి డెక్కన్ జట్టు తరఫున బ్రాండన్ వాన్‌లాల్‌రెమ్‌డికా (43వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (45+4వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. డైమండ్ హార్బర్ జట్టుకు హుగో డియాజ్ (62వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఈ గెలుపుతో శ్రీనిధి డెక్కన్ జట్టు 21 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈనెల 10న హైదరాబాద్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి డెక్కన్ జట్టు తలపడుతుంది.

## చైనాకు కొరియా షాక్

మూడోసారి ఉబెర్ కప్ సొంతం

హార్సెన్స్ (డెన్మార్క్): నాలుగేళ్ల విరామం తర్వాత ప్రతిష్టాత్మక ఉబెర్ కప్ మహిళల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో దక్షిణ కొరియా జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియా 3–1తో 16 సార్లు చాంపియన్ చైనా జట్టును బోల్తా కొట్టించి మూడోసారి ఉబెర్ కప్‌ను సొంతం చేసుకుంది. 2010, 2022లలో కూడా చైనా జట్టునే ఓడించి దక్షిణ కొరియా జట్టు ఉబెర్ కప్‌ను దక్కించుకుంది. పదోసారి చైనా జట్టుతో టైటిల్ పోరులో తలపడ్డ కొరియా ఈసారి పూర్తి ఆధిపత్యం కనబరిచింది. తొలి మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్, ఒలింపిక్ చాంపియన్ ఆన్ సె యంగ్ 21–10, 21–13తో ప్రపంచ 2వ ర్యాంకర్ వాంగ్ జి యిపై 20వ సారి గెలిచి కొరియాకు శుభారంభం అందించింది. రెండో మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ జోడీ లియు షెంగ్ షు–టాన్ నింగ్ 21–15, 21–12తో జియోంగ్ నా యున్–లీ సో హీ జంటపై గెలిచి స్కోరును 1–1తో సమం చేసింది. మూడో మ్యాచ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ కిమ్ గా యున్ 21–19, 21–15తో ప్రపంచ 4వ ర్యాంకర్ చెన్ యు ఫెను ఓడించి కొరియాకు 2–1తో ఆధిక్యం అందించింది. నాలుగో మ్యాచ్‌లో ప్రపంచ 170వ ర్యాంక్ జోడీ 16–21, 21–10, 21–13తో ప్రపంచ 4వ ర్యాంక్ ద్వయం జియా యి ఫాన్–జాంగ్ షు జియాన్‌ను కంగుతినిపించి కొరియాకు 3–1తో విజయాన్ని అందించింది. సెమీఫైనల్లో ఓడిన ఇండోనేసియా, జపాన్ జట్లకు కాంస్య పతకాలు లభించాయి.

## రన్నరప్ మానస్

న్యూఢిల్లీ: కెరీర్‌లో తొలి ఏటీపీ చాలెంజర్ సింగిల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ యువతార మానస్ ధామ్నెకు నిరాశ ఎదురైంది. కజకిస్తాన్‌లో ఆదివారం జరిగిన షిమ్‌కెంట్ చాలెంజర్–50 టోర్నీలో 18 ఏళ్ల మానస్ రన్నరప్‌గా నిలిచాడు. బువెసార్ గడామౌరి (బెల్జియం)తో జరిగిన ఫైనల్లో మానస్ 6–7 (8/10), 4–6తో ఓడిపోయాడు. ఒక గంట 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మానస్ ఒక ఏస్ సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తొలి సర్వీస్‌లో 25 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 11 పాయింట్లు స్కోరు చేశాడు. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 17 విన్నర్స్ కొట్టి, 31 అనవసర తప్పిదాలు చేశాడు. ప్రపంచ 444వ ర్యాంకర్ మానస్‌కు 5,500 డాలర్ల (రూ. 5 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 25 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ప్రదర్శనతో మానస్ 62 స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ 382వ ర్యాంక్‌కు చేరుకుంటాడు.



● మంచి మాట

# ముక్తి మార్గం... ఒక ఆధ్యాత్మిక ప్రయాణం

సాధారణంగా మనిషి తనను తాను శరీరం, పేరు, కులంతో గుర్తుంచుకుంటాడు. దీనివల్ల రాగద్వేషాలు, భయం, దుఃఖం కలుగుతాయి.

ముక్తి అనేది కేవలం మరణానంతరం లభించేది కాదు, జీవించి ఉండగానే పొందే స్థితి (జీవన్ముక్తి). వైరాగ్యం- లౌకిక విషయాల పట్ల మోహం తగ్గించుకోవడం. ఎల్లప్పుడూ సత్య మార్గంలో నడవడం. ఇతరులకు హాని చేయకుండా జీవించడం. సరైన దిశానిర్దేశం చేసే గురువును ఆశ్రయించడం. ముక్తి అంటే ఎక్కడికో వెళ్లడం కాదు, మన లోని దైవత్వాన్ని మనం గుర్తించడం. మన ప్రవృత్తికి ఏ మార్గం సరిపోతుందో దానిని ఎంచుకుని సాగడమే ముక్తికి అసలైన బాట.

ముక్తి లేదా మోక్షం అంటే పునర్జన్మ లేని స్థితిని పొందడం. దేహం ముసలిదవుతుంది, మనస్సు మారుతుంటుంది, కానీ వీటన్నింటినీ గమనిస్తున్న 'సాక్షి' ఒకరు ఉన్నారు. ఆ సాక్షి లేదా ఆ చైతన్యమే అసలైన దైవత్వం. దైవత్వానికి., మనకు మధ్య ఉన్న అతిపెద్ద అడ్డుగోడ 'అహం' 'నేను చేస్తున్నాను', 'ఇది నాది' అనే భావన తగ్గినప్పుడు, మనలోని అనంతమైన దైవశక్తి వెలుగులోకి వస్తుంది.

సముద్రంలోని అల నేను సముద్రాన్ని కాదని భావిస్తే అది అహంకారం, తాను సముద్రంలో భాగమే అని గుర్తిస్తే అది జ్ఞానం. గంగా, యమునా వంటి నదులు వేర్వేరుగా ప్రవహించినా, సముద్రంలో కలిసిన తర్వాత అవి సముద్రమే అయిపోతాయి. అలాగే జీవులన్నీ వేర్వేరుగా కనిపించినా, వాటి మూలం ఆ పరమాత్మే. మట్టితో చేసిన కుండ, ప్రమిద, బొమ్మలు.. పేర్లు వేరైనా వాటన్నింటిలో ఉన్న అసలు వస్తువు మట్టే. అలాగే జగత్తులోని రూపాలు వేరైనా, అంతటా ఉన్నది పరబ్రహ్మమే. 'నేను ఎవరు?' అనే ప్రశ్నతో మొదలై, దేహం అనిత్యమని, ఆత్మ శాశ్వతమని తెలుసుకోవడం. పరమాత్మపై పరిపూర్ణ మైన ప్రేమను, శరణాగతిని కలిగి ఉండటమే భక్తి మార్గం. కలియుగంలో ఇది అత్యంత సులభమైన మార్గంగా చెప్పబడింది.

'దైవత్వాన్ని గుర్తించడం' అనే మాట వినడానికి సరళంగా అనిపించినా, ఇది ఒక లోతైన ఆధ్యాత్మిక ప్రయాణం. దీనిని సాకారం చేసుకోవడానికి మన గ్రంథాలు కొన్ని ఆచరణాత్మక మార్గాలను సూచించాయి. అదేమంటే... రమణ మహర్షి బోధించినట్లుగా 'నేను ఎవరు?' అనే విచారణ చేయడం.

చెరువు నీరు ప్రశాంతంగా ఉన్నప్పుడే అందులో చంద్రుని ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే దైవత్వం ప్రతిఫలిస్తుంది. షరతులు లేని ప్రేమను పెంపొందించుకోవడం ద్వారా దైవానికి దగ్గరవ్వవచ్చు. 'తత్వమసి' అంటే 'దైవం నీవే'. తత్వమసి అనేది కేవలం చదవడానికి వాక్యం కాదు, అది ఒక అనుభూతి. 'నేను పరిమితమైన వాడిని' అనే అజ్ఞానం నుంచి 'నేను అనంతమైన వాడిని' అనే జ్ఞానం వైపు నడిపించే మహా మంత్రం ఇది. ఈ సత్యాన్ని గ్రహించిన మనిషి జీవన్ముక్తుడు అవుతాడు.

మనం దైవాన్ని గుడులలో, గోపురాలలో వెతుకుతాము, కానీ అసలైన దేవుడు మన హృదయస్థానంలో ఉంటాడు. ప్రతి రోజూ కొంత సమయం నిశ్శబ్దంగా కూర్చుని, ఆలోచనలను గమనిస్తూ ఉంటే, ఆ నిశ్శబ్దంలోనే దైవత్వం అనుభవంలోకి వస్తుంది. బాహ్య ప్రపంచపు సందడిని తగ్గించి, అంతరంగంలోకి ప్రయాణించడమే దీనికి మార్గం. 'అందరిలోనూ ఉన్నది ఒకే దైవం' అని గుర్తించడం. ఎదుటి వారిని చూసినప్పుడు వారి రూపం కంటే, వారిలో ఉన్న జీవాన్ని (దైవత్వాన్ని) గౌరవించడం నేర్చుకోవాలి. 'అద్వైతం' అంటే ఇదే. ఇది ఏదో ఒక రోజులో జరిగేది కాదు, ఇది నిరంతర ప్రక్రియ.

– ఆనంద 'మైత్రేయ'మ్

● భారత విజ్ఞానం

# కర్ణుని చావుకి కారణాలెన్నో..!

మహాయోధుడిగా... దానకర్ణుడుగా పేరు పొందిన 'కర్ణుని చావుకు కారణాలెన్నో...' అనే నానుడి ఎలా వచ్చిందో తెలుసుకుందాం....

మహాభారత యుద్ధంలో కర్ణుడు 17వరోజున తన తమ్ముడైన అర్జునుని చేతిలో వీరమరణం పొందాడు. అర్జునుడు ఎంతో గర్వంగా శ్రీకృష్ణునితో మహాయోధుడైన కర్ణుని అంతమొందించానని చెప్పడంతో... నీవు చంపడమేమిటి... నీకన్నా ముందు ఆరుగురు వ్యక్తుల వల్ల కర్ణుడు మరణించాడని శ్రీకృష్ణుడు చెప్పాడు.

విద్య నేర్చుకునే సమయంలో గురువైన పరశురామునితో తాను బ్రాహ్మణుడనని, తనకు బ్రహ్మాస్త్రంతో పాటు ఇతర అస్త్రాల ప్రయోగాలన్నీ నేర్పమని కర్ణుడు కోరాడు. అందుకు సమ్మతించిన పరశురాముడు అన్ని అస్త్రాల ప్రయోగాలను నేర్పించాడు. అయితే ఒకరోజు పరశురాముడు, కర్ణుడి ఒడిలో తలపెట్టుకొని నిద్రిస్తుండగా ఒక కీటకం అతని తొడను తొలచసాగింది. రక్తం ఏరులై పారుతున్నప్పటికీ కర్ణుడు బాధను దిగమింగి కదలక ఉండిపోయాడు. అయితే ఆ రక్తప్రవాహానికి మెలకువ వచ్చిన పరశురాముడు, విషయాన్ని అడగటంతో, తాను బ్రాహ్మణుడు కాదని నిజం చెబుతాడు కర్ణుడు. దాంతో తీవ్రంగా ఆగ్రహించిన పరశురాముడు నువ్వు నేర్చుకున్న అస్త్రాలన్నీ నిష్ప్రయోజనమవుతాయని, సరియైన సమయానికి పనికిరాకుండా పోతాయని శాపం ఇచ్చాడు. అలాగే మహాభారత యుద్ధంలో అతను నేర్చుకున్న అస్త్రాలు ఏవీ జ్ఞాపకానికి రాక కర్ణుని మరణానికి ఒక కారణం అయింది.

... కర్ణుడు విలువిద్య అభ్యసిస్తున్నప్పుడు అనుకోకుండా ఒక బాణం ఆవుకి తగిలింది. అదే సమయంలో ఆవు యజమాని అక్కడికి వచ్చి తన ఆవు పడుతున్న బాధను చూసి ఆక్రోశంతో నీవు కూడా యుద్ధ సమయంలో రోదిస్తూ నిస్సహాయంగా మిగిలిపోయి చనిపోతావని శాపం ఇచ్చాడు.

... కర్ణుడు తన రాజ్యంలో తిరుగుతున్నప్పుడు ఒక చిన్నపిల్ల మట్టికుండలో తీసుకెళ్తున్న నెయ్యి ఒలికి పోయిందని, ఇంటికి వెళ్తే తన తల్లి తిడుతుందని తనకు అదే నెయ్యి కావాలని ఏడుస్తూ కర్ణుని అడిగింది. భూమిని పిండి నెయ్యిని తీసి ఇవ్వడంతో గాయాలతో బాధపడిన భూదేవి యుద్ధ సమయంలో నీ రథచక్రం నేలలో దిగిపోతుందని శపించింది.

... కర్ణుడు తన పుత్రుడే అని తెలుసుకున్న కుంతి శ్రీకృష్ణుని సలహా మేరకు యుద్ధం జరుగుతున్న సమయంలో ఒక రాత్రివేళ కర్ణుని వద్దకు వెళ్లి జన్మవృత్తాంతం తెలిపి, నీ సోదరులను చంపవద్దని కోరగా అర్జునుడు మినహా మిగిలిన నలుగురిని వదిలివేస్తానని మాట ఇస్తాడు కర్ణుడు.

....సహజ కవచ కుండలాలతో జన్మించిన కర్ణుని చంపడం ఎవరివల్లా కాదని గ్రహించిన ఇంద్రుడు తన

కుమారుడైన అర్జునుని కోసం ఒక వృద్ధ బ్రాహ్మణ వేషంలో కర్ణుని వద్దకు వెళ్లి కవచ కుండలాలు దానం చేయమని కోరగా, ప్రాణాలకు తెగించి వాటిని కర్ణుడు కోసి ఇచ్చాడు. ఇది కూడా కర్ణుని మృతికి కారణమైంది.

... అన్నిటికన్నా ముఖ్యంగా మహాభారత సంగ్రామంలో ఒంటరివాడై నిస్సహాయంగా ఉన్న కర్ణునిపై బాణం సంధించమని అర్జునుని ప్రేరేపిస్తాడు శ్రీకృష్ణుడు. ఇది న్యాయం కాదని, అర్జునుడు చెప్పినప్పటికీ అభిమన్యుని ఒంటరివాడిగా చేసి చంపడం న్యాయమా... అని ప్రశ్నిస్తూ యుద్ధనియమాలు పక్కనపెట్టి కర్ణుని సంహరించమని సూచిస్తాడు.

... ఏది ఏమైనా అధర్మం వైపు నిలబడడం వల్లే కర్ణుని మరణం సంభవించిందని చెప్పుకోవచ్చు.

– సి. ఎన్. మూర్తి, సీనియర్ పాత్రికేయులు

● భక్తికి సేవామార్గం

# మంచుకొండల్లో.... మహాన్నదానం

చుట్టూ మంచు కొండలు... ఓ వైపు నది... మరో వైపు లోయ... అడుగు తీసి అడుగు వేయాలంటేనే ఇబ్బంది. తీవ్రమైన చలిలో సాగే కేదార్‌నాథ్ యాత్రలో తెలుగు రాష్ట్రాల భక్తులకు ఆహారం దొరకడం అంత సులభం కాదు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లాకు చెందిన కొందరు భక్తులు భక్తికి సేవనే మార్గంగా ఎంచుకుని కేదార్‌నాథ్‌కు వచ్చే భక్తులకు ఉచితంగా భోజనం, అల్పాహారం, వసతి అందించాలని సంకల్పించి 'కేదార్‌నాథ్ అన్నదాన సేవాసమితి' పేరుతో మంచుకొండల్లో తెలుగు భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. 2015 సంవత్సరంలో సిద్దిపేటకు చెందిన భక్తులు కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లారు. అక్కడ భోజనం లభించక వారు చాలా ఇబ్బంది పడ్డారు. డబ్బులు పెట్టినా సరైన ఆహారం లభించని పరిస్థితి. దీంతో తాము పడ్డ ఇబ్బందులు మిగతా భక్తులు పడకూడదన్న ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట కు



చెందిన మిత్రులు కొందరు 31 మంది సభ్యులతో కేదార్‌నాథ్ సేవా సమితి పేరిట ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి కేంద్రాల ద్వారా మూడుచోట్ల అన్నదానం అందిస్తున్నారు. అన్నదాన సేవలో సమితి ప్రతినిధులు తమవంతు పాత్ర పోషిస్తూనే రోజూ 10 వేల నుంచి 12వేల మందికి భోజనాన్ని అందిస్తున్నారు. అలాగే దాదాపు 400 మందికి ఉచిత వసతి సైతం ఏర్పాటు చేశారు.

## అన్నదానం... దైవ సంకల్పం

అన్ని దానాలలో అన్నదానం మిన్న. మానవ సేవతో మనిషి జీవితానికి పరిపూర్ణ సార్థకత లభిస్తుంది. సిద్దిపేటకు చెందిన పలువురి సహకారంతో 2019లో కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితిని ఏర్పాటు చేశాం. దక్షిణ భారతదేశంలోనే తొలి లంగర్‌ను ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు ఇతర భక్తులకు భోజనాన్ని అందిస్తున్నాం. మహాపుణ్య క్షేత్రమైన కేదార్‌నాథ్‌లో అన్నదానం చేయడం దైవ సంకల్పంగా భావిస్తున్నాం.

– చీకోటి మధుసూదన్, కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు

● భక్తులకు తెలుగింటి భోజనాన్ని అందిస్తున్న కేదారనాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు.

### ఆహారం... అందించే వేళలు

తెల్లవారుజాము 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ జరుగుతున్న ఈ సేవలో ఉదయం 7 నుంచి 11 వరకు అల్పాహారం, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు భోజనం అందిస్తారు. సాటి భక్తుల కడుపు నింపడంలోనే తమ ఆనందాన్ని, ఆధ్యాత్మికతను వెతుక్కుంటున్నారు సమితి ప్రతినిధులు.

– గజవెల్లి షణ్ముఖ రాజు, సాక్షి, సిద్ధిపేట

# సాక్షి సినిమా

## సరికొత్త యాక్షన్ షురూ

● 'దిల్' రాజు, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, గోపీచంద్, అనార్కలి, వెంకట్, విజయ్

గోపీచంద్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా ప్రముఖ ఫైట్ మాస్టర్ వి. వెంకట్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మలయాళ నటి అనార్కలి నజర్ ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా తెలుగులోకి అడుగుపెడుతున్నారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్–లక్ష్మణ్ మాస్టర్స్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత మల్లెమాల శ్యామ్‌ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టారు. నిర్మాత 'దిల్' రాజు ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, యలమంచిలి రవిశంకర్ స్క్రిప్ట్‌ను అందజేశారు. ''70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్' వంటి గొప్ప నిర్మాణ సంస్థ 'గోపీచంద్ 34' చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలు, సాంకేతిక నైపుణ్యంతో కూడిన ఒక సరికొత్త కథాంశాన్ని ప్రేక్షకులకు అందించనుంది. వి. వెంకట్‌కి దర్శకుడిగా ఇది తొలి చిత్రం అయినప్పటికీ బలమైన స్క్రిప్ట్‌ను తయారు చేశారు. గోపీచంద్ పూర్తి యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రలో ఇంటెన్స్ డ్రామా, మంచి ఎమోషన్స్ ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: సామ్ సీఎస్.

## పవర్‌ఫుల్ ఫైట్‌లో...

● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం'. 'హౌస్ నెం: 47 (ఏకే 47)' అనేది ఉపశీర్షిక. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో 'కేజీఎఫ్, హిట్ 3, తెలుసు కదా' చిత్రాల ఫేమ్ శ్రీనిధీ శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించి ఓ హై ఓల్టేజ్ క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్‌ని హైదరాబాద్‌లో పూర్తి చేశారట మేకర్స్. ఫైట్ మాస్టర్ కెవిన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పోరాట సన్నివేశం తెరకెక్కించారట. వెంకటేశ్‌పై చిత్రీకరించిన ఈ పవర్‌ఫుల్ ఫైట్ మూవీ క్లైమాక్స్‌లో వస్తుందని సమాచారం. కుటుంబ కథా చిత్రంగా రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం'లో మధ్యతరగతి వ్యక్తి పాత్రలో నటిస్తున్నారు వెంకటేశ్. వినోదం, భావోద్వేగాల కలయికలో రూపొందుతోన్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

## ఆరంభం... ముగింపు అక్కడే!

● మహేశ్‌బాబు

''వారణాసి' చిత్రకథ వారణాసి ఘాట్‌లలో ఆరంభమై, అక్కడే ముగుస్తుంది'' అని పేర్కొన్నారు ఎస్ఎస్ కార్తికేయ. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'. కేఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల మెక్సికోలో జరిగిన 'కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్'లో ఈ చిత్రం వీడియో గ్లింప్స్‌ని ప్రదర్శించారు. ఆ ఈవెంట్‌లో కార్తికేయ మాట్లాడుతూ... ఈ సినిమా వారణాసి ఘాట్స్‌లో ఆరంభమై, అక్కడే ముగుస్తుందని పేర్కొన్నారు. ఇంకా దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణం ఎపిసోడ్ అద్భుతంగా ఉంటుందని తెలిపారు కార్తికేయ. ఒక కొత్త కోణంలో రాజమౌళి చిత్రీకరించిన ఈ ఎపిసోడ్ మొత్తం ఇప్పటివరకూ భారతీయ తెరపై చూడని విధంగా ఉంటుందని, విజువల్‌గా స్టన్నింగ్‌గా ఉంటుందని కూడా పంచుకున్నారు. తెరపై కనిపించే ఈ 20 నిమిషాల ఎపిసోడ్ చిత్రీకరణకు దాదాపు 60 రోజులు పట్టిందట. ప్రస్తుతం ఈ సినిమా షూట్ అంటార్కిటికాలో జరుగుతోంది. 2027 ఏప్రిల్ 7న 'వారణాసి' విడుదల కానుంది.

## అందుకే ఈ సినిమా నుంచి తప్పుకున్నా!

- దర్శకుడు సుందర్ .సి

● రజనీకాంత్, కమల్‌హాసన్, సుందర్ .సి

''గడచిన 16 ఏళ్లల్లో నేను ఏ సినిమా చేసినా నాకు నచ్చినట్లుగా, నా నిర్ణయాల ప్రకారమే తీశాను. అయితే ఈ ప్రాజెక్ట్ విషయంలో మాత్రం తీవ్రమైన ఒత్తిడికి గురయ్యాను. అందుకే తప్పుకున్నాను'' అంటూ రజనీకాంత్ హీరోగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న సినిమా నుంచి తాను తప్పుకున్న విషయం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు దర్శకుడు సుందర్ .సి. గత ఏడాది నవంబరులో రజనీకాంత్ 173వ సినిమాని కమల్‌హాసన్ నిర్మించనున్నట్లు ప్రకటించి, దర్శకుడిగా సుందర్ .సీని ఖరారు చేసినట్లు తెలిపారు. అయితే ఆ ప్రకటన వచ్చిన వారంలోపే 'అనివార్య పరిస్థితుల్లో ఈ చిత్రం నుంచి తప్పుకుంటున్నాను'' అని సుందర్. సి. ఓ లేఖ విడుదల చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి పలు విశేషాలు పంచుకున్నారు. ''ఈ సినిమా చేసే క్రమంలో నా ఆలోచనలను ఇతరులకు చెప్పి, ఒప్పించే సామర్థ్యం నాకు లేదనిపించింది. నాకు కథను బలంగా నరేట్ చేయడం రాదు. అదే సమయంలో ఎవరైనా ఏమైనా చెబితే సులువుగా ఒప్పేసుకుంటాను. ఇలాంటి పెద్ద సినిమాలు చేసేటప్పుడు కేవలం నా నిర్ణయాలు మాత్రమే ఉండవు. అందుకే ఒత్తిడికి గురయ్యాను. ఈ ప్రాజెక్ట్ విషయంలో, ఇందులో ఇన్వాల్వ్ అయినవారి పట్ల నిజాయితీగా ఉండలేనేమోనని ఆరంభ దశలోనే తప్పుకున్నా. అయితే ఈ నిర్ణయం తీసుకునే ముందే రజనీని కలిసి విషయం చెప్పాను. అలాగే అప్పట్లో ఈ సినిమా నుంచి తప్పుకుంటున్న విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పేర్కొంటానని రజనీ–కమల్‌ల అనుమతి కోరిన తర్వాతే పోస్ట్ చేశాను'' అని ఆ ఇంటర్వ్యూలో సుందర్ పేర్కొన్నారు. గతంలో రజనీకాంత్‌తో 'అరుణాచలం', కమల్‌హాసన్‌తో 'అన్బే శివమ్' చిత్రాలను తెరకెక్కించారు సుందర్. ఇప్పుడు ఒకరు హీరోగా, మరొకరు నిర్మాతగా వ్యవహరిస్తున్న సినిమా నుంచి మాత్రం తప్పుకున్నారు. సుందర్ తప్పుకున్న తర్వాత శిబీ చక్రవర్తిని దర్శకుడిగా ఎంపిక చేశారు. ప్రస్తుతం నయనతార లీడ్ రోల్‌లో 'ముకుత్తి అమ్మన్' సీక్వెల్ 'ముకుత్తి అమ్మన్ 2'కి దర్శకత్వం వహిస్తున్నారు సుందర్.

## ఆ తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది

● శ్రుతీహాసన్

''చెన్నైలోని మైలాపూర్‌లో ఉన్న వారాహి అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది'' అన్నారు శ్రుతీ హాసన్. ఆమె తండ్రి, ప్రముఖ నటుడు కమల్‌హాసన్ నాస్తికుడు అనే విషయం తెలిసిందే. శ్రుతీహాసన్ మాత్రం 'నేను నాస్తికురాలిని కాదు... నాలో దైవ భక్తి, విశ్వాసం ఉన్నాయి' అని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ''నా జీవితంలో వారాహి అమ్మవారి ప్రభావం చాలా ఉంది. మైలాపూర్‌లో ఉన్న వారాహి అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది. మనం ఓ గుడికి వెళ్లాలని నిర్ణయించుకుని వెళతాం. అయితే దైవాలు కూడా మనల్ని ఎంచుకుంటారు. వారాహి అమ్మవారి గర్భగుడిలోకి వెళ్లగానే భక్తి పారవశ్యాన్ని పొందాను. అంతేకాదు.. ఏదో తెలియని శక్తి నన్ను ఆవహిస్తోందనిపించింది. ఆ గుడిలో వీఐపీ క్యూలు లేవు... ఆడంబరాలు లేవు. కేవలం శక్తివంతమైన వారాహి అమ్మవారు మాత్రమే ఉన్నారు. అదే విధంగా అస్సాంలోని శక్తి పీఠం కామాఖ్య దేవాలయాన్ని కూడా సందర్శిస్తుంటాను. నాలోని మానసిక ప్రశాంతతకు, ఆత్మవిశ్వాసానికి ఆధ్యాత్మిక చింతనే కారణం అనుకోవచ్చు'' అని శ్రుతీహాసన్ తెలిపారు. ప్రస్తుతం ఆమె తమిళంలో విజయ్ సేతుపతి సరసన 'ట్రైన్' మూవీలో నటిస్తున్నారు.

## బుద్ధుడు గురించి తప్పుడు ప్రచారం వద్దు

- డైరెక్టర్ సత్యారెడ్డి

''గౌతమ బుద్ధుడు గురించి ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. ఆయన్ని అవమానించే ప్రయత్నాలు జరిగితే తీవ్రంగా ఖండిస్తాం. గౌతమ బుద్ధుడు పుట్టినరోజును జాతీయ సెలవుగా ప్రకటించాలి'' అని నటుడు–దర్శక–నిర్మాత సత్యారెడ్డి కోరారు. బుద్ధ జయంతిని సంపూర్ణ నేషనల్ హాలిడేగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా జరిగిన ధర్నాలో 'కింగ్ బుద్ధ' మూవీ డైరెక్టర్ సత్యారెడ్డి పాల్గొని, మాట్లాడుతూ– ''గౌతమ బుద్ధుడు సాధారణ వ్యక్తి కాదు. ఆయన శాంతి సందేశం, చరిత్ర, తత్వం, ఆయన చూపిన మార్గం భావితరాలకు తెలియజేయడం మన బాధ్యత. ప్రపంచవ్యాప్తంగా బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తున్న దాదాపు 25 దేశాలు శాంతి, అభివృద్ధి, సమానత్వంలో ముందంజలో ఉన్నాయి. ఆ దేశాల పురోగతిని చూసి భారతదేశం కూడా మరోసారి బుద్ధిజం వైపు పయనించాలి'' అని సత్యారెడ్డి పేర్కొన్నారు. గౌతమ బుద్ధుడి శాంతి సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలియజెప్పాలనే లక్ష్యంతో స్వీయ దర్శకత్వంలో సత్యా రెడ్డి రూపొందిస్తున్న చిత్రం 'కింగ్ బుద్ధ'. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా భాషల్లో విడుదల చేయాలన్నది తన సంకల్పం అని సత్యా రెడ్డి పేర్కొన్నారు.

## రెడ్ బ్యాగ్ కథ ఏంటి?

● ఈషాన్, రాధ్య

కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి ముఖ్య తారాగణంగా నటించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. రవి కుమార్ సీరపు కథ అందించడంతో పాటు దర్శకత్వం వహించారు. హరికృష్ణ సోమిశెట్టి నిర్మించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం తెలిపింది. ''ఓ బ్యాగ్ చుట్టూ తిరిగే కథతో ఈ మూవీ కథనం సాగుతుంది. ఈ చిత్రంలో కబీర్ సింగ్ వైవిధ్యమైన పాత్రను పోషించారు. ఇటీవల థాయ్‌లాండ్‌లో కీలక సన్నివేశాలతో పాటు ఓ పాటను చిత్రీకరించాం. ఈ సన్నివేశాలు, పాట సినిమాకి హైలెట్‌గా నిలుస్తాయి. త్వరలోనే సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ మోపూరి, కెమెరా: ప్రియేష్ గురుసామి.

## ప్రేమ ప్రయాణం రెడీ

త్రిగుణ్, పాయల్ రాధా కృష్ణ జోడీగా నటించిన చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకత్వంలో సీహెచ్‌వీ ఎస్ఎన్ బాబ్జీ సమర్పణలో అరవింద్ మండెం నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 15న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. శ్రీ వెంకట సాయి ఫిల్మ్స్‌పై ముత్యాల రామదాస్ ఈ మూవీని పంపిణీ చేస్తున్నారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. భవిష్యత్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ ఎలా ఉండబోతోందనే కాన్సెప్ట్‌తో పాటు ఒక అందమైన ప్రేమకథ కూడా ఈ చిత్రంలో ఉంటుంది. నిజాయితీ గల అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటే ఆ ప్రయాణం ఎంత వినోదాత్మకంగా ఉంటుందో మా సినిమాలో చూపించాం'' అని యూనిట్ తెలిపింది.

● త్రిగుణ్, పాయల్

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 1,000 | 275 |
| 76,664 | 23,898 |

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 25,114 | △ | 222 |
| డోజోన్స్ | 49,499 | ▽ | 153 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 10,364 | ▽ | 15 |
| డాక్స్ | 24,292 | △ | 338 |
| షాంఘై | 4,079 | ▽ | 13 |
| నికాయ్ | 59,716 | △ | 576 |

అమెరికా బ్రిటన్ జర్మనీ చైనా జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 92.27 | 95.31 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 124.51 | 128.94 |
| € | యూరో | ఎస్‌బీఐ | 107.82 | 118.84 |
| ¥ | జపాన్ యెన్ (100) | ఎస్‌బీఐ | 48.00 | 61.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 64.86 | 68.85 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 71.41 | 75.20 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 24.12 | 25.75 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 24.73 | 26.00 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 12.89 | 14.72 |

# ఇన్వెస్టర్లూ పారాహుషార్!!

**డిఫెన్స్ థీమ్... షేర్లు జూమ్**

- ఐదారు నెలల్లోనే ఆరేడు రెట్లు పెరిగిపోయిన షేర్లు
- డిఫెన్స్ రంగంలో లీడర్లను మించి భారీగా పెరుగుదల
- షేర్ల రైజింగ్‌తో పోలిస్తే ఆమడ దూరంలో ఆదాయం
- 200–320 పీఈ వద్ద కూడా ట్రేడవుతున్న కొన్ని షేర్లు
- ఇలాంటివి కొంటే కరెక్షన్‌లో ఇరుక్కుపోయే ప్రమాదమే ఎక్కువ
- డిఫెన్స్ రంగంలో ఆర్డర్లున్నా అమలుకు దీర్ఘకాలం పట్టే అవకాశం
- కొన్నిసార్లు అమల్లో లోటుపాట్లుంటే మొత్తానికే తల్లకిందులు

(రమణమూర్తి మంథా)

**స్టాక్ మార్కెట్లో తరచూ కొన్ని థీమ్‌లు మెరుస్తాయి. భవిష్యత్తు అద్భుతమంటూ బ్రోకరేజ్ కంపెనీలు కొన్ని రంగాల స్టోరీలు తెరపైకి తెస్తాయి. మారుతున్న పరిస్థితులు,** ప్రభుత్వ ఫోకస్, కంపెనీలు పెట్టే ఖర్చు... వీటి ఆధారంగా ఈ స్టోరీని అల్లుతారు. వీటికి నిపుణుల సిఫారసులు తోడవుతాయి. దీంతో ఆ రంగంలోని షేర్లు దూసుకుపోతాయి. సహజంగానే ఆ రంగంలోని దిగ్గజాలు ఆ ర్యాలీని లీడ్ చేస్తూ ఉంటాయి. తమాషా ఏంటంటే... అదే థీమ్ ముసుగులో ఆ రంగానికి చెందిన చిన్నాచితకా కంపెనీలు కూడా రివ్వుమంటాయి. ఫండమెంటల్స్ ఏమాత్రం లేని షేర్లు లీడర్లను మించిపోతుంటాయి. ఇదే ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. ఆపరేటర్ల హస్తవాసితో దూసుకెళ్లే షేర్ల జోలికి చిన్న ఇన్వెస్టర్లు వెళితే... ఆ తరవాత పతనంలో అమ్ముకోవటం అంత తేలిక్కాదు. ఇదంతా ఎందుకంటే... ఇపుడు మన మార్కెట్లో డిఫెన్స్, ఏరోస్పేస్ థీమ్ నడుస్తోంది. ఏడాదిగా ఈ రంగంలోని షేర్లు బీభత్సంగా పెరిగిపోతున్నాయి. షేరు పీఈ (షేరుకు ఆర్జన) ఏకంగా 150–200 దాటిపోతోంది కూడా. అంటే... ఆ కంపెనీ ఇంకో 200 ఏళ్లలో సంపాదించే ఆదాయానికి తగ్గట్టుగా ఆ షేరు ఇప్పుడే పెరిగిపోయిందన్న మాట. మరి ఇలాంటి షేర్ల విషయంలో జాగ్రత్తపడాలి కదా? అదెలాగో వివరించేదే ఈ 'సాక్షి వెల్త్' స్టోరీ...

**ఒ**కే ఒక్క ఏడాదిలో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో ఉన్న, ఉన్నట్లు చెబుతున్న పలు షేర్లు రెండు, మూడు, నాలుగు రెట్లు కూడా పెరిగిపోయాయి. నిజానికి ఈ రంగం లాంగ్‌టర్మ్ పటిష్ఠంగానే ఉంది. కొన్ని కంపెనీల ఆర్డర్ బుక్స్ కూడా భారీగానే ఉన్నాయి. ఒక రంగం బాగుందంటే దానర్థం ఆ రంగంలోని షేర్లను ఏ ధర పడితే ఆ ధరకు కొనొచ్చని కాదు కదా? ఇలాంటి పరిస్థితుల్లో జరిగేదేమిటంటే మొదట స్టోరీ. దాంతో భారీగా రీ–రేటింగ్. ఫండ్లు, ఆ రంగంపై అవగాహన ఉన్నవారు, సమాచారం తెలిసినవారు ముందుగా ఆయా షేర్లు కొంటారు. ఇదంతా స్మార్ట్ మనీ. షేర్లు పెరుగుతాయి. అప్పుడు రిటైలర్లు కొంటారు. ఇంకా పెరుగుతాయి. ఇక దొరకవేమోనన్న భయంతో మరి కొందరు రిటైలర్లు దూకుతారు. వేల్యుయేషన్లు పెరిగిపోతాయి. కరెక్షన్ ఆరంభం. అయితే ధర తగ్గటం... లేదా దీర్ఘకాలంపాటు అక్కడే కదలటం. ఇలా ఏ రకంగానైనా దెబ్బతినేది ఆలస్యంగా కొన్న రిటైలర్లే. అందుకే రిటైల్ ఇన్వెస్టర్లు ఏం చేయాలో చూద్దాం...

**1. ఆర్డర్ బుక్ భారీగా ఉన్నా...**

- డిఫెన్స్ వ్యవహారాల్లో ఎగ్జిక్యూట్ కావటానికి దీర్ఘకాలం... అంటే 3–5 ఏళ్లు పడుతుంది.
- ఎగ్జిక్యూషన్ రిస్కులు ఎక్కువ. ఆర్డర్లన్నీ ఆచరణలోకి రాకపోవచ్చు కూడా.

**2. ప్రభుత్వ ప్రీమియం పెరుగుతోంది...**

- చారిత్రకంగా చూస్తే ప్రభుత్వ రంగ డిఫెన్స్ కంపెనీలు 10–20 పీఈ మధ్య ట్రేడయ్యేవి.
- ఇపుడైతే వాటి చారిత్రక విలువల కన్నా 5–10 రెట్లు ఎక్కువ పీఈ వద్ద ట్రేడవుతున్నాయి.

**2. ఆర్జనను మించి షేరు పరుగు...**

- ఈ కంపెనీల ఆదాయాలు ఏటా 20 నుంచి 40 శాతం పెరుగుతున్నాయి.
- కానీ ఈ కంపెనీల షేర్ల విలువ ఏడాదిలో 200–300 శాతం పెరిగిపోతోంది.

**ఇలాగైతే జాగ్రత్త...**

- స్టాక్ నిట్టనిలువుగా పెరుగుతూ వచ్చిందంటే... కొనేముందు ఆలోచించండి.
- స్టాక్ ధర ఎంత ఉంది? దాని ఆదాయం ఎంత పెరుగుతోంది? అనేది చూడండి.
- నిదానంగా కొనటం ముఖ్యం. ఒకేసారి మొత్తం కొంటే తరవాత కష్టం.

**చెయ్యాల్సిందేంటి?**

- కరెక్షన్ కోసం చూడండి. ఎందుకంటే షేర్లు ఎప్పుడూ పెరుగుతూనే ఉండవు. కనీసం 30–40 శాతం తగ్గేదాకా ఎదురుచూడండి.
- షేరు ధర కన్నా... కంపెనీ ఆదాయం పెరుగుదలపై ఫోకస్ పెట్టండి.
- వేగంగా పెరుగుతున్న చిన్న షేర్ల కన్నా... లీడర్లపై దృష్టిపెట్టండి.

**లోకల్ కంపెనీల డ్రీమ్ రన్... జాగ్రత్త!**

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంటార్ టెక్నాలజీస్, అపోలో మైక్రో సిస్టమ్స్, సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, బొందాడ ఇంజినీరింగ్ వంటి షేర్లు డిఫెన్స్ థీమ్‌తో ఇటీవల బీభత్సంగా ఎగిశాయి. ఎంటార్ షేరు ఏకంగా రెండుమూడు నెలల వ్యవధిలోనే 3–4 రెట్లు పెరిగిపోయింది. ఆదాయాలకు మించి పెరుగుతున్న ఇలాంటి షేర్లలో కరెక్షన్ వస్తే అది కూడా తీవ్రంగానే ఉంటుంది. కాబట్టి రిటైలర్లు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన సమయమిది.

**ఇవీ.. డిఫెన్స్‌లో లీడర్లు**

- హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్
- భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్
- భారత్ డైనమిక్స్ లిమిటెడ్

**షిప్ బిల్డింగ్.. హెవీ డిఫెన్స్‌లో**

- మజగన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్
- కొచిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్
- గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్

**ప్రైవేటు డిఫెన్స్ షేర్లు... (స్మాల్–మైక్రోకాప్)**

- డాటా పాటర్న్స్ ఇండియా
- పరస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్
- సోలార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్

**బాగా పెరిగిన తెలుగు రాష్ట్రాల షేర్లు**

- ఎంటార్ టెక్నాలజీస్
- అజాద్ ఇంజినీరింగ్
- బొందాడ ఇంజినీరింగ్
- సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (ఒకనాటి మెగాసాఫ్ట్)
- అపోలో మైక్రో సిస్టమ్స్

(వీటిలో చాలా షేర్లు నిట్టనిలువుగా పెరిగినవని)

**ప**క్క పట్టిక చూస్తే 320 పీఈ వద్ద ట్రేడవుతున్న షేర్లు ఆరు నెలలు తిరక్కుండా ఆరేడు రెట్లు పెరిగిన షేర్లు కనిపిస్తాయి. నెలలోనే రెట్టింపయిన షేర్లూ ఉన్నాయి. మరి వీటి ఆదాయాలు ఆ స్థాయిలో పెరిగాయా? ఈ ప్రశ్నకు ఆశాజనకమైన జవాబు రాదు. ఆదాయాలు కొంత పెరుగుతూ ఉండొచ్చు. కానీ ఆదాయాలకు 10 నుంచి 20 రెట్లు షేర్లు పెరిగిపోవటమే ఆందోళనకరం. రిటైలర్లు ఇలాంటి సమయాల్లో ఇంకా పెరుగుతాయనే ఆశతో ఎంటరయితే పడిపోయే అవకాశమూ ఉంది. ఎందుకంటే అప్పటిదాకా పెరిగిన షేర్లలో లాభాల స్వీకరణ జరగవచ్చు. పైపెచ్చు స్టోరీ ఆధారంగా పెరిగిన షేర్లు ఆ స్టోరీ గనక నిజం కాకపోతే నేలచూపులు చూడొచ్చు. అపుడు రిటైల్ ఇన్వెస్టర్లు ఎంతో కొంతకు అమ్ముకుని బయటపడాల్సిన పరిస్థితి ఉంటుంది. నష్టాలు భారీగా ఉంటాయి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని థీమ్‌ల వెంట పరుగులు పెట్టవద్దన్నది నిపుణుల సలహా. ఒకవేళ మీరు గనక థీమ్‌ను బలంగా నమ్మితే... ఆ రంగంలో లీడర్లను ఎంచుకోవాలే తప్ప చిన్నషేర్ల వెంట క్విక్ మనీ కోసం పరుగులు పెడితే ఇబ్బందులేనన్నది గ్రహించాలి.

**షేర్లు... వాటి వేల్యుయేషన్లు**

| స్టాక్ | ప్రస్తుత ధర రూ.లలో | మార్కెట్ విలువ రూ.కోట్లలో | పీఈ | బలాబలాలు |
|---|---|---|---|---|
| హెచ్ఏఎల్ | 4,338 | 2,90,028 | 32 | - స్ట్రాంగ్ ఫండమెంటల్స్, రీ-రేటింగ్ |
| బీడీఎల్ | 1,346 | 50,058 | 86.32 | - వృద్ధిపై అంచనాలెక్కువ |
| బీఈఎల్ | 431 | 3,15,307 | 52.86 | - స్థిరంగా పెరుగుతోంది |
| మజగన్‌డాక్ | 2,7333 | 1,10,254 | 45.81 | - భారీ స్థాయి రీరేటింగ్ |
| కొచిన్ షిప్‌యార్డ్ | 1,733 | 45,634 | 62.76 | - పటిష్ఠమైన ఆర్డర్ బుక్ స్టోరీ |
| గార్డెన్‌రీచ్ షిప్.. | 2,930 | 33,615 | 44.94 | - మొమెంటమ్ ఆధారిత రైజింగ్ |

**ప్రయివేటు కంపెనీలు ఇలా...**

| | | | | |
|---|---|---|---|---|
| డాటా పాటర్న్స్ | 4,081 | 22,902 | 92.70 | - ప్రీమియమ్ వేల్యుయేషన్ |
| పరస్ డిఫెన్స్ | 794.25 | 6,396 | 89.58 | - బీభత్సమైన హెచ్చుతగ్గులు |
| ఎంటార్ టెక్నాలజీస్ | 6,457 | 19842 | 320 | - 7 నెలల్లోనే 6 రెట్ల పెరుగుదల |
| సోలార్ ఇండస్ట్రీస్ | 15,439 | 1,39,713 | 92 | - బలమైనదే.. కానీ ఖరీదెక్కువ |
| అపోలో మైక్రో | 297 | 10,635 | 126 | - రిటైలర్ల దూకుడుతో... |
| సిగ్మా అడ్వాన్స్‌డ్... | 287 | 5,069 | 38 | - నెలలోనే డబుల్ |
| (పాత మెగాసాఫ్ట్) | | | | |
| బొందాడ ఇంజి.. | 340 | 3,807 | 18.02 | - నెలలో 41 శాతం పెరుగుదల |
| అజాద్ ఇంజినీరింగ్ | 2,164 | 14,010 | 115.27 | - స్టోరీ ఆధారిత పెరుగుదల |

## గ్రామీణ బ్యాంకింగ్‌లో దూసుకెళ్తున్న ఏపీజీబీ

- తొలి ఏడాదిలోనే రూ.1,836 కోట్ల నికర లాభం
- ఏపీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, హరీషన్ (ఎడమ) , రఘునాథరెడ్డి (కుడి)

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలో గ్రామీణ బ్యాంకింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) కీలక మైలురాయిని చేరుకుందని బ్యాంక్ చైర్మన్ కే.ప్రమోద్‌కుమార్‌రెడ్డి చెప్పారు. నాలుగు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనంతో గతేడాది మే 1వ తేదీన ఏర్పాటైన బ్యాంకు, తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తొలి ఏడాది ప్రగతి నివేదికను గుంటూరులోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. విలీన ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తి చేయడంతోపాటు వ్యాపార, ఆర్థిక రంగాల్లో గణనీయమైన ఫలితాలు సాధించినట్లు ప్రమోద్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,359 శాఖలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 1.30 కోట్ల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామని, రాష్ట్రంలోని ప్రతి నలుగురిలో ఒకరికి ఈ బ్యాంకు సేవలు అందుతున్నాయని చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.1.36 లక్షల కోట్లకు చేరిందని, నికర లాభం రూ.1,836 కోట్లుగా నమోదైందన్నారు. ప్రాధాన్యతా రంగాలకే ఎక్కువ రుణాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మొత్తం రుణాల్లో 93 శాతం వ్యవసాయం, మహిళా సంఘాలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగా 'లక్‌పతి దీది' పథకం ద్వారా 23 వేలకు పైగా మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలులోనూ బ్యాంకు చురుకైన పాత్ర పోషించిందని తెలిపారు. ముఖ్యంగా పీఎం సూర్య ఘర్ యోజన కింద గృహాలకు రుణాలు అందించడంతోపాటు, ప్రధానమంత్రి సుర్క్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జనధన్ ఖాతాల ప్రారంభం వంటి సామాజిక భద్రత పథకాల లక్ష్యాలను 100 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. విలీన ప్రక్రియలో సిబ్బంది ఏకీకరణ, సాంస్కృతిక సమన్వయం, ఐటీ ప్లాట్‌ఫామ్‌ల సమీకరణలలో ఎలాంటి అంతరాయం లేకుండా పూర్తి చేయడం వల్ల ఖాతాదారులకు సేవల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని స్పష్టం చేశారు. నిరర్థక ఆస్తులు లేని బలోపేతమైన ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎదిగిందని వివరించారు. సమావేశంలో ఏపీజీబీ విజిలెన్స్ ఇన్‌చార్జి బి.హరీషన్, జనరల్ మేనేజర్ ఎస్.ఆర్.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెక్టార్ ఆఫ్ ది వీక్: ఆటోమొబైల్

**మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్** (బ్రోకరేజి)

వివిధ సెగ్మెంట్ల నుంచి గణనీయంగా డిమాండ్‌తో దేశీ ఆటోమొబైల్ పరిశ్రమ నిలకడగా ముందుకు సాగుతోంది. వాల్యూమ్స్ భారీగా ఉండటం, ముడివస్తువుల భారం కాస్త నెమ్మదించడంలాంటి అంశాలు పరిశ్రకు సానుకూలంగా ఉంటున్నాయి. డిస్కౌంటింగ్ ధోరణులు తగ్గడమనేది లాభదాయకతకు తోడ్పడుతోంది. అయితే, రాబోయే రోజుల్లో కమోడిటీల ధరల తీరుతెన్నులను బట్టి కంపెనీల మార్జిన్లు ఆధారపడి ఉంటాయి. ఆదాయాలు, ఫైనాన్సింగ్ ఆప్షన్లు పెరుగుతూ, ప్రాధాన్యతలు మారే కొద్దీ వివిధ సెగ్మెంట్ల వ్యాప్తంగా ప్రీమియమైజేషన్ పెరుగుతున్న ధోరణి కనిపిస్తోంది. కొత్త ఆవిష్కరణలు, కొత్త ఉత్పత్తులను లాంచ్ చేస్తుండటంతో అమ్మకాలు, ఆదాయ వృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆకర్షణీయంగా ఉన్న స్టాక్స్‌లో కొన్ని.

**టీవీఎస్ మోటర్స్**
**టార్గెట్ ధర: రూ. 4,073**

**మో**టర్‌సైకిల్స్, స్కూటర్లు, త్రీ–వీలర్ల విభాగంలో దేశీయంగాను, విదేశీ మార్కెట్లలోను మార్కెట్ వాటాను స్థిరంగా పెంచుకుంటూ వస్తుండటమనేది దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడే అంశం. ఇక ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియో పటిష్టంగా ఉండటం, ఈవీల అమ్మకాలు పెరుగుతుండటంలాంటివి సానుకూలాంశాలు. మార్జిన్లు మెరుగుడుతుండటం, ప్రీమియమైజేషన్, విస్తృత స్థాయి మొదలైనవి కంపెనీ లాభదాయకతకు తోడ్పడుతున్నాయి.

**సంవర్ధన మదర్సన్**
**టార్గెట్ ధర: రూ. 138**

**వి**ద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేలా ఢిల్లీ ప్రభుత్వం రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాల ముసాయిదా పాలసీతో ఈవీల వినియోగం గణనీయంగా పెరగనుంది. ప్రీమియమైజేషన్, అంతర్జాతీయంగా ఈవీల వినియోగం ట్రెండుతో సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ గణనీయంగా ప్రయోజనం పొందగలదు. కంపెనీ ప్రస్తుతం భారత్, పోలాండ్ తదితర దేశాలవ్యాప్తంగా 10 ప్రాజెక్టులను నిర్మిస్తోంది. 2027 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మరో ఎనిమిది మొదలుకానున్నాయి. ఆటోమోటివ్, నాన్–ఆటోమోటివ్ సెగ్మెంట్లలో ఆర్డర్ల బ్యాక్‌లాగ్, ఇటీవల కొనుగోలు చేసినవాటి అనుసంధానం పూర్తి కావడంలాంటి అంశాలు కంపెనీకి సానుకూలంగా ఉండనున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

## అసెంబ్లీ, క్యూ4 ఫలితాలపై ఫోకస్

- పశ్చిమాసియా పరిస్థితులు కీలకం
- చమురు ధరలు, రూపాయికీ ప్రాధాన్యం
- దేశ, విదేశీ తయారీ, సర్వీసు రంగ గణాంకాలపై దృష్టి
- హీరో, బజాజ్, ఎంఅండ్ఎం, లుపిన్ పనితీరు వెల్లడి

ఐదు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, కార్పొరేట్ దిగ్గజాల గతేడాది చివరి త్రైమాసిక పనితీరు ప్రధానంగా ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు దారి చూపనున్నాయి. అంతేకాకుండా విదేశీ మార్కెట్లో ముడి చమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి పతనం, విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

**నే**డు(4న) ఐదు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చెక్ పెట్టనున్నట్లు ముందస్తు అంచనాలు పేర్కొన్నాయి. మరో పక్క తమిళనాడు ఫలితాలపైనా ఎగ్జిట్ పోల్స్ ఉత్కంఠతకు తెరతీయడంతో స్టాక్ ఇన్వెస్టర్లు సైతం వీటి ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్ర అసెంబ్లీ ఫలితాలు సైతం నేడు తెలియనున్నాయి.

**దిగ్గజాలు రెడీ**

ఇప్పటికే గతేడాది(2025–26) చివరి త్రైమాసిక ఫలితాల సీజన్ వేడెక్కింది. వారాంతాన కొటక్ మహీంద్రా బ్యాంక్‌సహా.. నాల్కో, సీడీఎస్ఎల్, స్టార్ హెల్త్, డీమార్ట్, ఏపీఎల్ అపోలో తదితరాలు క్యూ4(జనవరి–మార్చి) ఫలితాలు ప్రకటించాయి. ఈ బాటలో మరికొన్ని దిగ్గజాలు సైతం పనితీరు వెల్లడిచనున్నాయి. తాజా జాబితాలో అంబుజా సిమెంట్స్, బీహెచ్ఈఎల్, గోద్రెజ్ ప్రాపర్టీస్, జిందాల్ స్టెయిన్‌లెస్, ఎల్అండ్‌టీ, ఎస్ఆర్ఎఫ్, మారికో, కోఫోర్జ్‌తో పాటు.. ఆటో రంగ దిగ్గజాలు ఎంఅండ్ఎం, బజాజ్ ఆటో, హీరో మోటో, గోద్రెజ్ కన్జూమర్, పాలీక్యాబ్, శ్రీ సిమెంట్, బీఎస్ఈ, పిడిలైట్, లుపిన్, థెర్మాక్స్, ఏబీబీ, బీవోబీ, ఎంసీఎక్స్, స్విగ్గీ, కల్యాణ్ జ్యువెలర్స్ తదితరాలు చేరాయి.

**గణాంకాలు**

ఏప్రిల్ నెలకు హెచ్ఎస్‌బీసీ తయారీ, సర్వీసులు, కాంపోజిట్ పీఎంఐ గణాంకాలు విడుదలకానున్నాయి. ఇదేవిధంగా చైనా, యూఎస్ పీఎంఐ గణాంకాలు సైతం వెల్లడికానున్నాయి. ప్రధానంగా యూఎస్ ఉపాధి కల్పన, నిరుద్యోగ వివరాలు తెలియనున్నాయి. గత వారం యూఎస్ ఫెడరల్ రిజర్వ్ యథాతథ పాలసీ అమలుకే కట్టుబడింది. ఫెడ్ చైర్మన్‌గా పదవీ విరమణ చేయనున్న పావెల్ అధ్యక్షతన ఎఫ్‌వోఎంసీ ఫండ్స్ రేట్లను 3.5–3.75 శాతం స్థాయిలో అమలు చేసేందుకు నిర్ణయించింది.

**చమురు మంట**

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మండుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధమేఘాలు తొలగక పోవడం, హార్ముజ్ సంక్షోభం నేపథ్యంలో లండన్ మార్కెట్లో బ్రెంట్ బ్యారల్ గత వారం ఒకదశలో 126 డాలర్లను తాకింది. దీంతో డాలరుతో మారకంలో రూపాయి 95కు పతనమైంది. ఇది సరికొత్త కనిష్ఠంకాగా.. గతేడాదికి దేశీయంగా వాణిజ్య లోటు 333 బిలియన్ డాలర్లను దాటేసింది. 2024–25లో ఇది దాదాపు 284 బిలియన్ డాలర్లుగా నమోదైంది. మండుతున్న చమురు ధరలు దిగుమతుల బిల్లును పెంచడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నట్లు ఆర్థికవేత్తలు తెలియజేశారు.

**ఆటుపోట్లకు చాన్స్**

హార్ముజ్‌పై అనిశ్చితి, బలపడుతున్న చమురు ధరలు తదితర అంశాలు దేశీ స్టాక్ మార్కెట్లలో ఆటుపోట్లకు కారణంకానున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా, ఎన్‌రిచ్ మనీ సీఈవో ఆర్.పొన్మూడి పేర్కొన్నారు. అసెంబ్లీ ఫలితాలకు ప్రాధాన్యమున్నప్పటికీ చమురు ధరలు సెంటిమెంటుకు కీలకంకానున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా అభిప్రాయపడ్డారు.

**స్టాక్స్‌కు ఎఫ్‌పీఐల షాక్**
**ఏప్రిల్‌లో రూ. 60,847 కోట్లు ఔట్**

న్యూఢిల్లీ: గత కొద్ది రోజులుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో భారీ అమ్మకాలు చేపడుతున్నారు. ఫలితంగా ఏప్రిల్‌లో నికరంగా రూ. 60,847 కోట్ల(6.5 బిలియన్ డాలర్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈ బాటలో 2026 తొలి 4 నెలల్లో(జనవరి–ఏప్రిల్) రూ. 1.92 లక్షల కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. వెరసి 2025 పూర్తి కేలండర్ ఏడాదిలో నమోదైన రూ. 1.66 లక్షల కోట్లకంటే అధికంగా అమ్మకాలకు తెరతీశారు. పశ్చిమాసియా సంక్షోభానికితోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి ఇన్వెస్టర్ల రిస్క్ సామర్థ్యాలను దెబ్బతీయడం ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. గత 4 నెలల్లో ఫిబ్రవరిలో మాత్రమే ఎఫ్‌పీఐలు(రూ. 22,615 కోట్లు) ఇన్వెస్ట్ చేశారు. ఇది అంతక్రితం 17 నెలల్లోనే అత్యధికంకావడం గమనార్హం! అయితే మార్చిలో ఏకంగా రూ. 1.17 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విషయం ప్రస్తావనార్హం!!

**గత వారమిలా..**

**తొ**లుత క్యూ4 ఫలితాలతో మార్కెట్లు బలపడినప్పటికీ ఇరాన్–యూఎస్ యుద్ధంతో చివర్లో డీలా పడ్డాయి. వెరసి గత వారం సెన్సెక్స్ నికరంగా 249 పాయింట్లు(0.3 శాతం) పుంజుకుంది. 76,914 వద్ద ముగిసింది. నిఫ్టీ 100 పాయింట్లు(0.4 శాతం) వృద్ధితో 23,998 వద్ద స్థిరపడింది. అయితే బ్యాంక్ నిఫ్టీ 2.2 శాతం పతనమైంది. బీఎస్ఈలో మిడ్‌క్యాప్ 0.3 శాతం లాభపడగా.. స్మాల్ క్యాప్ 2 శాతం జంప్‌చేయడం గమనార్హం!

**సాంకేతికంగా చూస్తే..**

ఈ వారం సైతం మార్కెట్లు ఆటుపోట్ల మధ్య స్వల్పంగా బలపడే వీలున్నట్లు సాంకేతిక నిపుణుల అంచనా. వీటి ప్రకారం నిఫ్టీకి 23,800–23,700 పాయింట్ల స్థాయిలో సపోర్ట్ లభించవచ్చు. తదుపరి 23,500 వద్ద బలమైన మద్దతుకు వీలుంది. ఒకవేళ బలపడితే 24,600 పాయింట్లను తాకవచ్చు. ఆపై 24,700– 27,800కు చేరే అవకాశముంది.

- సెన్సెక్స్ 76,000 పాయింట్ల స్థాయిలో సపోర్ట్ తీసుకునే వీలుంది. 77,500వరకూ పుంజుకోవచ్చు. 78,000 దాటితే 78,500 పాయింట్లను తాకే అవకాశముంది.

వ్యాపారంలో కస్టమర్ ఒక్కడే బాస్. అతను తన డబ్బును వేరే చోట ఖర్చు చేయడం ద్వారా, కంపెనీ ఛైర్మన్ నుండి కింద ఉన్న ఉద్యోగి వరకు ఎవరినైనా తీసివేయగలడు. - శామ్ వాల్టన్, అమెరికన్ వ్యాపారవేత్త, వాల్‌మార్ట్ వ్యవస్థాపకుడు

# వాయిదా వేయకండి!

బ్యాంకింగ్‌లో రుణాల స్వరూపం తీరుతెన్నులను సమూలంగా మార్చేసే దిశగా రిజర్వ్ బ్యాంక్ కొత్త నిబంధనలను తెరపైకి తెచ్చింది. సమస్య వచ్చాకా పరిష్కారం వెతుక్కోవడం కన్నా అసలు సమస్యే రాకుండా బ్యాంకులు ముందు జాగ్రత్త తీసుకునేలా ఈసీఎల్ .. అంటే ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ విధానాన్ని ప్రతిపాదించింది. సరళంగా చెప్పాలంటే ఇచ్చిన రుణంపై నష్టం వచ్చే రిస్కులను బ్యాంకులు ముందుగానే అంచనా వేసుకోగలగాలి. దానికి తగ్గట్లుగా ఆ మేరకు నిధులను పక్కన పెట్టుకోవాలి. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ రూల్స్‌తో రుణాల తీరుతెన్నులు మారిపోతాయని నిపుణులు చెబుతున్నారు. సరే అదేదో బ్యాంకులకు సంబంధించిన వ్యవహారం కదా మనకేంటి అనుకుంటే పొరపాటే. దీని వల్ల రుణాలు తీసుకున్న, తీసుకోబోతున్న వారందరిపైనా ప్రభావం పడబోతోంది. ఇంతకీ, అసలు ఈ రూలేంటి.. దాని ప్రభావాలు ఎలా ఉండబోతున్నాయనేది వివరించేదే ఈ కథనం.. - సాక్షి, వెల్త్

దశాబ్దాలుగా బ్యాంకులు తమకు 'వాటిల్లిన నష్టం' ప్రాతిపదికన మొండిబాకీలకు కేటాయింపులు చేసే విధానాన్ని పాటిస్తూ వస్తున్నాయి. సింపుల్‌గా చెప్పాలంటే రుణ గ్రహీత తాను తీసుకున్న లోన్‌ని కొన్నాళ్ల పాటు చెల్లించక, అది బాకీగా మారితే గానీ దాన్ని మొండిపద్దు కింద వర్గీకరించడం లేదు. దాన్ని నష్టంగా పరిగణించి నిధులను పక్కన పెట్టడం లేదు. అంటే రుణ గ్రహీత విషయంలో కాస్త ఉదారంగా ఉంటున్నట్లే. ఎందుకంటే ఒకసారి మొండిపద్దుగా వర్గీకరిస్తే దాని వసూలుకు తీసుకునే చర్యలు వేరేగా ఉంటాయి. క్రెడిట్ ప్రొఫైల్‌పై ప్రభావమూ వేరేగా ఉంటుంది. ఒకరకంగా ముందుగానే సదరు రుణం మొండిబాకీగా మారే అవకాశాలను అంచనా వేసి జాగ్రత్తలు తీసుకోవడం కన్నా, పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత మాత్రమే చర్యలు తీసుకుంటున్నాయి. అయితే, కొత్తగా వచ్చే ఈసీఎల్ నిబంధనలతో ఈ వేచి చూసే ధోరణికి కాలం చెల్లిపోతుంది. బ్యాంకులు ఇకపై రాబోయే రోజుల్లో రుణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకోవాల్సి రానుంది. తలెత్తబోయే రిస్కులను ఊహించుకుని, ముందుగానే ప్రొవిజనింగ్‌తో సిద్ధంగా ఉండాలి. ఎప్పుడో తీరిగ్గా స్పందించడం కాకుండా, సింగిల్ పేమెంట్ మిస్ అయినా, వెంటనే స్పందించి, క్రియాశీలకంగా చర్యలు తీసుకోవాలి.

## మరి దీని ప్రభావం ఏంటి..

ఇలా ఆర్‌బీఐ నిబంధనలను కఠినతరం చేసేయడమనేది మీ నెలవారీ ఖర్చులపైనా ప్రభావం చూపనుంది. రాబోయే నష్టాల రిస్కులను అంచనా వేసి, వాటికి అనుగుణంగా బ్యాంకులు కొంత మొత్తాన్ని పక్కన పెట్టాల్సి రావడం వల్ల, వాటికి వ్యాపారం ఖరీదైన వ్యవహారంగా మారిపోతుంది. దీనితో మార్జిన్లను కాపాడుకునేందుకు అవి వడ్డీ రేట్లను స్వల్పంగా పెంచాల్సి రావొచ్చు. ఫలితంగా మీరు కారు రుణం తీసుకోవాలన్నా.. పర్సనల్ లోన్‌లాంటివి తీసుకోవాలనుకున్నా వడ్డీ రేటు మరికాస్త పెరిగిపోవచ్చు.

**ఒక్క ఈఎంఐ ఎగ్గొట్టినా కష్టమే..**

- భవిష్యత్తులో రుణాలు పుట్టడం గగనమే
- ఖాతాలపై మరింత తీవ్రం కానున్న బ్యాంకుల నజర్
- కొత్తగా అమల్లోకి రాబోయే ఆర్‌బీఐ రూల్స్ ఎఫెక్ట్
- ఆర్థిక క్రమశిక్షణకు, బ్యాంకింగ్ పటిష్టత కోసమే

**ఏం చేయాలంటే..**

- ఈఎంఐలు సకాలంలో చెల్లించేయాలి.
- క్రెడిట్ స్కోరు బాగుండేలా చూసుకోవాలి
- అతిగా రుణాలు తీసుకోవడం మానేయాలి

| అంశం | ప్రభావం |
|---|---|
| రుణ లభ్యత | కాస్త కఠినతరం |
| వడ్డీ రేట్లు | స్వల్పంగా పెరగొచ్చు |
| క్రెడిట్ డిసిప్లిన్ | ఇకపై మరింత కీలకం |
| బ్యాంకింగ్ | మరింత పటిష్టం |



## కొత్త ప్రమాణాలు..

క్రెడిట్ స్కోరును పెద్దగా పట్టించుకోని వారికి ఈ కొత్త నిబంధనలు మేల్కొలుపులాంటివి. రుణం దొరకడమనేది కఠినతరమైన వ్యవహారంగా మారుతుంది. రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి క్రెడిట్ అలవాట్లను ట్రాక్ చేసేందుకు బ్యాంకులు మూడంచెల పర్యవేక్షణ విధానానికి మారతాయి. మొదటి అంచెలో, ఆరోగ్యకరమైన అకౌంట్లు ఉంటాయి. రెండో అంచెలో అప్పుడప్పుడే కాస్త స్ట్రెస్ మొదలవుతున్న దాఖలాలు కనిపించే ఖాతాలు ఉంటాయి. ఇక మూడో అంచెలో డిఫాల్ట్ అయిన ఖాతాలు ఉంటాయి. ఉదాహరణకు, మీరో రుణం తీసుకున్నారు. ఏదో కారణం వల్ల ఈఎంఐలను కట్టడంలో జాప్యం చేశారు. ప్రస్తుతమైతే బ్యాంకులు కాస్త చూసీ చూడనట్లుగా పెనాల్టీల్లాంటివి వేసి వదిలేస్తున్నాయే గానీ ఇకపై ఇలా జరిగితే మీరు వెంటనే హై రిస్క్ కేటగిరీలోకి వెళ్లిపోతారు. ఇచ్చిన రుణం రెండో గ్రేడ్‌లోకి జారిన పక్షంలో తమకి జరిమానా పడే అవకాశం ఉన్నందున, బ్యాంకులు ముందునుంచే చాలా జాగ్రత్త వహిస్తాయి. తీసుకున్నవారు రెగ్యులర్‌గా చెల్లించకపోతున్నా, క్రెడిట్ స్కోరు పడిపోతున్న దాఖలాలు కనిపిస్తున్నా మరింత వేగంగా స్పందిస్తాయి. మీ మీద నిఘా మరింత పెంచేస్తాయి. అంటే రాబోయే రోజుల్లో రుణగ్రహీతలు ఏవో కొన్ని ఈఎంఐలు కట్టకపోతే మహా అయితే లేట్ ఫీజు పడుతుంది అంతేగా అనుకుని లైట్‌గా తీసుకునే పరిస్థితి ఉండదు. అసలుకే ఎసరొస్తుంది. ఖాతాలపై మానిటరింగ్ పెరగడమే కాకుండా భవిష్యత్తులో మీరు రుణం తీసుకుందామనుకున్నా అంత తేలిగ్గా దొరక్కపోవచ్చు.



## వ్యవస్థకు మేలే..

వ్యక్తిగత స్థాయిలో రుణాలు తీసుకున్నవారికి ఈ నిబంధనలు కఠినతరంగా అనిపించినప్పటికీ ఒక క్రమశిక్షణ అలవడుతుంది. తద్వారా విస్తృత స్థాయిలో ఆర్థిక వ్యవస్థకు మేలే జరుగుతుంది. రాబోయే తలనొప్పులను ముందుగానే గుర్తించేలా బ్యాంకులపై ఒత్తిడి పెంచడం ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తం పటిష్టంగా అయ్యేలా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా భారీ బ్యాంకింగ్ సంక్షోభాలు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఆర్థికంగా మందగమనాల్లాంటివేవైనా తలెత్తినా బ్యాంకులు 'ఆరోగ్యకరంగా'నే ఉంటాయి. ఇక రుణాలు తీసుకున్న వారి విషయానికొస్తే.. క్రెడిట్ డిసిప్లిన్ అనేది సూపర్‌పవర్‌లాంటిది గుర్తెరిగి వ్యవహరించడం వల్ల రుణ ప్రయాణాలు సాఫీగా సాగుతాయి.

## స్థిరమైన ఆదాయానికి అవీవా ఇండియా ప్లాన్

న్యూఢిల్లీ: అవీవా ఇండియా 'అవీవా సెక్యూర్ నెస్ట్ యాన్యుటీ ప్లాన్'ను ప్రవేశ పెట్టింది. సింగిల్ ప్రీమియంతో స్థిరమైన ఆదాయాన్ని పొందే పరిష్కారమే ఈ ప్లాన్ అని సంస్థ ప్రకటించింది. 80 ఏళ్ల వయసు వరకు ఈ ప్లాన్‌లోకి ప్రవేశించొచ్చు. ఈ ప్లాన్ కింద ఒకరికి లేదంటే ఉమ్మడిగా కవరేజీని కూడా పొందొచ్చు. మరణానంతరం నామినీలకు కొనుగోలు ధరను చెల్లించే సదుపాయం కూడా ఉంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) నిబంధనలకు అనుగుణంగా ఈ ప్లాన్ పనిచేస్తుందని అవీవా ఇండియా తెలిపింది. జీవిత కాలం పాటు స్థిరమైన ఆదాయానికి ఈ ప్లాన్ ద్వారా భరోసా ఇస్తున్నట్టు అవీవా ఇండియా ఎండీ, సీఈవో అసిత్ రథ్ తెలిపారు.

**బజాజ్ లైఫ్ 'యంగ్ అచీవర్ ప్లాన్'**

బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ చదువుకునే పిల్లల పేరిట సంపద సృష్టితోపాటు, వారి భవిష్యత్ లక్ష్యాలకు కవరేజీతో కూడిన 'బజాజ్ లైఫ్ యంగ్ అచీవర్ ప్లాన్'ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా పిల్లల కోసం కావాల్సినంత నిధిని (హామీతో కూడిన) సమకూర్చుకోవచ్చు. తల్లి/తండ్రి మరణిస్తే లేదా వైకల్యం పాలు కావడం లేదంటే ఎంపిక చేసిన 25 తీవ్ర అనారోగ్యాల్లో (క్రిటికల్ ఇల్‌నెస్) ఏదేనీ బారిన పడితే, ఆ తర్వాత భవిష్యత్ ప్రీమియంలు చెల్లించక్కర్లేదు. పాలసీ యథావిధిగా కొనసాగుతుంది. ఒకే విడత చెల్లింపులు లేదా పిల్లల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్రమానుగతంగా ఆదాయం అందుకునే ఆప్షన్లలో ఒకదానిని ఎంపిక చేసుకోవచ్చు. 5–12 ఏళ్ల మధ్య ప్రీమియం చెల్లింపుల కాలవ్యవధిని ఎంపిక చేసుకోవచ్చు. ప్రీమియం చెల్లింపులకు, చివర్లో అందుకునే ప్రయోజనాలపై పన్ను ప్రయోజనాలున్నాయి.

# డిగ్రీ ఉంటే సరిపోదు.. స్కిల్ ఉంటేనే ఛాన్స్

- విద్యార్థుల్లో పెరుగుతున్న వాస్తవిక దృక్పథం
- కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ నైపుణ్యాలకే ప్రాధాన్యత
- ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌కు డిమాండ్
- 'అన్‌స్టాప్ టాలెంట్ రిపోర్ట్ 2026' సర్వేలో ఆసక్తికర విషయాలు




ముంబై: నేటి తరం విద్యార్థుల వేతన అంచనాలకు, మార్కెట్లోని వాస్తవ పరిస్థితులకు మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. పట్టభద్రులవుతున్న విద్యార్థుల్లో దాదాపు 73 శాతం మంది రూ.5 లక్షలకు మించి వార్షిక వేతనాన్ని (ఎల్‌పీఏ) ఆశిస్తుండగా.. కేవలం 40 శాతం మంది మాత్రమే ఆ లక్ష్యాన్ని సాధిస్తున్నారని 'అన్‌స్టాప్ టాలెంట్ రిపోర్ట్ 2026' వెల్లడించింది. దేశవ్యాప్తంగా 37 వేలకు పైగా విద్యార్థులు, 500 మందికి పైగా హెచ్‌ఆర్ ప్రతినిధుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

**డిగ్రీ 'ప్రీమియం' కనుమరుగు:** ఒకప్పుడు పెద్ద కోర్సులు చదివిన వారికి మాత్రమే దక్కే 'అదనపు వేతన ప్రాధాన్యం' క్రమంగా తగ్గుతోంది. ఎంబీఏ పూర్తి చేసిన వారిలో 30 శాతం మంది రూ. 10 లక్షల కంటే తక్కువ వార్షిక వేతనం పొందుతుండగా, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 39 శాతం మంది రూ. 7 లక్షల లోపు వేతనాలకే పరిమితమవుతున్నారు. దీనిని బట్టి వివిధ కోర్సుల మధ్య ఉన్న 'వేతన అంతరం' తగ్గుముఖం పడుతోందని స్పష్టమవుతోంది.

**విద్యార్థుల ఆలోచనా ధోరణిలో మార్పు:** పెరుగుతున్న పోటీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సైతం వాస్తవిక దృక్పథంతో ఆలోచిస్తున్నారు. మెరుగైన అభ్యాస అవకాశాలు, కెరీర్ వృద్ధి ఉంటే 90 శాతం మందికి పైగా విద్యార్థులు తక్కువ జీతానికైనా పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే 82 శాతం మంది విద్యార్థులు తక్షణ ఆర్థిక స్థిరత్వం కోసం అదనపు ప్రయోజనాల (పెర్క్స్) కంటే చేతికి వచ్చే జీతానికే (ఇన్–హ్యాండ్ శాలరీ) ప్రాధాన్యత ఇస్తున్నారు.

**నైపుణ్యమే అసలైన 'గేట్‌కీపర్':** ప్రస్తుత పోటీ ప్రపంచంలో నియామక ప్రమాణాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు కేవలం డిగ్రీ సర్టిఫికేట్లు చూసి ఉద్యోగాలిచ్చిన కంపెనీలు, ఇప్పుడు అభ్యర్థుల్లోని నైపుణ్యాలు (స్కిల్స్), కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాన్నే ప్రాతిపదికగా తీసుకుంటున్నాయి. సుమారు 64 శాతం మంది హెచ్‌ఆర్ ప్రతినిధులు ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలపై పట్టున్న వారినే 'ప్రీమియం టాలెంట్'గా గుర్తిస్తున్నారు. భవిష్యత్తులో ప్రాబ్లమ్ సాల్వింగ్ (49%), ఏఐ పరిజ్ఞానం (39%), ఎమోషనల్ ఇంటెలిజెన్స్ (30%) వంటి సామర్థ్యాలు ఉన్నవారికే అత్యధిక డిమాండ్ ఉంటుందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

**ఎంపిక ప్రమాణాలు మారాయి:** భారత ఉద్యోగ విపణిలో అవకాశాలు తగ్గలేదు, కానీ ఒక నిర్మాణాత్మక మార్పు జరుగుతోంది. నైపుణ్యం, ఏఐ పరిజ్ఞానం ఉన్నవారికి మాత్రమే అవకాశాలు దక్కుతున్నాయి. బలమైన పునాదులతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు, ఏఐ ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులే ఈ పోటీలో నిలబడతారు'' అని అన్‌స్టాప్ వ్యవస్థాపకుడు, సీఈఓ అంకిత్ అగర్వాల్ విశ్లేషించారు.

# డిడక్షన్లు కొనసాగుతాయా..

డా. కందాళ సత్యనారాయణ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

కొత్త చట్టం. కొత్త రూల్సు, కొత్త ఫారాలు. కొత్త ఆర్థిక సంవత్సరం. గత ఆర్థిక సంవత్సరం వరకు అమల్లో ఉన్న డిడక్షన్లు కొనసాగుతాయా? ఈ సంవత్సరం క్లెయిం చేసుకోవచ్చా? పాత చట్టంతో పాటు అవి కూడా పోతాయా? చాలా మంది ట్యాక్స్ పేయర్లు ఇలాంటి సందేహాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా అడుగుతున్నారు. ఒక మాటలో, సుందరకాండలో హనుమంతుడు చెప్పినట్లు చెప్పాలంటే, 'కొనసాగుతాయి' అని చెప్పాలి. ఇక వివరాల్లోకి వెళితే..

పాత చట్టం, అంటే 1961 చట్టంలోని అంశాలు అన్నింటినీ యధాతథంగా కొనసాగించారు. భాష మారింది. సెక్షన్ల అంకెలు మారాయి. చెప్పవలసిన సందర్భం మారింది. అంతే కాని, అంశాలు, వాటి ఉద్దేశం, పరిమితులు, ఉప పరిమితులు, ఆంక్షలు, షరతులు, వర్తించే నియమావళి మారలేదు. ఒకప్పుడు చాప్టర్ VI-Aలో పొందుపర్చిన అంశాలను వేరొకచోట, సెక్షన్ల నంబర్లు మార్చి, వరుసగా, మరింత సరళమైన భాషతో, భావంతో మరింత నిర్మాణాత్మకంగా విశదీకరించారు.

పాత సంవత్సరంలో అసెస్సీలకు, అంటే, మీకు, మనందరికి, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించడానికి రెండు ఆప్షన్లు ఇచ్చారు. పాత పద్ధతిలో సెక్షన్ 80సి, 80డి, 80ఈ మొదలైన సెక్షన్ల ప్రకారం డిడక్షన్లు ఇచ్చారు. బేసిక్ లిమిట్ .. వయస్సును బట్టి ఉంది. రేట్లు 10 శాతం, 20 శాతం, 30 శాతం.

కొత్త పద్ధతిలో ఎటువంటి డిడక్షన్లు ఇవ్వడం లేదు. బేసిక్ లిమిట్ ఎవరికైనా రూ. 3,00,000తో మొదలుపెట్టి రూ. 4,00,000కు పెంచారు. ప్రతి శ్లాబ్‌ను రూ. 4,00,000 చొప్పున పెంచారు. రేట్లు 5%, 10%, 15%, 20%, 25% తర్వాత 30%. ఇలా ఉంటుండగా 'రిబేటు' పేరిట పెద్ద రిలీఫ్ ఇచ్చి రూ. 12,75,000 ఆదాయం వరకు ఉద్యోగస్తులకు, ఇతరులకేమో రూ. 12,00,000 వరకు ఎటువంటి పన్నుభారం లేకుండా చేశారు. కొత్త పద్ధతిలో మీరు ఎటువంటి సేవింగ్స్ చేయనక్కర్లేదు. ఏమీ ఇన్వెస్ట్‌మెంట్ చేయనక్కర్లేదు. అంటే నగదు.. నగదంటే.. నగదు కాదు.. బ్యాంకు ద్వారా ఎటువంటి విధంగా బైటకు వెళ్లడం (ఔట్‌ఫ్లో) ఉండక్కర్లేదు. అంటే మీ చేతిలో 'సర్‌ప్లస్' ఉంటుంది. పాత పద్ధతిలో రూ. 10,00,000 నికర ఆదాయం దాటితే 30 శాతం వర్తిస్తుంది. కొత్త పద్ధతిలో రూ. 24,00,000 దాటితే 30 శాతం వర్తిస్తుంది.

పైన చెప్పినదంతా మీకు ఇదివరకు తెలిసిందే. కొత్త అంశాలు లేవు. వీటిని యధాతథంగా కొత్త చట్టంలోకి తెచ్చారు. వాటికి అనుగుణంగా అనుసంధానం చేస్తూ రూల్సు, ఫారాలు మార్చారు. మీకు ఎన్నో సంవత్సరాలుగా పరిచయం ఉన్న సెక్షన్ 80సి ఇప్పుడు కొత్త చట్టంలో 123గా మారింది. అలాగే మరో సెక్షన్ 80డి ఇప్పుడు 127గా చలామణీలోకి వచ్చింది. ఇలాగే మిగతా అన్ని డిడక్షన్లు.

కొత్త చట్టంలోనూ, కొత్త రూల్స్ ప్రకారం, కొత్త ఫారాల అమల్లో అదే సమస్య.. కాదు..కాదు.. అదే పరిస్థితి. రెండు రకాల ఆప్షన్లు. మీరు నిర్ణయించుకోవాల్సినది.. దేన్ని ఎంచుకోవాలని. పాతదా కొత్తదా.. గతంలో ఎన్నోసార్లు ఎన్నెన్నో ఉదాహరణలు ఇచ్చి వివరించాము. ఒక వ్యూహంతో నిర్ణయం తీసుకోవాలి. ఈ నిర్ణయం తీసుకోవడానికి కొన్ని సలహాలు.

**కేవలం పన్నుభారం తగ్గే దిశలో ఆలోచిస్తే ..**

ఏదో ఒక కారణం వల్ల ప్రావిడెంట్ ఫండ్‌కి కాంట్రిబ్యూషన్ కంపల్సరీ. పిల్లలు చదువుకుంటున్నారు. ఫీజులు చెల్లించాలి. మెడికల్ అత్యవసరం లేదా కంపల్సరీ. ఇలాంటి సందర్భాల్లో మీరు మీ ఖాతా నుంచి ఖర్చు పెట్టక తప్పదు. నగదు బైటకు వెళ్లడం తప్పదు. ఇన్‌కం ట్యాక్స్ చట్టంతో సంబంధం లేకుండా ఖర్చు తప్పదు. అప్పుడు పాత పద్ధతిని ఎంచుకోండి. డిడక్షన్ క్లెయిమ్ చేయండి. మరొక పరిస్థితి. సేవింగ్స్ అవసరం లేదు. పిల్లలకు ఫీజులు కట్టక్కర్లేదు. అనారోగ్య భయం లేదు. అటువంటప్పుడు కొత్త పద్ధతిని ఎంచుకోండి.

**పన్నుయేతర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి నిర్ణయం తీసుకోవాలంటే..**

పాత పద్ధతిలో ప్రతి డిడక్షన్‌కి కాగితాలు, రుజువులు ఉండాలి. వివరణ ఇవ్వాలి. కొత్త పద్ధతిలో ఎటువంటి కాగితాల్లాంటివి అవసరం లేదు.

**ఇతర అంశాలు..**

సులభతరం కాబట్టి, యువతరం కొత్త పద్ధతివైపు మొగ్గు చూపుతున్నారు. వృద్ధులు జాగ్రత్తపరులుగా ఉండి, పాత పద్ధతివైపు వెళ్తున్నారు. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి. గడువు తేదీ దాటితే పాతపద్ధతిలో వేయలేరు. యజమానికి ముందుగా చెప్పాలి. వ్యాపారస్తులు, వృత్తి నిపుణులకు మార్పిడి విషయంలో ఆంక్షలు ఉన్నాయి.

ఆలోచించుకుని సరైన నిర్ణయం తీసుకోండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఉంటే business@sakshi.com కు ఈ-మెయిల్ పంపించగలరు.

## డీమార్ట్ లాభం అప్

**క్యూ4లో రూ. 656 కోట్లు**

న్యూఢిల్లీ: రిటైల్ రంగ దిగ్గజం ఎవెన్యూ సూపర్‌మార్ట్స్(డీమార్ట్) గత ఆర్థిక సంవత్సరం(2025–26) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం ఎగసి రూ. 656 కోట్లను అధిగమించింది. 2024–25 ఇదే కాలంలో రూ. 551 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఆదాయం సైతం 19 శాతం బలపడి రూ. 17,684 కోట్లకు చేరాయి. అంతక్రితం క్యూ4లో రూ. 14,872 కోట్ల అమ్మకాలు సాధించింది. మొత్తం వ్యయాలు 19 శాతం పెరిగి రూ. 16,798 కోట్లను తాకాయి. నికర లాభ మార్జిన్లు నిలకడను చూపుతూ 3.7 శాతంగా నమోదయ్యాయి. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి డీమార్ట్ స్టోర్ల దిగ్గజం నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 2,970 కోట్లయ్యింది. మొత్తం కన్సాలిడేటెడ్ ఆదాయం 16 శాతం పుంజుకుని రూ. 68,895 కోట్లను తాకింది. క్యూ4లో ప్రారంభించిన 58 కొత్త స్టోర్లతో కలిపి వీటి సంఖ్య 500 మైలురాయికి చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

# ఆదాయపన్నుకు డెడ్‌లైన్!

ఆదాయపన్ను రిటర్నుల దాఖలు పన్ను వర్తించే ఆదాయం పరిధిలో ఉన్న వారందరూ తప్పనిసరిగా చేయాల్సిన పని. అది కూడా గడువులోపు దాఖలు చేయడం ఉత్తమం. పన్ను వర్తించేంత ఆదాయం లేకపోయినా సరే, కొన్ని లావాదేవీల్లో (టీడీఎస్ తదితర) భాగస్వాములై ఉన్నా కానీ రిటర్నులు దాఖలు చేయాల్సిందే. అంతేకాదు పన్ను వర్తించే ఆదాయం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 మించుతుంటే ముందస్తు పన్ను చెల్లింపుల బాధ్యత కూడా ఉంటుంది. కనుక ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఆదాయపన్ను నిబంధనల పాటింపునకు సంబంధించి కీలక తేదీలను ఒక్కసారి తెలుసుకుందాం.

### మే 2026

**మే 7:** ఏప్రిల్ 2026 నెలకు సంబంధించిన టీడీఎస్/టీసీఎస్ డిపాజిట్ చేయాలి.

**మే 15:** ఏప్రిల్ నెలకు సంబంధించి శాలరీ (ఫారమ్ 16), ఇతర పేమెంట్లకు (ఫారమ్ 16ఏ) టీడీఎస్ సర్టిఫికెట్లు జారీ చేయాలి.

**మే 30:** జనవరి–మార్చి 2026 త్రైమాసికానికి సంబంధించి టీసీఎస్ సర్టిఫికెట్లు జారీ చేయాలి.

**మే 31:** అధిక విలువ కలిగిన ఆర్థిక లావాదేవీల నివేదిక (ఫారమ్ 61ఏ), ఆస్తి లావాదేవీల నివేదిక (ఫారమ్ 61బీ) దాఖలు చేయడానికి చివరి తేదీ. స్వచ్ఛంద సంస్థలు తమ విరాళాల నివేదికను (ఫారమ్ 10బీడీ) దాఖలు చేయాలి.

### జూన్ 2026

**జూన్ 7:** మే 2026 నెలకు సంబంధించిన టీడీఎస్/టీసీఎస్ డిపాజిట్ చేయాలి.

**జూన్ 15:** మొదటి విడత అడ్వాన్స్ టాక్స్ (సంవత్సరం మొత్తం పన్ను బాధ్యత అంచనాలో 15శాతం) చెల్లించడానికి చివరి తేదీ.

**జూన్ 30:** మే నెలకు సంబంధించిన టీడీఎస్ చలాన్–స్టేట్‌మెంట్ దాఖలు చేయాలి. ఏఐఎఫ్‌లు క్రితం త్రైమాసిక నివేదికలను సమర్పించాలి.

### జూలై 2026

**జూలై 31:** ఆడిట్ అవసరం లేని వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు తమ ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్–1 లేదా ఐటీఆర్–2) దాఖలు చేయడానికి చివరి తేదీ.

### ఆగస్టు 2026

**ఆగస్టు 15:** ఏప్రిల్–జూన్ (క్యూ1) త్రైమాసికానికి సంబంధించిన టీడీఎస్ రిటర్నులు దాఖలు చేయాలి.

**ఆగస్టు 31:** ఆడిట్ అవసరం లేని వ్యాపార నిపుణులు ఐటీఆర్–3 లేదా ఐటీఆర్–4 దాఖలు చేయడానికి పొడిగించిన గడువు.

### సెప్టెంబర్ 2026

**సెప్టెంబర్ 15:** రెండో విడత అడ్వాన్స్ టాక్స్ (మొత్తం 45శాతం) చెల్లించడానికి చివరి తేదీ.

**సెప్టెంబర్ 30:** జూలై–సెప్టెంబర్ (క్యూ2) త్రైమాసికానికి సంబంధించిన టీడీఎస్ రిటర్నులు దాఖలు చేయాలి.

### అక్టోబర్ 2026

**అక్టోబర్ 31:** ఆడిట్ అవసరమైన వ్యాపారస్తులు, నిపుణులు తమ ఐటీఆర్–3/ఐటీఆర్–4 రిటర్నులు దాఖలు చేయడానికి చివరి తేదీ.

### నవంబర్ 2026

**నవంబర్ 30:** అంతర్జాతీయ లావాదేవీలు నిర్వహించిన వారు 'ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ రిపోర్ట్' (ఫారమ్ 3సీఈబీ) సమర్పించాలి.

### డిసెంబర్ 2026

**డిసెంబర్ 15:** మూడో విడత అడ్వాన్స్ టాక్స్ (మొత్తం 75శాతం) చెల్లించడానికి చివరి తేదీ.

**డిసెంబర్ 31:** ఆలస్యంగా దాఖలు చేసే రిటర్నులకు పెనాల్టీతో దాఖలు చేయడానికి చివరి అవకాశం.

### జనవరి 2027

**జనవరి 31:** ఉద్యోగులు తమ పన్ను ఆదాకు సంబంధించిన పెట్టుబడుల వివరాలను యజమాన్యానికి సమర్పించాలి.

### ఫిబ్రవరి

**ఫిబ్రవరి 15:** జనవరి నెలకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ జమ చేసేందుకు గడువు.

### మార్చి

**మార్చి 15:** చివరి విడత అడ్వాన్స్ టాక్స్ (100 శాతం) చెల్లించడానికి గడువు.

**మార్చి 31:** పన్ను ఆదా కోసం ఉద్దేశించిన పెట్టుబడులకు, సవరణ రిటర్నులు, ఆలస్యపు రిటర్నుల దాఖలుకు చివరి తేదీ.

# గత ప్రభుత్వ సంస్కరణల వల్లే పదిలో ప్రభంజనం

- టెన్త్ ఫలితాల్లో 596 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ
- వైఎస్ జగన్ హయాంలో సమకూరిన వసతులతో మెరుగైన ఫలితాలు
- నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు



వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన అధునాతన వసతులతో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్)

దశ తిరిగింది.. దిశ మారింది

**సాక్షి, నెట్‌వర్క్:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. వైఎస్ జగన్ పాలనలో చేపట్టిన విద్యా సంస్కరణలు నేడు మంచి ఫలితాలనిస్తున్నాయి. నాడు–నేడు కార్యక్రమం వల్ల సమకూరిన మౌలిక వసతుల వల్ల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. పేదింటి బిడ్డలు వెలుగులు విరజిమ్మారు. 2014–19 మధ్య రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలంటే అందరికీ చిన్నచూపు. చిన్నపాటి వర్షానికే కారే భవనాలు.. కుక్కలు, పందులతో పాఠశాల ప్రాంగణాలు.. తెల్లగా మారిపోయిన బ్లాక్ బోర్డులు.. చివరకు చాక్‌పీస్‌లకూ కొరతే.. పిల్లలకు బెంచీలుండవు.. అయ్యవార్లకు కుర్చీలుండవు.. పిల్లలకు కనీసం తాగడానికి మంచినీరు దొరికేది కాదు. అలాంటి దుస్థితిలో ఉన్న పాఠశాలలను 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది. ఇదివరకెన్నడూ లేనివిధంగా వేల కోట్ల రూపాయలతో నాడు–నేడు కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. సీబీఎస్‌ఈ స్కూళ్లు, ఇంగ్లిష్ మీడియం, టోఫెల్, ఐబీ సిలబస్, విద్యార్థులకు ట్యాబ్‌లు, పిల్లలకు మధ్యాహ్నం గోరుముద్ద పేరిట రుచికరమైన భోజనం, జగనన్న విద్యాకానుక కింద యూనిఫాం, పుస్తకాలు, షూ, బెల్ట్, బ్యాగ్ తదితరాలన్నీ సమకూర్చింది. వీటన్నింటితో పాటు సకల సౌకర్యాలతో పాఠశాలలను తీర్చిదిద్దింది. అత్యాధునిక ల్యాబ్, లైబ్రరీ, ఫర్నిచర్, డెస్కులు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, వాటర్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు క్యూ కట్టారు. ఓ దశలో పలు పాఠశాలల్లో హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టారు. వీటన్నింటికీ తోడు పిల్లలను బడులకు పంపే తల్లులకు ఏటా రూ.15 వేలు అమ్మ ఒడి పేరిట తల్లుల ఖాతాల్లో జమ చేశారు.

వైఎస్ జగన్ ప్రభుత్వ సంస్కరణల ఫలితంగా 2022 నుంచి ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మారిపోయింది. అప్పటివరకు పదో తరగతి ఫలితాల్లో గుత్తాధిపత్యం గల కార్పొరేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఫలితాలు రావడం మొదలైంది. దిగువ మధ్యతరగతి, పేదింటి పిల్లలు సైతం అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రభంజనం సృష్టిస్తున్నాయి. ప్రతి పాఠశాలలోనూ పిల్లలు మంచి మార్కులు సాధించారు. పలువురు విద్యార్థులు 596 మార్కులు సాధించారంటే ఇందుకు కారణం గత ప్రభుత్వ సంస్కరణలే అని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెబుతున్నారు.

## వైఎస్ జగన్ ఉజ్వల భవితకు బాట వేశారు

**596/600**

నాన్న హరిప్రసాద్ వ్యవసాయమే ప్రపంచం. సాధారణ గృహిణి అయిన అమ్మ రాజ్యలక్ష్మికి ఇల్లే ప్రపంచం. ఆకలి బాధతో చదువుకునే విద్యార్థులు మెరుగైన లక్ష్యాలను అందుకోలేరన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో ఎన్నో మార్పులు తెచ్చింది. ఎంతో మంది విద్యార్థుల ఆకలి బాధను పోషకాహారంతో తీర్చి మంచి మార్కులతో ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా బాటలు వేసింది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి 596 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ర్యాంక్ సాధించడానికి గత ప్రభుత్వ విధానాలే బాటలు వేశాయి. 4వ తరగతి వరకు కొల్లూరులోని ప్రైవేట్ స్కూల్‌లో చదివాను. ఐఐటీ పూర్తి చేసి సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నా.

- బావిరెడ్డి దివ్య తేజశ్రీ, గాజుల్లంక, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా

## జగన్ ప్రభుత్వం ముందు చూపు వల్లే..

**596/600**

నాన్న దూళ్ల శ్రీనివాస్ వ్యవసాయ పనులకు వెళ్తారు. అమ్మ వీరవేణి గృహిణి. మాది మధ్యతరగతి కుటుంబం. నేను టెన్త్ ఫలితాల్లో 600 మార్కులకు 596 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచాను. దీనికి ప్రధాన కారణం నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలల్లో 'నాడు–నేడు'లో అభివృద్ధి చేయడమే. చక్కటి తరగతి గదులు, డిజిటల్ తరగతులు, ట్యాబ్‌లు, ఫుట్‌పాత్, చక్కటి మొక్కలు, సమావేశపు ప్రాంగణం, టేబుల్స్ వంటి మౌలిక వసతులతో సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం కల్పించారు. పాఠశాలను అత్యంత ఆధునిక వసతులతో తీర్చిదిద్దడంతో బాగా చదువుకోగలిగాను. పాఠశాలలో కల్పించిన ఆధునిక వసతులు ఎంతో ప్రేరణగా నిలిచాయి. మా చెల్లి కూడా ఇదే పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. భవిష్యత్‌లో సీఏ చదవాలనుకుంటున్నాను.

- దూళ్ల చిన్నారి, సంపర, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా

## నాడు-నేడు నా జీవితాన్నే మార్చింది

**596/600**

నాన్న చక్రపాణి ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్. అమ్మ పద్మావతి గృహిణి. నేను పాణ్యం మండలం నెరవాడ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్నా. టెన్త్‌లో 596 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలవడానికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం. ఇది ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. ఐదో తరగతిలో చేరినప్పుడు పాఠశాలలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. కిందనే కూర్చుని పాఠాలు వినేవాళ్లం. విద్యుత్ సౌకర్యం ఉండేది కాదు. వైఎస్ జగన్ ప్రభుత్వం మంచి టేబుల్స్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ లాంటి సదుపాయాలు ఏర్పాటు చేసింది. డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చింది. ఐఎఫ్‌బీ ప్యానెల్ ఏర్పాటు చేసి వాటి ద్వారానే ఉపాధ్యాయులు బోధన చేసేవారు. 8వ తరగతిలో ట్యాబులు ఇచ్చారు. వీటిద్వారా ఎప్పటికప్పుడు సబ్జెక్టులలో వచ్చే అనుమానాలు నివృత్తి చేసుకునే దాన్ని. భవిష్యత్‌లో గైనకాలజిస్ట్ కావాలనుకుంటున్నాను.

- సాయిశ్రీ, నెరవాడ గురుకుల పాఠశాల, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా

## నాడు- నేడుతో బడి బాగు

**596/600**

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ అనుసరించిన విధానాలతో మా ఊరితో పాటు పాఠశాల బాగు పడింది. విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యార్థులకు ట్యాబ్స్ ఇవ్వడంతోపాటు నాడు–నేడు పథకంలో మా పాఠశాలని కూడా బాగుచేయడం ఎంతో నచ్చింది. ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌ల వల్ల మాకు క్విక్ రివిజన్ అయ్యేది. దీనివల్ల ఒత్తిడి ఉండేది కాదు. దీనివల్ల మేం ముందుకు సాగాం. చదివింది, విన్నది, చూసినది అన్నీ చక్కగా గుర్తుపెట్టుకోగలిగాను. 10వ తరగతి పరీక్షల్లో కంగారు లేకుండా బాగా రాయటానికి ఇవన్నీ దోహదపడ్డాయి. మొత్తంగా టెన్త్‌లో 596 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలబడటానికి గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలే కారణం. నాన్న వెంకట దుర్గారావు పెయింటింగ్ వర్కర్. తల్లి నాగలక్ష్మి బీఏ, బీఈడీ చేసి గృహిణిగా స్థిరపడ్డారు. యూపీఎస్సీలో మంచి ర్యాంకు సాధించడమే నా గోల్.

- శిరిగినీడి రిషిత లక్ష్మి నిహారిక, సామంతకుర్రు, అల్లవరం మండలం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

## ట్యాబుల వల్లే మంచి మార్కులు సాధించా..

నాన్న శ్రీనివాసరావు గ్యాస్ డెలివరీ చేస్తారు. అమ్మ వెంకట అనంతలక్ష్మి గృహిణి. అమ్మ బీకామ్ చదివింది. క్లాస్‌లో టాప్‌లో ఉండాలని చెబుతుంటారు. జగన్ ప్రభుత్వంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)లు వచ్చిన తరువాత మాకు ల్యాబ్ లేదన్న కొరత తీరింది. పాఠాలు చెప్పడం, వెంటనే వీడియోలో ప్లే చేయడం, ట్యాబ్‌లలో స్లిప్ టెస్టులు, స్పెషల్ టెస్టులు పెట్టేవారు. ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌ల వల్ల మాకు క్విక్ రివిజన్ అయ్యేది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన నాడు–నేడు, నూతన విద్యావిధానం మాకెంతో ఉపయోగపడింది.

**595/600**

- గాలిదేవర హర్షిణీ సత్యదుర్గ, జెడ్పీ హైస్కూల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

## మంచి బోధనా వసతులే కారణం

నాన్న కోలా కులశేఖర్. అమ్మ సరోజమ్మ. మాది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులకు భారం కాకూడదని నాగలగుట్టపల్లె జెడ్పీ హైస్కూల్‌లో చదివా. పదో తరగతిలో 595 మార్కులు సాధించా. ఉన్నత చదువులకు పేదరికం, ఆర్థిక సమస్య అడ్డుగోడగా ఉంటోంది. కష్టపడి చదివి తొలుత డాక్టర్ వృత్తి చేపడతా. సివిల్స్‌కు ప్రిపేర్ అయి కలెక్టర్ అవుతా. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలో కల్పించిన మంచి బోధనా వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం బాగా చదవడానికి దోహదపడింది. నాడు–నేడు పథకంలో ప్రతి తరగతి గదికి ఇచ్చిన ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు ద్వారా కల్పించిన విద్యాబోధన కూడా విజయానికి దోహదపడింది.

**595/600**

- కోలా లక్ష్మి వెంకటేశ్వర్, నాగలగుట్టపల్లె జెడ్పీ హైస్కూల్, వైఎస్సార్ కడప జిల్లా

## గత ప్రభుత్వం వల్లే అధిక మార్కులు

టెన్త్‌లో 600 మార్కులకు 595 మార్కులతో టాపర్‌గా నిలిచాను. మా పాఠశాలను గత ప్రభుత్వం 'నాడు–నేడు'లో అన్నివిధాలుగా అభివృద్ధి చేసింది. మా స్కూల్‌లో ప్రశాంత వాతావరణం కల్పించడంతో చదువుపై దృష్టి పెట్టాను. డిజిటల్ తరగతి గదులు, అత్యంత ఆధునికత ఉట్టిపడేలా టేబుళ్లు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్పొరేట్ స్కూళ్లలో లక్షలు ఖర్చు చేస్తే కానీ చదవలేం. కానీ ప్రభుత్వ పాఠశాలలోనే కార్పొరేట్ వసతులు కల్పించారు. మా వంటి పేద విద్యార్థులకు ఇంతకంటే ఏం కావాలి. నాన్న రవికిశోర్ అకౌంటెంట్. అమ్మ ఉషారాణి గృహిణి. టీచర్ కావాలన్నదే నా ఆశయం.

**595/600**

- పత్రి హర్షిణి, జెడ్పీ బాలికల హైస్కూల్, తుని, కాకినాడ జిల్లా

## 'సాక్షి' మెటీరియల్ అద్భుతం

మాది వ్యవసాయ ఆధారిత మధ్య తరగతి కుటుంబం. నాన్న కొర్రకూటి వెంకటేశ్వర్లు. అమ్మ లక్ష్మి గృహిణి. ఆర్థిక స్తోమత లేని కారణంగా ఊళ్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థలో తెచ్చిన పటిష్టమైన విద్యా ప్రమాణాలే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. టెన్త్‌లో 600 మార్కులకు గాను 595 మార్కులొచ్చాయి. జగన్ ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్ నా చదువుకు ఎంతో దోహదపడింది. ఉపాధ్యాయుల బోధనతో పాటు 'సాక్షి' మీడియా అందించిన స్టడీ మెటీరియల్ కూడా మంచి మార్కులు సాధించేందుకు సహకరించింది. సివిల్స్ సాధనే లక్ష్యంగా ఎంచుకున్నాను.

**595/600**

- కొర్రకూటి యశ్విత, నాగులువెల్లటూరు, చేజర్ల మండలం, పల్నాడు జిల్లా

## డిజిటల్ విద్యతో ఉత్తమ ఫలితాలు

**595/600**

గత ప్రభుత్వం 'నాడు–నేడు' పథకంలో భాగంగా కాకినాడ శ్రీనగర్‌లో ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టిన డిజిటల్ విద్య పదో తరగతి పరీక్షల్లో 595 మార్కులు సాధించేందుకు ఎంతగానో దోహదపడింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా 2023లో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారు. డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు కూడా ఇచ్చారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాను. సుద్ద ముక్కలు, బ్లాక్ బోర్డులు అవసరం లేకుండా మా పాఠశాలలో జరిగిన డిజిటల్ బోధన, కార్పొరేట్ పాఠశాలల్లో లేనివిధంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లేలను 'నాడు–నేడు'లో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయడం కలిసొచ్చింది. మా నాన్న రామలింగరాజు ప్రైవేట్ ఉద్యోగి. తల్లి శ్వేత గృహిణి. వారిద్దరూ నాకెంతో స్ఫూర్తిని కలిగించారు. ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపు తీసుకుని చార్టర్డ్ అకౌంటెంట్‌గా స్థిరపడాలనేది నా ఆశయం.

- వేగిరాజు కావ్య హాసిని, శ్రీనగర్ ఉన్నత పాఠశాల, కాకినాడ

## ఐఎఫ్‌పీ ప్యానల్స్ బాగా ఉపయోగపడ్డాయి

**595/600**

టెన్త్‌లో 595 మార్కులు రావడం చాలా సంతోషంగా ఉంది. నాన్న బ్రహ్మానందం చిన్న షాపు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అమ్మ సౌజన్య గృహిణి. వైఎస్ జగన్ హయాంలో నాడు–నేడు పథకాన్ని మా పాఠశాలలో బాగా అమలు చేశారు. తరగతి గదులలో టైల్స్ వేశారు. ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)ల ద్వారా విద్యాబోధన మరింత మేలు చేసింది. పాఠాలు వినడంతో పాటు వీడియోలు కూడా చూడటం వల్ల మాకు మరింతగా అర్థమయ్యాయి. ట్యాబ్‌లు అందుబాటులో ఉండటం వల్ల మాకు తరచూ స్లిప్ టెస్టులు నిర్వహించారు. ఈ కారణంగానే మాకు మంచి మార్కులు వచ్చాయి. భవిష్యత్‌లో కంప్యూటర్ ఇంజినీరింగ్ చేస్తాను.

- నంద్యాల కార్తీక, జెడ్పీ హైస్కూల్, పి.లక్ష్మీవాడ, కాట్రేనికోన మండలం, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

## వైఎస్ జగన్ హయాంలోనే కొత్త భవనాలు

**595/600**

మాది పీలేరు. నాన్న ఆర్‌డీ మునిరాజ్ కడపలోని జగదీశ్వర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో మేనేజర్. అమ్మ శైలజ గృహిణి. నేను 5వ తరగతి వరకు మదనపల్లె విజయభారతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో చదివా. తరువాత జెడ్పీ హైస్కూల్‌లో చేరా. టెన్త్‌లో 595 మార్కులు సాధించా. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో కొత్త భవనాలు వచ్చాయి. డిజిటల్ బోర్డులపై విద్యాబోధన కూడా చాలా బాగా అర్ధమైంది. అప్పటి ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు చాలా అద్భుతంగా ఉపయోగపడ్డాయి. పాఠశాల రూపురేఖలు కూడా మార్చేశారు. చూస్తే బిల్డింగ్‌లతోపాటు వివిధ రంగులలో ఉన్న బెంచీలు, ఇతర పరిసరాలు బాగా ఉన్నాయి. అప్పట్లో మాకు ఇచ్చిన అన్ని వస్తువులు బాగా ఉపయోగపడ్డాయి. మాకున్న లాంగ్వేజ్‌లతో పాటు మిగతా సబ్జెక్టులు ఏవీ కష్టంగా భావించలేదు. ఇంటర్‌లో ఎంపీసీ తీసుకుని ఐఐటీ సాధన దిశగా ముందుకెళ్లాలని నిశ్చయించుకున్నా.



- ఆర్‌డీ వైష్ణవి, జెడ్పీ గర్ల్స్ హైస్కూల్, పీలేరు, అన్నమయ్య జిల్లా

---

# మోకాళ్లపై కూర్చోబెట్టి.. తుపాకులు గురిపెట్టి

### కరీంనగర్‌లోని జ్యువెలరీస్‌లో దోపిడీ..

**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** ఆదివారం ఉదయం ప్రశాంతంగా ఉన్న తెలంగాణలోని కరీంనగర్ పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కాల్పుల మోతతో కలకలం రేగింది. స్థానిక జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెలరీస్‌లో బంగారం, ఆభరణాలు దోచుకున్న దొంగలు.. అడ్డువచ్చిన సిబ్బందిపై తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. ఇందులో తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రూ.2 కోట్లకు పైగా విలువైన కిలోన్నర బంగారం దొంగలు దోచుకున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..ఉదయం 11.06 గంటల ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు పీఎంజే జ్యువెలరీ షాపు వద్దకు వచ్చారు. తొలుత లోపలికి వచ్చిన ఒక వ్యక్తి 20 గ్రాముల గొలుసులు చూపించాలని అడిగాడు. ఆ వెంటనే మరో ఇద్దరు వచ్చి నగలు చూపాలని అడిగారు. వీరిద్దరిపై సేల్స్‌మేన్‌కు అనుమానం వచ్చి ఇన్‌చార్జికి చెప్పడంతో అతను నగలు చూపిస్తున్నాడు. ఆ సమయంలో మరో ఇద్దరు ద్వారం వద్దే నిలబడ్డారు. ఈ క్రమంలో లోపల ఉన్న ముగ్గురూ తుపాకులు బయటకు తీసి తెలుగు, హిందీ భాషల్లో అరుస్తూ.. నగలు, బంగారం బయటికి తీయాలని బెదిరించారు. సిబ్బందిని మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు కట్టేశారు. తలలకు తుపాకులు గురిపెట్టారు. వీరిలో ఇద్దరు బంగారం, నగలు సర్దారు. ఈ క్రమంలో అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న ముస్తాక్ దొంగలపై తిరగబడ్డాడు. మధుకర్, రాజేశ్, కమలాసన్ అనే సిబ్బంది కూడా ఎదురుతిరిగారు. దీంతో దుండగులు ఒక్కసారిగా ఫైర్ ఓపెన్ చేశారు. ముస్తాక్‌కు బుల్లెట్ తలను రాసుకుంటూ దూసుకెళ్లింది. దీంతో అతను అక్కడే కుప్పకూలాడు. మధుకర్‌కు బుల్లెట్ పేగుల వరకు వెళ్లింది. రాజేశ్‌కు కుడి భుజం, కమలాసన్‌కు ఎడమ భుజానికి తూటా గాయాలయ్యాయి. వీరిలో ముస్తాక్, మధుకర్ పరిస్థితి విషమంగా ఉంది. కాల్పులు జరుపుతూనే దొంగలు 11.11 గంటల కల్లా తాము వచ్చిన అపాచీ (తెలుపు), పల్సర్ (నలుపు) బండ్ల మీద పరారయ్యారు. మొత్తం దొంగతనం కేవలం 5 నిమిషాల్లోనే ముగియడం విశేషం. ఘటనాస్థలం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి కేవలం 100 మీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం.

# సరళంగా నీట్ యూజీ–2026 ప్రశ్నపత్రం

### గతేడాదితో పోలిస్తే ఈసారి పెరగనున్న కటాఫ్‌లు.. అంచనా వేసిన సబ్జెక్టు నిపుణులు

**సాక్షి, అమరావతి:** దేశంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ఇతర యూజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన అర్హత పరీక్ష నీట్ యూజీ–2026 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది నీట్ ప్రశ్నపత్రం సరళంగా ఉందని సబ్జెక్ట్ నిపుణులు తెలిపారు. గత ఏడాది పేపర్ కఠినంగా ఉందని, దానితో పోలిస్తే ఈ దఫా సులభంగా ఉందని పేర్కొన్నారు. దీంతో 2025తో పోలిస్తే ఈసారి కటాఫ్ పెరగనున్నట్టు తెలుస్తోంది. నీట్ యూజీ రాయడానికి దేశ వ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి దేశ వ్యాప్తంగా 5432 కేంద్రాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరీక్ష నిర్వహించింది.

**ఊరటనిచ్చిన ఫిజిక్స్**

గత రెండేళ్లుగాఫిజిక్స్ విద్యార్థులను భయపెడుతుండగా, ఈసారి మాత్రం కొంత ఊరటనిచ్చింది. ఫిజిక్స్ విభాగంలో ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నట్టు సబ్జెక్టు నిపుణులు తెలిపారు. గతేడాది అన్ని ప్రశ్నలూ కఠినంగా రాగా, ఈ సారి పది ప్రశ్నలు మాత్రమే కఠినంగా ఉన్నట్టు చెబుతున్నారు. జువాలజీ కూడా ఈ సారి తేలికగా ఉందని విద్యార్థులు భావిస్తున్నారు. బయాలజీలో ప్రశ్నలను సులభం నుంచి మధ్యస్థంగా వర్గీకరించారు. ప్రశ్నలన్నీ పూర్తిగా ఎన్‌సీఈఆర్టీ పరిధి నుంచే వచ్చాయి. అయితే, గతంలోలా నేరుగా అడిగే ప్రశ్నల కంటే మ్యాచింగ్, అసెర్షన్–రీజనింగ్ ప్రశ్నలు ఎక్కువగా ఉండటంతో ప్రతి ఆప్షన్‌ను నిశితంగా పరిశీలించాల్సి వచ్చిందని విద్యార్థులు వెల్లడించారు. ఇది తమ సమయాన్ని కొంత హరించిందని అభిప్రాయ పడ్డారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్, ఇన్–ఆర్గానిక్ ప్రశ్నలు నేరుగా వచ్చాయి. కానీ, ఫిజికల్ కెమిస్ట్రీలో కొన్ని లెక్కలు సంక్లిష్టంగా ఉండటంతో సగటు విద్యార్థికి సమయం సరిపోలేదని నిపుణులు చెబుతున్నారు. మొత్తం మీద మల్టిపుల్ స్టేట్మెంట్ ప్రశ్నలు ఎక్కువగా ఉన్నాయి.

**స్వల్పంగా కటాఫ్‌లు పెరుగుతాయి**

గత ఏడాదితో పోలిస్తే పేపర్ తేలికగా ఉంది. ఈ క్రమంలో కటాఫ్‌లు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. పేపర్ మధ్యస్థంగా ఉన్నప్పుడు, ఎక్కువ మంది విద్యార్థులు ఒకే రకమైన మార్కులు సాధిస్తారు. దీంతో కటాఫ్‌లు పెరిగే అవకాశం ఉంది. - కె.రవీంద్ర కుమార్, నీట్ కో-ఆర్డినేటర్, ధనిక్ భారత్ విద్యా సంస్థలు

## ఆలస్యం.. విషం

### 'నీట్' రాయకుండానే వెనుదిరిగిన విద్యార్థిని

విలపిస్తున్న విద్యార్థిని

**ఏఎన్‌యూ (పెదకాకాని):** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా చేరుకోవడంతో ఓ విద్యార్థిని పరీక్ష రాయకుండానే వెనుదిరిగింది. ఆదివారం ఉదయం 10 గంటలకే విద్యార్థిని పరీక్ష కేంద్రానికి చేరుకుంది. పరీక్ష 2 గంటలకు అని సిబ్బంది చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయింది. తిరిగి ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థిని 10 నిమిషాలు ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకుంది. అప్పటికే ప్రధాన ద్వారం మూసేశారు. లోపలికి పంపాలని సిబ్బందిని ఆ విద్యార్థిని, ఆమె తండ్రి ప్రాధేయపడ్డారు. అయినప్పటికీ పరీక్షకు అనుమతించకపోవడంతో విద్యార్థిని కన్నీరుమున్నీరుగా విలపించింది.

# చరిత్రలో శాశ్వత వెన్నుపోటుదారు ఏబీఎన్ రాధాకృష్ణ

### బహిరంగ లేఖలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి

**సాక్షి, అమరావతి:** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణపై ఎన్టీఆర్ సతీమణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి నిప్పులు చెరిగారు. రాధాకృష్ణను ఉద్దేశించి ఆదివారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో 'రాధాకృష్ణా నీ బాస్‌కి, నీకు, రామోజీకి వెన్నుపోటుదారులనే బిరుదు చరిత్ర పుటల్లో శాశ్వతంగా ఉండిపోతుంది. మీరు హీరోలంటూ ఎంత కలరింగ్ ఇచ్చుకున్నా లాభం లేదు. ఎందుకురా బతుకంతా అబద్ధాలతో బతుకుతారు. ఛీకొట్టినా మీ బతుకులంతే. ఒక్క ప్రశ్న అడుగుతాను. నేను చేసిన తప్పేమిటి? ఒక్క రుజువు చూపించారా. పోనీ.. ఎమ్మెల్యేలు ఎన్టీఆర్‌కు వ్యతిరేకం అయితే టీడీఎల్‌పీ మీటింగ్ పెట్టి అందులో తమ నాయకుడిని ఎన్నుకోవచ్చు కదా? కనీసం అసెంబ్లీలో ఎన్టీఆర్ గారు ఏం చెప్పేవారో ఆయనను మాట్లాడనివ్వొచ్చు కదా? ఎన్నికల ముందే మీ సీబీఎన్ ఎమ్మెల్యే కాండిడేట్స్‌కు డబ్బులెందుకు పంచారు. వైశ్రాయ్ హోటల్లో లిక్కర్ సిండికేట్‌తో కుమ్మక్కయి ఎమ్మెల్యేలతో బేరాలు చేసింది ఎవరు? ఎన్టీఆర్ గారు హోటల్ దగ్గరకు వస్తే చెప్పు లేసింది ఎందుకు? జర్నలిస్టులందరికీ నువ్వు(రాధాకృష్ణ) డబ్బు పంపిణీ చేసి తప్పుడు రాతలు రాయించలేదా? పార్టీ నుండి ఎన్టీఆర్‌ను సస్పెండ్ చేసింది మీ చంద్రబాబే కదా?. ఎన్నికల్లో రాష్ట్రమంతా నేను, ఎన్టీఆర్ ఇద్దరమే కదా తిరిగాము. ప్రజలు 256 సీట్లు ఇచ్చి ఆశీర్వదించారు. ఎనిమిది నెలలు తిరగకముందే నన్ను బూచిగా చూపించి ఆయన పదవి లాగేసిన నీచులు మీరు కదా? కష్టపడిన మా ఇద్దరి జీవితాలు నాశనం చేసిన దుర్మార్గులు మీరే కదా? నా తప్పేమిటో ఆ రోజే మీటింగ్‌లో పెట్టి ఉంటే తెలిసేది. అప్పుడు ఎన్టీఆర్ మీద, ఇప్పుడు జగన్ మీద మీ అబద్ధాల చెత్త పలుకులు కంటిన్యూ అవుతూనే ఉన్నాయి. ముందు నీ చెత్తపలుకులో ఎన్టీఆర్ జామాత దశమ గ్రహం క్యాసెట్ మీద, ధర్మపీఠంలో స్వయంగా చెప్పిన వీడియో మీద ఒక పలుకు పలికితే జర్నలిస్ట్‌గా కొంచెమైనా న్యాయం పాటించిన వాడివి అవుతావు. ధైర్యం ఉంటే నా ఈ లెటర్ నీ పేపర్లో వెయ్యి. అయినా మీలాంటి వెన్నుపోటుదారులకు నిజాయితీ ఎక్కడుంటుంది. మీ పాపాలు పండే సమయం దగ్గర్లోనే ఉంది. అప్పుడు రాద్దువుగాని సరికొత్త పలుకు' అని లక్ష్మీపార్వతి పేర్కొన్నారు.

# రిటర్నబుల్ ప్లాట్లలో అక్రమ తవ్వకాలు

- ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్డుకున్న నవులూరు రైతులు
- ప్రభుత్వ పెద్దల అండతోనే మట్టి మాఫియా అరాచకం

రిటర్నబుల్ ప్లాట్లలో మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

**మంగళగిరి టౌన్ :** అమరావతి రాజధాని ప్రాంతంలోని రిటర్నబుల్ ప్లాట్లతో సహా వివిధ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పెద్దల అండతో మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తోంది. అధికారిక అనుమతులు లేకుండానే జేసీబీలు, లారీలు, ట్రాక్టర్లతో మట్టిని భారీగా తరలిస్తూ అక్రమార్కులు రూ.కోట్లు గడిస్తున్నారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామంలో రాజధాని కోసం భూములు ఇచ్చిన వారికి కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లలో అక్రమంగా మట్టి తవ్వుతున్నారని తెలుసుకున్న రైతులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తవ్వకాలు సాగిస్తున్న పొక్లెయిన్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో భారీ యంత్రాలతో మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మట్టి తవ్వితే మా గతేమిటంటూ రైతులు ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ ఘటనా స్థలానికి చేరుకోకపోవడంపై రైతులు మండిపడ్డారు. తవ్వకాల వల్ల తమ ప్లాట్లలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, వర్షం వస్తే చెరువుల్లా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి గుంతల భూములను ఏం చేసుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే తమకు కేటాయించిన ప్లాట్లలో అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, గుంతలను పూడ్చి వేయాలని డిమాండ్ చేశారు. మట్టి మాఫియా ఇంత భారీగా తవ్వకాలు సాగిస్తోందంటే తప్పకుండా ప్రభుత్వ పెద్దల అండ ఉంటుందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అమరావతిపై అసంబద్ధ లెక్కలు

### రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త పురుషోత్తమరెడ్డి ధ్వజం

**తిరుపతి అన్నమయ్య సర్కిల్:** టీడీపీ కూటమి ప్రభుత్వం అమరావతికి సంబంధించి తీసుకుంటున్న నిర్ణయాలు రాజధాని నగరానికి ఏ విధంగానూ మేలు చేసేలా లేవని, తాజాగా కేబినెట్ భేటీలో ఆమోదించిన మూడు అంశాలే ఇందుకు నిదర్శమని రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త ఎం.పురుషోత్తమరెడ్డి స్పష్టం చేశారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు లేని నగరాన్ని ఊహించుకోగలమా? అని ప్రశ్నించారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సెక్రటేరియట్ ఎలివేషన్, భవనాల నగిషీలకు రూ.2,540 కోట్లు వ్యయం.. రాజధానిలో అదనపు భూసేకరణ.. గత ప్రభుత్వం అమరావతిలో పేదలకు ఇచ్చిన 50 వేల ఇళ్ల పట్టాల రద్దు లాంటి నిర్ణయాలు అమరావతికి ఉపయోగపడేవి కావని స్పష్టం చేశారు. రాజధాని పేరుతో రూ.57 వేల కోట్లను ఇతర అవసరాలకు కేటాయించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలు, కాంట్రాక్టర్లతో కుదుర్చుకున్న ఒప్పందాలను పరిశీలిస్తే భవనాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.14,750 చొప్పున కేటాయిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఇంకా అదనపు ఖర్చు పేరుతో మరో రూ.4 వేల కోట్లకు జీవో ఇవ్వనున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ లెక్కన అమరావతిలో చ.అడుగుకు రూ.19,660 చొప్పున ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అమరావతిలో నిర్మాణాలకు వేర్వేరు జీవోలు ఇస్తూ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఒకవైపు అంతులేని అప్పులు చేస్తున్న ప్రభుత్వం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతులకు బకాయిలు చెల్లించలేదని విమర్శించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey No. 766/2, Ankireddypalem Village, Guntur Rural, Guntur District. Andhra Pradesh. and Printed at Jagati Publications Limited, D.No. 5 - 25, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, A.P. & Jagati Publications Limited, Sakshi Press, Sy.No. 766/2, Ankireddypalem Village, Guntur Rural, Guntur District. A.P. EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పర్యాటకం : ఇండియన్ హెరిటేజ్ రైల్వేస్

# ట్రాక్‌లపై నడిచే టైమ్ మెషీన్స్

రైలు ప్రయాణం మనం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడం మాత్రమే అనుకుంటాం. కానీ చాలా మందికి ఇది ఒక ఇమోషన్. విండో పక్కనే కూర్చుని బయటకు చూస్తుంటే కనిపించే పచ్చని పర్వతాలు, మబ్బుల్లో మాయం అయ్యే ట్రాక్స్, టన్నెల్స్‌లో ఉన్న చీకటి నుంచి వెలుగులోకి వెళ్లే థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్.. ఇవన్నీ కలిసి ఒక మేజికల్ అనుభవాన్ని క్రియేట్ చేస్తాయి.

ఈ మ్యాజికల్ మూమెంట్స్‌ ని ఇంకా నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్తాయి భారత దేశంలో హెరిటేజ్ రైల్వేస్. ఇవి సింపుల్‌గా ట్రైన్స్ కాదు. కాలాన్ని వెనక్కి తీసుకెళ్తున్న టైమ్ మెషిన్స్ లాంటివి.

బ్రిటిష్ కాలంలో మరీ ముఖ్యంగా 19 నుంచి 20వ శతాబ్దంలోనే భారత దేశంలో అత్యంత కఠినమైన ప్రాంతాల్లో రైల్వే లైన్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఆధునిక సాంకేతికత లేకపోయినా ఈ దారులను ఏర్పాటు చేయడం ఒక ఇంజినీరింగ్ అద్భుతం అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు ఈ ట్రాక్స్ స్ట్రాంగ్‌గా ఉండటం వల్లనే అవి హెరిటేజ్ రైల్వేస్‌గా గుర్తింపు పొందాయి.

ఈ దారుల్లో కొన్ని అంతర్జాతీయంగా కూడా పేరు పొంది యునెస్కోలో చోటు సంపాదించాయి. నిజానికి ఈ ట్రైన్స్ స్పీడ్ చాలా తక్కువ. ఇందులో కొన్ని ట్రైన్లు 10 నుంచి 30 కిమీ వేగంతో మాత్రమే వెళ్తాయి. కానీ ఇందులో ప్రయాణించేవారు వేగం కోసం కాకుండా చక్కని అనుభూతి కోసం చాలా దూరం నుంచి వస్తుంటారు.

## నీలగిరి మౌంటెన్ రైల్వే

సౌత్ ఇండియాలో ఉన్న నీలగిరి మౌంటెయిన్ రైల్వే ఒక అందమైన జర్నీ అనుభవాన్ని ఇస్తుంది. మెట్టుపాళయం నుంచి ఊటీ వరకు వెళ్లే ఈ బ్లూ ట్రెయిన్ మన దేశంలో ఇప్పటికీ ఆవిరితో నడిచే రైల్వే వ్యవస్థలో ఒకటిగా నిలుస్తోంది.

ఉదయం వేళలో పొగ మంచులో అటవి అందాలు, జలపాతాల మధ్యలో వెళ్తుంటే ఈ జర్నీ ఒక డ్రీమ్ సీక్వెన్స్‌లా అనిపిస్తుంది. మూవీలో ఐకానిక్ విజువల్స్ కూడా ఇక్కడే షూట్ అయ్యాయి.

## డార్జిలింగ్ హిమాలయన్ రైల్వేస్

భారత దేశంలో హెరిటేజ్ జర్నీస్ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది డార్జిలింగ్ హిమాలయన్ రైల్వేస్. 1881లో ప్రారంభమైన ఈ టాయ్ ట్రెయిన్, న్యూ జల్పైగురి నుంచి డార్జీలింగ్ వరకు వెళ్తుంది. టీ గార్డెన్‌ల మధ్యలో నెమ్మదిగా తిరుగుతూ వెళ్తుంది ఈ ట్రెయిన్. బటాసియా లూప్ దగ్గర సర్క్యులర్‌గా తిరిగే మూమెంట్ చాలా ఫేమస్.

రోడ్డు పక్కనే వెళ్తుంది కాబట్టి కొన్ని చోట్ల కార్లు, వ్యానులు కూడా ఈ ట్రైనుకు సమాంతరంగా ప్రయాణిస్తున్నట్టు అనిపిస్తుంది. బాలీవుడ్ సినిమా సీన్స్ కూడా ఇక్కడ షూట్ చేశారు. ఈ జర్నీలో ప్రతీ ఫ్రేమ్ ఒక పోస్ట్‌కార్డ్‌లా అనిపిస్తుంది.

## కాంగ్రా వ్యాలీ రైల్వే

కాంగ్రా వ్యాలీ రైల్వే అనేది చాలా తక్కువ మందికి తెలిసిన ఒక బ్యూటిఫుల్ ట్రైన్ జర్నీ. పఠాన్‌కోట్ నుంచి జోగిందర్ నగర్ వరకు వెళ్లే ఈ ట్రైన్ రూట్‌లో ధౌలాధర్ మౌంటెయిన్ రేంజ్ వ్యూస్ డైరెక్ట్‌గా కనిపిస్తాయి. క్రౌడ్ తక్కువగా ఉండటం వల్ల ఈ జర్నీ చాలా ప్రశాంతంగా ఉంటుంది. నేచర్‌ని చాలా కామ్‌గా ఎంజాయ్ చేయాలి అంటే ఇది ఒక పర్ఫెక్ట్ ఆప్షన్. ఫోటోగ్రఫీ ఇష్టపడే వారికి ఇది ఒక స్వర్గంలాంటిది.

### హెరిటేజ్ ట్రైన్ ఎందుకు భిన్నం అంటే..’

మన రెగ్యులర్ ట్రైన్స్ వేగంగా గమ్యస్థానానికి చేరుకోవడం కోసంఉంటాయి. కానీ హెరిటేజ్ ట్రైన్స్‌లో ప్రధాన లక్ష్యం వేగం కాదు. అనుభవం, అనుభూతి, మెమొరీస్ క్రియేట్ చేయడం. స్పీడ్ చాలా తక్కువగా ఉంటుంది కానీ ఆ స్లో మూమెంట్ వల్ల ప్రతీ క్షణాన్ని ఆస్వాదించే అవకాశం లభిస్తుంది, సాధారణ ట్రైన్స్‌లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ ట్రైన్స్ చాలా కామ్‌గా, పీస్‌ఫుల్‌గా ఉంటాయి. అందుకే ఈ జర్నీని చాలా మంది ట్రావెల్ కాదుఇది ఒక ఎక్స్‌పీరియెన్స్ అని వర్ణిస్తారు.

### ఆసక్తికరమైన విషయాలు

ఈ హెరిటేజ్ ట్రైన్ జర్నీలు ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా చాలా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఇన్‌స్ట్రాగామ్‌లో ట్రావెల్ రీల్స్ చూస్తే ఈ ట్రైన్ విజువల్స్ రెగ్యులర్‌గా కనిపిస్తాయి. స్లోగా వంపులు తిరుగుతూ వెళ్లడం, టన్నెల్స్‌లో ఎంట్రీ, ఎగ్జిట్ షాట్స్, ఫాగ్ మధ్యలో ట్రాక్స్.. ఇవన్నీ రీల్స్‌కి పర్ఫెక్ట్ సినిమాటిక్ ఫీల్ ఇస్తాయి. అందుకే ట్రావెల్ కంటెంట్ క్రియేట్ చేసే వాళ్లకి ఈ ప్రయాణాలు ఒక సువర్ణావకాశంలా అనిపిస్తాయి.

### సింపుల్ ట్రావెల్ ప్లాన్

ఈ జర్నీస్‌ని ప్లాన్ చేయడానికి సింపుల్‌గా 2–3 రోజుల ఐటిసిఆర్ ఫాలో అవ్వొచ్చు. మొదటి రోజు బేస్ లొకేషన్‌కి రీచ్ అవ్వడం, రెండవ రోజు హెరిటేజ్ ట్రెయిన్ జర్నీ, మూడవ రోజు రిటర్న్ జర్నీ ప్లాన్ చేసుకోవచ్చు. ఇలా ప్లాన్ చేస్తే రష్ లేకుండా చక్కగా ప్రయాణాన్ని ఎంజాయ్ చేసే టైమ్ లభిస్తుంది.

### బుకింగ్ ఎలా?

ఈ జర్నీస్ ప్లాన్ చేయడానికి టికెట్స్‌ని ఆన్‌లైన్ ద్వారా ఈజీగా బుక్ చేసుకోవచ్చు. టికెట్ ధరలు కూడా బడ్జెట్ ఫ్రెండ్లీగా.. సుమారు రూ.500 నుంచి రూ.1500 మధ్య ఉంటాయి. వేసవిలోనూ వాతావరణం చాలా ఆహ్లాదకరంగా, సీనరీస్ చాలా అందంగా ఉంటాయి. అయితే అడ్వాన్స్ బుకింగ్ తప్పనిసరి.

**– ఎం.జి.కిశోర్, ప్రయాణికుడు**

## మాతెరన్ హిల్ రైల్వే

మహారాష్ట్రలో ఉన్న మాతెరన్ హిల్ రైల్వే కూడా చాలా యూనిక్ అని చెప్పవచ్చు. మాతెరన్‌లో వాహనాలను అనుమతించరు. అందుకే ఇక్కడి టాయ్ ట్రెయిన్ ఒక ప్రధాన రవాణా సాధనంగా మారిపోయింది. సన్నని గేజ్ ట్రాక్‌పై చుట్టపక్కల వనాల్లోంచి ట్రైన్ వెళ్తోంటే పక్షుల శబ్దాలు, స్వచ్ఛమైన గాలి ఇవన్నీ ఈ జర్నీలో హైలైట్‌గా నిలుస్తాయి.

## కాల్కా-షిమ్లా రైల్వే

హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న కాల్కా షిమ్లా రైల్వే అనేది బ్రిటిష్ ఇంజినీరింగ్ బ్రిలియన్స్‌కు చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు. 1903లో స్టార్ట్ అయిన ఈ రూట్‌లో 100కి పైగా టన్నెల్స్, 800కి పైగా బ్రిడ్జిలు ఉంటాయి. బారోగ్ టన్నెల్ అనేది అత్యంత పొడవైన టన్నెల్‌గా ప్రసిద్ధి చెందింది.

కార్డెలె

# ప్రపంచ పుచ్చకాయల రాజధాని

సమ్మర్ అంటే మనకి ఫస్ట్ గుర్తుకు వచ్చేదే పండ్లల్లో పుచ్చకాయ ఒకటి. ఎంత రుచిగా, చల్లగా ఉంటుందో అంతే పోషకాలున్న మ్యాజికల్ ఫ్రూట్ ఇది. కానీ, ఈ టేస్టీ ఫ్రూట్‌కి ఒక స్పెషల్ సిటీ ఉంది అని చాలా మందికి తెలియదు. అమెరికాలోని ఉన్న కార్డెలె అనే చిన్న సిటీని ‘ప్రపంచ వాటర్‌మెలన్ క్యాపిటల్’ అని పిలుస్తారు. ఈ ప్లేస్ జార్జియా స్టేట్‌లో ఉంటుంది. అక్కడ క్లైమేట్ చాలా పెర్ఫెక్ట్‌గా ఉంటుంది. ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల నుంచి 32 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటాయి. మట్టి కూడా సాండీగా ఉండటం వల్ల క్రాప్స్ బాగా వస్తాయి.

### కార్డెలేకి ఈ టైటిల్ ఎలా వచ్చిందంటే?

కార్డెలెలో భారీ సంఖ్యలో పుచ్చకాయలను పండిస్తారు. ఎంతగా అంటే అమెరికాలోనే అది అతి పెద్ద వాటర్‌మెలన్ హబ్ అయింది. ప్రతి సంవత్సరం లక్షలాది టన్నుల పుచ్చకాయలను ఇక్కడి నుంచి వేరే రాష్ట్రాలకు, కెనడాకు కూడా ఎగుమతి చేస్తారు. అక్కడి రైతులు అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ వినియోగించి సీడ్‌లెస్ వాటర్‌మెలన్‌ను పండిస్తున్నారు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది.

మరో ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే, 1949 నుంచి ఒక ఫెస్టివల్ కూడా జరుగుతోంది. ఈ ఫెస్టివల్‌లో స్థానికులు, టూరిస్టులు అందరూ కలిసి సెలబ్రేట్ చేస్తారు. గేమ్స్, ఫుడ్ స్టాల్స్, ఈవెంట్స్ ఇవన్నీ ఒక ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేస్తాయి.

ప్రపంచ స్థాయిలో చూస్తే చైనా పుచ్చకాయలను అత్యధికంగా పండించే దేశంగా నెంబర్ వన్ స్థానంలో ఉంది. కానీ ఒక సిటీ లెవెల్‌లో మాత్రం కార్డెలే టాప్ ప్లేస్‌లో ఉంటుంది. అందుకే దానిని అధికారికంగా వాటర్‌మెలన్ క్యాపిటల్ అని పిలుస్తారు. సో మీరు నెక్స్ట్ టైమ్ పుచ్చకాయను తింటే మాత్రం అది ఎక్కడి నుంచి వచ్చి ఉంటుందో అని ఆలోచించండి. మే బి అది కార్డెలె నుండి వచ్చిందేమో.. ఏమో ఎవరికి తెలుసు?!

కోడిని, కేరళ

# ఒకే ఊరిలో 400 కవలలు.. కేరళలో వింత!

ఒక ఊరిలో నడుస్తోంటే ప్రతీ ఒక్కరు రెండు సార్లు కనిపిస్తే ఎలా ఉంటుంది?! కేరళలోని మలప్పురం దగ్గర ఉండే ‘కోడిని’ అనే ప్రాంతానికి వెళ్లినప్పుడు మనకి అదే అనిపిస్తుంది.

మొదటిసారి ట్రావెల్ చేసే వారికి ఇది చాలా వింతగా, ఒక మ్యాజిక్‌లా అనిపిస్తుంది. స్పెషల్ ట్రావెల్ ఎక్స్‌పీరియెన్స్ కావాలనే వారికి ఇది చాలా ఈజీగా, మనసును హత్తుకున్నట్టుగా అనిపిస్తుంది. ఒక అద్దం ముందు నిలబడినట్టుగా ప్రతీ చోట జనాలు కనిపిస్తూ ఉంటే ఎవరికరైనా చాలా కొత్తగా అనిపిస్తుంది కదా!

అక్కడ అడుగు పెట్టగానే పచ్చని పొలాలు, చల్లని గాలి మనకు స్వాగతం పలుకుతాయి. ఆర్కిటెక్చర్ చాలా సింపుల్‌గా, మన ఊర్లో ఉన్నట్టే అనిపిస్తుంది. అక్కడక్కడ తిరిగే కవల పిల్లలు చూస్తుంటే ఒక్కసారిగా మనం ఎక్కడున్నాం అనే అనుభూతి కలుగుతుంది. ఆ గాలిలో నడుస్తుంటే మనం ఒక వింత స్వప్నంలో ఉన్నామన్న భావన కలుగుతుంది. ప్రతీ తోటలో, ప్రతీ ఇంటి ముందు ఒక కొత్త కళ కనిపిస్తుంది. మనుషుల చిరునవ్వులు, వారి అమాయకత్వం మనసుకు చాలా హాయిని ఇస్తాయి.

### సందర్శనీయ ప్రదేశాలు

కవలల నగరం లేదా ట్విన్ టౌన్ అని పిలిచే ఈ ప్రాంతంలో తిరుగుతూ అక్కడి స్థానికులతో మాట్లాడటం ఒక గొప్ప అనుభవం. దగ్గరలో ఉన్న కడలుండి బర్డ్ శాంక్చువరీలో రంగురంగుల పక్షులను చూడటం లేదా నీలాంబుర్లోని తోటలను సందర్శించడం మనసుకు ప్రశాంతతను ఇస్తాయి.

### ఏం తినాలి?

కేరళ స్థానిక రుచులు అయిన వేడి వేడి పుట్టు, కడల కర్రీ తప్పకుండా ట్రై చేయాల్సిన ఫుడ్ అని చెప్పవచ్చు.స్థానిక టీ స్టాల్స్ దగ్గర లభించే వేడి భోజనం, బనానా ఫ్రిట్టర్స్ అక్కడ కూర్చొని తినడం ఒక మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

### ఎప్పుడు వెళ్లాలి?

సెప్టెంబర్ నుంచి మార్చి వరకు వాతావరణం చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఏప్రిల్, మే నెలల్లో కూడా వెళ్లవచ్చు. అప్పుడూ అక్కడి పచ్చదనం మనసును హాయిగా ఉంచుతుంది. కానీ చలికాలంలో వెళ్లడం ఉత్తమం. మీరు ఎప్పుడు వెళ్లినా కూడా స్థానికులు చాలా మర్యాదగా పలకరిస్తారు. మొత్తం ఫ్రెండ్లీ వాతావరణం ఉంటుంది.

### హైదరాబాద్ నుంచి ఎలా వెళ్లాలి?

హైదరాబాద్ నుంచి కోజికోడ్‌కు డైరెక్ట్ విమానాలు ఉంటాయి. ట్రైన్‌లో వెళ్తే కోజికోడ్ లేదా తిరూర్ దగ్గర దిగి సుమారు 40 కిమీ రోడ్ జర్నీ చేయాలి. బస్సులో వెళ్లాలని ప్లాన్ చేస్తే కోజికోడ్ లేదా మలప్పురంకి డైరెక్ట్ సర్వీసులు ఉంటాయి. అక్కడి నుంచి లోకల్ బస్ లేదా క్యాబ్‌తో కోడిని ఈజీగా చేరుకోవచ్చు.

ఈ ప్రయాణం మనలోని క్యూరియాసిటీకి ఒక సమాధానంతో పాటు ప్రకృతితో మమేకం అయ్యే ఒక అవకాశం. ప్రపంచంలోని వింతల గురించి ఆలోచించినప్పుడు కోడిని మీకు తప్పకుండా గుర్తుకు రావాలి అంటే ఒకసారి మీరు అక్కడికి వెళ్లిరావాలి మరి!

లంబసింగి

# తెలుగు నేలలో చల్లని మ్యాజిక్

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఈ వేడి నుంచి ఉపశమనం కోసం మనలో చాలా మంది చల్లని ప్రదేశాల ఏవో అని సెర్చ్ చేస్తుంటారు. నిజానికి చాలా మంది సమ్మర్ ట్రిప్ అంటే చాలా దూరం వెళ్లాలి అనుకుంటారు. కానీ దగ్గర్లోనే లంబసింగి ప్రశాంతమైన చోటు ఉండటం నిజంగా తెలుగు వారి లక్కు అనుకోవాలి.

కానీ ఫస్ట్ టైమ్ వెళ్లేవారికి ఇది ఈజీగా, దగ్గరలోనే ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్టు అనిపిస్తుంది. నేచర్‌ని ఇష్టపడే వారికి ఈ ప్రదేశం చాలా బాగా నచ్చుతుంది. అయితే ఎండాకాలం ఇక్కడ చలికాలం అంత చల్లగా ఉండదని గమనించాయి. కాని అక్కడి గాలిలో ఉండే చల్లదనం మనసుని వెంటనే తాజాగా మార్చేస్తుంది.

చుట్టూ ఉన్న కొండ కోనలు, అక్కడక్కడ కనిపించే కాఫీ తోటలు చాలా అందంగా ఉంటాయి. పొద్దుపొద్దున్నే లేచి చూస్తుంటే మంచు తెరలు తొలుగుతూ భానుడి కిరణాలు కొండలపై పడటం, వాటిని చూడటం ఒక గొప్ప దృశ్యంగా అనిపిస్తుంది. ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తుంది. నిశ్శబ్దం మనల్ని పలకరిస్తుంది.

### సందర్శనీయ స్థలాలు

సూజాన్ గార్డెన్‌లో విరబూసిన పూలు, రిజర్వాయర్ దగ్గర ఉన్న నీటి అందాలు చాలా ప్రశాంతంగా ఉంటాయి. కొత్తపల్లి జలపాతం దగ్గర జలజల జారే నీటి ధారలు చూస్తుంటే మనసులోని భారం అంతా దూరం అయిపోతుంది. ఘాట్ రోడ్డు మలుపుల్లో సాగే ప్రయాణం ప్రతీ క్షణం ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది.

### ఏం తినాలి?

అక్కడ దొరికే వేడివేడి చికెన్ తింటుంటే ఆ మట్టి వాసన, తాజాదనం తెలుస్తుంది. స్థానికంగా ఉండే టీ స్టాల్స్ దగ్గర దొరికే కాఫీ తాగుతూ, చల్లని గాలిలో కూర్చోవడం ఒక మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది. సింపుల్‌గా ఉండే స్థానిక వంటలు మనసుకు హాయిని ఇస్తాయి.

### ఎప్పుడు వెళ్లాలి?

నవంబర్ నుండి మార్చి వరకు చాలా చల్లగా ఉంటుంది. వేసవిలోనూ సాయంత్రం సమయంలో చాలా చల్లగా, రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. ఇక్కడి మనుషుల అమాయకత్వం, వారి మర్యాద మన ప్రయాణాన్ని ఇంకా అందంగా మార్చేస్తాయి.

### ఎలా వెళ్లాలి?

విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో 5 నుంచి 6 గంటల్లో చేరుకోవచ్చు. ట్రైన్‌లో వెళ్లే వారికి చింతపల్లి దగ్గర రైల్వే స్టేషన్ అనుకూలంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి వెళ్లేవారు ముందుగా వైజాగ్‌కి చేరుకొని, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా లంబసింగి చేరుకోవచ్చు. ఈ ప్రయాణం మనసులోని అలసటను దూరం చేసి, కొత్త శక్తి ఇస్తుంది. ప్రకృతి ఒడిలో కొన్ని క్షణాలు గడిపితే అది జీవితాంతం గుర్తుండే ప్రయాణంగా మారిపోతాయి.

పనామాలోని పోర్టోబెలోలో 7వ పాలెరా కాంగా వేడుకను పురస్కరించుకుని శనివారం పడవలతో ప్రజల ప్రదర్శన

కర్ణాటకలోని చిక్కమగళూరులో ఆదివారం జరిగిన సంప్రదాయ ఎడ్ల బండ్ల పోటీలో తన ఎద్దులను పరుగులు పెట్టిస్తున్న పోటీదారు

## రేపు రాష్ట్రపతిని కలవనున్న చద్దా

**సాక్షి, న్యూఢిల్లీ:** ఇటీవల ఆప్‌ను వీడి బీజేపీ పక్షాన చేరిన రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ కానున్నారు. పంజాబ్‌లో ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు ఆయన అపాయింట్‌మెంట్ కోరగా రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం ఉదయం ఆయనకు సమయం కేటాయించింది. పంజాబ్‌లోని అధికార యంత్రాంగాన్ని రాజకీయ కక్షసాధింపు కోసం వాడుకుంటున్నారని చద్దా ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల ఆప్‌ని వీడి బీజేపీలో చేరిన ఎంపీలను లక్ష్యంగా చేసుకున్నారని అంటున్నారు. చద్దాతోపాటు మరో ముగ్గురు ఎంపీలకు కూడా రాష్ట్రపతి ముర్మును కలిసేందుకు అవకాశం కల్పించారు. మే 5వ తేదీ ఉదయం 10.40 గంటలకు వీరు రాష్ట్రపతితో సమావేశం కానున్నారు.

## నేటి నుంచి పంచాయతీల 'వర్క్‌షాప్'

**సాక్షి, న్యూఢిల్లీ:** 2026–27 సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై రెండ్రోజుల పాటు సాగే జాతీయ వర్క్‌షాప్ సోమవారం దేశ రాజధానిలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో ప్రారంభం కానుంది. పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, జలశక్తి శాఖ కార్యదర్శి అశోక్ కె.కె. మీనా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 16వ ఆర్థిక సంఘం గ్రాంట్లకు సంబంధించిన విధివిధానాలు, నిధుల వినియోగంపై ఈ వర్క్‌షాప్‌లో లోతుగా చర్చించనున్నారు. గ్రామాల్లో జీవనోపాధి, ఆరోగ్యం, శిశు సంక్షేమం, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి 10 ముఖ్యాంశాలపై రాష్ట్రాల వారీ నమూనా ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ కోసం 'ప్రజా ప్రణాళిక ప్రచార'(పీపీసీ) పుస్తకం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) కరదీపికతోపాటు ఆధునీకరించిన 'ఈ–గ్రామ స్వరాజ్'ప్లానింగ్ పోర్టల్‌ను ఆవిష్కరించనున్నారు.

## జార్ఖండ్‌లో రూ.1.32 కోట్ల విలువైన నల్లమందు గడ్డి స్వాధీనం, ఒకరి అరెస్టు

**చత్రా/రాంచీ (జార్ఖండ్):** జార్ఖండ్‌లో నిర్వహించిన వేర్వేరు ఆపరేషన్లలో పోలీసులు రూ. 1.32 కోట్ల విలువైన నల్లమందు గడ్డిని స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. చత్రా, రాంచీ జిల్లాల్లో అధికారులు మూడు వేర్వేరు ఆపరేషన్లు నిర్వహించారు. బిహార్‌కు మాదకద్రవ్యాలను తరలిస్తున్నారనే సమాచారం మేరకు, ప్రతాప్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బల్వదోహర్ గ్రామం వద్ద పోలీసులు ఒక టెంపోను అడ్డగించారు. అందులో 10 సంచుల్లో నింపిన రూ.42 లక్షల విలువైన నల్లమందు గడ్డిని స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల స్మగ్లర్‌ను అజయ్ కుమార్ సాను అరెస్టు చేశారు. రెండవ ఆపరేషన్‌లో రూ. 30 లక్షల విలువైన 258 కిలోల నల్లమందు గడ్డిని స్వాధీనం చేసుకున్నారు. అయితే, వాహన డ్రైవర్ తప్పించుకున్నాడు. మరొక ఆపరేషన్‌లో అటవీ ప్రాంతంలో పారవేసిన రూ.60 లక్షల విలువైన 400 కిలోల నల్లమందు గడ్డిని స్వాధీనం చేసుకున్నారు.

## నలుగురు పిల్లలను, భార్యను హత్య చేసి..

### ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి

**గురుగ్రామ్:** గురుగ్రామ్‌లోని వజీర్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి భార్యను, నలుగురు పిల్లలను హత్య చేసి, తాను ఆత్మహత్యాయత్నం చేశాడు. శనివారం జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. యూపీ, మొరాదాబాద్‌లోని బిలారి నివాసి అయిన నజీమ్, కొన్ని నెలలుగా కుటుంబంతో కలిసి వజీర్‌పూర్‌లోని అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. సమీపంగా ఒక సెలూన్ నడుపుతున్నాడు. నజీమ్, భార్య నజ్మాల మధ్య తరచుగా గొడవలు జరిగేవి. శనివారం పని ముగించుకుని ఇంటికి వచ్చిన నజీమ్ మళ్లీ భార్యతో వాగ్వాదానికి దిగాడు. ఆ తరువాత నలుగురు పిల్లలను, భార్యను హత్య చేసిన నజీమ్ తాను చేయి కోసుకుని ఆత్మహత్య చేసుకోబోయాడు. శనివారం రాత్రి ఇంటికి వచ్చిన అతని సోదరునికి నజీమ్ రక్తస్రావంతో విలవిలలాడుతూ, సోదరుని భార్య, పిల్లలు విగత జీవులుగా కనిపించారు. వెంటనే అందరినీ ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మహిళ, నలుగురు పిల్లలు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. నజీమ్ చికిత్స పొందుతున్నాడు. ఇంట్లో అంతర్గత కలహాల కారణంగానే అతను ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మడోనా, లేడీ గాగాల బాటలో షకీరా

### కోపాకబానా బీచ్‌లో ఉచిత సంగీత ప్రదర్శన

**రియో డి జనీరో:** కొలంబియన్ సూపర్ స్టార్ షకీరా.. మడోనా, లేడీ గాగా బాటలోనే నడిచారు. శనివారం రాత్రి రియో డి జనీరోలోని కోపాకబానా బీచ్‌లో భారీ ఉచిత సంగీత ప్రదర్శన ఇచ్చారు. అత్యంత ప్రసిద్ధ తీరప్రాంతాల్లో ఒకటైన ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు 20 లక్షల మంది హాజరయ్యారు. శనివారం ఉదయం నుంచే జనం బీచ్‌పైకి పోటెత్తారు. ఇది ఆ ప్రదేశంలో జరిగిన అతిపెద్ద సంగీత కచేరీలలో ఒకటిగా నిలిచింది. దీంతో రియో డి జనీరోలో పర్యాటకం, స్థానిక వ్యాపారాలు గణనీయంగా పెరిగాయి. కోపాకబానా బీచ్ లెజెండరీ కళాకారుల ఉచిత ప్రదర్శనలకు నిలయంగా ఉంది. 2024 మేలో మడోన్నా కూడా ఇదే బీచ్‌లో భారీ ఉచిత సంగీత ప్రదర్శన నిర్వహించి, రికార్డు సృష్టించారు.

## డ్రైవర్‌కు అస్వస్థత, హిమాచల్ ప్రదేశ్‌లో బస్సు బోల్తా

### 28 మందికి గాయాలు

**నూర్పూర్:** హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో ఒక ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. 28 మంది గాయపడ్డారు. ఆదివారం చంబా నుంచి ఊనాకు వెళ్తున్న బస్సు, పఠాన్‌కోట్–మండి జాతీయ రహదారిపై ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఛాతీ నొప్పి రావడంతో వాహనంపై నియంత్రణ కోల్పోవడం వల్ల ప్రమాదం సంభవించింది. వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని రక్షించారు. తీవ్రంగా గాయపడిన నలుగురు వ్యక్తులను మెరుగైన చికిత్స నిమిత్తం కాంగ్రా జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. గాయపడిన వారిలో బస్ డ్రైవర్‌కూడా ఉన్నారు.

## సరస్సులో మునిగిన తేలియాడే గుడిసెలు

### 30 మంది పర్యాటకులను ఎస్డీఆర్‌ఎఫ్ బృందం

**న్యూ తెహ్రీ (ఉత్తరాఖండ్):** ఉత్తరాఖండ్‌లో డోబ్రా–చంతి సరస్సులో పర్యాటకులకు పెను ప్రమాదం తప్పింది. తుఫాను ధాటికి బలమైన గాలులు, భారీ అలలకు సరస్సులోని తేలియాడే గుడిసెలు కొట్టుకుపోయాయి. ఇరుసు కీళ్ళు విరిగిపోవడంతో గుడిసెలు సరస్సులో ఒరిగిపోయాయి. నీటిలో మునిగిపోతున్న గుడిసెలలో ఉన్న 30 మంది పర్యాటకులను ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించారు. అందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తెహ్రీలో ఎస్డీఆర్‌ఎఫ్ సకాలంలో స్పందించడం వల్ల పెను ప్రమాదం తప్పింది. సాంకేతిక వైఫల్యంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించిన జిల్లా మేజిస్ట్రేట్ ఆ ప్రదేశంలో అన్ని కార్యకలాపాలను నిలిపేశారు. ఉత్తరాఖండ్ పర్యాటక శాఖ 2015–16లో ఈ 22 తేలియాడే గుడిసెలను నిర్మించింది. 2020–21 నుంచి ప్రైవేట్ సంస్థ 'లే రాయ్'పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యంతో దీనిని నిర్వహిస్తోంది.

## పాకిస్తాన్ సివిల్ సర్వీసుకు ఎంపికైన ఇద్దరు హిందువులు

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో మైనారిటీ హిందూ మతానికి చెందిన ఇద్దరు అధికారులు ఆ దేశ సివిల్ సర్వీస్ పరీక్షకు ఎంపికయ్యారు. పాక్ ప్రభుత్వ ఉద్యోగాల్లో మైనారిటీలకు చోటు దొరకడం అత్యంత అరుదైన విషయం. గురువారం వెల్లడించిన ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎఫ్‌పీఎస్‌సీ)పరీక్ష ఫలితాల్లో ఎంపికైన 170 మంది అభ్యర్థుల్లో సింధ్ ప్రావిన్స్‌కు చెందిన జీవన్ రెబారీ, ఖేమ్ చంద్ జండోరా కూడా ఉన్నారు. వీరిద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. ఈ పరీక్షకు మొత్తం 12,792 మంది హాజరవగా 355 మంది ఉత్తీర్ణులయ్యారు. వివిధ పరీక్షల ద్వారా వడపోతలో చివరికి 170 మంది మిగిలారు. పాకిస్తాన్‌లోని 26 కోట్ల మంది జనాభాలో అతిపెద్ద మైనారిటీ వర్గమైన హిందువుల సంఖ్య 38 లక్షలు.

## మొరాకోలో ఇద్దరు అమెరికా జవాన్లు గల్లంతు

**రబాట్:** ఆఫ్రికా దేశంలో మొరాకోలో ఇద్దరు అమెరికా సైనికులు గల్లంతయ్యారు. ఆఫ్రికన్ లయన్ పేరిట రెండు దేశాలు ఉమ్మడిగా చేపట్టిన సైనిక విన్యాసాల సందర్భంగా శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. అట్లాంటిక్ తీరంలోని టాన్‌టాన్‌కు సమీపంలో ఉండగా వీరు కనిపించకుండా పోయారు. సహాయ, అన్వేషణ కార్యక్రమం చేపట్టినట్లు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్రికా కమాండ్(ఆఫ్రికాం) ఆదివారం వెల్లడించింది.

## చైనా చేరుకున్న నూతన రాయబారి

**బీజింగ్:** చైనాకు కాబోయే భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి(56) ఆదివారం బీజింగ్ చేరుకున్నారు. నూతన బాధ్యతలు స్వీకరించనున్న దొరైస్వామికి చైనా విదేశాంగ శాఖలో ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ లి జియాన్‌బో, భారత రాయబార కార్యాలయం చార్జ్‌డీ అఫైర్స్ ఏంజెలిన్ ప్రేమలత తదితరులు సాదర స్వాగతం పలికారు. శనివారం షాంఘైకు చేరుకున్న విక్రమ్ దొరైస్వామి ఆదివారం బీజింగ్ వచ్చారు. దొరైస్వామి నియామకంతో రెండు దేశాల మధ్య సంబంధాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు. 1992 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి అయిన దొరైస్వామి ప్రదీప్ కుమార్ రావత్ స్థానంలో బాధ్యతలు చేపడతారు. అంతకుముందు, ఈయన యూకేలో హైకమిషనర్‌గా పనిచేశారు.

## హార్మూజ్‌లో భారీ నౌకపై దాడి

**దుబాయ్:** హార్మూజ్ జలసంధి సమీపంలో ఒక భారీ నౌకపై పలు చిన్న నౌకలు దాడి చేసినట్లు బ్రిటిష్ సైన్యానికి చెందిన యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ ఆదివారం తెలియజేసింది. ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. ఇరాన్‌లోని సిరిక్ తీరంలో ఈ దాడి జరిగిందని, నౌకలోని సిబ్బంది సురక్షితంగా ఉన్నారని వెల్లడించింది. హార్మూజ్‌లో నౌకలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## నీటి అడుగున ఎత్తైన మానవ పిరమిడ్

### అండమాన్ దీవుల్లో మరో గిన్నిస్ రికార్డు

**శ్రీవిజయపురం:** అండమాన్ నికోబార్ దీవుల్లో ఆదివారం మరో గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైంది. స్వరాజ్ ద్వీప్‌లో నీటి అడుగున అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్ ఏర్పడింది. ఇందులో లెఫ్టినెంట్ గవర్నర్ డీకే జోషి సహా పద్నాలుగుమంది పాల్గొన్నారు. నీటి అడుగున 22.3 మీటర్ల ఎత్తున మూడు నిమిషాల పాటు పిరమిడ్ ఆకారంలో కొనసాగారు. అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరిస్తూ, గిన్నిస్ రికార్డు మార్గదర్శకాలకు అనుగుణంగా శిక్షణ పొందిన డైవర్లు, సాంకేతిక నిపుణులు, సహాయ సిబ్బంది ఈ సాహస విన్యాసంలో పాలుపంచుకున్నారని అధికారులు వివరించారు. శనివారం ఇక్కడే నీటి అడుగున ప్రపంచంలోనే అతి పెద్దదైన భారత జాతీయ జెండాను నీటి అడుగున ఆవిష్కరించి గిన్నిస్ రికార్డు నెలకొల్పడం తెల్సిందే.

# బెంగాల్‌లో 'స్వీట్ల' రాజకీయం

'మోదీశ్రీ', 'జాయ్ బంగ్లా', 'లాల్ సలాం'... నినాదాలను తలపిస్తున్నాయి కదా! కానీ ఇవన్నీ స్వీట్లు. ఎన్నికల ఫలితాల వేళ.. వివిధ పార్టీల అభ్యర్థుల కోసం బెంగాల్ స్వీట్ల తయారీదారులు పెట్టిన మిఠాయిల పేర్లు. ఓట్ల లెక్కింపు కోసం ఓటర్లు, అభ్యర్థులు ఎదురు చూస్తుంటే.. మిఠాయి తయారీదారులు మాత్రం రాజకీయ, సాంస్కృతిక మేళవింపుతో పార్టీలను ప్రతిబింబించే స్వీట్ల తయారీలో నిమగ్నమయ్యారు.

### ఆహారం చుట్టూరా ప్రచారం..

ఈసారి పశ్చిమబెంగాల్ ఎన్నికలు ఆహారం చుట్టూనే తిరిగాయి. నెల రోజులకు పైగా సాగిన ఎన్నికల పోరు చేపలు, జల్మురి వంటి ఆహారం చుట్టే తిరిగింది. చివరికి ఫలితాలు కూడా తినుబండారాలతోనే ముడిపడ్డాయి. అది కూడా బెంగాల్‌కే ప్రత్యేకమైన స్వీట్లతో. 'మిఠాయిలు బెంగాల్ సంస్కృతిలో అంతర్భాగం. ప్రతి సందర్భానికీ తగిన మిఠాయిలు ఉంటాయి. అలాంటప్పుడు ఎన్నికలకు ఎందుకు చేయకూడదు?'అని ప్రశ్నిస్తున్నారు మిఠాయి వ్యాపార సంస్థల యజమానులు. స్వీట్లతో ఫలితాలను వేడుకగా మార్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో తాజా రసగుల్లాలు, సందేశ్‌ల సువాసనతో కోల్‌కతా అంతా ఘుమఘుమలాడుతోంది. ఇక, ఈ ఎన్నికల అసలు విశేషం ఏంటంటే ఆ మిఠాయిల రంగులు, పేర్లు.

### పార్టీల రంగు, నినాదాలు, నాయకుల పేర్లు..

పార్టీ రంగులు, చిహ్నాలు, నినాదాలు, నాయకుల పేర్లతో కూడిన ప్రత్యేక స్వీట్లను తయారు చేసే పనిలో పడ్డాయి సంస్థలు. కాషాయ రంగు స్వీట్‌కు 'మోదీశ్రీ'అని, ఆకుపచ్చ రంగు మిఠాయిలకు 'జాయ్ బంగ్లా'అని, గులాబీ, ఎరుపు రంగు వర్ణపు మిఠాయిలకు వామపక్షాల 'లాల్ సలాం'అని పేర్లు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కోల్‌కతా వచ్చిన ప్రధాని మోదీ కాషాయ రంగు కేసర్ ఫ్లేవర్ 'సందేశ్'రుచి చూశారు. ఆ స్ఫూర్తితో కాషాయ రంగు సందేశ్‌కు 'మోదీ శ్రీ'అని పేరు పెట్టారు. ఇక, మరో సందేశ్‌ను నిమ్మకాయ ఫ్లేవర్‌తో, ఆకుపచ్చ రంగులో తయారు చేసి తృణమూల్ కాంగ్రెస్ నినాదమైన 'జోయ్ బంగ్లా'పేరు పెట్టారు. తమ దుకాణాల్లో ప్రధానంగా రసగుల్లా, రాజ్‌భోగ్ రకాలను తయారు చేస్తామని ప్రఖ్యాత కేసీ దాస్, నోబిన్ చంద్ర దాస్ మిఠాయి దుకాణ సంస్థల డైరెక్టర్ ధీమన్ దాస్ అన్నారు. 'ఆకుపచ్చ, నారింజ, ఎరుపు వెల్వెట్ రసగుల్లాలను తయారు చేస్తున్నాం. ఓట్ల లెక్కింపు రోజున డిమాండ్, ట్రెండ్‌ను బట్టి సరఫరా చేస్తాం'అని చెప్పారు.

### తెల్లరసగుల్లాలను రెడీ చేసుకుని..

రాష్ట్రంలో నెలకొన్న 'ఫిఫ్టీ–ఫిఫ్టీ'ఛాన్సెస్‌కు అనుగుణంగానే కాషాయం, ఆకుపచ్చ రంగులో రసగుల్లాలు, సందేశ్‌లను తయారు చేస్తున్నారు. ఫలితాల తరువాతే మిఠాయిలు అవసరమవుతాయి. అప్పుడు వేగంగా స్వీట్లను అందించేందుకు తయారీ సంస్థలు ముందు భారీ సంఖ్యలో తెల్ల రసగుల్లాలను తయారు చేసి పెడుతున్నాయి. రంగు రంగుల చక్కెర సిరప్‌లను కూడా సిద్ధంగా ఉంచుతున్నాయి. ఓట్ల లెక్కింపు తరువాత గెలవబోయే అభ్యర్థి పార్టీ రంగును బట్టి అవసరమైన రంగులో రసగుల్లాలను ముంచి సరఫరా చేయనున్నారు. బీజేపీ, తృణమూల్ మధ్య హోరాహోరీ పోటీ నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ సందిగ్ధానికి ఇది అద్దం పడుతోంది.

– కోల్‌కతా

# సద్భావ్ యాత్ర చేపట్టిన నిశాంత్

### ఆశీర్వదించిన నితీశ్ కుమార్

**పట్నా:** జేడీయూ నేత నిశాంత్ కుమార్ ఆదివారం సాయంత్రం పశ్చిమ చంపారన్ జిల్లాలో సద్భావ్ యాత్రను ప్రారంభించారు. జేడీయూ చీఫ్, రాజ్యసభ సభ్యుడు నితీశ్ కుమార్ తనయుడు అయిన నిశాంత్ కుమార్(45)కు అంతకుముందు పట్నాలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. పార్టీ ప్రధాన కార్యాలయంలో నిశాంత్ తన తండ్రి నితీశ్ కుమార్ ఆశీర్వాదం అందుకున్నారు. ప్రజలకు చేరువయ్యేందుకు నిశాంత్ మొదటిసారిగా చేపట్టిన సద్భావ్ యాత్ర విజయం కావాలని పార్టీ నేతలు ఆకాంక్షించారు. యాత్రలో భాగంగా సాయంత్రం భారత్–నేపాల్ సరిహద్దుల్లోని వాల్మీకి నగర్ వెళ్లారు. ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ జీపును గతంలో నితీశ్‌కుమార్ పలు ప్రచార కార్యక్రమాల కోసం వాడారు. 'నా మొట్టమొదట రాజకీయ ప్రయాణం సద్భావ్ యాత్ర నేడు మొదలైంది. సద్భావ్ అంటే ప్రేమ, సానుకూల దృక్పథం. అందరినీ కలుపుకుని ముందుకు వెళతా. ఏ ఒక్కరినీ వదిలి వెళ్లను. పశ్చిమ చంపారన్ జిల్లా ఒకప్పుడు మహాత్ముడు సంచరించిన నేల. సత్యాగ్రహం మొదలుపెట్టిన ప్రాంతం'అంటూ ఆయన ప్రసంగం కొనసాగించారు. సద్భావ్ యాత్రపై ప్రజల్లో ఆసక్తి కలిగించేందుకు జేడీయూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టింది. జీపులో ఉన్న నిశాంత్‌పైకి జనం పూలు చల్లుతున్నట్లుగా ఉన్న ఫొటోలను షేర్ చేసింది. అట్టడుగు స్థాయి ప్రజలను కలుసుకుని, వారి మనస్సులను గెలుచుకోవడమే తమ నేత లక్ష్యమని తెలిపింది.ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన నితీశ్ కుమార్ బిహార్ సీఎం పదవికి రాజీనామా చేయడం తెల్సిందే. బిహార్ సీఎంగా మొట్టమొదటి సారిగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌదరి బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రభుత్వం నిశాంత్ కుమార్ డిప్యూటీ సీఎంగా ఉంటారని మొదట్లో వార్తలు వచ్చాయి. అయితే, పదవుల కంటే ప్రజల్లో పార్టీ ఆదరణ పెంచడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు నేతలు చెబుతున్నారు.

నితీశ్‌కు పాదాభివందనం చేస్తున్న నిశాంత్

## ఎన్నికలప్పుడు డీజేలతో హింసకు కుట్ర

### బీజేపీపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపణ

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలప్పుడు పెద్ద శబ్దంతో డీజేలను వినియోగించి, హింసను, విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు కుట్ర పన్నుతోందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. లక్నోలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈసారి యూపీ ఎన్నికల పోరు డీజేలతోనే జరుగుతుంది. హింస, విద్వేషాలను ప్రేరేపించేందుకు డీజేలను యథేచ్ఛగా వాడాలని బీజేపీ కొత్త కుట్రకు రంగం సిద్ధం చేస్తోంది. అభ్యంతరకరమైన పాటలతో సహజంగానే ఎవరైనా ఉద్రేకం చెందుతారు. దీనిపై మేం ఇప్పటికే ప్రజలను అప్రమత్తం చేశాం'అని ఆయన వివరించారు. వచ్చే ఏడాది మొదట్లోనే యూపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. 'వివాహ వేడుకలో భారీ డీజే సౌండ్ కారణంగా సుల్తాన్‌పూర్ జిల్లాలోని ఓ ఫాంలో ఇటీవల 140 కోళ్లు మృత్యువాతపడ్డాయి. సంబంధిత డీజే నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు'అని వివరించారు. అదే, బలహీనమైన గుండె కలిగిన వారైతే డీజే శబ్దాల తీవ్రతకు అనారోగ్యం బారిన పడటం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

శనివారం సెల్‌ఫోన్లలో అలెర్ట్‌లు పంపడంపై అఖిలేశ్ స్పందిస్తూ..'స్విచ్ఛాఫ్ చేసి ఉన్నా, సైలెంట్‌లో ఉన్నా ఆ అలర్ట్ సెల్‌ఫోన్‌లో కనిపిస్తుంది. ఇదంతా దేని కోసం సిద్ధం చేస్తున్నారో ఒక్కసారి ఆలోచించండి? భయాన్ని సృష్టించడం ద్వారా, మిమ్మల్ని భయపెట్టడం ద్వారానే బీజేపీ ఎన్నికల్లో పోటీ చేస్తుంది' అని వ్యాఖ్యానించారు. బీజేపీని సోన్ పాపిడితో పోల్చిన అఖిలేశ్ యాదవ్.. 'బీజేపీ అబద్ధాలతో చేసిన సోన్ పాపిడి. ఒక అబద్ధంపై మరో అబద్ధాన్ని అలా పొరలు పొరలుగా పేర్చుకుంటూ పోతారు బీజేపీ నేతలు. ప్రచారమే బీజేపీ ప్రధాన ఎన్నికల వ్యూహం. ప్రజల్లో భయాన్ని కల్గించడం ద్వారానే వాళ్లు ఎన్నికల్లో పోటీ చేస్తారు'అంటూ విరుచుకుపడ్డారు. దేశంలో అవినీతి, ద్రవ్యోల్బణాలను నియంత్రించడంలో బీజేపీ విఫలమైందని ఆయన ఆరోపించారు. అదే స్థానంలో, బీజేపీ నేతలు తమ అనుయాయులకు లాభాలను చేకూర్చే పనులను అనుమతులిచ్చారు. ఫలితంగా, ద్రవ్యోల్బణం, అవినీతి ఎన్నడూలేనంతగా పెరిగిపోయాయి'అని విమర్శించారు.

## ఖలిస్తానీలు దేశ భద్రతకు ప్రమాదం

### కెనడా నిఘా విభాగం నివేదిక వెల్లడి

**ఒట్టావా:** ఖలిస్తానీ తీవ్రవాదులు దేశ జాతీయ భద్రతకు, ప్రయోజనాలకు ముప్పుగా పరిణమించారని కెనడా నిఘా విభాగం ప్రకటించింది. ఖలిస్తానీ తీవ్రవాద గ్రూపులు శక్తులు ప్రభుత్వ, సామాజిక సంస్థలను సొంత హింసాత్మక అజెండాను ప్రచారం చేసుకునేందుకు దుర్వినియోగం చేస్తున్నాయని తెలిపింది. ఈ మేరకు ఇటీవల కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ తన పబ్లిక్ రిపోర్టులో పేర్కొంది. 'కొందరు ఖలిస్తానీ తీవ్రవాదులు కెనడా పౌర సమాజంతో బలమైన సంబంధాలను కలిగి ఉన్నారు. వీరు తమ హింసాత్మక తీవ్రవాద అజెండాను ప్రచారం చేయడానికి ఇక్కడి సంస్థలను వాడుకుంటున్నారు. అమాయక సామాన్య ప్రజల నుంచి నిధులు సేకరించి, వాటిని హింసాత్మక కార్యకలాపాలకు మళ్లిస్తున్నారు'అని పేర్కొంది. ఈ నివేదకను కెనడా ప్రభుత్వం తన వెబ్‌సైట్‌లో ఉంచింది. ప్రత్యేక దేశం కోసం డిమాండ్ చేస్తున్న ఖలిస్తానీ తీవ్రవాద గ్రూపులను భారత ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలు ప్రకటించడం తెల్సిందే. ఖలిస్తాన్ కోసం అహింసాయుత పద్ధతుల్లో కెనడాలోని చట్టాలకు లోబడి, శాంతియుతంగా పోరాడే వారిని తీవ్రవాదులుగా పరిగణించలేమని తెలిపింది. కేవలం, భారత్ నుంచి వేరు దేశం కావాలనే తమ డిమాండ్ కోసం కెనడా కేంద్రంగా నిధులు సేకరిస్తూ హింసాత్మక చర్యలకు పూనుకునే కొన్ని గ్రూపులను మాత్రమే తీవ్రవాదులుగా భావిస్తామంది. 1985 నాటి ఎయిర్ ఇండియా విమానం కనిష్క పేలుడుకు పాల్పడింది కెనడాకు చెందిన ఖలిస్తానీ తీవ్రవాదులేనని గుర్తు చేసింది. అప్పటి ఘటనలో 182 మంది చనిపోవడం తెల్సిందే. కాగా, భారత్‌తో సంబంధాలు తిరిగి గాడిన పడుతున్న వేళ కెనడా స్వయంగా ఖలిస్తానీ తీవ్రవాద ముప్పును అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అస్సామీ చిత్రం 'మోయ్ ఎతి నిక్షసోర్'కు అంతర్జాతీయ పురస్కారం

**గౌహతి:** అస్సామీ చిత్రం 'మోయ్ ఎతి నిక్షసోర్'(కొడువ–నైట్‌బర్డ్) రెండు అంతర్జాతీయ అవార్డులను దక్కించుకుంది. హోస్టన్–వరల్డ్ ఫెస్ట్ చలనచిత్రోత్సవంలో డార్క్ కామెడీ, ఎత్తమ ఎడిటింగ్ పురస్కారాలను గెలుచుకుంది. ఈ చిత్రానికి జాతీయ పురస్కార గ్రహీత, దర్శకుడు విద్యుత్ కోటోకి దర్శకత్వం వహించారు. ఆయన సతీమణి పల్లవి ఎడిటింగ్ చేశారు. ఉత్తమ డార్క్ కామెడీ విభాగంలో కోటోకీ ప్లాటినం రెమీ అవార్డును అందుకోగా, చిత్ర ఎడిటింగ్‌కుగాను పల్లవి 'గోల్డ్ రెమీ అవార్డు'ను దక్కించుకున్నారు. ఈ చిత్ర కథ 'కొడువా'అనే గ్రామీణ దొంగ చుట్టూ తిరుగుతుంది. సమాజంలో నెలకొన్న అశాంతి, వివక్షను మానవీయంగా తనదైన రీతిలో ఎదుర్కొంటూ ముందుకు కొడువా సాగుతాడు. కథ ముగిసే సమయానికి 'అసలు దొంగ ఎవరు?'అనే ప్రశ్న ప్రేక్షకుల మనసుల్లో ఉదయిస్తుంది. ప్రముఖ రంగస్థల నటుడు గుణమోని బారువా ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించగా, ఇతర పాత్రల్లో అస్సామీ నటులు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ అనురాధ శర్మ పూజారి రాసిన ఒక నిజజీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు.

### ప్రేక్షకుల హృదయాలనూ దొంగిలించాడు..

బతకడం కోసం దొంగతనాలు చేసే కొడువా హోస్టన్ వరల్డ్ ఫెస్ట్‌లోనూ ప్రేక్షకుల హృదయాలను దొంగిలించడంలోనూ విజయవంతమయ్యాడని దర్శకుడు కోటోకీ చమత్కరించారు. 1961లో ఒక ఫిల్మ్ సొసైటీగా ప్రారంభమైన వరల్డ్‌ఫెస్ట్–హోస్టన్, 1968 నాటికి అంతర్జాతీయ చలనచిత్రోత్సవంగా రూపుదిద్దుకుంది. ప్రపంచంలోనే అత్యంత పురాతన స్వతంత్ర చలనచిత్రోత్సవాల్లో ఒకటిగా పేరుగాంచింది.



# బెంగాల్ విభజనకు కారణమైన వైస్రాయ్?

**1919లో స్వాతంత్ర్యోద్యమ నాయకులైన డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్ అరెస్ట్‌కు నిరసనగా అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో సమావేశమైన ప్రజానీకంపై జనరల్ డయ్యర్ విచక్షణారహితంగా కాల్పులు జరిపించాడు. ఈ ఊచకోతకు నిరసనగా రవీంద్రనాథ్ టాగూర్ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన నైట్‌హుడ్ బిరుదును త్యజించారు. 1929లో లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య సాధనే కాంగ్రెస్ ఆశయంగా ప్రకటించారు. ఇదే సంవత్సరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.**

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

## ఆధునిక భారతదేశ చరిత్ర - బ్రిటిషర్ల పాలన

### వైస్రాయ్‌లు

#### లార్డ్ కానింగ్

ఇతడిని 1858 నవంబర్ 1న అలహాబాద్ కోటలో తొలి రాజప్రతినిధిగా ప్రకటించారు.

#### మొదటి లార్డ్ ఎల్జిన్ (1862-63)

ఇతడి కాలంలో ప్రధానంగా వహాబి ఉద్యమం జరిగింది. సుప్రీమ్, సాదర్ కోర్టులను హైకోర్టులో కలిపారు.

#### సర్ జాన్ లారెన్స్ (1864-69)

లారెన్స్ 1866లో ఒడిశాలో, 1868-69లో రాచపుతానాలో సంభవించిన క్షామానికి సంబంధించిన నివారణన చర్యలు తీసుకోవడానికి సలహా సంఘం నియమించాడు. 1866లో వితంతు వివాహ సంస్థను డి.కె. కార్వే ఆధ్వర్యంలో బొంబాయిలో స్థాపించారు.

సర్ జాన్ లారెన్స్ అనేక రైల్వే, తంతి తపాలా సౌకర్యాలను కల్పించాడు. ఇతడు యూరప్‌లో మొదటిసారిగా తంతి సౌకర్యం కల్పించాడు. పంజాబ్ కౌలు చట్టాన్ని జారీ చేశాడు. దీని ప్రకారం కౌలుదార్లకు అధికారాలు ఇచ్చారు. భూటాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్, బొంబాయి, కలకత్తాలో కోర్టులు ఏర్పాటు చేశారు.

#### లార్డ్ మేయో (1869-72)

ఇతడు స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియా, వ్యవసాయ, వాణిజ్య శాఖలను ఏర్పాటు చేశాడు. ఇతడు ఆఫీసులోనే హత్యకు గురైన మొదటి గవర్నర్ జనరల్. అజ్మీర్‌లో విద్య కోసం ఒక కళాశాల, రాజ్‌కోట్‌లో రాజకీయ శిక్షణ ఇవ్వడానికి మరో కళాశాల స్థాపించాడు.

#### లార్డ్ నార్త్ బ్రూక్ (1872-76)

ఇతడి కాలంలో 1875లో వేల్స్ రాజు (ఏడో ఎడ్వర్డ్) భారతదేశాన్ని సందర్శించాడు. 1872లో బహు భార్యత్వ నిషేధ చట్టాన్ని జారీ చేశారు.

#### లార్డ్ లిట్టన్ (1876-80)

ఇతడి కాలంలో 1878లో ఆయుధ చట్టం, దేశభాషా పత్రికల చట్టాలను చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే జాతీయవాదులను అణచివేయడం కోసం దేశభాషా పత్రికల చట్టాన్ని ప్రవేశపెట్టారు. లిట్టన్ 1878లో ఐ.సి.ఎస్. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల గరిష్ఠ వయసును 21 ఏళ్ల నుంచి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ కొత్త నిబంధనలు ప్రకటించాడు. ఇతడు రెండో అఫ్గాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో తీసుకువచ్చిన యుద్ధ చట్టం యావత్ జాతిని నిరాయుధులను చేసింది. రాయల్ టైటిల్స్ యాక్ట్ చేశారు. 1877లో ఢిల్లీ దర్బార్ జరిగింది. ఇతడి కాలంలో మొదటిసారిగా కరవుపై కమిషన్ ఏర్పాటు చేశారు.

#### లార్డ్ రిప్పన్ (1880-84)

ఇతడు 1882లో దేశభాషా పత్రికల చట్టాన్ని రద్దు చేసి స్వేచ్ఛా ప్రతిపత్తిని కల్పించాడు. 1881లో మొదటి కర్మాగార చట్టం ప్రవేశపెట్టాడు. దీని ద్వారా కర్మాగారంలో పని చేసే శ్రామికుల పరిస్థితులు మెరుగయ్యాయి. 1882లో ఆర్థిక వికేంద్రీకరణ చేసి ఆదాయాన్ని 3 భాగాలుగా విభజించారు. అవి.. 1) కేంద్ర ప్రభుత్వ ఆదాయం, 2) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, 3) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆదాయం. 1882లో స్థానిక ప్రభుత్వాలకు పునాది వేసిన ఘనత రిప్పన్‌దే. ఇతడు 1882-85లో స్థానిక ప్రభుత్వ వ్యవహార చట్టం జారీ చేశాడు. ఇదే సంవత్సరంలో సర్ విలియం హంటర్ అధ్యక్షతన విద్యకు సంబంధించి ఒక కమిషన్‌ను నియమించాడు. ఈ కమిషన్ సూచనల ఆధారంగా ప్రాథమిక పాఠశాల విద్యను స్థానిక సంస్థలకు అప్పగించాడు. స్త్రీ విద్య కూడా ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో యూరోపియన్ల ఒత్తిడి మేరకు 'ఇల్బర్ట్ బిల్లు'ను సవరించారు.

ఈ బిల్లు క్రిమినల్ కేసుల్లో యూరోపియన్లను విచారించడానికి భారతీయ జిల్లా మెజిస్ట్రేటులు, సెషన్స్ జడ్జీలకు అవకాశం కల్పించే శాసనంగా ఉండేది. 1879లో వాసుదేవ్ బలవంత్ పాడ్కే అనే ఉద్యోగి అమోషి రైతులను కూడగట్టి మహారాష్ట్రలో సాయుధ తిరుగుబాటు ప్రారంభించాడు. లార్డ్ రిప్పన్ కాలంలో భారతదేశంలో మొదటిసారిగా జనాభా లెక్కలు గణించారు.

#### లార్డ్ డఫ్రిన్ (1884-88)

ఇతడి కాలంలో 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ఎ.ఒ. హ్యూమ్ తుది రూపం ఇచ్చాడు. ఇదే సంవత్సరం డిసెంబర్‌లో బొంబాయిలో ప్రథమ జాతీయ కాంగ్రెసు సమావేశానికి డబ్ల్యు.సి. బెనర్జీ అధ్యక్షత వహించాడు. మూడో బర్మా యుద్ధం డఫ్రిన్ కాలంలోనే జరిగింది.

#### లాండ్‌జన్ (1888-94)

ఇతడి కాలంలో ఫ్యాక్టరీ చట్టం చేశారు. సివిల్ సర్వీసులను విభజించారు. 'డ్యూరాండ్ కమిషన్' బ్రిటిష్ ఇండియా, అఫ్గానిస్తాన్ మధ్య సరిహద్దును నిర్ణయించింది. 1892లో 'భారత కౌన్సిళ్ల చట్టం' జారీ చేశారు. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో సభ్యుల సంఖ్య పెరిగింది. వీరిలో కొందరిని భారతీయులు పరోక్షంగా ఎన్నుకునే వీలు కలిగింది. కానీ ప్రభుత్వం నియమించే సభ్యుల సంఖ్యాధిక్యత యథాతథంగానే ఉంది. నూతన సభ్యులకు వార్షిక బడ్జెట్‌పై చర్చలో పాల్గొనే అవకాశం కల్పించారు. కానీ, వీరికి ఓటు హక్కు లేదు.

#### ఎల్జిన్ (1894-99)

ఇతడి కాలంలో 1896-97లో భయంకరమైన క్షామం సంభవించింది. దీనికి కారణాలు తెలుసుకోవడానికి 'విల్లీ' అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించాడు. ఇది నివేదిక సమర్పించక ముందే 1899లో మళ్లీ క్షామం వచ్చింది. చాపేకర్ సోదరులు 1897లో ఇద్దరు బ్రిటిష్ అధికారులను హత్య చేశారు.

#### లార్డ్ కర్జన్ (1899-1905)

కర్జన్ 1904లో యూనివర్సిటీ చట్టాన్ని జారీ చేశాడు. 'సర్‌థామస్' ర్యాలీ అధ్యక్షతన యూనివర్సిటీలకు సలహాలు ఇవ్వడానికి ఒక కమిషన్ నియమించాడు. 1904లో ప్రాచీన కట్టడాల (మాన్యుమెంట్స్) రక్షణ చట్టం, ప్రిజర్వేషన్ యాక్ట్‌ను జారీ చేశాడు. బిహార్‌లోని 'పూసా'లో వ్యవసాయ పరిశోధన సంస్థను స్థాపించాడు. 1905లో బెంగాల్‌ను విభజించాడు. కర్జన్ కాలంలోనే 1904లో వి.డి సావర్కర్ 'అభినవ భారత్' పేరుతో ఒక రహస్య విప్లవ సంస్థను స్థాపించాడు.

#### లార్డ్ మింటో (1905-10)

ఇతడి కాలంలో అతివాదులు, విప్లవ కారులు విజృంభించారు. వీరి కార్యకలాపాలను అరికట్టడానికి 1908లో 'ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్' చేశాడు. పత్రికలు, ప్రజావేదికలపై ఆంక్షలు విధించాడు. దీని కారణంగా 1908లో 'లోకమాన్య' బాలగంగాధర్ తిలక్‌ను మాండలే కారాగారంలో నిర్బంధించారు. లార్డ్ మింటో కాలంలోనే 1906లో 'భారత ముస్లింలీగ్'ను స్థాపించారు. ఆగా ఖాన్, ఢాకా నవాబు దీని ఏర్పాటుకు కృషి చేశారు. 1907లో భారత జాతీయ కాంగ్రెస్ అతివాదులు, మితవాదులుగా చీలిపోయింది. బెంగాల్ విభజనకు నిరసనగా ప్రతిఘటనోద్యమ నాయకులు 1905 అక్టోబర్ 16ను జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. 1906 ఆగస్టు 15న జాతీయ విద్యా సమితి ఆవిర్భవించింది. కలకత్తాలో జాతీయ కళాశాలను ప్రారంభించారు. అరవింద్ ఘోష్ దీనికి మొదటి ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. 1905 తర్వాత అనేక పత్రికలు విప్లవ హింసావాదాన్ని ప్రచారం చేయడం ప్రారంభించాయి. వీటిలో బెంగాలీలో వెలువడే సంధ్య, యుగంధర్; పుణే నుంచి వెలువడే 'కాల్ ప్రముఖ్' పత్రికలు ముఖ్యమైనవి. 1909లో భారత శాసనసభల చట్టం ద్వారా రాజ్యాంగపరమైన రాయితీలు ప్రకటించారు. వీటినే మింటో-మార్లే సంస్కరణలు అంటారు. వీటి ద్వారా కేంద్ర, రాష్ట్ర శాసన సభల్లో ఎన్నికైన సభ్యుల సంఖ్యను పెంచారు. వీరిలో ఎక్కువ మందిని పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకునే విధానం ప్రవేశపెట్టారు. మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను కూడా ఏర్పాటు చేశారు. హిందూ-ముస్లింలను విభజించి పాలించడమే ఇందులోని ప్రధాన ఉద్దేశం.

#### లార్డ్ హార్డింజ్ (1910-1916)

ఇతడి కాలంలో 1911లో బెంగాల్ విభజనను రద్దు చేశారు. భారత రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. అయిదో జార్జి ఢిల్లీ దర్బారును ఏర్పాటు చేశారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారత సైనికులు, పౌరులను అనుమతి లేకుండానే యుద్ధంలోకి నెట్టారు. 1915లో గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారత్ తిరిగి వచ్చారు. ఇదే సంవత్సరంలో అనిబిసెంట్ హోమ్‌రూల్ ఉద్యమాన్ని, మదన్ మోహన్ మాలవ్య 'హిందూ మహాసభ'ను స్థాపించారు. 1915లోనే గోఖలే, ఫిరోజ్‌షా మెహతా మరణించారు.

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఐఐటీ బీహెచ్‌యూలో వివిధ ఉద్యోగాలు

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీహెచ్‌యూ) సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంట్ ఫెసిలిటీ విభాగంలో తాత్కాలిక ప్రాతిపదికన ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్-03, ఆఫీస్ అసిస్టెంట్-01.
» **అర్హత:** ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్ పోస్టుకు సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీటెక్/ఎంటెక్/బీఎస్సీ/ఎమ్మెస్సీ(ఇంజనీరింగ్/సైన్స్ విభాగం)లో ఉత్తీర్ణులవ్వాలి.
దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుకు 10+2 లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 30 నుంచి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్లలకు రూ.30,000, ఆఫీస్ అసిస్టెంట్‌లకు రూ.22,000.
» **ఎంపిక విధానం:**
ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:**
ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** office.cif@itbhu.ac.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.05.2026.
» **వెబ్‌సైట్:** https://www.iitbhu.ac.in

### ఐఏఆర్ఐ, న్యూఢిల్లీలో సీనియర్ రీసెర్చ్ ఫెలోలు

న్యూఢిల్లీలోని ఐసీఏఆర్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఏఆర్ఐ) తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:**
ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:**
ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.05.2026.
» **ఇంటర్వ్యూ తేది:** 22.05.2026.
» **వెబ్‌సైట్:** http://www.iari.res.in

# నక్షత్రాల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగించేది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

## ఉష్ణం

### ఉష్ణోగ్రత మాపక రకాలు

#### వాయు ఉష్ణోగ్రతా మాపకాలు

ఘన, ద్రవ పదార్థాలతో పోలిస్తే వాయువుల ఉష్ణవ్యాకోచం అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటిని ఉపయోగించి తక్కువ ఉష్ణోగ్రతను కచ్చితంగా కొలవచ్చు. ఈ ఉష్ణోగ్రత మాపకాల్లో ఎలాంటి వాయువులైనా ఉపయోగించవచ్చు. ఇవి పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. అందువల్ల వీటిని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లడం సాధ్యం కాదు. వీటిలో హైడ్రోజన్, నైట్రోజన్, హీలియంలతో పాటు ఏ వాయువునైనా నింపవచ్చు.

#### నిరోధక ఉష్ణోగ్రతా మాపకాలు

లోహాలను వేడిచేస్తే వాటి నిరోధం పెరుగుతుందనే సూత్రం ఆధారంగా ఈ ఉష్ణోగ్రతా మాపకాలు పనిచేస్తాయి. కానీ వేర్వేరు లోహాల నిరోధాలు వేర్వేరుగా ఉండటం వల్ల వీటిని ఉపయోగించి ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవలేం. నిరోధక ఉష్ణోగ్రతా మాపకాల్లో ప్లాటినంను వాడతారు. దీన్ని ఉపయోగించి కొలిచే ఉష్ణోగ్రత స్థాయి -200°C నుంచి 1200°C.

#### అయస్కాంత ఉష్ణోగ్రత మాపకం

పరమశూన్య ఉష్ణోగ్రత -273°C లేదా 0°K-ను కొలవడానికి ఈ ఉష్ణోగ్రతా మాపకాలను ఉపయోగిస్తారు. సాధారణంగా ద్రవస్థితిలో ఉన్న హీలియంను ఇలాంటి మాపకాల్లో వాడతారు.

#### ఉష్ణ విద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం

ఇది సీబెక్ ఫలితం ఆధారంగా పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి క్రిమికీటకాల ఉష్ణోగ్రతలను 0.025°C వరకు కచ్చితంగా కొలవవచ్చు. ఇలాంటి ఉష్ణోగ్రత మాపకాలను Sb, Bi అనే ఉష్ణయుగ్మంతో నిర్మిస్తారు.

#### సిక్స్ గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం

ఇందులో పాదరసం, ఆల్కహాల్‌ను ఉపయోగిస్తారు. 24 గంటల కాల వ్యవధిలో వాతావరణంలో సంభవించే కనిష్ఠ,గరిష ఉష్ణోగ్రతలను కొలవవచ్చు.

#### బెక్‌మెన్స్ ఉష్ణోగ్రతా మాపకం

వివిధ స్వభావాలు ఉన్న నీటిఆవిరి ఉష్ణోగ్రతలను కొలవడానికి ఈ మాపకాన్ని వాడతారు.

**ఉదాహరణ:**

1) స్వచ్ఛమైన నీరు 100°C
2) సముద్ర జలం 101°C
3) మలినమైన నీరు 99°C (సుమారు)

#### బెథిస్కోప్

సముద్రగర్భంలో ఉన్న ఉష్ణోగ్రతలను కొలవడానికి దీన్ని జలాంతర్గామిలో అమరుస్తారు.

#### క్లినికల్ థర్మోమీటర్

దీన్ని సెంటారియో అనే శాస్త్రవేత్త 1602లో కనుగొన్నాడు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆధునిక క్లినికల్ థర్మామీటర్‌ను 1866లో సర్ థామస్ క్లిఫర్డ్ ఆల్బట్ రూపొందించాడు.

#### పైరో మీటర్

పరిశ్రమల్లోని బట్టీలు లేదా కొలిమిల నుంచి వెలువడే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి పైరో మీటర్‌ను ఉపయోగిస్తారు. దీని సహాయంతో 3000°C-3500°C వరకు ఉష్ణోగ్రతలను కొలవడం సాధ్యపడుతుంది.

#### ఆప్టికల్ పైరోమీటర్

సూర్యుడు లేదా నక్షత్రాల్లో ఉండే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు.

పైరోమీటర్, ఆప్టికల్ పైరోమీటర్లు ఉష్ణ వికిరణం ఆధారంగా పనిచేస్తాయి. కాబట్టి వస్తువుల ఉష్ణోగ్రతలను కొలిచేటప్పుడు వేడి వస్తువులు, ఉష్ణోగ్రత మాపకాల మధ్య భౌతిక స్పర్శ ఉండాల్సిన అవసరం లేదు.

#### విశిష్టోష్ణం

పదార్థం విశిష్టోష్ణం $S = \frac{1}{m}\frac{Q}{t}$

$$\Rightarrow S \propto \frac{1}{\Delta t}$$

m = పదార్థ ద్రవ్యరాశి,
Q = పదార్థానికి అందించిన ఉష్ణరాశి.

విశిష్టోష్ణం, ఆయా పదార్థాల (ఘన, ద్రవ, వాయు) స్వభావంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వేర్వేరు పదార్థాల్లో విశిష్టోష్ణ విలువలు వేర్వేరుగా ఉంటాయి.

#### పాదరసం

ఇది గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో లభించే ఒక లోహ మూలకం. పాదరసాన్ని సిన్నబార్ అనే ముడిపదార్థం నుంచి సంగ్రహిస్తారు. స్వభావరీత్యా వెండిలా మెరవడం వల్ల దీన్ని క్విక్ సిల్వర్ అని కూడా అంటారు. పాదరసం లోహాలతో చర్య జరిపినప్పుడు ఏర్పడిన పదార్థాలను అమాల్గమ్‌లు అంటారు. ఇది Fe(ఇనుము)తో చర్య జరపదు. కాబట్టి దీన్ని ఇనుప పాత్రలో రవాణా/నిల్వ చేస్తారు. పాదరసం మంచి ఉష్ణ వాహకం, విద్యుత్ వాహకం.పాదరస కాలుష్యం వల్ల 'మినిమిటా'అనే వ్యాధి వస్తుంది.తొలిసారిగా ఈ వ్యాధిని జపాన్‌లో కనుగొన్నారు.

### ఉష్ణ వ్యాకోచాలు

#### ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు

ప్రతి ఘన పదార్థంలో ద్రవ్యరాశి మూడు అంశాల వెంబడి అంటే X, Y, Z (X- పొడవు, Y- వెడల్పు, Z- ఎత్తు)లలో విభజితమై ఉంటుంది. ఒక ఘన పరిమాణాన్ని వేడిచేస్తే అది మూడు రకాల వ్యాకోచాలను కలిగి ఉంటుంది.

* **దైర్ఘ్య వాకోచం:**
ఘన పదార్థాన్ని వేడిచేస్తే ఏదైనా ఒక అక్షం వెంట వ్యాకోచిస్తే దాన్ని దైర్ఘ్య వ్యాకోచం అంటారు.

* **విస్తీర్ణ వ్యాకోచం:**
ఒక ఘన పదార్థాన్ని వేడి చేస్తే ఏదైనా రెండు అంశాల వెంట వ్యాకోచిస్తే దాన్ని విస్తీర్ణ వ్యాకోచం అంటారు.

* **ఘనపరిమాణ వ్యాకోచం:**
ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే అన్ని అక్షాల వెంట వ్యాకోచిస్తే దాన్ని ఘన పరిమాణ వ్యాకోచం అంటారు.

ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే దానిలో ఉండే వివిధ వ్యాకోచాల నిష్పత్తి 1:2:3గా ఉంటుంది. కాబట్టి ప్రతి ఘనపదార్థం దాని ఘనపరిమాణంలో గరిష్ఠ వ్యాకోచాన్ని కలిగి ఉంటుంది. ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు వాటి స్వభావాన్ని బట్టి అణువుల మధ్య బంధ దూరంలో మార్పు వస్తుంది.

* కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వీటి అణువుల మధ్య బంధ దూరం పెరగడం వల్ల ఆ పదార్థాలు వ్యాకోచిస్తాయి.
**ఉదా:** Al, Cu, Fe...
* కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వాటి అణువుల మధ్య బంధ దూరం తగ్గి పదార్థాలు సంకోచిస్తాయి.
**ఉదా:** ప్లాస్టిక్, రబ్బర్, గాజు, సిల్క్ వస్త్రాలు, తల వెంట్రుకలు, ఫ్యూజు తీగ.
* కొన్ని ఘన పదార్థాలను వేడి చేసినా లేదా చల్లబర్చినా వాటి అణువుల మధ్య బంధదూరం మారదు. కాబట్టి ఇలాంటి పదార్థాలు సంకోచ, వ్యాకోచాలు చెందవు. **ఉదా:** చెక్కదిమ్మ.

#### అనువర్తనాలు

* రెండు వరుస రైలు పట్టాల మధ్యలో తగినంత ఖాళీ వదలడం వల్ల అవి స్వేచ్ఛగా సంకోచ, వ్యాకోచాలు చేయగలుగుతాయి.
అందుకే రెండు విద్యుత్ స్తంభాలు లేదా టెలిఫోన్ స్తంభాల మధ్య తీగలను కొంచెం వదులుగా బిగిస్తారు.
* ఒక అల్యూమినియం పాత్రలో ఇనుపపాత్ర బంధించి ఉన్నప్పుడు వాటిని విడదీయాలంటే వేడిచేయాలి. ఇనుము కంటే అల్యూమినియం ఎక్కువగా వ్యాకోచిస్తుంది. అందువల్ల ఇనుప పాత్ర పరిమాణం కంటే అల్యూమినియం పాత్ర పరిమాణం పెరుగుతుంది.
* ఒకవేళ ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర బంధించి ఉంటే వాటిని వేరు చేయడం కోసం చల్లబర్చాలి. ఈ సందర్భంలో ఇనుప పాత్ర కంటే అల్యూమినియం పాత్ర ఎక్కువగా సంకోచిస్తుంది.
* గది ఉష్ణోగ్రత వద్ద ఒక లోహ పలక మధ్య బిందువు వద్ద ఒక రంధ్రం ఉంది. లోహ పలకను వేడిచేసినప్పుడు అది వ్యాకోచించడం వల్ల రంధ్రం వ్యాసం కూడా పెరుగుతుంది.
* ఎడ్లబండి కొయ్య చక్రంపై వేడిచేసిన ఇనుప చక్రాన్ని అమర్చి నీటిని చల్లినప్పుడు అది సంకోచించి చక్రాన్ని గట్టిగా అదిమి పట్టుకుంటుంది.
* విద్యుత్ బల్బులను సీల్ చేయడం కోసం ప్లాటినం(Pt)ను ఉపయోగిస్తారు. గాజు, ప్లాటినంల సంకోచ వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
* ఇంటి పైకప్పుల నిర్మాణంలో కాంక్రీట్‌తో పాటు స్టీలును ఉపయోగిస్తారు. ఆ రెండు పదార్థాల సంకోచం, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
* ఇనుప బ్రిడ్జిలను నిర్మించాక వాటిని గోళాకారం లేదా స్థూపాకారం ఉన్న నిర్మాణాలపై ఉంచితే అవి స్వేచ్ఛగా సంకోచ వ్యాకోచాలు చెందుతాయి.
* వేడి గాజు పలకపై చల్లటి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన సంకోచాల వల్ల అది పగిలిపోతుంది.
* గాజు పలకపై వేడి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన వ్యాకోచాల వల్ల అది పగిలిపోతుంది.
* ఇన్వార్ స్టీల్ అనే పదార్థంలో సంకోచ, వ్యాకోచాలు పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువగా ఉంటాయి. కాబట్టి ఈ పదార్థాన్ని శృతి దండాలు, మీటర్ స్కేలు, గోడ గడియారాల్లోని లోలకాల తయారీలో ఉపయోగిస్తారు.

### గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఏ ఉష్ణోగ్రత వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది?
ఎ) -4°C   బి) 4°C
సి) 60°C   డి) 100°C
2. నీటి అసంగత వ్యాకోచ ధర్మాన్ని ఏ పదార్థ స్వభావంతో పోల్చవచ్చు?
ఎ) రబ్బర్   బి) ప్లాస్టిక్
సి) బైమెటల్
డి) పైవన్నీ
3. క్రిమి కీటకాల ఉష్ణోగ్రత కొలవడానికి ఉపయోగించే ఉష్ణోగ్రతా మాపకం?
ఎ) సిక్స్-గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం
బి) పైరోమీటర్
సి) సీబెక్ ఉష్ణవిద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం
డి) అయస్కాంత ఉష్ణోగ్రతా మాపకం
4. ఉష్ణశక్తి యాంత్రికశక్తిగా ఎందులో మారుతుంది?
ఎ) వాహనం   బి) ఫ్యాన్
సి) ఇస్త్రీపెట్టె
డి) విద్యుత్ హీటర్
5. 80°C వద్ద ఉన్న వేడి టీ 70°Cకు చల్లారడానికి అయిదు నిమిషాల సమయం అవసరం. తిరిగి 70°C నుంచి 60°Cకు చల్లారడానికి కావాల్సిన సమయం?
ఎ) అయిదు నిమిషాలు
బి) అయిదు నిమిషాల కంటే ఎక్కువ
సి) అయిదు నిమిషాల కంటే తక్కువ
డి) ఏదీకాదు
6. ఒక ఇంధనం నుంచి వెలువడే ఉష్ణరాశిని దేనితో కొలుస్తారు?
ఎ) ఉష్ణోగ్రతా మాపకం
బి) సాధారణ కెలోరీమీటర్
సి) బోలోమీటర్
డి) బాంబు కెలోరీమీటర్
7. రాగి పాత్రలో వేడి ద్రవాన్ని నింపి ఇనుపబల్లపై ఉంచితే అది ఏ పద్ధతి వల్ల చల్లారుతుంది?
ఎ) ఉష్ణవహనం   బి) ఉష్ణ సంవహనం
సి) ఉష్ణ వికిరణం
డి) ఎ, బి
8. ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించేందుకు ఉపయోగించే థర్మోస్టాట్‌ను దేనితో తయారుచేస్తారు?
ఎ) ఇనుము, ఇత్తడి
బి) ఇనుము, రాగి
సి) రాగి, ఉక్కు
డి) ఇత్తడి, రాగి
9. థర్మాస్‌ఫ్లాస్క్‌లోని వేడిద్రవం ఏ పద్ధతి వల్ల ఉష్ణాన్ని నష్టపోదు?
ఎ) ఉష్ణవహనం
బి) ఉష్ణ సంవహనం
సి) ఉష్ణ వికిరణం
డి) పైవన్నీ
10. ఉష్ణోగ్రత మాపకం కనిష్ఠ రీడింగ్ ఎల్లప్పుడూ దేనికి సమానం?
ఎ) మంచు ఉష్ణోగ్రత
బి) పాదరస ఉష్ణోగ్రత
సి) ఆల్కహాల్ ఉష్ణోగ్రత
డి) నీటి ఆవిరి ఉష్ణక్షగ్రత
11. ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర ఉంచారు. వీటిని వేరు చేయాలంటే?
ఎ) ఆ రెండు పాత్రలు వేడి చేయాలి
బి) ఆ రెండు పాత్రలూ చల్లని నీటిలో ముంచాలి
సి) ఆ రెండు పాత్రలను సుత్తితో కొట్టాలి
డి) పైవన్నీ
12. నీటి అసంగత వ్యాకోచం తగ్గించేందుకు దానిలో ఏ ద్రవం కలపాలి?
ఎ) ఇథైల్ గ్లైకాల్
బి) బెంజీన్   సి) పెట్రోలు
డి) కిరోసిన్
13. విద్యుత్ ఇస్త్రీపెట్టెను కనుగొన్నవారు?
ఎ) ప్రివోస్ట్   బి) కూలుంబ్
సి) హెన్రీషెలె
డి) విలియం గిల్‌బర్డ్
14. పగటి సమయంలో చంద్రుడి సగటు ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 25°C   బి) 50°C
సి) 75°C   డి) 100°C

#### సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) ఎ; 5) బి; 6) డి; 7) డి; 8) ఎ; 9) డి; 10) ఎ; 11) బి; 12) ఎ; 13) సి; 14) డి.

# పోతన భాగవతంలో పేర్కొన్న ఏకశిలానగరం..?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

## తెలంగాణ కవులు - సాహిత్యం

### కాకతీయుల కాలం

**విశ్వేశ్వర దేశికుడు (1200–1290):** ఇతడినే విశ్వేశ్వర దేశికుడు లేదా శివదేవుడు అంటారు. ఈయన 'శివతత్వ రసాయనం' రచించాడు. శివదేవుడు కేరళ ప్రాంతానికి చెందిన కీర్తి శంభుని శిష్యుడు. విశ్వేశ్వర దేశికుడు తెలంగాణకు వచ్చి స్థిరపడ్డాడు. ఇక్కడ అనేక మఠాలు (కాళేశ్వరం, ఏలేశ్వరం), దేవాలయాలు (మంథెన, వెల్లాల, గోళగి) నిర్మించాడు. ఈయన కాకతీయ గణపతి దేవుడి దీక్షా గురువు. విశ్వేశ్వర దేశికుడు రుద్రమదేవి పాలనను, ప్రతాపరుద్రుడి యువరాజ త్వాన్ని ప్రశంసించాడు. గణపతి దేవుడి నుంచి 'మందిరం', రుద్రమదేవి నుంచి 'వెలగపూడి' అనే గ్రామాలను పొందాడు. ఈ రెండింటినీ కలిపి 'గోళగి' అనే అగ్రహారంగా మార్చాడు. అక్కడ శివాలయం, ప్రసూతి వైద్యశాల నిర్మించాడు.

**గోన బుద్ధారెడ్డి (1210–1240):** రంగనాథ రామాయణం రాశాడు. ఇది తెలుగులో తొలి రామాయణం. ఇందులో.. ఇంద్రుడు కోడై కూయడం, లక్ష్మణుడు ఏడుగీతలు గీయడం, ఊర్మిళ నిద్ర, లక్ష్మణ దేవుడి నవ్వు లాంటి కథలు కూడా రాశాడు. దీన్ని ద్విపద కావ్యంలో రచించాడు.

**శివదేవయ్య:** 'పురుషార్థసారం' గ్రంథాన్ని రచించాడు. గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడి వద్ద శివదేవయ్య మంత్రిగా పనిచేసి మన్ననలు పొందాడు. సంస్కృతాంధ్ర కవితా పితామహుడిగా కీర్తి పొందాడు.

**ఈశ్వర భట్టోపాధ్యాయుడు (1262):** ఇతడు మయూరసూరి పుత్రుడు. తన తల్లి పేరుతో, భార్య పేరుతో బూదపురంలో రెండు చెరువులు తవ్వించాడు. అక్కడ దేవాలయాలు నిర్మించాడు. ఈయన బూదపుర శాసనాన్ని నిర్మించాడు. ఇది మహబూబ్ నగర్ జిల్లాలో ఉంది.

**కుప్పాంబిక (1230–1300):** ఈమె తొలి తెలుగు/ తెలంగాణ కవయిత్రి. మొల్ల కంటే ముందే అనేక కవిత్వాలు రచించారు.

**చక్రపాణి రంగనాథుడు:** శివభక్తి దీపిక, గిరిజాది నాయక శతకం, చంద్రాభరణ శతకం, శ్రీగిరి నాథ విక్రయం, వీరభద్ర విజయం (సంస్కృతం) రచించాడు. ('వీరభద్ర విజయం' తెలుగులో పోతన రాశాడు)

**కపర్ది:** అపస్తంభ శ్రౌత సూత్ర భాష్యం, భరద్వాజ గృహ్యసూత్ర భాష్యం, అపస్తంభ గృహ్యపరిశిష్ట భాష్యం, శ్రౌత కల్పకావృత్తి, దివ్య పూర్ణభాష్యం ఇతడి ప్రసిద్ధ గ్రంథాలు. కపర్ది ప్రఖ్యాత వ్యాఖ్యాత మల్లినాథసూరి తండ్రి. మెదక్ జిల్లా కొలిచెలిమివాసి. ఈయన గొప్ప భాష్యకారుడు.

**గంగాధర కవి:** మహాభారతాన్ని నాటక రూపంలో రచించాడు.

**అప్పయార్యుడు:** జినేంద్రకల్యాణాభ్యుదయం రాశాడు.

**మంచన:** కేయూర బాహు చరిత్ర రాశాడు.

**శేషాద్రి రమణ:** సంస్కృతంలో యయాతి చరిత్ర, ఉషా రాగోదయం (నాటకం) శేషాద్రి రమణ రచించాడు. యయాతి చరిత్రను తెలుగులో పొన్నెగంటి తెనగానచార్యుడు గోల్కొండ రాజు ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో రాశాడు.

**మారన (1289–1323):** తెలుగులో తొలి పురాణమైన 'మార్కండేయ పురాణం' తెలుగులో తొలి వ్యాకరణ గ్రంథమైన 'ఆంధ్రభాషాభూషణం' మారన రాశాడు.

**కేతన:** 'విజ్ఞానేశ్వరీయం' కేతన రాశాడు. ఇది తెలుగులో తొలి శిక్షాస్మృతి. ఇది యజ్ఞవల్క్యుడి స్మృతికి అనువాదం.

**విద్యానాథుడు (1289–1323):** ప్రతాపరుద్ర యశోభూషణం, ప్రతాపరుద్ర కల్యాణం గ్రంథాలను విద్యానాథుడు రాశాడు. వీటిలో ప్రతాపరుద్రుడి యశోగానం కనిపిస్తుంది.

**కుమారస్వామి:** 'సోమిపథి రత్నాపణ' గ్రంథాన్ని రాశాడు.

**చిలకమర్రి తిరుమలాచార్యులు:** 'రత్నశాణ' రచించాడు. భట్టుమూర్తి 'నరసభూపాతియం' దీని అనువాదమే.

**అగస్త్యుడు (1289–1323):** బాల భారతం, కృష్ణచరిత్ర (గద్య కావ్యం), నలకీర్తి కౌముది (పద్య కావ్యం), మణిపరీక్ష (లక్ష్మీ స్తోత్రం), లలిత సహస్ర నామం, శివ సంహిత, శివస్తవం తదితర 74 గ్రంథాలు రచించాడు. గంగాదేవి అగస్త్యుడి శిష్యురాలు. ఈమె విజయనగర రాజైన కుమార కంపరాయలను వివాహం చేసుకుంది. 'మధుర విజయం' గ్రంథంలో భర్త ఘన విజయాలను వివరించింది.

**తిక్కన:** భారతాన్ని తెలుగులోకి తిక్కన అనువదించారు.

- 'నన్నయ' రాజరాజనరేంద్రుడి, 'తిక్కన' గణపతిదేవుడి, 'ఎర్రన' ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉన్నారు. ఈ ముగ్గురిని 'కవిత్రయం'గా పేర్కొంటారు.
- మల్లికార్జునుడు, హుళక్కి భాస్కరుడు, రుద్రదేవుడు.. ఈ ముగ్గురు కలిసి 'భాస్కర రామాయణం' రచించారు.

### రేచర్ల పద్మనాయకులు

**విద్యారణ్య స్వామి:** ఈయన శృంగేరి పీఠాధిపతి. 'సంగీతసారం' గ్రంథాన్ని రచించారు. విద్యారణ్య స్వామి మహామేధావి, కవి, తాత్వికుడు. హరిహర రాయలు, బుక్కరాయలకు విజయనగర రాజ్యాన్ని స్థాపించడానికి ప్రేరణ ఇచ్చారు. విద్యారణ్యుడు ఏకశిలానగరవాసి అని 21వ శృంగేరి పీఠాధిపతి సచ్చిదానంద భారతి ఆస్థాన విద్వాంసుడైన కాశీ లక్ష్మణ శాస్త్రి 'గురువంశ కావ్యం'లో పేర్కొన్నాడు.

**సాయనుడు:** ఈయన చతుర్వేదాలకు భాష్యం రాశాడు. పురుషార్థ సుధానిధి, ఆయుర్వేద సుధానిధి, యజ్ఞతంత్ర సుధానిధి తదితర రచనలు చేశాడు.

**పద్మనాయక భూపాలుడు:** సారంగధర చరిత్ర పద్మనాయక భూపాలుడు రాశాడు. ఈయనకు 'సర్వజ్ఞ' అనే బిరుదు ఉంది.

**విశ్వేశ్వరుడు:** చమత్కార చంద్రిక, వీరభద్ర విజృంభణ గ్రంథాలను రాశాడు.

**కవిభల్లటుడు:** గుణమంజరి, పదమంజరి, శూద్రక రాజచరిత్రం, బేతాళ పంచవింశతి ఇతడి ప్రసిద్ధ రచనలు.

**మడికి సింగన:** సకలనీతి సమ్మతం, పద్మపురోణోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం (ద్విపదం), జ్ఞాన వాశిష్ఠ రామాయణం మొదలైనవి రచించాడు.

**సర్వజ్ఞ సింగభూపాలుడు:** రసావర్ణ సుధాకరం, సంగీత సుధాకరం, కందర్ప సంభవం, కువలయావళి (రత్నపాంచాలిక) లాంటి రచనలు చేశా డు. ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత నాట్య మర్మజ్ఞుడు. కవి, నాటకకారుడు. సర్వజ్ఞ సింగభూపాలుడు అనేక మంది కవి, పండితులను పోషించాడు. సారంగదేవుడు రచించిన 'సంగీత రత్నాకరం' గ్రంథానికి 'సంగీత సుధాకరం' పేరుతో వ్యాఖ్యానం చేశాడు. రసావర్ణ సుధాకరం అనేది అలంకార శాస్త్రం.

**గౌరన:** నవనాథ చరిత్ర (దీన్నే శ్రీగిరి పండితుడు చంపువుగా రాశాడు), లక్ష్మణ దీపిక, హరిశ్చంద్రోపాఖ్యానం లాంటి అనేక గ్రంథాలు రచించాడు. గౌరనకి 'సరస సాహిత్య లక్షణ చక్రవర్తి', 'ప్రతివాద మదగజ పంచాననుడు' అనే బిరుదులు ఉన్నాయి. మార్కండేయ, స్కంధ పురాణాల్లో ఉన్న హరిశ్చంద్ర మహారాజు కథే హరిశ్చంద్రోపాఖ్యానం మూలకథ. శ్రీగిరి పండితుడు రెడ్డిరాజుల కాలంలో నవనాథ చరిత్రను చంపువుగా రాశాడు.

**బమ్మెర పోతన:** పోతన 'వీరభద్ర విజయం', 'భోగినీ దండకం', 'మహాభాగవతం' (తెలుగులో) రచించాడు. ఈయన కొంతకాలం మూడో సింగభూపాలుని ఆస్థానంలో ఉన్నారు. పోతన భాగవతంలో పేర్కొన్న ఏకశిలానగరం నేటి ఓరుగల్లే (వరంగల్). పోతన జన్మస్థలమైన బమ్మెర ఈ జిల్లాలోనే ఉంది. అంతకుముందు ఇది నల్లగొండ జిల్లాలోని గ్రామం. వీరభద్ర విజయంలోని మూలకథ.. శివుడిని ఆహ్వానించకుండా దక్షుడు యజ్ఞం నిర్వహించడం, శివుడి కోప సంకల్పంతో పుట్టిన వీరభద్రుడు దాన్ని ధ్వంసం చేయడం, దక్షుడి శిరస్సు ఖండించడం. భోగినీ దండకంలో నాటి పాలకుల భోగలాలసత్వాన్ని వర్ణించారు. పోతన భాగవతం తెలుగులో భక్తికి మారుపేరుగా నిలిచింది. ఇందులో ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, వామనావతార ఘట్టం, శ్రీకృష్ణ చరిత్ర మొదలైనవాటిని పోతన రమ్యంగా వర్ణించారు.

**కొరవి గోపరాజు:** 'సింహాసన ద్వాత్రింశిక' రచించాడు. ఇది కథాకావ్యం. ఈ గ్రంథానికి మూలం విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం. పాల్కురికి తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం ఇదే.

### కుతుబ్‌షాహీల యుగం (1518-1687)

**సుల్తాన్ కులీ:** ఇతడికి బడే మాలిక్ (దొడ్డ ప్రభువు) అనే బిరుదు ఉంది.

**జంషీద్:** కూచిపూడి భాగవతులకు 'కూచిపూడి' గ్రామాన్ని దానం చేశాడు.

**ఇబ్రహీం కుతుబ్‌షా:** ఇతడిని మల్కిభరాముడిగా పేర్కొన్నారు. ఈయన ఆస్థానంలో అనేక మంది కవులు ఉండేవారు. వీరిలో ముఖ్యమైనవారు.

**అద్దంకి గంగాధరుడు:** ఈయన 1565లో తపతీ సుందరోపాఖ్యానం (తపతీ సంవరణోపాఖ్యానం) రచించి ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితం చేశాడు. 'వసుచరిత్ర'ను దీని ఆధారంగానే రాశారు (1570). అద్దంకి గంగాధరుడు రామరాజ భూషణుడితో పోల్చదగిన ప్రతిభావంతుడైన కవి.

**కందుకూరి రుద్రకవి:** సుగ్రీవ విజయం (తొలి యక్షగానం), నిరంకుశోపాఖ్యానం, జనార్ధనాష్టక స్తోత్రం, గువ్వల చెన్నని శతకం మొదలైనవాటిని రచించాడు. అగ్రశ్రేణి కవుల్లో ఒకరైన రుద్రకవి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ సమీపంలో ఉన్న కందుకూరు గ్రామ నివాసి. నిరంకుశోపాఖ్యానం శృంగార ప్రధానమైన సాంఘిక కావ్యం.

**పొన్నెగంటి తెలగన:** 'యయాతి చరిత్ర' పొన్నెగంటి తెలగన రాశాడు. ఇది అచ్చ తెలుగులో రచించిన తొలి గ్రంథం.

**మహమ్మద్ కులీకుతుబ్‌షా:** తన ప్రేయసి భాగమతి పేరుపై మహమ్మద్ కులీకుతుబ్‌షా భాగ్యనగరం నిర్మించాడు. బాగ్ అంటే 'ఉద్యానం' అని అర్థం. చార్మినార్ (1591), హైదరాబాద్ (1593)ను కూడా ఈయన నిర్మించాడు. మీర్జా మహమ్మద్ అమిన్, వజీహీ, గవాసీ తదితర ప్రముఖ కవులను మహమ్మద్ కులీకుతుబ్‌షా ఆదరించాడు. ఈయన ఉర్దూ కవితల సంకలనాన్ని దివాన్ పేరుతో అతడి అల్లుడు సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వెలువరించాడు.

**సారంగు తమ్మయ్య:** హరిభక్తి సుదోదయం, వైజయంతీ విలాసం రచించాడు. సారంగు తమ్మయ్య కుతుబ్‌షాకు ఆప్తుడిగా వ్యవహరిస్తూనే.. కలంపట్టి కమనీయమైన కావ్యరచనలు చేశాడు. వైజయంతీ విలాసం గ్రంథం తెలుగు శృంగార కావ్యాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. నాటి పాలకుల భోగలాలసతను మరో కోణం నుంచి చిత్రించిన కావ్యం ఇది.

**నేబతి కృష్ణమంత్రి:** 'రాజనీతి రత్నాకరం' అనే గ్రంథం రాశాడు.

**ఎల్లారెడ్డి:** బాలభారతం (అగస్త్యుడి రచనకు అనువాదం), కిరాతార్జునీయం (భారవి రచనకు అనువాదం) రాశాడు.

**మల్లారెడ్డి:** షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం తదితర రచనలు చేశాడు.

**అబ్దుల్లా కుతుబ్‌షా:** సంస్కృత 'శుకసప్తతి'ని 'యతినామా' పేరుతో పర్షియన్ భాషలోకి అనువాదం చేశాడు. అబ్దుల్లా కుతుబ్‌షా పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగంగా ఉంది. ఈయన కవి, పండిత పోషకుడే కాకుండా స్వయంగా గొప్ప కవి. అబ్దుల్లా పేరుతో కవితలు రాశాడు. అబ్దుల్లా కుతుబ్‌షా ఆస్థానంలో అనేక మంది పండితులు ఉండేవారు. వారిలో ప్రధాన కవులు–వారి రచనలు..

- గవాసి ఇబిన్ నిషాత్ – తోతినామా.
- తబియా – బహురావగుల్.
- తులసీమూర్తి – సంగీత విద్వాంసుడు.
- క్షేత్రయ్య – రాజుపై 12 వేల కృతులు రాశారు.
- మరింగంటి వేంకట నరసింహాచార్యులు – హరివాసర మాహాత్మ్యం.
- చరిగొండ నరసింహ – శశిబిందు చరిత్ర.
- రాజలింగ కవి – కూర్మపురాణం.
- కోన నారాయణ – వజ్రాభ్యుదయం.
- పిల్లలమర్రి వేంకటపతి – రాజేశ్వర విలాసం.
- గోపతి లింగ కవి – చెన్నబసవ పురాణం.

**సురభి మాధవరాయలు:** చంద్రికా పరిణయం అనే ప్రౌఢ కావ్యాన్ని శ్లేష అనుప్రాసాది శబ్ద చిత్ర నిపుణత్వంతో రచించాడు.

**ఎలకూచి బాలసరస్వతి:** సుభాషిత రత్నావళి, మాధవ రాఘవ పాండవీయం రాశాడు. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువాదం చేసి మాధవ రాయల తండ్రి మల్లభూపాలుడికి అంకితం చేశాడు.

**అప్పకవి:** సాధ్వీజన ధర్మం (ద్విపద కావ్యం), అనంతవ్రతకల్పం (కావ్యం), అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) రాశాడు.

**పోనుగోటి జగన్నాథాచార్యులు:** కుముదవల్లి విలాసం (ఇది భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉండటం గమనార్హం)

**కంచర్ల గోపన్న:** దాశరథీ శతకం రాశారు. ఈయనను భక్తరామదాసుగా పేర్కొంటారు. ఈయన అక్కన్న, మాదన్న మేనల్లుడు. 1650లో భద్రాచలం తహశీల్దార్‌గా నియమితులయ్యారు.

భద్రాచలంలో రామాలయం నిర్మించారు. అబుల్‌హసన్ తానీషా ఈయనను గోల్కొండలో బంధించాడు. గోపన్న భక్తికి మెచ్చి చివరకు విడుదల చేశారు.

**పెన్గలూరి వెంకటాద్రి:**

భువన మోహిని విలాసం రాశారు.

**విశ్వనాదయ్య:** సిద్ధేశ్వర పురాణం (ద్విపదం) రచించారు.

**అన్నంభట్టు:** తర్క సంగ్రహం రాశారు.

**కృష్ణమాచార్యులు:** భగవద్గీత (ద్విపద) రాశారు..

# What is the code for 'being'?

## Model Questions

*Directions (Q.1-5): Study the following information to answer the given questions.*

Seven friends, viz Manjit, Naveen, Parul, Hitesh, Tarun, Raghu and Sahil, are pursuing their PhD in different subjects Maths, History, Political Science, Chemistry, Economic, Accounts and Geography, but not necessarily in the same order. They study in three different universities, viz P, Q and S. At least two friends study in the same university. Hitesh is studying Political Science in university P. The one who is studying History is not from university S. Sahil is studying Geography in university Q with only Naveen. Manjit is not studying Economics and is not from university P. Raghu is studying Accounts and is not from university P. Tarun is studying Chemistry but not from university P. No one studies Maths or Economics in university P.

1. Which of the following represents the group that studies in university S?
   1) Hitesh, Naveen
   2) Parul, Raghu, Tarun
   3) Manjit, Tarun
   4) Tarun, Raghu, Manjit
   5) None of these
2. Parul is studying in which of the following universities?
   1) P 2) Q 3) S
   4) Can't be determined
   5) None of these
3. Which of the following combinations is true?
   1) Manjit-Economics-university S
   2) Naveen-History-university Q
   3) Parul-History-university S
   4) Tarun-Chemistry-university Q
   5) None of these
4. Naveen studies which subject in PhD?
   1) History
   2) Maths
   3) Economics
   4) Can't be determined
   5) None of these
5. Who among the following is studying History in PhD?
   1) Naveen 2) Parul
   3) Raghu 4) Manjit
   5) None of these

*Directions (Q.6-11): Read the following information carefully and answer the given questions.*

Eight friends Aman, Bharat, Rohit, Dinesh, Ishant, Farhan, Aditya and Hirender are sitting around a circular table, facing the centre but not necessarily in the same order. Each of them has a different designation, viz Banker, Teacher, Company MD, Politician, Corporate Leader, General Manager, Specialist Officer and CEO. Aman sits third to the right of the CEO. Only two people sit between the CEO and Hirender. The Specialist Officer and the Company MD are immediate neighbours. Neither Aman nor Hirender is either a Specialist Officer or a Company MD. The Specialist Officer is not an immediate neighbour of the CEO. The Banker sits second to the left of Ishant. Ishant is not an immediate neighbour of Hirender. The Banker is an immediate neighbour of both the Politician and the Corporate Leader. The Corporate Leader sits third to the right of Bharat. Bharat is not a Specialist Officer. Rohit sits on the immediate right of the Teacher. Aman is not a Teacher. Farhan is not an immediate neighbour of Aman. Aditya is not an immediate neighbor of the Banker.

6. Four of the following five are alike in a certain way based on the given arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
   1) Farhan – Teacher
   2) Aditya – General Manager
   3) Dinesh – Banker
   4) Aman – Corporate Leader
   5) Bharat – CEO
7. Who amongst the following sits third to the left of Ishant?
   1) Banker 2) Aditya 3) Aman
   4) Corporate Leader 5) Bharat
8. Who among the following is a General Manager?
   1) Aman 2) Rohit 3) Hirender
   4) Aditya 5) Dinesh
9. What is the profession of Bharat?
   1) Teacher 2) Banker
   3) Company MD
   4) Specialist Officer
   5) Corporate Leader

BANK EXAMS

REASONING

10. Who among the following is a Politician?
    1) Rohit 2) Farhan 3) Aditya
    4) Hirender 5) Aman
11. Which of the following is true with respect to the given seating arrangement?
    1) The Politician is an immediate neighbour of the Specialist Officer.
    2) Aditya sits second to the right of Dinesh.
    3) The Politician and the Company MD are immediate neighbours.
    4) The Teacher sits on the immediate left of the CEO
    5) None of these

*Directions (Q.12-16): Study the following information to answer the given questions.*

**In a certain code language:**

'firefighters are armymen' is written as 'tee mee kee',
'courageous people are armymen' is written as 'kee loo nee tee',
'courageous being enthusiastic' is written as 'loo pee jee',
'people are enthusiastic' is written as 'kee nee pee' and
'positive people are unpleasant' is written 'nee kee dee see'.

12. What is the code for 'being'?
    1) loo 2) jee 3) kee
    4) pee 5) None of these
13. Which of the following may be the possible code for 'unpleasant firefighters are positive'?
    1) dee see tee mee
    2) dee see kee mee
    3) see tee mee kee
    4) dee see jee lee
    5) None of these
14. What does 'pee' stand for?
    1) courageous 2) positive
    3) army men
    4) enthusiastic
    5) None of these
15. Which of the following is represented by the code 'see jee tee pee dee kee loo'?
    1) unpleasant armymen enthusiastic being are positive firefighters
    2) unpleasant armymen enthusiastic courageous positive are being
    3) unpleasant armymen being enthusiastic are positive people
    4) unpleasant armymen being are enthusiastic people.
    5) None of these
16. Which of the following is the code for 'firefighters armymen belong to positive people'?
    1) tee kee cee que loo dee
    2) mee cee kee dee kee see
    3) mee tee cee too dee nee
    4) mee tee cee toe nee see
    5) Can't be determined

*Directions (Q.17-21): Study the information and answer the given questions:*

Seven people P, Q, R, S, T, U and V live on separate floors of a 7-floor building. Ground floor is numbered 1, first floor is numbered 2 and so on until the topmost floor is numbered 7. Each one of these is travelling to a different city, viz Delhi, Mumbai, Patna, Chennai, Kolkata, Bengaluru and Lucknow but not necessarily in the same order. Only three people live above the floor on which P lives. Only one person lives between P and the one travelling to Bengaluru. U lives immediately below the one travelling to Mumbai. The one travelling to Mumbai lives on an even-numbered floor. Only three people live between the ones travelling to Bengaluru and Patna. T lives immediately above R. T is not travelling to Patna. Only two people live between Q and the one travelling to Kolkata. The one travelling to Kolkata lives below the floor on which Q lives. The one travelling to Delhi does not live immediately above or immediately below Q. S does not live immediately above or immediately below P. V does not travel to Chennai.

17. Which of the following is true with respect to V as per the given information?
    1) The one who lives immediately below V is travelling to Mumbai.
    2) V lives on floor no. 7
    3) V lives immediately below T
    4) V lives on the lowermost floor
    5) V is travelling to Bengaluru
18. Who among the following lives on floor no. 3?
    1) The one travelling to Chennai
    2) The one travelling to Kolkata
    3) R 4) V 5) T
19. Who lives on the floor immediately above T?
    1) P 2) Q 3) S
    4) V 5) U
20. To which of the following cities is S travelling?
    1) Mumbai 2) Bengaluru
    3) Patna 4) Kolkata
    5) Chennai
21. How many people live between the floors on which S and the one travelling to Mumbai live?
    1) None 2) Two 3) One
    4) More than three
    5) Three.

## Answers and Explanations

**(1-5):**

| Friend | University | Subject |
|---|---|---|
| Manjit | S | Maths |
| Naveen | Q | Economics |
| Parul | P | History |
| Hitesh | P | Political Science |
| Raghu | S | Accounts |
| Sahil | Q | Geography |
| Tarun | S | chemistry |

**1.** 4 **2.** 1 **3.** 5
**4.** 3 **5.** 2

**(6-11):**




**6.** 5 **7.** 4 **8.** 1
**9.** 3 **10.** 2 **11.** 4

**(12-16):**

firefighters are armymen → tee mee kee...(i)
courageous people are armymen → kee loo nee tee...(ii)
courageous being enthusiastic → loo pee jee...(iii)
people are enthusiastic → kee nee pee...(iv)
positive people are unpleasant → nee kee dee see...(v)
From (i), (ii) and (iv) are → kee
From (i) and (ii) armymen → tee
From (i) firefighters → mee
From (iii) and (iv) enthusiastic → pee
From (ii), (iv) and (v) people → nee
From (ii) and (iii) courageous → loo
From (iii) being → jee
From (v) positive/unpleasant → dee/see

**12.** 2 **13.** 2 **14.** 4
**15.** 2 **16.** 5

**(17-21):**

| Person | Floor | City |
|---|---|---|
| S | 7 | Chennai |
| Q | 6 | Patna |
| V | 5 | Lucknow |
| P | 4 | Mumbai |
| U | 3 | Kolkata |
| T | 2 | Bengaluru |
| R | 1 | Delhi |

**17.** 1 **18.** 2 **19.** 5
**20.** 5 **21.** 2